

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 268

గురువారం 19-12-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆస్కార్ లేడీస్..
ఆస్కార్ బరిలో ఆశాదీపాలుగా నిలుస్తున్న మహిళలు -11లో



ఆటకు అశ్విన్ గుడ్‌బై
అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత మేటి స్పిన్నర్ -12లో



జమిలి జేపీసీలో ప్రియాంక
'జమిలి' బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటవుతున్న జేపీసీలో కాంగ్రెస్ తరఫున ప్రియాంకాగాంధీ నామినేటయ్యే చాన్స్ ఉంది.
వివరాలు 6లో ▸



మాటలు.. మంటలు
అంబేడ్కర్‌ను ప్రస్తావిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి.
వివరాలు 6లో ▸




క్యాన్సర్‌కు రష్యా టీకా
క్యాన్సర్ నివారణకు రష్యా శాస్త్రవేత్తలు అత్యుత్తమ వ్యాక్సిన్ (టీకా) అభివృద్ధి చేశారు. వచ్చే ఏడాదే ఇది అందుబాటులోకి రానుంది.
వివరాలు 6లో ▸



హెచ్-1బీ వీసా సులభతరం
భారతీయులకు శుభవార్త. హెచ్-1బీ వీసా నిబంధనల్లో అమెరికా మార్పులు చేసింది. దీంతో వీసా పొందడం సులభం కానుంది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం



నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బాలుడు సుమారు 20 రోజులుగా జ్వరం, తలనొప్పితో బాధపడుతున్నాడు. స్థానికంగా వైద్యం చేయించినా తగ్గకపోవడంతో.. వైద్యులు ముంబైలోని ప్రైవేటు ల్యాబ్‌కు రక్త నమూనాలు పంపించారు. అక్కడి పరీక్షల్లో జికా వైరస్ అని తేలింది.
వివరాలు 2లో ▸

పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు



అభ్యుదయ రచయిత, కవి, విమర్శకుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 2021లో ఆయన ప్రచురించిన వ్యాసాల సంపుటి 'దీపిక'కు కేంద్ర సాహిత్య అకాడమీ ఈ పురస్కారాన్ని ప్రకటించింది.
వివరాలు 3లో ▸

ఐఎన్ఎస్ నిర్దేశక్ జాతికి అంకితం



భారత నావికాదళంలోకి ఐఎన్ఎస్ నిర్దేశక్ ప్రవేశించింది. బుధవారం విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ నిర్దేశక్‌ను కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ జాతికి అంకితం చేశారు. హిందూ మహా సముద్రంలో భారత్ తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకునేందుకు ఈ నౌక సేవలు దోహదపడతాయని కేంద్ర మంత్రి చెప్పారు.
వివరాలు 14లో ▸

స్థిరంగా తీవ్ర అల్పపీడనం



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.
వివరాలు 3లో ▸

ఇదండీ సంగతి



చైనాతో కలసి ప్రపంచ సమస్యలు సృష్టిస్తా.. సారీ పరిష్కరిస్తా!!

నిన్న కరెంట్ చార్జీలు.. నేడు ఆస్తుల రిజిస్ట్రేషన్లు

• ఇదేనా సంపద సృష్టి?

బాదుడే బాదుడు

భూముల విలువతోపాటు నిర్మాణాల (స్ట్రక్చర్) విలువలూ పెరుగుదల

గుడిసెలు, పూరి పాకలు, పెంకుటిళ్లు, రూఫ్ లేని ఇళ్లు.. వేటినీ వదలని వైనం

అన్ని రకాల నిర్మాణాల విలువల్ని పెంచేసిన చంద్రబాబు ప్రభుత్వం

- నివాస, వాణిజ్య భవనాలు, అపార్టుమెంట్ల ఫ్లాట్ల విలువలు అమాంతం పెంపు.. విలువల పెంపుపై మెమో జారీ చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ
- భూముల విలువలు సైతం 50 శాతానికిపైగా పెంపు.. ఇందుకోసం దొడ్డిదారిన క్లాసిఫికేషన్ల మార్పు
- ఏరియా ప్రాతిపదికన కాకుండా స్థలం ప్రాతిపదికగా విలువలు ఖరారు
- ఇప్పటికే ఖరారు చేసిన సబ్ రిజిస్ట్రార్లు.. జేసీ కమిటీల ఆమోదమే తరువాయి
- జనవరి ఒకటి నుంచి అమల్లోకి కొత్త విలువలు.. రూ.కోటి ఫ్లాట్‌పై అదనంగా రూ.2.5 లక్షల భారం
- వంద గజాల స్థలంపైనా భారీగా వడ్డన
- అడ్డగోలుగా ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ప్రజలపై భారం

2లో



రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు మేలు చేసిందేమీ లేకపోగా, ప్రజలను బాదడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల కనీవినీ ఎరుగని రీతిలో కరెంట్ చార్జీలను ఎడా పెడా బాదేసిన చంద్రబాబు ప్రభుత్వం.. తాజాగా రిజిస్ట్రేషన్లపై పడింది. ఇదివరకు ఏ ప్రభుత్వం అవలంబించని రీతిలో ల్యాండ్ ధరలను పెంచేయడంతో పాటు నిర్మాణాల విలువనూ అమాంతం ఆకాశాన్నంటించింది. విలువల పెంపునకు కాదేదీ అనర్హం.. అన్నట్లు పూరిళ్లు, రేకుల షెడ్లు, పెంకుటిళ్లు, గోడలు లేని ఇళ్లను కూడా వదలక పోవడం విస్తుగొలుపుతోంది. క్లాసిఫికేషన్ల పేరుతో మాయ చేస్తూ ఒకే ప్రాంతంలో ఇష్టానుసారం రేట్లు ఫిక్స్ చేస్తోంది. సంపద సృష్టించడం అంటే ఇదే కాబోలు అని జనం వాపోయేలా చేసింది.

న్యాయాధికారిపై నిఘా!

ఇంటి పరిసరాల్లో మాటు వేసిన ఇంటెలిజెన్స్ అధికారులు

న్యాయాధికారి కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా



- న్యాయమూర్తులను బెదిరించే రీతిలో చంద్రబాబు సర్కారు బరి తెగింపు
- తనపై నిఘా పెట్టారని వ్యాఖ్యానించిన జడ్జి
- అసైన్డ్ భూముల కేసులో చార్జిషీట్లు ఎందుకు దాఖలు చేయడం లేదని ప్రశ్న
- చంద్రబాబుపై కేసులను నీరుగార్చేలా పోలీస్ ఉన్నతాధికారులతో లూథ్రా వరుస భేటీలు
- పోలీసు వ్యవస్థను తన కంట్రోల్‌లోకి తీసుకుని దర్యాప్తు అధికారులకు దిశా నిర్దేశం

2లో

మేజిస్ట్రేట్ చాలా యాంత్రికంగా

వ్యవహరించారు

సోషల్ మీడియా పోస్టుల కేసులో మేజిస్ట్రేట్ కోర్టు తీరును ఆక్షేపించిన హైకోర్టు

- సెక్షన్ 111 కింద నేరం చేశారనేందుకు దర్యాప్తు అధికారి ఆధారాలు చూపలేదు
- మేజిస్ట్రేట్ మాత్రం ఆధారాలున్నాయంటూ రిమాండ్ విధించారు
- 111 కింద కేసుకు నిందితునిపై ఒకటి కంటే ఎక్కువ చార్జిషీట్లు దాఖలై ఉండాలి
- అందులో కనీసం ఒక చార్జిషీట్‌నైనా కోర్టు విచారణకు స్వీకరించి ఉండాలి
- అలాంటిదేమీ లేకపోయినా రిమాండ్ ఇచ్చారు
- పోలీసులు అరెస్ట్‌కు కారణాలనూ చెప్పలేదు
- అయినా రిమాండ్ రిపోర్ట్‌పై మేజిస్ట్రేట్ సంతృప్తి వ్యక్తం చేశారన్న ధర్మాసనం

10లో





ప్రమాదంలో నీట మునిగిన పర్యాటక పడవ వద్ద సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

13 మంది జలసమాధి

- పర్యాటక పడవను ఢీకొన్న నేవీ బోట్
- మృతుల్లో ముగ్గురు నేవీ అధికారులు
- ముంబై సమీప అరేబియా సముద్ర జలాల్లో దుర్ఘటన

6లో

ఉద్యోగం కావాలా..

లోకేశ్‌ను కలవండి!



- సెలవులో పంపిన గనుల శాఖాధికారులతో మధ్యవర్తుల రాయబేరాలు
- ఆయన వద్దకు వెళితేనే పని అవుతుందంటూ బెదిరింపులు
- ఆరోపణలు ఉన్నాయంటూ 26 మందిని బలవంతంగా సెలవుపై పంపిన గనుల శాఖ

3లో

వేమిరెడ్డికే క్వార్ట్జ్ గనులు!

అధికారికంగా లైన్ క్లియర్.. జనవరి నుంచి దోపిడీ షురూ

సైదాపురంలో పనులను దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఆఫీస్ సిద్ధం.. తన మాట వినే అధికారికి పోస్టింగ్

- ఇప్పటికే నిత్యం అనధికారికంగా వందల లారీల్లో ఖనిజం అక్రమంగా తరలింపు.. తవ్వకాలపై ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా పరిశ్రమ ఏర్పాటు పేరుతో దోపిడీకి సిద్ధం
- హైదరాబాద్‌కు పిలిచి ఇతర గనుల యజమానులకు ఎంపీ బెదిరింపులు
- వందేళ్లకుపైగా నడుపుకొంటున్న గనులు, ఖనిజాన్ని తమకే అప్పగించాలని హుకుం.. ఇప్పటికే తవ్విన ఖనిజం, ఇకపై తవ్వేది నామ మాత్రపు ధరకు ఇవ్వాలని హెచ్చరిక
- గత ఆర్నెళ్లుగా తవ్వకాలు చేపట్టకుండా లీగల్ మైన్ల యజమానులకు వేధింపులు
- అనుమతులన్నీ ఉండీ, ఏళ్ల తరబడి డెడ్ రెంట్ కడుతున్న యజమానులు లబోదిబో




సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సైదాపురం క్వార్ట్జ్ గనులపై ఎమ్మెల్యేలు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మధ్య నెలకొన్న ఆధిపత్య పోరులో ఎంపీదే పైచేయిగా మారినట్లు సమాచారం. గనులను చేజిక్కించుకునేందుకు జిల్లాకు చెందిన ఇతర ఎమ్మెల్యేలు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఎంపీ వేమిరెడ్డికి ప్రభుత్వ 'ముఖ్య' నేత గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జనవరి నుంచి ఇక అధికారికంగానే గనుల దోపిడీ జరగనుంది. నాణ్యమైన గనులు ఉన్న వెంకటగిరి, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాల్లో దొరికే క్వార్ట్జ్ మెటల్‌ను ఆయనకే అప్పగించాలని ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు నజరానాగా ప్రతి నెలా 'ముఖ్య' నేతకు ముడుపులు చెల్లించేలా
మిగతా 10వ పేజీలో ▸

బదులివ్వలేకే దుష్ప్రచారం

నా వ్యాఖ్యలను వక్రీకరించారు.. కాంగ్రెస్‌పై అమిత్ షా ధ్వజం

ఆ పార్టీ ఫక్తు అంబేడ్కర్ వ్యతిరేకి.. ఆ వాస్తవాలను సభలోనే నిరూపించాం

ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు.. అంబేడ్కర్‌ను కలలోనైనా అవమానించను.. ఆయన సిద్ధాంతాలనే ప్రచారం చేస్తున్నాం



న్యూఢిల్లీ: అంబేడ్కర్‌పై రాజ్యసభలో తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పూర్తిగా వక్రీకరించిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. తన వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. ''కాంగ్రెస్ పార్టీ ఫక్తు అంబేడ్కర్ వ్యతిరేకి.. రాజ్యాంగ వ్యతిరేకి.. రిజర్వేషన్ల వ్యతిరేకి. ఈ వాస్తవాలను రాజ్యాంగంపై చర్చ సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా నిరూపించాం. మేం లేవనెత్తిన అంశాలకు కాంగ్రెస్ వద్ద ఏ సమాధానమూ లేకపోయింది. అందుకే తీవ్ర అసహనంతో ఇలా తప్పుడు దారి ఎంచుకుంది. ప్రధాని వ్యాఖ్యలను కూడా ఇలాగే వక్రీకరిస్తోంది. వాటిపై ఆందోళనలకు దిగుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతోంది''అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం రాజ్యసభలో అంబేడ్కర్ గురించి తాను మాట్లాడినదాంట్లో ఎలాంటి సందిగ్ధతా లేదని స్పష్టం చేశారు. ''రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కలలో సైతం అవమానపరచని పార్టీ నుంచి, సిద్ధాంతం నుంచి వచ్చాను. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడల్లా అంబేడ్కర్ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేసింది. రిజర్వేషన్లను బలోపేతం చేసేందుకు కృషి చేసింది'' అన్నారు. ''కాంగ్రెస్‌చర్యలు ఆక్షేపణీయం. నాపై ఆ పార్టీ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నా'' అని చెప్పారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించగా.. అన్ని అవకాశాలూ పరిశీలిస్తామన్నారు. అంబేడ్కర్‌పై తాను చేసిన పూర్తి వ్యాఖ్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. అలాగే అంబేడ్కర్‌కు కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని కూడా ప్రజలకు తెలియజెప్పాలని కోరారు.

నెహ్రూ కుటుంబం అంబేడ్కర్ వ్యతిరేకి

కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే తన ప్రసంగంలో కేవలం కొంత భాగాన్నే చూపిస్తోందని అమిత్ షా ఆక్షేపించారు. తద్వారా అయోమయం సృష్టించడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా కృత్రిమ మేధ సాయంతో తన వ్యాఖ్యలను, మోదీ వ్యాఖ్యలను వక్రీకరించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ''అంబేడ్కర్‌ను పూర్తిగా పక్కన పెట్టేందుకు ప్రయత్నించిన చరిత్ర తొలి ప్రధాని
మిగతా 6వ పేజీలో ▸

హెల్మెట్ తప్పనిసరి



- వాహనదారులు చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే వారిని అక్కడికక్కడే ఆపి, వెంటనే జరిమానాలు విధించాలని పోలీసులకు హైకోర్టు తేల్చిచెప్పింది. వాహనం నడిపే వారు మాత్రమే కాకుండా వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేసింది. జరిమానా కట్టకపోతే వాహనాన్ని ఎందుకు జప్తు చేయట్లేదని ప్రశ్నించింది. హై స్పీడ్, భారీ శబ్దాలతో నరకం చూపిస్తున్న వారిని ఎందుకు అడ్డుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది.

10లో

రక్తపోటు.. గుర్తించకపోతే

స్ట్రోక్ ముప్పే..



ఐదేళ్లుగా బాధపడిన వారికి 31% ప్రమాదం

- 6-20 ఏళ్లుగా ఉన్న వారికి 50 శాతం
- 20 ఏళ్లకు పైగా బాధపడిన వారికి 67% ఎక్కువ ముప్పు.. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనంలో వెల్లడి
- ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహారంతోనే రక్షణ

2లో



ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా టెక్ కంపెనీలు భారీ సంఖ్యలోనే ఉద్యోగులను తొలగించాయి. 529 కంపెనీలు 1,49,870 మందిని తొలగించాయి. 2022లో 1064 కంపెనీలు 1,65,269 మందిని తొలగిస్తే.. 2023లో 1193 కంపెనీలు 2,64,220 మందిని తొలగించాయి. 2024 జనవరి, ఆగస్టులలోనే సుమారు 60 వేలమందిని తొలగించాయి. అత్యధిక ఉద్యోగులను తొలగించిన రంగాలు.. హార్డ్‌వేర్, రవాణా, ఫైనాన్స్. ఎక్కువ మందిని తొలగించి అమెరికా మొదటి స్థానంలో ఉంటే మనదేశం మూడో స్థానంలో ఉంది. మనదేశంలో వైట్‌హ్యాట్ జూనియర్, బైటెండెన్స్, రిలయన్స్ జియోమార్ట్, ఓలా, అన్‌ఎకాడమీ, స్విగ్గీ, క్యూర్‌ఫిట్, ఊబర్ వంటి కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి.

దేశం	తొలగించిన ఉద్యోగులు
అమెరికా	1,06,128
జర్మనీ	10,919
భారత్	8,895
యూకే	5,461
జపాన్	4,000

ఆధారం: బిజినెస్ డాట్ ఎస్టైడ్

క్లుప్తంగా...

నేడు ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలతో వైఎస్ జగన్ సమావేశం


సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన నేతలతో సమావేశం కానున్నారు. ఆ జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, మేయర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైఎస్సార్‌సీపీని మరింతగా బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై నేతలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేయనున్నారు.

నేడు కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్‌లో మంత్రివర్గ సమావేశం జరగనుంది. సీఆర్‌డీఏ పరిధిలో చేపట్టనున్న పనులకు ఆమోదం తెలపడంతో పాటు పలు అంశాలపై నిర్ణయాలు తీసుకుంటారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం

- ఐదేళ్ల బాలుడికి వైరస్
- చికిత్స కోసం చెన్నైకి తరలింపు




నెల్లూరు(అర్బన్): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం రేపింది. మర్రిపాడు మండలం వెంకటాపురానికి చెందిన బత్తుల నాగరాజు, కళ్యాణి దంపతుల ఐదేళ్ల కుమారుడు సుబ్బరాయుడు జ్వరం, తలనొప్పితో సుమారు 20 రోజులుగా బాధపడుతున్నాడు. మొదట్లో స్థానికంగా వైద్యం చేయించినా తగ్గలేదు. దీంతో 10 రోజుల కిందట నెల్లూరులోని నారాయణ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి మందులు రాసి ఇంటికి పంపారు. అయినా తగ్గకపోవడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో వైద్యులు థర్డ్ పార్టీ ల్యాబ్ సహకారంతో ముంబైలోని ప్రైవేటు ల్యాబ్‌కు రక్త నమూనాలు పంపారు. అక్కడ జికా వైరస్ అని తేలింది. దీంతో బాలుడిని మెరుగైన చికిత్స కోసం చెన్నై ఎగ్మోర్‌లోని బేబీ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ విధానంతో పరిశ్రమల ఏర్పాటు

- యూనిట్ల ఏర్పాటుపై సీఎస్ సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిరంతర పర్యవేక్షణతో సకాలంలో పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తున్నట్టు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. బుధవారం సచివాలయంలో ఎస్‌ఐపీసీ ప్రాజెక్టు మానిటరింగ్ మెకానిజమ్‌లో భాగమైన ఎస్‌ఐపీసీ, ఎస్‌ఐపీబీ సమావేశాల తర్వాత ఆయా పెట్టుబడుల ప్రతిపాదనల పర్యవేక్షణ అంశాలపై సకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో కొన్ని శాఖలకు జిల్లాస్థాయి అధికారి లేనందున జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నోడల్ అధికారిగా సంబంధిత శాఖల అధికారులు ప్రాజెక్టులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



వధూవరులకు వైఎస్ జగన్ ఆశీస్సులు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ బుధవారం కర్నూలులోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై వధూవరులు డాక్టర్ కె.చతుర, డాక్టర్ జి.నిఖిల్‌ను ఆశీర్వదించారు. అంతకుముందు బెంగళూరు నుంచి కర్నూలుకు చేరుకున్న వైఎస్ జగన్‌కు పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు దిగేందుకు యువకులు, అభిమానులు పోటీ పడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరుపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు మేయర్ రామయ్య తదితరులు వైఎస్ జగన్‌ను కలిశారు. - కర్నూలు (టౌన్)

నిన్న కరెంట్ చార్జీలు.. నేడు ఆస్తుల రిజిస్ట్రేషన్లు

బాదుడే బాదుడు

భూముల విలువతోపాటు నిర్మాణాల (స్ట్రక్చర్) విలువలూ పెరుగుదల

అన్ని రకాల నిర్మాణాల విలువల్ని పెంచేసిన చంద్రబాబు ప్రభుత్వం

విజయవాడలోని పటమట ప్రాంతంలో ప్రస్తుతం రూ.కోటి విలువైన ఫ్లాట్ కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ చార్జీలు రూ.8 లక్షలు. ఇప్పుడు దాని విలువ 30% పెరిగితే రిజిస్ట్రేషన్ చార్జీలు అదనంగా రూ.2.50 లక్షలు.. అంటే రూ.10.50 లక్షలు కట్టాల్సి వస్తుంది. గుంటూరు రూరల్ ప్రాంతంలో రూ.30 లక్షల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రస్తుతం రూ.2.40 లక్షలు అవుతుండగా.. అవి రూ.3 లక్షలకు పెరగనున్నాయి. ఇలా అన్ని చోట్లా భూముల విలువను బట్టి రేట్లు భారీగా పెరిగిపోనున్నాయి. జనవరి 1 నుంచి ఈ పెరుగుదల అమల్లోకి రానుంది. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ మంగళవారం రాత్రి మెమో, ప్రొసీడింగ్స్ (ఎంవీ1/752/2022) జారీ చేశారు.

సాక్షి, అమరావతి: ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై పెనుభారాలు మోపుతోంది. భూముల విలువతోపాటు నిర్మాణాల (స్ట్రక్చర్) విలువను అమాంతం పెంచేస్తోంది. ఇప్పటికే నిర్మాణాల విలువను నిర్ధారించింది. పూరిళ్లు, రేకుల షెడ్లు, పెంకుటిళ్లు, గోడలు లేని ఇళ్లనూ వదలకుండా వాటి విలువలను పెంచేసింది. భూముల విలువ పెంచినా, ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. పైకి 20 శాతం వరకు పెంపు ఉంటుందని చెబుతున్నా 50 శాతం వరకు పెంచుతున్నారని తెలుస్తోంది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని భూముల విలువ కేటగిరీలను బట్టి 30 నుంచి 60 శాతం వరకు పెంచేస్తున్నారు. దీంతో నగరాల్లో అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసిన వారిపై అదనంగా రూ.లక్షల భారం పడనుంది. భూముల విలువ పెంపును తక్కువగా చూపేందుకు ప్రస్తుతం ఉన్న భూముల క్లాసిఫికేషన్లను మార్చేస్తున్నారు. అంటే ప్రతి ఏరియాలోని భూమికి ప్రస్తుతం ఒకే విలువ ఉండగా, దొడ్డిదారిన దాని క్లాసిఫికేషన్ మార్చి రెండవ విలువను పెట్టాలని నిర్ణయించారు. దీనికి కొత్తగా లేయర్లు, గ్రిడ్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం వ్యవసాయ భూమి అయితే మెట్ట, మాగాణి, కన్వర్షన్ చేసిన భూమిగా.. ఇళ్ల స్థలాలైతే జాతీయ రహదారులను ఆనుకుని ఉన్నవి.. వాటి వెనుక ఉన్నవి.. అంటూ పలు రకాలుగా క్లాసిఫికేషన్‌లో ఉన్నాయి. ఒక ఏరియాలో మెట్ట భూమి విలువ రూ.10 లక్షలు, మాగాణి భూమి విలువ రూ.20 లక్షలుగా ఉందనుకుందాం. ఇప్పుడు రూ.10 లక్షలు ఉన్న మెట్ట భూమిలో ఒకచోట రూ.15 లక్షలు, పక్కనే ఉన్న దానికి రూ.20 లక్షలు పెడుతున్నారు. అంటే ప్రతి క్లాసిఫికేషన్‌లోనూ కొత్తగా రెండో రేటు పెడుతున్నారు. జాతీయ రహదారి పక్కనున్న భూములకు ఒక క్లాసిఫికేషన్, వాటి వెనుక లోపల ఉన్న భూములను మరో క్లాసిఫికేషన్ పెడుతున్నారు. ఈ విధానంలో ఒకే ప్రాంతంలోని రోడ్డుపై ఉన్న భూమికి ఒక రేటు, దానికి ఆనుకున్న భూమికి ఒక రేటు, వాటి వెనుక ఉన్న వాటికి మరో రేటు పెడుతున్నారు. అర్బన్ ప్రాంతాల్లోనూ క్లాసిఫికేషన్లు మార్చి రోడ్ల పక్కనున్న స్థలాలకు ఒకరేటు, సందుల్లో వాటి వెనుక ఉన్న స్థలాలకు మరో రేటు నిర్ణయిస్తున్నారు. వాణిజ్య స్థలాలకు సంబంధించి క్లాసిఫికేషన్లు రకరకాలుగా మార్చారు. ఒక ఏరియాలోనే గతంలో మాదిరిగా ఒక క్లాసిఫికేషన్‌లో ఉన్న భూమికి ఒక రేటు కాకుండా ప్రతి దాని రేటు మార్చేస్తున్నారు. తద్వారా ఒకే ప్రాంతంలో ఉన్న భూమి మార్కెట్ విలువను వీలును బట్టి రెండు, మూడు రకాలుగా పెంచేశారు.

Office of the Commissioner and Inspector General of Registration and Stamps, A.P., Tadepalli.

Memo No.MV1/752/2022 **Dt.17.12.2024**

Sub: R&S Department - Market Value Scheme - A.P. Revision of Market value Guidelines Rules, 1998 –Request to take-up General Revision of Market Values both in Urban, Rural and Structure values in the state w.e.f.1-1-2025 – Communication for Implementation–Instructions Issued - Regarding.

Ref: 1. G.O.Ms.No.301, Revenue (Regn.I) Department, dt: 04-05-1998.
2. Minutes of the structural rates revision committee dt:19-08-2024.
3. This office Proceedings No:MV1/752/2022 dated:17/12/2024.

*****

The attention of all the Deputy Inspector General and District Registrars in the state are invited to the references cited. It is informed that through the reference 2nd cited, the Government have accorded permission to revise the Market Values in the state under General Market value Revision Rule 4(2) (d) ofA.P. revision Market Value Guidelines Rules, 1998, and also to revise the structure values in the state w.e.f.01-01-2025.

Hence, all the Deputy Inspector General and District registrars are informed that make effect date of implementation of revised market values is 01-01-2025.

They are further directed to ensure the data entry of newly fixed values andissue further instructions to the Sub Registrars under the jurisdiction.

Sd/- M.V.Seshagiri Babu
Commissioner & Inspector General of
Registration and Stamps, A.P., Tadepalli

రిజిస్ట్రేషన్ల విలువల పెంపునకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జారీ చేసిన ప్రొసీడింగ్స్

పూరి పాకలనూ వదల్లేదు

ఇప్పటికే నిర్మాణాల విలువను ప్రభుత్వం ఖరారు చేసి ఉత్తర్వులిచ్చింది. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల వారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలు, నాన్ ఆర్‌సీసీ రూఫ్‌లతోపాటు పూరిళ్లు, గోడలు లేని ఇళ్ల విలువనూ పెంచేసింది. కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఉన్న అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువను రూ.1,490కి పెంచింది. నగర పంచాయతీల్లో చదరపు అడుగు రూ.1,270, గ్రామ పంచాయతీల్లో చదరపు అడుగుకు రూ.900కు పెంచింది. సెల్లార్, పార్కింగ్ ఏరియాతోపాటు ప్రతి అంతస్తులో అదనపు ఫ్లోర్లకు రేటు పెంచారు. వాణిజ్య భవనాల విలువను కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో రూ.1,800కు, నగర పంచాయతీల్లో రూ.1,540కి, పంచాయతీల్లో రూ.1060కు పెంచారు. ఇతర ఆర్‌సీసీ నిర్మాణాలే కాకుండా ఆర్‌సీసీ రూఫ్‌లు లేని ఇళ్ల విలువను సైతం పెంచేశారు. చివరికి పెంకుటిళ్లు, పాకలు, గోడలు లేని ఇళ్లను సైతం వదలకుండా వాటి విలువను చదరపు అడుగుకు రూ.5 నుంచి రూ.20 వరకూ పెంచింది. అన్ని రకాల నిర్మాణాల్లోనూ ఎస్ఎఫ్‌టీ రేటు రూ.30 నుంచి రూ.90 వరకు పెంచారు.

ఏరియాను బట్టి కాదు.. స్థలాన్ని బట్టి రేటు

సాధారణంగా భూముల విలువను.. ఉన్న దానిపైనే ఎంతో కొంత పెంచడం ఆనవాయితీ. కానీ ఆదాయాన్ని భారీగా పెంచుకోవడం కోసం గుట్టుచప్పుడు కాకుండా క్లాసిఫికేషన్లు మార్చుతున్నారు. దీంతో ప్రతి వ్యవసాయ, నివాస, వాణిజ్య భూములతోపాటు అర్బన్ ప్రాంతాల్లోని అన్ని స్థలాల మార్కెట్ విలువలు అమాంతం పెరిగిపోనున్నాయి. ఏరియా ప్రాతిపదికన కాకుండా సంబంధిత భూమి ప్రాతిపదికన రేటు పెట్టడంతో అన్ని భూముల విలువలు పెరిగిపోనున్నాయి. ఎక్కడైనా ఈ ఏరియాలో భూమి రేటు ఎంత ఉందని అడగడం సహజం. కానీ ఇకపై ఆ ఏరియాలోని ప్రతి స్థలం రేటు.. రోడ్డు పక్కన ఒకలా, రోడ్డు లోపల మరోలా మారిపోవడం వల్ల రేటు చెప్పడం అంత సులువు కాదు.

27 నాటికి తుది విలువలకు ఆమోదం

భూముల మార్కెట్ విలువల పెంపునకు సంబంధించి ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్లకు రిజిస్ట్రేషన్ల శాఖ షెడ్యూల్ కూడా ఇచ్చింది. 18వ తేదీ లోపు మార్కెట్ విలువను నిర్ధారించాలని షెడ్యూల్ ఇవ్వడంతో దాదాపు అన్ని చోట్లా వాటిని ఖరారు చేశారు. 19వ తేదీ ఆయా జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీలు వీటికి ఆమోదం తెలపనున్నాయి. 20వ తేదీ.. పెరిగిన ఈ విలువలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో అంటించడంతోపాటు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో పెట్టి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. అభ్యంతరాల స్వీకరణ, వాటికి వివరణలు ఇవ్వడం, డేటా ఎంట్రీ పనులన్నీ 26వ తేదీలోపు పూర్తి చేసి.. 27న మార్కెట్ విలువకు జేసీ కమిటీల నుంచి తుది ఆమోదం తీసుకోవాలని ఆదేశించారు. జనవరి 1 నుంచి ఈ విలువలను అమల్లోకి తెచ్చి, వాటి ప్రకారమే రిజిస్ట్రేషన్ల చార్జీలు వసూలు చేయాలని స్పష్టం చేశారు. తదనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని జరుగుతోంది.

న్యాయాధికారిపై

ఇంటెలిజెన్స్ నిఘా!

ఇంటి పరిసరాల్లో మాటు వేసిన నిఘా అధికారులు

చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా న్యాయమూర్తులపైనే నిఘా పెట్టిందా..?

ఢిల్లీ నుంచి సీనియర్ న్యాయవాదిని రంగంలోకి దించి చంద్రబాబుపై కేసులను నీరు గార్చేలా పోలీస్ వ్యవస్థకు 'కౌన్సెలింగ్' చేస్తోందా..?

తాజా పరిణామాలు అవుననే స్పష్టం చేస్తున్నాయి.

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబుపై నమోదైన అవినీతి కేసులను అడ్డగోలుగా మూసివేసే పన్నాగమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం బరితెగించి వ్యవహరిస్తోంది. ఏకంగా ఆ కేసులను విచారిస్తున్న న్యాయాధికారి కదలికలపై ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా నిఘా పెట్టిందన్న విషయం సంచలనం కలిగిస్తోంది. తనపై ఇంటెలిజెన్స్ అధికారులు నిఘా పెట్టారని ఆ జడ్జీ వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో గత ఏడాది చంద్రబాబుకు రిమాండ్ విధించిన పరిణామాల నేపథ్యంలోనే ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ దుశ్చర్యకు తెగించినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు చంద్రబాబు నిందితుడిగా ఉన్న కేసులో చార్జిషీట్లను న్యాయస్థానానికి సమర్పించకుండా తాత్సారం చేయడంపై ఆ జడ్జీ ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తున్న ఈ ఉదంతం ఇలా ఉంది...

ఇంటి వద్ద ఎందుకు మాటు వేశారు?

– పోలీసు అధికారిని ప్రశ్నించిన న్యాయాధికారి

చంద్రబాబుపై నమోదైన కేసులను విచారిస్తున్న ఓ న్యాయస్థానం న్యాయాధికారిపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. ఆ జడ్జీ ఇంటి పరిసరాల్లో తిష్ట వేసిన ఇంటెలిజెన్స్ అధికారులు ప్రతి కదలికనూ గమనిస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడం గమనార్హం. అయితే నిఘా వేసిన ఇంటెలిజెన్స్ అధికారులను న్యాయాధికారి సిబ్బంది గుర్తించారు. న్యాయాధికారి కోసం వాకబు చేస్తున్న విషయాన్ని పసిగట్టారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జడ్జీ ఓ పోలీసు అధికారిని దీనిపై న్యాయస్థానంలోనే ప్రశ్నించడం గమనార్హం. తన నివాసం వద్ద ఇంటెలిజెన్స్ అధికారులు ఎందుకు మాటు వేశారు...? తన ప్రతి కదలికను ఎందుకు పరిశీలిస్తున్నారని సూటిగా ప్రశ్నించడంతో ఆ పోలీసు అధికారి తత్తరపాటుకు గురయ్యారు.

చార్జిషీట్లు ఎందుకు తొక్కిపెట్టారు?

– సీఐడీని ప్రశ్నించిన న్యాయాధికారి

చంద్రబాబుపై ఉన్న అవినీతి కేసులను నీరుగార్చేందుకు సీఐడీ పన్నిన పన్నాగంపై కూడా న్యాయాధికారి ప్రశ్నించారు. 2014–19 మధ్య టీడీపీ హయాంలో చంద్రబాబు అవినీతిని ఆధారాలతో సహా నిగ్గు తేల్చిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దీనిపై ఇప్పటికే న్యాయస్థానంలో చార్జిషీట్లు దాఖలు చేసింది. అయితే న్యాయస్థానం కొన్ని వివరణలు కోరుతూ చార్జిషీట్లను ఈ ఏడాది ఏప్రిల్‌లో వెనక్కి పంపింది. వివరణలతో ఆ చార్జిషీట్లను మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈమేరకు అప్పటి సీఐడీ అధికారులు వివరణలతో చార్జిషీట్లను సిద్ధం చేశారు. అయితే జూన్‌లో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్తగా నియమితులైన సీఐడీ ఉన్నతాధికారులు ఆ చార్జిషీట్లను తొక్కిపెట్టారు. వాటిని న్యాయస్థానంలో దాఖలు చేయకుండా ఉద్దేశపూర్వకంగా తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఆ కేసులో సాక్షులను బెదిరించి చంద్రబాబుకు అనుకూలంగా తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించాలన్నది సీఐడీ ఉన్నతాధికారుల లక్ష్యం. అప్పటి వరకు చార్జిషీట్లను న్యాయస్థానంలో దాఖలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి పి.నారాయణ ప్రధాన నిందితులుగా ఉన్న అసైన్డ్ భూముల కేసులో గత ఏడాది సిట్ అధికారులు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నివాసంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అసైన్డ్ భూముల కుంభకోణం అంతా వెల్లడిస్తానని, తనను అప్రూవర్‌గా గుర్తించాలని కోరుతూ ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. సిట్ జప్తు చేసిన తన పత్రాలను విడుదల చేయాలని ఆయన ఇటీవల న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై కొద్ది రోజుల క్రితం విచారించిన న్యాయమూర్తి అసలు సీఐడీ ఇంతవరకు చార్జిషీట్లను ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ఆ చార్జిషీట్లు దాఖలు చేయనంతవరకు ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి అప్రూవరా లేక నిందితుడా అన్నది నిర్ధారించలేమన్నారు. చార్జిషీట్లను ఇంకా ఎందుకు దాఖలు చేయడం లేదని న్యాయమూర్తి ప్రశ్నించగా సీఐడీ తరపు న్యాయవాది సరైన సమాధానం చెప్పలేకపోయారు.

లూథ్రా కంట్రోల్‌లో పోలీస్ వ్యవస్థ!


చంద్రబాబు తరఫున కేసులను వాదిస్తున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా తాజాగా విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో వరుసగా రెండు రోజుల పాటు పోలీసు, సీఐడీ, ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులతో సమావేశమై ఆ కేసులను నీరుగార్చే చర్యలను స్వయంగా పర్యవేక్షించడంపై న్యాయ వర్గాల్లో తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. ఈ కేసులో గతంలో వాంగ్మూలాలు ఇచ్చిన ఉన్నతాధికారులు, ఇతరులను బెదిరింపులకు గురి చేసి తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లకు గురి చేయాలని పథక రచన చేశారు. మొత్తం పోలీస్ వ్యవస్థను లూథ్రా తన కంట్రోల్‌లోకి తీసుకోవడం.. చంద్రబాబుపై కేసుల దర్యాప్తు అధికారులకు దిశా నిర్దేశం చేయడం.. దీన్ని నుంచి ఆయన్ను మూడు నెలల్లోగా బయట పడేయాలని ఏకంగా డెడ్‌లైన్ విధించడం రాష్ట్రంలో ఎలాంటి పాలన సాగుతోందో చెప్పేందుకు నిదర్శనంగా నిలుస్తోంది. సాక్షులను బెదిరించి దారికి తేకుంటే ఈ కేసులో చంద్రబాబుకు విముక్తి కలిగించడం కష్టమని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది.

రక్తపోటు.. గుర్తించకపోతే

స్ట్రోక్ ముప్పు

రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వంటి జీవన శైలి జబ్బులు ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారాయి. ఈ సమస్యలు కిడ్నీ, మెదడు, గుండె సంబంధిత పెద్ద జబ్బులకు ప్రధాన కారణమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం మన దేశంలో 4.58 కోట్ల మంది అధిక రక్తపోటుతో బాధ పడుతున్నారు. వీరిలో 1.17 కోట్ల మంది రాష్ట్రాల ఆరోగ్య శాఖ ద్వారా వైద్యుల పర్యవేక్షణలో మందులు, చికిత్సలు అందుకుంటున్నారు. రక్తపోటు.. హార్ట్, బ్రెయిన్‌స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతోందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనంలో తేలింది. అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు అమెరికాలోని 27,310 మంది పెద్దల ఆరోగ్య రికార్డులను 12 ఏళ్లకు పైగా పరిశీలించారు. అధ్యయనంలో పాల్గొన్న వ్యక్తుల సగటు వయస్సు 65 ఏళ్లుగా ఉంది.

- సాక్షి, అమరావతి



10 కంటే ఎక్కువైతే 20% ప్రమాదం

రక్తపోటు సగటు కంటే ఎక్కువయ్యే కొద్దీ స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుందని మిచిగాన్ యూనివర్సిటీ న్యూరాలజీ విభాగం గతంలో ఓ అధ్యయనంలో వెల్లడించింది. రక్తపోటు సగటు కంటే 10 ఎంఎం హెచ్‌జీ ఎక్కువగా ఉన్న వారిలో ఇస్కీమిక్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం 20 శాతం, ఇంట్రాసెరెబ్రల్ హెమరేజ్ ప్రమాదం 31 శాతం ఎక్కువగా ఉంటుందని కనుగొన్నారు.

31 నుంచి 67 శాతం ఎక్కువ ప్రమాదం

సాధారణ వ్యక్తులతో పోలిస్తే ఐదేళ్ల అధిక రక్తపోటు సమస్యతో బాధపడిన వ్యక్తులు స్ట్రోక్ బారిన పడేందుకు 31 శాతం ఎక్కువ అవకాశాలు ఉంటాయని గుర్తించారు. ఆరు నుంచి 20 ఏళ్ల పాటు రక్తపోటు సమస్య ఉన్న వ్యక్తుల్లో 50 శాతం, రెండు దశాబ్దాలు పైగానే సమస్యతో బాధపడే వ్యక్తుల్లో 67 శాతం ఎక్కువగా స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు రక్తపోటు సంబంధిత లక్షణాలను ముందే గుర్తించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇందుకోసం ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహార అలవాట్లు అలవరచుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు, చికిత్సల ద్వారా రక్తపోటు నియంత్రణలో ఉంచుకుంటే జీవితకాల వైకల్యం ముప్పు తప్పుతుందన్నారు. ప్రస్తుతం ఎటువంటి లక్షణాలు లేకుండానే కొందరిలో రక్తపోటు చాప కింద నీరులా వృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో తరచూ రక్త పోటు పరీక్షలు చేయించుకుంటూ, ఉండాల్సినదాని కంటే ఎక్కువ రికార్డు అయితే వెంటనే అప్రమత్తం అవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

వివిధ రాష్ట్రాల్లో రక్తపోటు బాధితులు

ఆంధ్రప్రదేశ్	21,38,262
కర్ణాటక	25,86,173
తెలంగాణ	16,14,615
తమిళనాడు	31,22,115
కేరళ	16,81,410

జీవన శైలిలో మార్పు రావాలి



ఆహారం, నిద్ర, జీవన శైలిపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వ్యాయామాన్ని రోజువారి దినచర్యలో ఓ భాగం చేసుకోవాలి. రోజుకు 30 నిమిషాలు వాకింగ్, జాగింగ్ తప్పనిసరిగా చేయాలి. ఒత్తిడిని దరి చేరనివ్వకుండా చూసుకోవాలి. ప్రస్తుతం స్కూల్ పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ చిన్న చిన్న విషయాలకే తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. రక్తపోటు, మధుమేహం ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. వైద్య పరీక్షలు చేయించుకుంటూ సమస్యలను అదుపులో ఉంచుకోవాలి.

– డాక్టర్ బి.విజయ చైతన్య, కార్డియాలజిస్ట్, విజయవాడ



ఇ-వ్యర్థం.. ఎంతో అనర్థం

కాలానుగుణంగా ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతోంది. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, బ్యాటరీ చార్జర్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు.. వంటివి ఎప్పటికప్పుడు కొత్తవి కొనేస్తున్నారు. కానీ, పాతవాటిని రీసైక్లింగ్ చేయకుండా పారేస్తున్నారు. ఇవే ఎలక్ట్రానిక్ వ్యర్థాలుగా (ఇ-వేస్ట్) పోగుపడుతున్నాయి. ఇవి భూమి పొరలు, నీటిలో కలిసిపోయి కాలుష్య కారకాలుగా మారి ఇటు పర్యావరణానికీ, అటు మనకూ ఎంతో ప్రమాదంగా పరిణమిస్తున్నాయి. మనదేశంలో ఇలాంటి ఇ-వేస్ట్ ఏటికేడూ పెరిగిపోతోంది. ఇలా గత 5 ఏళ్ల నుంచి పోగుపడినది 73,22,965 టన్నులు.

ఉత్పత్తయిన ఇ-వేస్ట్ (లక్షల టన్నుల్లో)

2019-20	10.14
2020-21	13.46
2021-22	16. 01
2022-23	16.09
2023-24	17.51

ఆధారం: కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి

పెనుగొండ లక్ష్మీనారాయణకు సాహిత్య అకాడమీ అవార్డు

‘దీపిక’ వ్యాసాల సంపుటికి పురస్కారం



- మార్చి 25న ఢిల్లీలో ప్రదానం
- కరడుగట్టిన అభ్యుదయవాది పెనుగొండ
- 1972 నుంచి సాహితీ సేవ.. శ్రామికుల పక్షపాతి
- అభ్యుదయ రచయితగా, కవి, విమర్శకుడు, సాహితీ చరిత్రకారుడిగా గుర్తింపు
- అరసం కార్యకర్త నుంచి జాతీయ అధ్యక్షుడిగా ఎదిగిన సాహితీవేత్త

తెనాలి/నగరంపాలెం (గుంటూరు): అభ్యుదయ రచయితల సంఘం (అరసం), అభ్యుదయ సాహిత్యమే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా 50 ఏళ్లుగా సాహితీ సేవ చేస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 2021లో ఆయన ప్రచురించిన అభ్యుదయ సాహితీ వ్యాసాల సంపుటి ‘దీపిక’కు బుధవారం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని ప్రకటించింది. మార్చి 25న అవార్డుతోపాటు రూ. లక్ష నగదు పురస్కారంతో లక్ష్మీనారాయణను సత్కరించనున్నారు. దేశవ్యాప్తంగా 21 భాషల్లో సాహిత్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు బుధవారం ప్రకటించింది. తెలుగు భాషలో లక్ష్మీనారాయణ వ్యాస సంపుటికి ఈ అవార్డు దక్కింది. శ్రామికుల పక్షపాతిగా, అరసం ఉద్యమకారుడిగా, కవిగా, రచయితగా, అభ్యుదయ సాహితీ చరిత్రను రికార్డు చేయటంలో లక్ష్మీనారాయణ అయిదు దశాబ్దాలుగా ఆయన అలుపెరగక శ్రమిస్తున్నారు. ‘అందరూ రాసేవాళ్లే అయితే రాసేవాళ్ల పరంపరను మోసేవాళ్లెవరు’ అన్న ప్రశ్నకు తానున్నానంటూ ముందుకొచ్చారు. లక్ష్మీనారాయణ స్వస్థలం ప్రస్తుత పల్నాడు జిల్లాలోని నూజెండ్ల మండలం పాత చెరుకుంపాలెం. 1954 అక్టోబరు 24న మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు లింగమ్మ, గోవిందరెడ్డి. గుంటూరు ఏసీ కాలేజీలో బీఏ, బీఎల్ చేశారు. 1987లో గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, జిల్లా బార్ అసోసియేషన్స్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. పెనుగొండలోని నాయకత్వ లక్షణాలను గుర్తించిన పులుపుల వెంకట శివయ్య ఆయన్ని 1974లో అరసం జిల్లా మహాసభలకు తీసుకెళ్లారు. అక్కడే ‘అరసం’కు పరిచయమయ్యారు. ఆ సంఘంలో చురుగ్గా పనిచేస్తూ జిల్లా కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా చేశారు. 2023 నుంచి అరసం జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ పదవికి ఎంపికైన తొలి తెలుగు సాహిత్యకారుడిగా గుర్తింపు పొందారు. 1972లో ‘సమిధ’ అనే కవితా ప్రచురణతో తన సాహిత్య ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పట్నుంచి అనేక రచనలు, కవితా సంకలనాలు, వ్యాసాలు సాహితీ ప్రపంచానికి అందించారు. తొంభైకి పైగా సాహిత్య పుస్తకాలకు సంకలనకర్తగా, సంపాదకునిగా పనిచేశారు. ఆయన రాసిన వ్యాసాలు వివిధ పత్రికల్లో వచ్చాయి. ఆ వ్యాస సంపుటే ‘దీపిక’. అభ్యుదయ సాహితీ విమర్శకునిగా ఆయన రాసిన వ్యాసాలు 2004లో ‘అనేక’ సంపుటిగా, 2014లో ‘విదిత’ సంపుటిగా వెలువడ్డాయి. విదితకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం లభించింది. ‘గుంటూరు సీమ సాహిత్య చరిత్ర’ (2020, 2022)ను కూడా ఆయన వెలువరించారు. అనేక సాహిత్య సభల నిర్వాహకులుగా, వక్తగా ప్రసిద్ధులైన పెనుగొండ లక్ష్మీనారాయణ పొందిన వివిధ సాహిత్య పురస్కారాల్లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, కవిసంధ్య పురస్కారం, సుంకర, బొల్లిముంత, గుత్తికొండ సుబ్బారావు సాహిత్య పురస్కారం ఉన్నాయి. ఇటీవల అజో విభో కందాళం ఫౌండేషన్ విశిష్ట సాహితీమూర్తి పురస్కారం ప్రకటించారు. పాపినేని శివశంకర్, పెనుగొండ సంయుక్తంగా సంకలనం చేసిన ‘కవితా ఓ కవితా’ గ్రూప్-1 విద్యార్థులకు 1998లో పాఠ్య గ్రంథం. పలు విశ్వవిద్యాలయాల్లో ఎంఏ తెలుగు పాఠ్యగ్రంథం. ‘గుంటూరు కథలు’ సహా పలు గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ‘ఈతరం కోసం గేయకవిత’, ‘ఈతరం కోసం వచన కవిత’ తీసుకొచ్చారు.

ఇది ‘అరసం’కు దక్కిన గౌరవం: పెనుగొండ

నేను రాసిన అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి ‘దీపిక’కు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించటం చాలా సంతోషంగా ఉంది. నేను యాభై ఏళ్లుగా పనిచేస్తున్న అభ్యుదయ రచయితల సంఘం (అరసం)కు ఈ గౌరవం లభించినట్లు భావిస్తున్నా. దీపిక సంపుటిలోని 36 వ్యాసాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలకు చెందిన అంశాలపైనా చర్చ జరిగింది. ఆంధ్రులకో ప్రత్యేక సాంస్కృతిక విధానం ఆవశ్యకతను అందులో తెలియజేశాను. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆంధ్రప్రదేశ్ సాహితీవేత్తల సంఘీభావంపైనావ్యాసం రాశాను. నేను అరసంలోకి, సాహిత్యంలోకి ప్రవేశించి యాభై ఏళ్లు. ఈ స్వర్ణోత్సవ సంవత్సరంలో ఈ గౌరవం దక్కటం మరింత సంతోషకరం. అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో నన్ను ప్రోత్సహించిన పులుపుల వెంకట శివయ్య, పరుచూరి రాజారామ్, కొండేపూడి శ్రీనివాసరావును ఈ సందర్భంగా స్మరించుకుంటున్నా. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 17 మందికి ఇప్పటివరకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. నేను 18వ సాహిత్యకారుడిని. నా రచనలన్నీ నాకు తృప్తినిచ్చాయి. గౌరవాలనూ సాధించిపెట్టాయి. ఒక సాహిత్యకారుడికి, అభ్యుదయవాదికి ఇంతకన్నా కావాల్సింది ఏముంటుంది?

లక్ష్మీనారాయణకు వైఎస్ జగన్ అభినందనలు

ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ రచించిన దీపిక అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటికి సాహితీ విమర్శ విభాగంలో జాతీయ సాహిత్య అకాడమీ అవార్డు రావడం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. 1972లో సమిధ అనే కవితతో లక్ష్మీనారాయణ సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు.

సిబ్బందిపై పంటల బీమా భారం

- బీమా చేయించుకునేందుకు ముందుకు రాని రైతులు
- రోజు 10 మంది రైతులతో బీమా చేయించాలని అధికారుల ఆదేశాలు
- రైతులు చెల్లించకపోతే, వారి తరపున మీరే కట్టాలని హుకుం
- చేతిచమురు వదులుతోందని వీఏఏల గగ్గోలు



సాక్షి, అమరావతి: పంటల బీమా అమలులో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోంది. ప్రీమియం భారం భరించలేక పంటల బీమాలో తాము చేరలేమని రైతులు తెగేసి చెబుతుంటే.. ఎలాగైనా రైతులను చేర్పించాలంటూ రైతు సేవా కేంద్రాల సిబ్బంది (వీఏఏ)కి లక్ష్యాలను నిర్దేశించి మరి అధికారులు ఒత్తిడికి గురి చేస్తున్నారు. రైతులు కట్టలేమంటున్నారని చెబితే.. వారి తరపున ఆ ప్రీమియం సొమ్ములు మీరే కట్టండంటూ అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లు తట్టుకోలేక 15 రోజుల క్రితమే ఆళ్లగడ్డ మండలం జి.జంబులదిన్నె ఆర్‌ఎస్‌కే వ్యవసాయ అసిస్టెంట్ హరినాథ్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గుర్తు చేస్తూ తమకూ ఇదే పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు.

బీమా చేయాల్సింది 51.90 లక్షల ఎకరాలు

రబీ సాగు లక్ష్యం 57.50 లక్షల ఎకరాలు. నోటిఫై చేసిన పంటల సాగు విస్తీర్ణం 44.72 లక్షల ఎకరాలు, వీటికి అదనంగా బీమా పరిధిలోకి తీసుకొచ్చిన మామిడి విస్తీర్ణం మరో 7.18 లక్షల ఎకరాలు. అంటే బీమా చేయించాల్సిన విస్తీర్ణం 51.90 లక్షల ఎకరాలు. ఇప్పటివరకు సాగైన విస్తీర్ణం 18.50 లక్షల ఎకరాలు. దిగుబడి, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద ఈ నెల 17వ తేదీ వరకు బీమా కవరేజీ పొందిన విస్తీర్ణం కేవలం 7,40,875 ఎకరాలు మాత్రమే. రైతులు పంటల బీమాకు ఏ స్థాయిలో ఆసక్తి చూపిస్తున్నారో ఈ గణాంకాలే చెబుతున్నాయి.

వీఏఏలపై రైతుల ప్రీమియం భారం

కేవలం వరి పంటకు మాత్రమే బీమా చేయించుకునేందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. రబీలో 20.50 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. నోటిఫై చేసిన జిల్లాల పరిధిలో 15.77 లక్షల ఎకరాలు మాత్రమే బీమా కవరేజీ కల్పించాల్సి ఉండగా.. ఇప్పటివరకు కనీసం 10 శాతం విస్తీర్ణంలో కూడా బీమా కల్పించలేని దుస్థితి ఏర్పడింది. స్వచ్ఛందంగా ఈ పథకంలో చేరేందుకు రైతులెవరూ ముందుకు రాకపోవడంతో ఆ భారాన్ని వీఏఏలపై వేస్తున్నారు. ఇప్పటికే ఇంటర్నెట్‌తో పాటు పాడిపంటలు మ్యాగజైన్ కోసం చందాలు చేర్పించేందుకు వీఏఏలకు చేతిచమురు వదిలిపోతోంది. ఇప్పుడు రైతుల తరపున ప్రీమియం చెల్లించాలని ఒత్తిడి చేస్తే తాము బతికేదెలా అని వీఏఏలు ప్రశ్నిస్తున్నారు. ప్రీమియం భారం భరించలేక రైతులెవరూ పంటల బీమాపై ఆసక్తి చూపకపోవడంతో.. రోజుకు కనీసం 10 మందికి తక్కువ కాకుండా రైతులతో బీమా చేయించాల్సిందేనంటూ అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. చేసేది లేక ఉద్యోగాలను కాపాడుకునేందుకు రైతుల తరపున ప్రీమియం కడుతున్నామని వీఏఏలు చెబుతున్నారు. ఈ నెలలో వచ్చిన జీతంలో మూడో వంతు మ్యాగజైన్స్‌కు, మిగిలిన మొత్తం ప్రీమియానికి చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రూ.2, రూ.3 వడ్డీలకు తెచ్చి మరీ కట్టాల్సి వస్తోందని చెబుతున్నారు.

23 నుంచి ‘104’ విధుల బహిష్కరణ

సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 5 తర్వాత సమ్మె

సాక్షి, అమరావతి: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదనీ, దీనికి నిరసనగా ఈనెల 23 నుంచి విధులు బహిష్కరించనున్నట్టు ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్... ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు బుధవారం లేఖ రాసింది. తమకు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కంటే తక్కువ వేతనాలు ఇస్తున్నారని పేర్కొంది. వేతనాలతో పాటు, మరికొన్ని సమస్యలపై నిర్వహణ సంస్థ అరబిందోతో ఈనెల 4న చర్చలు జరిపినా, ఎటువంటి పురోగతి లేదని, గురువారం నుంచి ప్రజలకు వైద్యసేవలపై ఎటువంటి ప్రభావం లేకుండా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని వెల్లడించింది. యాజమాన్యం నిర్వహించే అన్ని గ్రూపుల నుంచి ఉద్యోగులు వైదొలగనున్నట్టు స్పష్టం చేసింది. అయినా పరిష్కారం లభించకపోతే ఈనెల 23 నుంచి విధులను బహిష్కరిస్తామని, అప్పటికీ కుదరకపోతే వచ్చే నెల 5 తర్వాత ఏ క్షణమైన సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. తమ లేఖను సమ్మె నోటీసుగా పరిగణించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

పింఛను లబ్ధిదారులకు నోటీసుల జారీ నిలుపుదల

- తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు తాత్కాలికంగా బ్రేక్

సాక్షి, అమరావతి: సామాజిక పింఛను లబ్ధిదారులకు నోటీసుల జారీని ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. ఇటీవల జిల్లా కలెక్టర్ల సదస్సులో సామాజిక పింఛన్ల తనిఖీ నిర్వహించి, అనర్హులైన వారికి పింఛన్లు తొలగించాలని, రెవెన్యూ రికవరీ చట్టం మేరకు పింఛన్ సొమ్మును తిరిగి రికవరీ చేయాలని, వికలాంగులకు తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చిన డాక్టర్లను ప్రాసిక్యూట్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనుమానిత పింఛన్ దారులందరికీ నోటీసులు జారీ చేయాలంటూ మంగళవారం సెర్ప్ సీఈవో కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అయితే తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నోటీసులు జారీ చేయొద్దని సూచిస్తూ బుధవారం సెర్ప్ సీఈవో కలెక్టర్లకు ఎస్ఎంఎస్ పంపారు.

స్థిరంగా కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

- రానున్న 48 గంటల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు



మహారాణిపేట: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో ఇది వాయవ్యంగా ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రా దిశగా ఏపీ తీరానికి ఆనుకుని ప్రయాణిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం వల్ల బుధవారం కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో శీతల వాతావరణం నెలకొంది. గురువారం కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో సాధారణ వర్షాలు, అనకాపల్లి, కాకినాడ, విశాఖ, అల్లూరి జిల్లా, విజయనగరంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

ఉద్యోగం కావాలా.. లోకేశ్‌ను కలవండి!

సెలవులో పంపిన గనుల శాఖాధికారులతో మధ్యవర్తుల రాయబేరాలు

సాక్షి, అమరావతి: బలవంతంగా సెలవుపై పంపిన గనుల శాఖాధికారులు లోకేశ్‌ను కలిస్తేనే ఉద్యోగంలో చేరడానికి అవకాశం ఉంటుందంటూ మధ్యవర్తులు రాయబారాలు నడుపుతుండటం చర్చనీయాంశంగా మారింది. లేనిపోని ఆరోపణలు మోపి గనుల శాఖ అధికారులను సెలవుపై పంపి.. ఇప్పుడు లోకేశ్‌ను కలవాలంటూ ఒత్తిడి చేయడం ముడుపుల కోసమేనన్న ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వానికి దగ్గరగా పని చేశారనే ఆరోపణలు సృష్టించి 26 మంది అధికారులను రెండు నెలల క్రితం గనుల శాఖ డైరెక్టర్ బలవంతంగా సెలవుపై పంపారు. తాము ఏం తప్పు చేశామని ప్రశ్నించినా.. అవన్నీ తమకు తెలియదని వెంటనే సెలవుపై వెళ్లిపోవాలని మౌఖికంగా ఆదేశించారు. గనుల శాఖ మంత్రి పేషీ నుంచి కూడా హెచ్చరికలు అందడంతో గత్యంతరం లేక వారంతా సెలవులో వెళ్లారు. వారిలో పలువురు డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఇతర స్థాయిల్లో పనిచేసే అధికారులు ఉన్నారు. నిజానికి కొద్ది నెలల క్రితమే వారికి టీడీపీ ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. ఆ పోస్టింగ్‌లు ఇవ్వడానికి భారీగా ముడుపులు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. లోకేశ్ తరపున అన్ని వ్యవహారాలు చక్కబెట్టే వ్యక్తి ఈ బదిలీల్లో కీలకంగా మారి వేలం నిర్వహించి మరీ పోస్టింగ్‌లు ఇచ్చారు. పోస్టింగ్‌లకు ముందే వారితో బేరం కుదుర్చుకుని సొమ్ములు తీసుకున్నారు. అనంతరం ఆ పోస్టుల్లో చేరిన కొద్దిరోజుల తర్వాత రెండు విడతలుగా వారిని బెదిరించి బలవంతంగా సెలవు పెట్టించారు.

చెప్పినట్టు చేస్తేనే తిరిగి ఉద్యోగం

కొన్ని వారాల తర్వాత లోకేశ్‌కు మధ్యవర్తిగా పనిచేసే వ్యక్తి నుంచి వారికి సమాచారం ఓ అందింది. మళ్లీ విధుల్లో చేరాలంటే తాను చెప్పినట్టు చేయాలని ఆయన సూచించారు. వెళితే మళ్లీ భారీగా ముడుపులు ముట్టజెప్పాలనే భయంతో మొదట్లో ఎవరూ వెళ్లలేదని సమాచారం. దీంతో ఆ వ్యక్తే వారిని కలిసి గత ఐదేళ్లలో వారు పనిచేసిన స్థానాలు, అక్కడ ఎంత సంపాదించారు వంటి వివరాలు చెప్పి బెదిరింపులకు దిగారు. ఐదేళ్లలో అంత సంపాదించారు కాబట్టి అందులో కొంత ఇవ్వాలని స్పష్టం చేశారు. మీరు చెప్పినంత సంపాదన తమకు లేదని, రెండవసారి మళ్లీ డబ్బులు ఇచ్చుకోలేమని చెప్పినా కీలకమైన పోస్టుల్లో అన్ని సంవత్సరాలు పని చేశారు కాబట్టి తాము చెప్పినట్టు వినాల్సిందేనని ఒత్తిడి చేసినట్టు సమాచారం. కొన్నిరోజులుగా దీనిపై చర్చలు జరిగినా బేరం కుదరకపోవడంతో వారిని తిరిగి విధుల్లోకి చేరేందుకు అనుమతించడంలేదు.

రెండవసారి ముడుపులు ఇచ్చుకోలేం

బదిలీల సమయంలో పోస్టింగ్ ఇచ్చినందుకు ముడుపులు తీసుకుని ఆ తర్వాత సెలవుపై పంపడం అన్యాయని, ఇప్పుడు మళ్లీ డబ్బులు ఇస్తేనే విధుల్లో చేరాలనడం ఏమిటని అధికారులు వాపోతున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక, ఉన్నతాధికారులతో మాట్లాడలేక సతమతమవుతున్నారు. గనుల శాఖలో బదిలీలన్నీ లోకేశ్ మనుషుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. లోకేశ్‌కి అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తి ఆదేశాల ప్రకారమే గనుల శాఖ డైరెక్టర్ పని చేస్తున్నారు. గనుల శాఖ మంత్రి చెప్పినా పట్టించుకోకుండా కేవలం లోకేశ్, ఆయన సన్నిహితుడు చెప్పిన పనులు మాత్రమే చేస్తున్నట్టు సమాచారం. లీజుల మంజూరు, బిల్లులు, ఇతర వ్యవహారాలు ఏమైనా తనకు లోకేశ్ చెప్పాల్సిందేనని స్పష్టం చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు సెలవుపై పంపిన అధికారులతో బేరాలు కుదరకపోవడంతో వారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

మామిడికి ప్రీమియం చెల్లింపు గడువు డిసెంబర్ 31

సాక్షి, అమరావతి: రబీలో 2024-26 సీజన్‌లలో మామిడి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద అమలు చేసేందుకు మార్గదర్శకాలను జారీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాతావరణ పంటల బీమా కింద నోటిఫై చేసిన పంటలకు ఇప్పటికే గడువు ముగిసినప్పటికీ మామిడి పంటకు మాత్రం డిసెంబర్ 31వ తేదీ వరకు గడువునిచ్చారు. మార్గదర్శకాల ప్రకారం నోటిఫై చేసిన జిల్లాల్లో కనీసం 2వేల హెక్టార్లకు తక్కువకాకుండా మామిడి సాగులో ఉండాలి. ఐదు క్లస్టర్స్ పరిధిలో 15 జిల్లాల్లో మామిడికి పంటల బీమా వర్తింప చేస్తున్నారు. అగ్రికల్చర్ ఇన్సురెన్స్ కంపెనీ ద్వారా అమలు చేస్తున్నారు.

సంగం డెయిరీ స్వాధీనం జీవో ఉపసంహరణ

సాక్షి, అమరావతి: సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ స్వాధీనం చేసుకునేలా గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో 19ను ఉపసంహరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అప్పట్లో సంగం డెయిరీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించగా, సంగం యాజమాన్య హక్కులు ఏపీ డెయిరీకి బదలాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 19ను రద్దు చేయాలని కోరుతూ సంగం డెయిరీ యాజమాన్యం అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గుంటూరు జిల్లా మిల్క్ ప్రొడ్యూసర్స్ కో- ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్, సంగం జాగర్లమూడిని కంపెనీగా మారుస్తూ 1978లో జారీ చేసిన జీవోను పునరుద్ధరిస్తున్నట్లు సహకార శాఖ కార్యదర్శి నాయక్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఓ పన్నెండి.. నిర్ణయం మిగిలుంది

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల పోస్టులకు 150 మందికి ఇంటర్వ్యూలు



సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో 15 డైరెక్టర్ల పోస్టులకు మూడు రోజుల పాటు జరిగిన ఇంటర్వ్యూలు బుధవారం రాత్రితో ముగిశాయి. మొత్తం 150 మందిని అధికారులు ఇంటర్వ్యూ చేశారు. వీరిలో ఒక్కో పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేసి, ఆ జాబితాను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఇంధన శాఖ అధికారులు తెలిపారు. ఎవరిని డైరెక్టర్‌గా నియమించాలనేది నిర్ణయించేది ప్రభుత్వమేనని చెప్పారు. అయితే ఈ పోస్టుల కోసం పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు విమర్శలు వచ్చాయి. కొందరు అభ్యర్థులు సైతం ఈ విషయాన్ని సన్నిహితుల వద్ద చెబుతుండటం విశేషం. ముఖ్యంగా కొందరు కూటమి నేతలు డైరెక్టర్ పోస్టును ఆశిస్తున్న వారి నుంచి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ వసూలు చేశారని ఆరోపణలు వినిపించాయి. ముడుపులు తీసుకున్న వారు పోస్టు ఇప్పించలేకపోతే డబ్బు తిరిగి ఇస్తారో లేదోనన్న ఆందోళనతో కొందరు అభ్యర్థులు మధ్య వర్తుల ద్వారా నేతలను అడిగితే.. ‘మీకే పోస్టు గ్యారెంటీ’ అంటూ చెబుతున్నారని సమాచారం. వారికే పోస్టు దక్కేలా చేయడానికి ఆ నేతలకు అధికారులు సైతం అన్ని విధాలుగా సహకరించారు. ఇష్టానుసారం నిబంధనలు మార్చటం, ఇంటర్వ్యూలు జరిగే ప్రదేశాన్ని ఆఖరి నిమిషంలో మార్చడం, అభ్యర్థులను అడిగే ప్రశ్నల వరకూ అన్నిటిలోనూ స్వామి భక్తిని చాటుకున్నారు. కొందరిని పది నిమిషాలు ఇంటర్వ్యూ చేస్తే, మరికొందరిని రెండు నిమిషాల్లోనే పంపేశారు. కొందరికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారానూ ఇంటర్వ్యూలు చేశారు.

పోలీసులకు ఏబీసీడీ అవార్డులు ప్రదానం



ఏపీ పోలీస్ బృందాన్ని అభినందిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: నేర పరిశోధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీసు అధికారులకు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ‘ఏబీసీడీ’ అవార్డులను ప్రదానం చేశారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్తూరు, కర్నూలు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు, గుంతకల్లు రైల్వే పోలీసు విభాగాలకు ఈ అవార్డులను బహూకరించారు. నేర పరిశోధనలో మొదటి స్థానం పొందిన కేసుకు రూ.లక్ష, రెండో స్థానం పొందిన కేసుకు రూ.60 వేలు, మూడో స్థానం పొందిన కేసుకు రూ.40వేలు, కన్సోలేషన్ బహుమతి పొందిన కేసుకు రూ.20వేల చొప్పున బహుమతులు ప్రదానం చేశారు. లోక్ అదాలత్ ద్వారా అత్యధికంగా కేసులను పరిష్కరించిన కర్నూలు, విజయనగరం, కృష్ణా జిల్లా ఎస్పీలకు ప్రశంసాపత్రాలు అందించారు. సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌తోపాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ టెన్నిస్ జట్లకు డీజీపీ అభినందన

అఖిల భారత పోలీస్ లాన్ టెన్నిస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఏపీ పోలీసు బృందాన్ని డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అభినందించారు. బెంగళూరులో ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో ఓపెన్ సింగిల్స్, ఓపెన్ డబుల్స్, వెటరన్ డబుల్స్ విభాగాల్లో ఏపీ పోలీసు జట్లు ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకాలు సాధించాయి. ఈ జట్ల సభ్యులు డీజీపీ ద్వారకా తిరుమలరావును రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం కలసి తాము సాధించిన పతకాలు చూపించారు. విజేతలుగా నిలిచిన ఏపీ పోలీసు బృందాన్ని డీజీపీ అభినందించారు.

జనసేన నేతల రేవ్‌పార్టీ

- మహిళలతో అశ్లీల నృత్యాలు.. ఏలూరు జిల్లాలో ఘటన



రేవ్ పార్టీలో అశ్లీల నృత్యం చేస్తున్న మహిళతో జనసేన నాయకుల చిందులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో జనసేన నేతల విశృంఖలత్వం పెచ్చుమీరిపోతోంది. ఇప్పటి వరకూ ఇసుక దోపిడీ, సెటిల్‌మెంట్లు చేసుకుంటూ వచ్చిన ఆ పార్టీ నేతలు తాజాగా రేవ్‌పార్టీ కల్చర్‌ను జిల్లాకు పరిచయం చేశారు. నిడమర్రు మండలంలోని బావాయిపాలెం ఇందుకు వేదికైంది. గ్రామ జనసేన నాయకుడు వాకమూడి ఇంద్ర తన పుట్టినరోజును పురస్కరించుకుని గత ఆదివారం ఈ రేవ్‌పార్టీని ఏర్పాటుచేయడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో మహిళలతో అశ్లీల నృత్యాలు చేయించారు. కొంతమంది హిజ్రాలతోనూ ఈ నృత్యాలు చేయించినట్లు తెలిసింది. జనసేన నేత, ఆయన అనుచరులు కూడా ఈ డ్యాన్సులు చేయడం విమర్శలకు తావిస్తోంది. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉంగుటూరు జనసేన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అండతో ఆ పార్టీ నేతల నాయకుల ఆగడాలకు అంతులేకుండా పోతోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

జల్‌జీవన్ మిషన్‌కు రూ.70 వేల కోట్లు అడిగాం: పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని జల్ జీవన్ మిషన్ పథకం లక్ష్యాల మేరకు కనీసం రూ.70 వేల కోట్లు అవసరమని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఆ మేరకు రాష్ట్రానికి కేటాయింపులు పెంచాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరామన్నారు. జల్‌జీవన్ మిషన్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను బుధవారం పవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.70 వేల కోట్ల అవసరాలకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు సమర్పించాలని కేంద్ర మంత్రి కోరారని చెప్పారు. అధికారులు జనవరిలోగా డీపీఆర్ రూపొందించాలన్నారు.

ఏపీలోనే అత్యధిక విద్యుత్ చార్జీలు

- గత ప్రభుత్వం కంటే ఐదు రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారు
- విద్యుత్ చార్జీలు–స్మార్ట్‌మీటర్ల సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న కృష్ణంరాజు

సాక్షి, విశాఖపట్నం: ఏపీలోనే విద్యుత్ చార్జీలు అత్యధికంగా ఉన్నాయని.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా చంద్రబాబు సర్కార్ భారీగా విద్యుత్ చార్జీలు వసూలు చేస్తోందని మేధావులు, సామాజిక వేత్తలు, ఉద్యమకారులు స్పష్టం చేశారు. విశాఖ పబ్లిక్ లైబ్రరీలో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి.. అధికారం చేపట్టిన 6 నెలల్లోనే ప్రజలను మోసగించారని వక్తలు ధ్వజమెత్తారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టబోమని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మార్చారని ఎద్దేవా చేశారు.

తెరచాటు చార్జీలు దుర్మార్గం

ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. ఇంధన, విద్యుత్ కొనుగోలు వ్యయాల సర్దుబాటు (ఎఫ్‌పీపీసీఏ) చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై సుమారు రూ.15 వేల కోట్ల భారాన్ని మోపుతోందన్నారు. తెరచాటు చార్జీలుగా పేరొందిన వీటిని దేశంలో ఏపీతో పాటు గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్ మాత్రమే వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. 2023 మార్చిలో అప్పటి సీఎం వైఎస్ జగన్ పాలనలో గృహ వినియోగం కనీస 100 యూనిట్లకు అన్ని సుంకాలు కలిపి రూ.321 మాత్రమే చెల్లించేవారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం ఆరు నెలల్లోనే దేశంలోనే అత్యధిక విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్న రాష్ట్రంగా మార్చేశారని ఆక్షేపించారు. ప్రతి విద్యుత్ బిల్లులో 13 రకాల సుంకాలు, పన్నులు చూపిస్తున్నారని.. మరే రాష్ట్రంలోనూ ఇన్ని రకాల భారాలు వేయడం లేదని స్పష్టం చేశారు. విశ్రాంత ఏయూ ప్రొఫెసర్ తమ్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 1.86 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్‌మీటర్ల పేరుతో మరో రూ.7,200 కోట్ల భారం మోపడానికి రంగం సిద్ధమైందన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు మాట తప్పి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకూ స్మార్ట్ మీటర్లు బిగిస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకురాలు మణి మాట్లాడుతూ.. అదానీ కోసం చంద్రబాబు, పవన్ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ఏపీ ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ జేటీ రామారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలను పీడించుకుతినే విధానం నడుస్తోందన్నారు. కాగా.. ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలంటూ సదస్సు తీర్మానించింది.



ప్రతిచోటా ఉండటమంటే ఎక్కడా లేకపోవడమే!
– సెనెకా

సాక్షి
గురువారం, 19 డిసెంబర్ 2024

మైత్రీబంధంలో శుభ పరిణామం

ఇది కొంత ఊహించని పరిణామమే కావచ్చు. కానీ కొత్త ఆశలు చిగురింపజేసిన సంఘటన. శ్రీలంక నూతన అధ్యక్షుడు అరుణ కుమార దిసనాయకె తన తొలి విదేశీ పర్యటనకు భారతదేశాన్ని ఎంచుకోవడం, ఢిల్లీ రావడం ఇరుదేశాల మధ్య సత్సంబంధాలకు సానుకూల సూచన. శ్రీలంకలోని అధికార నేషనల్ పీపుల్స్ పవర్ కూటమిలో ప్రధాన భాగస్వామి, సైద్ధాంతికంగా మార్క్సిస్టు భావజాలం వైపు మొగ్గుచూపే రాజకీయ పక్షమైన జనతా విముక్తి పెరుమున (జేవీపీ), దానికి సారథిగా దిసనాయకె చైనా పక్షం వహిస్తారని భావించారు. పైగా రుణాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సహా అనేక అంశాలలో ఆధారపడ్డ కొలంబోపై బీజింగ్ ప్రభావమూ తక్కువేమీ కాదు. మరోపక్క, 1980లలో ద్వీపదేశంలో తమిళ వేర్పాటువాదులతో శ్రీలంక అంతర్యుద్ధ వేళ సైన్యాన్ని పంపడం ద్వారా భారత జోక్యం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, జేవీపీ ఆది నుంచి భారత వ్యతిరేక వైఖరితో వ్యవహరించేది. పైపెచ్చు కొంత కాలంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో ప్రాబల్యం కోసం చైనా దూకుడుగా సాగుతూ, మనకు గుబులు పుట్టిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత ప్రయోజనాలకు విరుద్ధంగా శ్రీలంక భూభాగాన్ని వినియోగించుకొనేందుకు అనుమతించేది లేదంటూ భారత పర్యటనలో శ్రీలంక అధ్యక్షుడు ఇచ్చిన హామీ మండువేసవిలో పన్నీటిజల్లు లాంటిది. ఉమ్మడి భద్రతా ప్రయోజనాలు, పరస్పర విశ్వాసం, పారదర్శకతతో క్రమం తప్పకుండా జరపాల్సిన చర్చలను ఉభయ దేశాల సంయుక్త ప్రకటన ప్రతిఫలించడం విశేషం.

ద్వీపదేశాధ్యక్షుడికీ, భారత ప్రధాని మోదీకీ మధ్య భేటీ ఉత్సాహజనకంగా సాగడం చెప్పుకోదగ్గ అంశం. భారత విదేశీ విధానానికి దీన్ని ఓ విజయ సూచనగానూ భావించవచ్చు. రాజపక్స లాంటి శ్రీలంక నేతలు భారత్‌ను అనుమానిస్తూ, ఉద్దేశపూర్వకంగానే చైనా గాఢపరిష్వంగంలోకి చేరిన సందర్భంలో... నూతన అధ్యక్షుడు తన తొలి పర్యటనకు చైనాను కాక భారత్‌ను ఎంచుకోవడం మళ్ళీ పల్లవిస్తున్న స్నేహరాగం అనుకోవచ్చు. వెరసి, చైనాకు స్వల్పంగా దూరం జరిగి, మళ్ళీ భారత్‌తో చిరకాల బంధాలను పునరుద్ధరించుకోవడానికి శ్రీలంక ముందుకు రావడం మారుతున్న ఆలోచనా సరళికి సంకేతం. నిజానికి, కరోనా అనంతర కాలంలో ఆర్థికవ్యవస్థ కుప్ప కూలిపోయి, చేదు అనుభవాలు ఎదురుకావడంతో కొలంబో మార్పు వైపు చూసింది. దానికి తోడు అక్కడ మునుపటి వంశపారంపర్య, కుటుంబపాలిత రాజకీయ పార్టీల స్థానంలో కొత్త రాజకీయ నాయకత్వ ఆవిర్భావం మరింత తోడ్పడింది. అలాగే, ఇరుగుపొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యమంటూ భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానం లంకేయుల్ని ఆకట్టుకుంది. 2022లో శ్రీలంక ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయినప్పుడు 500 కోట్ల డాలర్ల పైచిలుకు మేర భారత్ సాయం అందించడమూ మరువరానిది. ఇవన్నీ కొలంబో ఆలోచనలో మార్పుకు దోహదం చేశాయి.

హంబన్‌తోట నౌకాశ్రయాన్ని 99 ఏళ్ళ లీజు మీద చైనాకు కట్టబెట్టడం సహా అనేక తప్పులు శ్రీలంకను వెంటాడాయి. అప్పటి రాజపక్సే సర్కారు వైఖరితో దేశం అప్పుల కుప్పయింది. అలాగే, నిన్నటి దాకా చైనా నౌకలు తమ గూఢచర్య యాత్రలు సాగిస్తూ, నడుమ శ్రీలంక నౌకాశ్రయాల్లో నిష్పూచీగా లంగరు వేసేవి. కానీ, ఇప్పుడు దిసనాయకె తాజా ఆశ్వాసనతో పరిస్థితి మారింది. చైనా నౌకలకు అది ఇక మునుపటిలా సులభమేమీ కాదు. ఇంతమాత్రానికే శ్రీలంకపై చైనా పట్టు సడలిందనుకోలేం. ఢిల్లీ, కొలంబోల మధ్య పాత కథలకు తెరపడి, కొత్త అధ్యాయం మొదలైందనుకోవచ్చు. లంకకు నిధుల అందజేతలో చైనాతో పోటీ పడలేకున్నా, రక్షణ సహా అనేక అంశాల్లో భారత – శ్రీలంకల మధ్య ఒప్పందాలు కలిసొస్తాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, సౌరశక్తి – పవన విద్యుత్ శక్తి, డిజిటల్ కనెక్టివిటీ లాంటివి ఉపకరిస్తాయి. అలాగే, అభివృద్ధి చెందని దేశాలతో దౌత్యపరంగా ముందుకు సాగేందుకు... భారత్ కొంతకాలంగా రుణసాయం నమూనా నుంచి పెట్టుబడుల ఆధారిత భాగస్వామ్యాల వైపు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అదీ కలిసొస్తోంది.

అన్ని అంశాలకూ తాజా భేటీ ఒక్కటే సర్వరోగ నివారణి కాకున్నా, చేపల వేటకై శ్రీలంక జలాల్లోకి ప్రవేశిస్తున్న భారతీయ మత్స్యకారులకు ఆ దేశ నౌకాదళం నుంచి ఎదురవుతున్న ఇక్కట్లు, శ్రీలంకలోని తమిళుల ఆకాంక్షల లాంటివి కూడా తాజా భేటీలో ప్రస్తావనకు రావడం సుగుణం. అలాగే, భారత భద్రత, ప్రాంతీయ సుస్థిరత కీలకమని కూడా లంక గుర్తించిందనుకోవాలి. మొత్తం మీద, దిసనాయకె తాజా పర్యటన చిరకాల భారత – శ్రీలంక మైత్రీబంధానికి ప్రతీకగా నిలిచింది. అనేక సంవత్సరాల ఆర్థిక, రాజకీయ సంక్షోభం తర్వాత ద్వీపదేశం పునర్నిర్మాణ బాటలో సాగుతూ, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల, ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకోవడంపై శ్రద్ధ పెట్టడం సంతోషకరమే కాక శ్రేయోదాయకం. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కొలంబో పర్యటన జరిపి, ఆ దేశ ఆర్థిక పునరుజ్జీవానికి మనం కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేయడం లాంటివి ఉపకరించాయి. ఫలప్రదమైన చర్చలకు బలమైన పునాది వేశాయి. సమీప సముద్రయాన పొరుగు దేశంగా వాణిజ్యం నుంచి ప్రాంతీయ భద్రతా పరిరక్షణ వరకు అనేక అంశాల్లో వ్యూహాత్మకంగా భారత్‌కు శ్రీలంక కీలకం. అదే సమయంలో విదేశాంగ విధానంలో దిసనాయకె ఆచరణాత్మక దృక్పథమూ అందివచ్చింది. మొత్తం మీద ఆయన తాజా పర్యటన, భారత – శ్రీలంకల మధ్య సంబంధాలు కొంత మెరుగవడం ఇరుపక్షాలకూ మేలు చేసేవే. పరస్పర ప్రయోజనాలను అది కాపాడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు దేశాలకూ కావాల్సింది అదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.చవితి ప.12.09 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఆశ్లేష తె.4.25 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి మఖ, **వర్జ్యం:** సా.4.45 నుండి 6.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.06 నుండి 10.50 వరకు, తదుపరి ప.2.31 నుండి 3.15 వరకు, **అమృతఘడియలు:** రా.2.46 నుండి 4.24 వరకు

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

కూటమి కథ కంచికేనా?

విశ్లేషణ



రషీద్ కిద్వాయి

2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత, ఎన్డీయేను సవాలు చేయగలిగే కూటమిగా 'ఇండియా' ఉండగలదని అనుకున్నారు. కానీ, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌ను అన్ని 'ఇండియా' పక్షాలు బరువుగా భావిస్తున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సీట్ల పంపకంలో సింగిల్ డిజిట్ సీట్లు తీసుకోవడానికి సిద్ధపడినప్పటికీ, కాంగ్రెస్‌కు అరవింద్ కేజ్రీవాల్ మొండిచెయ్యి చూపారు. బిహార్‌లోనూ కాంగ్రెస్‌తో పొత్తుకు లాలూప్రసాద్ యాదవ్ సిద్ధంగా లేరు. మహారాష్ట్రలో తమ పార్టీ ఘోర ప్రదర్శనకు శరద్ పవార్ కాంగ్రెస్ రూపంలో బలిపశువును వెతుకుతున్నారు. వీటిన్నింటికి తోడు నాయకత్వ సమస్యను పార్టీలు లేవనెత్తుతున్నాయి. ఈ అన్ని కారణాల వల్ల 'ఇండియా' కూటమి అకాల మరణం వైపు వెళ్తోంది.

నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని 2029 వరకు సవాలు చేయగలిగే సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రతిపక్షంగా ఇండియా కూటమి పని చేయగలదని 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రారంభంలో సూచించాయి. అయితే, ఈ సంకీర్ణం ఇప్పటికే అల్లాడుతోంది. సంవత్సరాంతానికే ఇండియా కూటమి అకాల మరణం వైపు వెళుతున్నట్లు కనబడుతోంది.

హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్), శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), సమాజ్ వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్‌తో సహా అనేక ఇండియా కూటమి పార్టీలకు ఒక విషయం అర్థం చేయించినట్లు కనిపిస్తోంది. అదేమిటంటే రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలోని కాంగ్రెస్ దేనికీ పనికిరాదు!

కాంగ్రెస్‌కు పెద్ద సవాలు

ఎంతో ఆలోచించి తీసుకున్న వ్యూహంలా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గ్రాండ్ ఓల్డ్ పార్టీకి సీట్లు కల్పించేది లేదని ప్రకటిస్తూ ఆప్ మొదటగా బయటకు వచ్చింది. బిహార్‌లో 2025 అసెంబ్లీ ఎన్నికల కోసం 'మహాగట్‌బంధన్'లో కాంగ్రెస్‌ను కోరుకోవడం లేదని లాలూ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వి వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

2026లో కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, తమిళనాడులో వరుసగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండగా, 2027లో గోవా, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, అస్సాంను బీజేపీ నుండి, కేరళను ఎల్‌డీఎఫ్ నుండి కైవసం చేసుకోవడం, హిమాచల్‌ను నిలుపుకోవడంలో కాంగ్రెస్ అత్యంత కష్టసాధ్యమైన సవాలును ఎదుర్కోనుంది. మిగిలిన రాష్ట్రాల్లో, అంటే తమిళనాడులో డీఎంకే, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ వంటి మిత్రపక్షాల మీద భారీగా ఆధారపడటమో, లేక ప్రాసంగికత లేకుండా ఉండిపోవడమో మాత్రమే కాంగ్రెస్ చేయగలిగేది!

కాంగ్రెస్‌ను ముంచే కేజ్రీవాల్ ఫార్ములా

ఇండియా కూటమి రాజకీయాల్లో ఎందుకు గందరగోళం ఉన్నదో ఇది వివరిస్తుంది. భారతదేశంలో పొత్తు రాజకీయాలు కొన్ని సూత్రాలు, నిర్బంధాల ద్వారా మార్గనిర్దేశం చేయబడుతున్నాయి. కానీ అవి ప్రస్తుతం ఇండియా కూటమి రాజకీయాల్లో కనిపించడం లేదు.

ముందుగా, పొత్తులు... భాగస్వాముల బలహీనతల ఆధారంగా కాకుండా వారి బలాల ఆధారంగా ఏర్పడ్డాయి. కానీ ప్రత్యక్ష ఎన్నికల పోరులో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు కాంగ్రెస్ తరచుగా బలహీనంగానూ, దుర్బలంగానూ ఉంటోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సీట్ల పంపకం విషయంలో సింగిల్ డిజిట్ సీట్లకు కాంగ్రెస్ సిద్ధపడినప్పటికీ, అరవింద్ కేజ్రీవాల్ కఠినంగా వ్యవహరించారు.



ఇండియా కూటమి: ఈ ఐక్యత నిలిచేనా?

ఢిల్లీకి సంబంధించినంతవరకు మైనారిటీ ఓట్లు కాంగ్రెస్ నుండి ఆప్‌కి మారడం ఖాయమని కేజ్రీవాల్ అంచనా. అలాంటప్పుడు కాంగ్రెస్ తనకు బరువుగా మారుతుంది. దీంతో దేశ రాజధానిలో రికార్డు స్థాయిలో మూడోసారి కూడా ఖాళీ సీట్లతో కాంగ్రెస్ మిగిలిపోయే అవకాశం కనిపిస్తోంది.

రాష్ట్ర స్థాయి పొత్తుల నుంచి కాంగ్రెస్‌ను తప్పించాలనే 'కేజ్రీవాల్ ఫార్ములా' తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ థాకరే వంటి వారికి ధైర్యం కలిగిస్తోంది.

దురదృష్టవశాత్తూ, 2026లో జరిగే అస్సాం, కేరళ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు తన సత్తాను నిరూపించుకునే అవకాశం వస్తుంది. కూటమి నేతల వ్యాఖ్యలపై స్పందించవద్దని పార్టీ సీనియర్ నేతలకు, సహచరులకు రాహుల్ గాంధీ సూచించారు. కూటమిని కొనసాగించడానికి ఇది బలహీనమైన ప్రయత్నమనే చెప్పాలి.

కూటముల వైఫల్యం వెనుక...

కూటమిలోని అనేక ప్రాంతీయ పార్టీలు కూటమి నాయకత్వ సమస్యను నిరంతరం లేవనెత్తుతున్నాయి. వాస్తవానికి, కాంగ్రెస్ మినహా, కూటమిలోని దాదాపు అందరూ మమతను అధిపతిగా సిఫార్సు చేశారు లేదా మద్దతు ఇచ్చారు. ఆమె కూడా బాధ్యతను 'ఒప్పుకునే' స్థాయిదాకా వెళ్లారు. కానీ కాంగ్రెస్ వ్యూహాత్మక మౌనం ఈ ఎత్తుగడను పురోగమించకుండా చేస్తోంది.

ఇండియా కూటమి భాగస్వాములు 'సహ–సమాన' హోదాను కోరుకుంటున్నాయని బహుశా కాంగ్రెస్‌కు తెలుసు. కానీ ఒక ఆధిపత్య భాగస్వామి, అనేక మంది మైనర్ ప్లేయర్‌లు ఉన్నప్పుడల్లా పొత్తులు పని చేశాయి, వృద్ధి చెందాయి. ఉదాహరణకు, కేరళలో వరుసగా కాంగ్రెస్, సీపీఎం నేతృత్వంలోని యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ పొత్తులు లేదా బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే. 1977 నాటి జనతా పార్టీ ప్రయోగం, నేషనల్ ఫ్రంట్ (1989), యునైటెడ్ ఫ్రంట్ (1996) కేవలం 'సహ–సమాన' వంటకంపై ఆధారపడినందుకే నాశనమైనాయి. అయితే లోక్‌సభలో ఓ వంద స్థానాలు ఉన్న కారణంగా, కాంగ్రెస్ తనను సమానులలో మొదటి స్థానంలో ఉంచుకుంటోంది.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, గతంలో కూటమికి నాయకత్వ సమస్య అరుదుగానే ఉండేది. మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రి అయ్యారంటే, ఆయన ఉత్తముడు లేదా గట్టి పోటీదారు కావడం వల్ల కాదు, చరణ్ సింగ్‌ను అదుపులో ఉంచడానికి. దేవీలాల్ నామినేషన్ వేసిన పదవికి పోటీదారు కాదు కాబట్టే 1988–89లో ఎన్టీ రామారావు నేషనల్ ఫ్రంట్ కన్వీనర్ అయ్యారు. తరువాత, ప్రతిష్ఠాత్మకమైన ఆ పదవిని వీపీ సింగ్‌కు కట్టబెట్టారు. హెచ్‌డి దేవెగౌడ, ఇందర్ కుమార్ గుజ్రాల్ రోజులలో, టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడు స్వల్పకాలిక యునైటెడ్ ఫ్రంట్‌కు కన్వీనర్‌గా, కింగ్‌మేకర్‌గా వ్యవహరించారు. అస్థిర కూటమి రాజకీయాల వాజ్‌పేయి కాలంలో, జార్జ్ ఫెర్నాండెజ్ ఎన్డీయే కన్వీనర్‌గా ఎంపికయ్యారు. రామారావుగానీ, నాయుడుగానీ, ఫెర్నాండెజ్‌గానీ తమకిచ్చిన పదవి కోసం తహతహలాడటం వినబడలేదు. మొరార్జీ, దేవీలాల్, గౌడ, గుజ్రాల్‌లకు కూడా ఇది వర్తిస్తుంది. ఈ విషయాన్ని మమత కూడా తెలుసుకోవాలని కాంగ్రెస్ అనుకుంటుండవచ్చు.

కూటమిలో అందరితోనూ సమాచారం పంచుకోగల దిగ్గజం శరద్ పవార్. కానీ నవంబర్ 23 మహారాష్ట్ర తీర్పు తర్వాత, పవార్ రాజ్యం లేని రాజుగా ఒంటరివాడయ్యారు. మహారాష్ట్రలో తన పార్టీ ఘోర ప్రదర్శనకు ఆయన ఒక బలిపశువును వెతుకుతున్నారు. కాంగ్రెస్ దానికి సరిగ్గా సరిపోతుంది. అన్న కొడుకు అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో అవమానకరమైన విలీనం కోసం పవార్ చూస్తుండటమే కాకుండా, కాంగ్రెస్‌పై నిందలు వేయడానికి మమత, కేజ్రీవాల్‌లతో కలిసి పన్నాగం పన్నుతున్నారు.

ఎదురుదాడి లేదా సమర్థమైన వ్యూహాన్ని ప్రారంభించడానికి అహ్మద్ పటేల్ వంటి సమర్థవంతమైన మేనేజర్‌ను కాంగ్రెస్ కోల్పోయింది. ముగ్గురు గాంధీలు, ఖర్గే శక్తిమంతంగా కనిపించవచ్చు. కానీ మమత, కేజ్రీవాల్, లాలూ, పవార్ వంటి స్వతంత్ర ఆలోచనాపరులను చేరుకోలేని బలహీనులుగా వారు మిగిలిపోతున్నారు. కూటమి పుట్టుక చాలా ఆర్భాటంగా జరిగింది. కానీ దాని మరణం చడీచప్పుడు లేకుండా సంభవిస్తోంది. జనతా పార్టీ నుంచి యూపీఏ దాకా ఏనాడూ కూటముల ముగింపు గురించి బహిరంగ ప్రకటన రాలేదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, రచయిత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

డాక్టర్ గౌరవం



ఒక సర్జన్‌గా ప్రతిరోజూ మరొకరి జీవితంలోని అత్యంత ముఖ్యమైన రోజులో భాగస్వామిని అయ్యే గౌరవం లభిస్తుంది.

– ఎలియట్ సెర్వాయిస్, యూఎస్ థొరాయిక్ సర్జన్

కొట్టేది వాళ్లే!



అశ్విన్ వెళ్లిపోతే, ఇక భారత క్రికెట్ జట్టు ఇంకో బౌలర్‌ను చూసుకోవాలి– బ్యాట్స్‌మెన్ విఫలమైనప్పుడల్లా ఎప్పుడంటే అప్పుడు వచ్చి బాది వెళ్లడానికి!

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

పిండుకోవడమే!



ఢిల్లీలోని ఒక పెద్ద ప్రైవేట్ హాస్పిటల్‌కు మా అమ్మను తీసుకెళ్తే, డాక్టర్ కంటే ముందు ఒక కోఆర్డినేటర్, జూనియర్ డాక్టర్, బిల్లింగ్ డిపార్ట్‌మెంట్ బృందం కలిశారు. పదిహేను రోజుల కిందటి పరీక్షలు పనికి రావని, మళ్లీ చేయించాలన్నారు. బయట చేయిస్తామంటే ఒప్పుకోలేదు. ఒక ప్యాకేజీ తీసుకొమ్మని బలవంతం చేశారు. మనం వెళ్తూనే మనల్ని సాధ్యమైనంత ఎక్కువ ఖర్చు పెట్టించడానికి వాళ్లు సిద్ధం చేస్తున్నారు.

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

పాపం మగవాళ్లు!



ఇండియా జనాభా 140 కోట్లు. ఇక్కడ సగం మంది, అంటే మగవాళ్లు గృహ హింస మీద కేసు పెట్టలేరు. లైంగిక హింస మీద కేసు పెట్టలేరు. అత్యాచారాలు, భార్య చూపే క్రూరత్వం, మర్యాదకు కలిగే భంగం... వేటి మీదా కేసు పెట్టలేరు.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, పురుష హక్కుల కార్యకర్త

జాడలేని లేడీస్



ఆస్కార్స్ షార్ట్ లిస్ట్ వచ్చేసింది. 'లాపతా లేడీస్' (లిస్టులో లేదు) బాగా తీసిన వినోదాత్మక సినిమా అయినప్పటికీ, అది ఒక అంతర్జాతీయ ఫీచర్ ఫిలిమ్ విభాగంలో ఇండియాకు ప్రాతినిధ్యం వహించగలిగేది కాదు. దురదృష్టవశాత్తూ 'మెయిన్‌స్ట్రీమ్ బాలీవుడ్' బుడగలో మనం జీవిస్తున్నాం. స్టార్ల హడావిడి లేకుండా కళలో రాజీపడకుండా తీసిన సినిమాలను వదిలేసి, ప్రతి సంవత్సరం తప్పుడువే ఎంపిక చేస్తున్నాం.

– రిక్కీ కేజ్, మ్యూజీషియన్

మోసపు వార్త



ఓ కాలంలో న్యూస్ పేపర్ మీడియా ఉండేది. తర్వాత టీవీ మీడియా వచ్చింది. అటుపై మెయిన్‌స్ట్రీమ్ మీడియా, ఆ తర్వాత సోషల్ మీడియా వచ్చాయి. దీనికి గొప్ప అదనపు చేర్పు ఏమిటంటే, థంబ్ నెయిల్ మీడియా. వార్తకూ దానికీ ఏ సంబంధమూ ఉండదు. కానీ అది ఓపెన్ చేసి, అందులో ఏమీలేదని తెలుసుకుని బయటకు వచ్చేసరికే కావాల్సిన వాచ్ టైమ్ వస్తుందని క్రియేటర్లకు తెలుసు.

– రామ్‌గోపాల్ వర్మ, దర్శకుడు

హిందీ చాలా?



డిజిటల్ ఇండియా కేవలం ప్రభుత్వ దరఖాస్తులను ఇంగ్లిష్ నుంచి హిందీకి మాత్రమే మార్చేట్టుగా ఉంది. ప్రతి భారతీయ భాష, మాండలికాల్లోకి మార్చగలిగే సమర్థత వాళ్లకు ఉన్నట్టు లేదు. కృత్రిమ మేధ ఉన్నప్పటికీ మనం ఇంతగా ఎందుకు వెనకబడి ఉన్నాం? సనాతనులే జవాబు చెప్పాలి.

– దేవ్‌దత్ పట్నాయక్, కాలమిస్ట్

ఇన్ బాక్స్

కావ్య వ్యాఖ్యాన మహోపాధ్యాయుడు

ప్రాచీన కావ్యాలకు వ్యాఖ్యాన సొగసులు అద్దిన వ్యాఖ్యాతల్లో వేదం వేంకటరాయశాస్త్రి ప్రసిద్ధులు. పదాలను విభజించడం, ఆ పదాలకు అర్థం చెప్పడం, విగ్రహం వాక్యం, వాక్య యోజన, ఆక్షేపశ్చ సమాధానం అనే పంచ లక్షణాలను కావ్య వ్యాఖ్యానాలలో ఇనుమడింపజేసే వ్యాఖ్యాతలకు ఆయన మార్గ నిర్దేశం చేశారు. 'మహోపాధ్యాయ' బిరుదుతో పాటు 'కళా ప్రపూర్ణ' గౌరవాన్ని పొందారు. 'నన్నెచోడుని కవిత్వము' అనే విమర్శనా గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు.



వేదం వేంకటరాయశాస్త్రి

1853 డిసెంబర్ 21న వేంకట రమణ శాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు చెన్నైలో జన్మించిన వీరు ప్రసిద్ధ పండితులుగా, కవిగా, వ్యాఖ్యాతగా, నాటక కర్తగా ప్రసిద్ధులు. సంస్కృతంలోని అనేక నాటకాలను తెలుగులోకి అనువదించారు. ప్రసిద్ధాలైన ప్రాచీన కావ్యాలకు వ్యాఖ్యానాలు రాసి అవి వెలుగు చూడ్డానికి దోహదపడ్డారు.

1916లో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు'కు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన వీరు గ్రాంథిక భాషావాదిగా పేరుపొందారు. 1899లో 'తెలుగు భాషాభిమాని' నాటక సమాజాన్ని స్థాపించారు. 1897లో 'ప్రతాపరుద్రీయం', 1901లో రాసిన 'ఉషా' నాటకం వీరికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చాయి. వీరు రాసిన 'శృంగార నైషధ సర్వంకషా వ్యాఖ్య', 'ఆముక్త మాల్యద సంజీవనీ వ్యాఖ్య'లు వ్యాఖ్యాన చరిత్రలో మకుటాయమానంగా నిలిచిపోయాయి. 'కుమార సంభవం', 'మేఘ సందేశం', 'విజయ విలాసం' లాంటి కావ్యాలకు విలువైన వ్యాఖ్యానాలు సంతరించారు. లక్షణ గ్రంథాలను మీరకపోవడం, గ్రాంథిక భాషను సమర్థించడం, వ్యాఖ్యానాల్లో పాండిత్య ధోరణిని ప్రవేశపెట్టడం అనే లక్షణాల వల్ల వేదం వారు రాసిన వ్యాఖ్యానాలు మూలగ్రంథం కంటే కఠినంగా ఉన్నాయనే విమర్శలను ఎదుర్కొన్నాయి. వ్యాఖ్యానం అంటే కేవలం పదాలకు అర్థాలు చెప్పడమే కాదు అందులోని విశేషార్థాలను వివరించే దిశగా కూడా సాగిన వ్యాఖ్యానాలు వీరి బహుముఖీన ప్రతిభను తేటతెల్లం చేస్తాయి. తమ వ్యాఖ్యానాల ద్వారా ఎన్నో ప్రాచీన కావ్యాలకు కొత్త ఊపిరి పోశారు. తమ జీవిత కాలాన్ని వ్యాఖ్యాన రచనకు అంకితం చేసిన వేదం వేంకట రాయశాస్త్రి 1929 జూన్ 18న పరమపదించారు.


– డా॥ జడా సుబ్బారావు; తెలుగు అధ్యాపకులు, నూజివీడు
(డిసెంబర్ 21న వేదం వేంకటరాయశాస్త్రి జయంతి)

సీమకు కృష్ణా నీరు రావాలంటే...

శ్రీశైలం నుంచి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సరఫరా చేస్తున్న కృష్ణా జలాల కంటే... ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలో కలుస్తున్న జలాలే అధికం. ఈ నీటిని ఒడిసిపట్టి దుర్భిక్ష ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో పీహెచ్‌పీ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచారు. శ్రీశైలంలో నీటి మట్టం 881 అడుగుల మేర ఉన్నప్పుడే పీహెచ్‌పీ ద్వారా ప్రస్తుతం ఉన్న డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కులను తరలించవచ్చు. అయితే ఆ మేరకు శ్రీశైలం నీటి మట్టం ఏడాదికి సగటున 15 నుంచి 20 రోజులు కూడా ఉండటం లేదు. ఈ నేపథ్యంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, శ్రీశైలం కుడి గట్టు కాలువ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

దుర్భిక్ష ప్రాంతాలకు వరదాయిని శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 854 అడుగుల్లో ఉంటేనే రాయలసీమ, నెల్లూరు ప్రాజెక్టులకు కనీసం ఏడు వేల క్యూసెక్కులైనా నీళ్లందుతాయి. కానీ 800 అడుగుల నుంచి తెలంగాణ సర్కార్ నీటిని తరలిస్తుండటం వల్ల జలాశయంలో నీటి మట్టం మెయింటెయిన్ చేయడం కష్టమవుతోంది. కృష్ణా బోర్డు కేటాయింపులు ఉన్నా సరే నీళ్లందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మన వాటా నీటిని వినియోగించుకుని సాగు, తాగునీటి కష్టాలను అధిగమించేందుకు 'రాయలసీమ ఎత్తి పోతల' పథకాన్ని చేపడితే, అది దుర్భిక్ష ప్రాంతాలకు కల్పతరువు అవుతుంది.

కృష్ణా జలాలపై రాయలసీమకున్న హక్కులను, శ్రీశైలం జలాశయంలో కేటాయింపులను సద్వినియోగం చేసుకునేందుకు ఉద్దేశించిన 'రాయలసీమ ఎత్తిపోతల' పథకం ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ నుండి అభ్యంతరాలు, అలాగే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేసులతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. కృష్ణా బోర్డు పరిధిలోకి వచ్చిన 36 ప్రాజెక్టుల్లో



'పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్' కూడా ఉంది. శ్రీశైలం 800 అడుగుల నుంచి పోతిరెడ్డిపాడు దిగువ భాగంలోకి కాల్వ ద్వారా రోజూ మూడు టీఎంసీల నీటిని తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. శ్రీశైలం కుడిగట్టు కాలువతో పాటు తెలుగు గంగ, గాలేరు నగరికి కృష్ణా జలాల్లో కేటాయింపుల మేరకు 102 టీఎంసీల నీరు వరద సమయంలో 30 రోజుల్లో తరలించేందుకు వీలుగా పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని ప్రభుత్వం పెంపుదల చేసింది. గత రెండు దశాబ్దాలుగా రాయలసీమలోని ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులలో కొన్ని పూర్తయినా... వాటికి నీళ్లివ్వాలన్నా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచటమే మార్గమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ అభ్యంతరంతో పాటు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ప్రాజెక్టు ముందుకు కదలాలంటే అటవీ పర్యావరణ అనుమతులు తప్పనిసరి. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటిని తరలించే ప్రాజెక్టుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం సవరించిన డీపీఆర్ ప్రస్తుతం అపెక్స్ కౌన్సిల్ పరిశీలనలో ఉంది. పర్యావరణ అనుమతులు వస్తే తప్ప అపెక్స్ కౌన్సిల్ అనుమతించే అవకాశం లేదు. రాయలసీమ జిల్లాలకు కృష్ణా నీరు రావాలంటే ఇదొక్కటే మార్గం.

తుంగభద్ర నదీ జలాలు దాదాపు ప్రతి ఏడాది 50 నుంచి 60 టీఎంసీలు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. ఈ నీటిని మళ్ళీ ఎత్తిపోతల పథకాల ద్వారా కె.సి. కెనాల్‌కు, హంద్రీ – నీవాకు తరలించాల్సి వస్తున్నది. సుంకేసుల ఆనకట్ట పై భాగంలో తుంగభద్రా నదిపై 15–20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న ప్రతిపాదన ఉన్నది. దానిపై తక్షణం రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.

– డా॥ ముచ్చుకోట సురేష్ బాబు,
ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు ၊ 99899 88912

సన్యాసం అంటే...

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సన్యాసంలో బయటకు కనిపించే రీతి కంటే అంతరంగ పరిస్థితి ఎక్కువ ప్రాముఖ్యాన్ని కలిగి ఉంది. ఇది కేవలం మానసిక పరిస్థితి పైననే ఆధారపడి ఉంటుంది. కర్తవ్యాన్ని మరచిపోవడం సన్యాసం కాదు. మతపరమైన ఆచార పద్ధతులను ఆచరించడం వల్ల, మంత్రాలను ఉచ్చరించడం, గుండు గీయించుకోవడం, లేక యజ్ఞోపవీతాన్ని తీసివేయడం వల్ల ఏ ఒక్కడూ నిజమైన సన్యాసి కాడు. సన్యాసి 'నేను', 'నాది' అనే వాటిని (అహంకార, మమకారాలను) విడచిపెట్టాలి. ఎందుకంటే బాధలన్నింటికీ మూలం ఇవే కాబట్టి.

'సర్వ కర్మాణి మనసా సన్యస్య' (మానసికంగా విడచిపెట్టినపుడే) ఏ ఒక్కడైనా సన్యాసి కాగలడు. కాషాయ వస్త్రాన్ని ధరించడం మానసిక త్యాగానికి ఒక చిహ్నం మాత్రమే. ఆంతరంగిక పరిత్యాగం పొందాలంటే, కొన్ని క్రమశిక్షణా పద్ధతులు లేక ఆచరణలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. ప్రతి సన్యాసి ఈ కింద వివరించిన మూడు రకాలైన కోరికలను విడిచిపెట్టాలి. అవి : 1. సంపద, 2. సంతానం 3. పేరు ప్రఖ్యాతులు. కేవలం ఇంతటితో ఆగకుండా వైరాగ్యాన్ని పెంచుకోవాలి. ప్రపంచంలోని వస్తువులతో సంబంధం కలిగి ఉండటం వలన కష్టాలు కలుగుతాయి. దీన పరిస్థితి సహజంగా ఏర్పడుతుంది అనే విషయాన్ని కూడా అవగాహన చేసుకోవాలి. వాస్తవంగా సన్యాసం అనేది ఇవ్వడానికి కాని లేక తీసుకోవడానికి కాని వీలుగల వస్తువు కాదు. కాని, ఇది స్వయం ప్రేరణతో ప్రయత్నం చేసి, తగిన కృషితో సంపాదించదగిన ఒక స్థితి. ఎవరైతే ఆలోచించకుండా, తొందరపడి సన్యాసం స్వీకరిస్తారో, అటువంటి వారు ఆ తర్వాత తప్పనిసరిగా పశ్చాత్తాప పడవలసి ఉంటుంది. తొందరపడి సన్యాసం స్వీకరించిన వ్యక్తి రెండు విధాలుగా నష్టపోతాడు. అందులో మొదటిది సన్యాసం వలన సాధ్యమయ్యే ఆత్మసాక్షాత్కారం లేకుండా పోవడం, రెండవది ప్రాపంచిక సుఖాలను పోగొట్టుకోవడం (సన్యాసం స్వీకరించనిచో కలిగెడి సుఖాలు).

శ్రీవారిని దర్శించుకున్న పుష్పగిరి మఠాధిపతి



తిరుమల: జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతి జగద్గురు అభినవోద్దండ విద్యా శంకర భారతి స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నడవలూరులో విషజ్వరాలు



రామచంద్రాపురం: తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలంలోని నడవలూరులో పలువురు విషజ్వరాల బారినపడి అల్లాడుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో దాదాపు 30 మంది వరకు విషజ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిసింది. వీరిలో కొంత మంది సమీప పట్టణాల్లోని ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ప్రభుత్వ వైద్యశిబిరం నిర్వహించి, ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారిని రక్తం వచ్చేలా కొట్టిన టీచర్

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు కొట్టడంతో ఓ చిన్నారి గాయపడింది. యూకేజీ చదువుతున్న జస్మిత ప్రియ.. సరిగా చదవలేదంటూ బుధవారం ఉపాధ్యాయురాలు కర్రతో చిన్నారి తలపై కొట్టడంతో గాయమై రక్తం కారింది. దీంతో తల్లిదండ్రులు పరమేశ్వరరావు, దేవి పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. యాజమాన్యం సర్దిచెప్పి ఉపాధ్యాయురాలితో క్షమాపణలు చెప్పించారు.

పంట 'లాస్' చాలా ఎక్కువే..




మౌలిక వసతుల్లేక వృథాగా పోతున్న పంట ఉత్పత్తులు

- ధాన్యం, పప్పులు, నూనె గింజలు, పండ్లు, కూరగాయల నష్టాలు రూ.1,57,787 కోట్లు
- అత్యధికంగా పశువుల ఉత్పత్తుల్లో నష్టం రూ.29,871 కోట్లు
- పండ్లలో రూ.29,545 కోట్లు, కూరగాయల్లో రూ.27,459 కోట్లు నష్టం
- నష్టాల నివారణకు ప్రాసెసింగ్ సౌకర్యాలు కల్పన
- పీఎంకెఎస్‌వై కింద 1,187 ప్రాజెక్టులు మంజూరు
- లోక్‌సభలో ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ వంటి సౌకర్యాల కొరత కారణంగా దేశంలో పంట కోత అనంతరం భారీ నష్టం కలుగుతోంది. ఈ నష్టం విలువ 2022లో ఏకంగా సుమారు రూ.1,57,787 కోట్లుగా నాబార్డు కన్సల్టెన్సీ సర్వీసెస్ వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం తృణ ధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, పండ్లు, కూరగాయలు, పశు ఉత్పత్తుల్లో ఎక్కువ నష్టం కలుగుతున్నట్లు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించింది. అత్యధికంగా పశు ఉత్పత్తుల్లో నష్టం వస్తుండగా, ఆ తరువాత పండ్లు, కూరగాయలు ఎక్కువగా పాడైపోయి నష్టం వాటిల్లుతున్నట్లు నివేదిక పేర్కొంది. తృణ ధాన్యాల ఏడాది సగటు ఉత్పత్తి 281.28 మిలియన్ టన్నులు ఉండగా.. కోత అనంతరం 12.49 మిలియన్ టన్నులు నష్టపోతున్నట్లు చెప్పింది. అదే విధంగా కూరగాయల సగటు ఉత్పత్తి 164.74 మిలియన్ టన్నులకుగాను 11.97 మిలియన్ టన్నులు వృథా అవుతున్నట్లు వివరించింది. అత్యధికంగా పశువుల ఉత్పత్తుల (డెయిరీ, మాంసం, ఫిష్ తదితరమైనవి) నష్టం విలువ రూ. 29,871 కోట్లు అని పేర్కొంది. ఈ నష్టాలను తగ్గించేందుకు అవసరమైన మౌలిక, ప్రాసెసింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. తద్వారా పంటల విలువను పెంచడంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ – సంరక్షణ సామర్థ్యాల విస్తరణ, ఆపరేషన్ గ్రీన్స్ సదుపాయాల కల్పనకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో క్రెడిట్ లింక్ ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపింది. ఆహార ప్రాసెసింగ్, సంరక్షణకు, హార్వెస్ట్ నష్టాలను తగ్గించడానికి కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. మౌలిక సదుపాయాల కల్పనకు పీఎంకేఎస్‌వై కింద 1,187 ప్రాజెక్టులు ఆమోదించినట్లు వివరించింది. ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీ కింద వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ నిధి ద్వారా శీతల గిడ్డంగులు, గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులను మంజూరు చేసినట్లు పేర్కొంది. వీటి ద్వారా పంట వృథాను తగ్గించడం, విలువ పెంచడం లక్ష్యమని తెలిపింది.




కోత అనంతరం కోల్పోతున్న పంట (మిలియన్ టన్నుల్లో..)






నష్టపోయిన ఉత్పత్తుల విలువ



తెల్లనివన్నీ పాలు కాదు!

దేశంలో పాలు, పాల ఉత్పత్తుల్లో కల్తీలు పెరుగుతున్నాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) 2023లో దేశవ్యాప్తంగా 10,126 పాలు, పాల ఉత్పత్తుల శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించింది. అందులో 98 శాతం మంచివేనని తేలింది. 2024లో డిసెంబరు 13 వరకు దేశంలోని 30 రాష్ట్రాల్లో 557 శాంపిళ్లు పరీక్షిస్తే అందులో 487 సరైనవని తేలింది. అంటే 87.4 శాతం సరైనవి, 12.6 శాతం కల్తీవి. కర్ణాటకలో 100 శాతం శాంపిళ్లు సరైనవని, ఉత్తరప్రదేశ్‌లో 28 శాతం, తెలంగాణలో 17.8 శాతం శాంపిళ్లలో కల్తీ ఉన్నట్టు తేలింది. ఏపీలో ఎలాంటి శాంపిళ్లూ సేకరించలేదు, పరీక్షించలేదు.



ఆధారం: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ

మాయమైన పచ్చదనం



గుంటూరు జిల్లా తాడేపల్లిలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసానికి సమీపంలోని రోడ్డు పక్కన వివిధ రకాల పూల మొక్కలు ఆహ్లాదం పంచుతూ ఉండేవి. కొద్ది నెలలుగా అధికారులు వీటిని ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం నీళ్లు కూడా పోయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో మొక్కలన్నీ ఎండిపోయాయి. గతంలో పూల సోయగాలతో పచ్చదనం నిండిన ఈ ప్రాంతం ఇదిగో ఇలా మోడువారి కనిపిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

పొట్టేలు @ రూ.1.20 లక్షలు



కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో ఈనెల 24, 25వ తేదీల్లో దేవర ఉత్సవాలు జరుగనున్నాయి. దీంతో పొట్టేళ్ల ధరలు ఆకాశాన్ని తాకాయి. ఓ పొట్టేలు ధర ఏకంగా రూ.1.20 లక్షలు **పలకడం ఆశ్చర్యానికి గురిచేసింది.** కోసిగి మండలం వందగల్లు గ్రామానికి చెందిన ఎస్‌కే వెంకటేష్ అనే ఓ వ్యాపారి కర్ణాటక ప్రాంతాల్లో పొట్టేళ్లను కొనుగోలు చేసి కోసిగి వారపు సంత మార్కెట్‌లో విక్రయిస్తాడు. ఈక్రమంలో తీసుకొచ్చిన పొట్టేలును పెద్దకడబూరు మండలం బాపుల దొడ్డి గ్రామానికి చెందిన నాగేంద్ర అనే రైతు రూ.1.20 లక్షలు కొనుగోలు చేశాడు. మండలంలోనే ఈ మార్కెట్‌లో పొట్టేలుకు అత్యధిక ధర పలకడం ఇదే మొదటిసారి అని వ్యాపారి, రైతులు తెలిపారు. – కోసిగి

గిరిమహిళ వేషధారణలో ఒడిశా డిప్యూటీ సీఎం

ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిదా బుధవారం ప్రత్యేక హెలీకాప్టర్‌లో అరకులోయ చేరుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలో పర్యటించారు. గిరి మహిళా రైతు వస్త్రధారణలో వరి కట్ట, కొడవలి చేతపట్టి అలరించారు. ఒడిశాలో టూరిజం అభివృద్ధి చర్యల్లో భాగంగా అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు ఆమె చెప్పారు. ఇక్కడి పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. స్థానిక ప్రకృతి అందాలు అద్భుతమని అభివర్ణించారు. – అరకులోయ టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)



వృద్ధురాలి గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లు

- వారం రోజులుగా నరకయాతన
- ఎండోస్కోపి ద్వారా బయటకు తీసిన గుంటూరు జీజీహెచ్ వైద్యులు





గొంతులో చేప ముల్లు గుచ్చుకుని వారం రోజులుగా తిండి తిప్పల్లేక అవస్థలు పడుతున్న ఓ వృద్ధురాలిని గుంటూరు జీజీహెచ్ వైద్యులు రక్షించారు. ప్రకాశం జిల్లా మోటుపల్లికి చెందిన 62 ఏళ్ల కొండూరి మేరిమ్మ ఈ నెల 12న ఇంట్లో చేపల కూర తింటున్న సమయంలో గొంతులో చేప ముల్లు ఇరుక్కుపోయింది. తొలుత చీరాల ఆస్పత్రికి వెళ్లగా మూడు రోజుల పాటు అక్కడి వైద్యులు విఫలయత్నం చేసి.. గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు చేసి గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రిఫర్ చేయడంతో డాక్టర్ కవిత పరీక్షలు నిర్వహించారు. చేప ముల్లు గొంతు లోపల బలంగా ఇరుక్కు పోవడంతో ఎండోస్కోపి ద్వారా ఐదు నిమిషాల్లో దానిని బయటకు తీశారు. గొంతు లోపలి భాగం చీము పట్టి వాచిపోవడంతో ఆమె ఆహారం, నీళ్లు తీసుకోలేక నానా అవస్థలు పడుతోంది. –గుంటూరు మెడికల్

'గగన్‌యాన్'కు పదేళ్లు!

- 2014 డిసెంబర్ 18న క్రూ మాడ్యూల్ పరీక్ష
- పదేళ్ల తర్వాత మళ్లీ అదే తేదీన రాకెట్ అనుసంధానం పనులు



సాలిడ్ మోటార్-200 సెగ్మెంట్‌ను రెండవ వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో అనుసంధానం చేస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా మానవ రహిత ప్రయోగం నిర్వహించేందుకు బుధవారం రాకెట్ తొలి దశ అనుసంధానం పనులు ప్రారంభించింది. గగన్‌యాన్ కోసం పదేళ్ల కిందట 2014 డిసెంబర్ 18న 3,775 కిలోల బరువు కలిగిన క్రూ మాడ్యూల్‌ను ఎల్‌వీఎం3-ఎక్స్ అనే రాకెట్ ద్వారా షార్ నుంచి ప్రయోగాత్మకంగా పరీక్షించగా.. పదేళ్ల తర్వాత మళ్లీ అదే రోజున ఇస్రో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కీలక ముందడుగు వేసింది. సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని 2వ వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8.45 గంటలకు రాకెట్‌కు సంబంధించిన ఎస్-200 మోటార్ సెగ్మెంట్‌ను శాస్త్రవేత్తలు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మాట్లాడుతూ.. గగన్‌యాన్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి.. సంక్లిష్టమైన టెక్నాలజీని అనేక పరీక్షల ద్వారా తెలుసుకుని పూర్తిస్థాయి మానవ రహిత ప్రయోగానికి సిద్ధం కావడానికి పదేళ్లు పట్టిందని చెప్పారు. మానవుడిని అంతరిక్షంలోకి పంపించి.. తిరిగి సురక్షితంగా తీసుకురావడమే లక్ష్యంగా ఇస్రో పనిచేస్తోంది. గగన్‌యాన్ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించేందుకు పదేళ్లుగా ఎన్నో పరీక్షలు నిర్వహించిన ఇస్రో.. ఇప్పుడు హెచ్‌ఎల్‌వీఎం3-జీ1 పేరుతో మొదటి ప్రయోగానికి సిద్ధమవుతోంది.

తాడిపత్రిలో కలకలం

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు కిడ్నాప్, ఆపై దాడి
- టీడీపీ నేత రెడ్డి రవికుమార్‌రెడ్డి సహా మరికొందరు దాష్టీకం



మనోజ్ కాశీ నుంచి వాంగ్మూలం తీసుకుంటున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి తాడిపత్రిలో అరాచకం రాజ్యమేలుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారు. ఇప్పటికే పలువురిపై దాడులు చేయడంతో పాటు ఆస్తులనూ ధ్వంసం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య దాడి ఘటన మరువక ముందే తాజాగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు మనోజ్ కాశిపై జరిగిన దాడి కలకలం రేపుతోంది.

టీడీపీ నేతలు చుట్టుముట్టి..

టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే టీడీపీ నాయకుల నుంచి బెదిరింపులు ఎక్కువకావడంతో మనోజ్ కాశి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన స్నేహితుడి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు బుధవారం తాడిపత్రికి వచ్చారు. వివాహ కార్యక్రమం ముగిశాక తన ఇంటి సమీపంలో ఉన్న ఓ కాఫీషాపు వద్ద ఉండగా.. టీడీపీ నేత రెడ్డి రవికుమార్‌రెడ్డి సహా మరికొందరు అక్కడికి వచ్చారు. కాఫీ తాగుతున్న మనోజ్ కాశిని ఈడ్చుకెళ్లి తమ వాహనంలోకి పడేశారు. అక్కడి నుంచి పట్టణ శివారులోని డిగ్రీ కాలేజ్ సమీపంలోని ఓ వెంచర్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అప్పటికే సిద్ధంచేసుకున్న కర్రలు, పైపులతో మూకుమ్మడిగా దాడిచేశారు. తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలవడంతో మనోజ్ కాశి సొమ్మసిల్లిపడిపోయాడు. దీంతో దాడిచేసిన వారు పరారయ్యారు. ఆ తర్వాత తేరుకున్న మనోజ్ కాశి స్నేహితులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆయన్ను అంబులెన్స్‌లో తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ సాయిప్రసాద్ తాడిపత్రి ఆసుపత్రికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు. మరోవైపు.. మనోజ్ కాశిని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఆస్పత్రిలో పరామర్శించారు.

మాటలు.. మంటలు

చిచ్చు రేపిన అమిత్ షా వ్యాఖ్యలు ● విపక్షాల నిరసనలు, ఆందోళనలు

- అంబేడ్కర్ నామజపం ఫ్యాషనైపోయింది
- దైవనామం జపిస్తే స్వర్గమన్నా దక్కేది
- కాంగ్రెస్‌పై రాజ్యసభలో హోం మంత్రి విసుర్లు
- రాజ్యాంగ నిర్మాతకు ఘోర అవమానం: విపక్షాలు
- అమిత్ షా రాజీనామాకు వెల్లువెత్తిన డిమాండ్లు
- తప్పకోకుంటే దేశమంతటా వీధి పోరాటాలే: ఖర్గే
- నా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు: అమిత్ షా
- కాంగ్రెస్ నిస్పృహకు నిదర్శనమంటూ ఎద్దేవా
- ఆయనకు మోదీ, కేంద్ర మంత్రుల బాసట

మనువాదానికి తార్కాణం: రాహుల్

''మనువాదులకు అంబేడ్కర్ సహజంగానే నచ్చరు. అమిత్ షా వ్యాఖ్యలు దాన్ని మరోసారి నిరూపించాయి'' అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. ''బీజేపీ ఎప్పుడూ రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు వ్యతిరేకమే. అంబేడ్కర్ చరిత్రను, రాజ్యాంగ రచనలో ఆయన కృషిని తెరమరుగు చేసేందుకు ప్రయత్నిస్తోంది. కానీ బాబాసాహెబ్‌ను అవమానిస్తే దేశం సహించబోదు. అమిత్ షా క్షమాపణలు చెప్పి తీరాల్సిందే'' అని స్పష్టం చేశారు. ప్రియాంక కూడా ఈ మేరకు ఎక్స్‌లో డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తదితరులు కూడా అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.


అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో విపక్షాల నిరసన

న్యూఢిల్లీ: మాటలు మంటలు రేపాయి. అంబేడ్కర్‌ను ప్రస్తావిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. రాజ్యాంగ వజ్రోత్సవాలపై రాజ్యసభలో రెండు రోజుల చర్చకు మంగళవారం ఆయన బదులిచ్చారు. ఆ సందర్భంగా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ అంబేడ్కర్ ప్రస్తావన తెచ్చారు. ''అంబేడ్కర్, అంబేడ్కర్ అనడం వాళ్లకు ఇప్పుడో ఫ్యాషనైపోయింది. అన్నిసార్లు దైవనామ స్మరణ చేస్తే కనీసం ఏడు జన్మల దాకా స్వర్గమన్నా దక్కేది'' అంటూ ఎద్దేవా చేశారు. ''కాంగ్రెస్ పదేపదే అంబేడ్కర్ నామస్మరణ చేస్తుండటం మాకూ ఆనందమే. కానీ ఆయనపై వారి అసలు వైఖరేమిటో కూడా బయటపెట్టాలి. అంబేడ్కర్‌ను పదేపదే అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ది. ఆర్టికల్ 370తో పాటు పలు విధానాలపై నెహ్రూ సర్కారు విధానాలతో విభేదించి ఆయన మంత్రివర్గం నుంచి అంబేడ్కర్ వైదొలిగాల్సి వచ్చింది. అలా మీరు నిత్యం వ్యతిరేకించిన అంబేడ్కర్ పేరునే ఇప్పుడు ఓటుబ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. ఇదెంత వరకు సమంజసం?'' అంటూ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. అయితే అమిత్ షా చేసిన 'అంబేడ్కర్–దైవ నామస్మరణ' పోలిక తీవ్ర విమర్శలకు దారితీసింది. జాతీయ రాజకీయాలు బుధవారమంతా వాటిచుట్టే తిరిగాయి. రాజ్యాంగ నిర్మాతనే గాక దేశంలోని దళితులందరినీ అమిత్ షా తీవ్రంగా అవమానించారని కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ దుయ్యబట్టాయి. ఆయన తక్షణం బహిరంగంగానూ, పార్లమెంటులోనూ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మరో అడుగు ముందుకేసి, ''షా తక్షణం రాజీనామా చేయాల్సిందే. లేదంటే ప్రధాని మోదీయే ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలి. అంబేడ్కర్ పట్ల మోదీకి ఏమాత్రం గౌరవమున్నా బుధవారం అర్ధరాత్రి లోపు ఈ పని చేయాలి'' అంటూ అల్టిమేటం జారీ చేశారు. లేదంటే దేశవ్యాప్త ఆందోళనలు, వీధి పోరాటాలు తప్పవని హెచ్చరించారు. అమిత్ షా వ్యాఖ్యలపై విపక్షాల ఆందోళనతో పార్లమెంటు కూడా అట్టుడికిపోయింది. ఉభయ సభలూ కార్యకలాపాలేవీ చేపట్టకుండానే గురువారానికి వాయిదా పడ్డాయి. ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో విపక్షాలు నిరసనలకు, ఆందోళనలకు దిగాయి. ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయం ముందు అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలో ఆప్ నేతలు, కార్యకర్తలు నిరసన ప్రదర్శనకు దిగారు. 'అమిత్ షా సిగ్గు పడు', 'క్షమాపణలు చెప్పు' అంటూ నినాదాలతో హోరెత్తించారు. విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ''ప్రసంగంలో కొంత భాగాన్ని తీసుకుని వక్రీకరిస్తున్నారు. కాంగ్రెస్‌కు మరే అంశాలూ లేక నిస్పృహతో చౌకబారు చర్యలకు అన్నారు. ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు అమిత్ షాకు బాసటగా మాట్లాడారు.

దేశమంతా అగ్గి రాజుకుంటుంది: ఖర్గే

బీజేపీ అహంభావ ధోరణికి, అంబేడ్కర్‌పై వారికున్న ద్వేషానికి అమిత్ షా వ్యాఖ్యలు అద్దం పట్టాయని ఖర్గే మండిపడ్డారు. ''అంబేడ్కర్‌కు, రాజ్యాంగానికి ఏమాత్రం గౌరవం ఇవ్వొద్దని మనుస్మృతి సిద్ధాంతాన్ని ఆచరించే బీజేపీ, ఆరెస్సెస్ నిర్ణయించుకున్నాయి. మనుస్మృతికి చోటివ్వలేదంటూ రాజ్యాంగ ప్రతిని, అంబేడ్కర్ దిష్టిబొమ్మలను తగలబెట్టిన చరిత్ర బీజేపీది'' అని ఆరోపించారు. ఉభయ సభలు వాయిదా పడ్డాక పార్లమెంటు ప్రాంగణంలో విపక్షాలన్నీ అమిత్ షా వ్యాఖ్యలపై ఆందోళనకు దిగాయి. నేతలంతా నల్ల జెండాలు, ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకతో పాటు తృణమూల్, ఆప్, ఆర్జేడీ, ఎస్పీ, శివసేన (యూబీటీ), వామపక్షాల నేతలు పాల్గొన్నారు. వారితో కలిసి ఖర్గే మీడియాతో మాట్లాడారు. అమిత్ షా ఇలాగే మాట్లాడితే దేశమంతటా అగ్గి రాజుకుంటుందని హెచ్చరించారు. ''ఎవరైనా రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మీదటే కేంద్ర మంత్రి అవుతారు. రాజ్యాంగ నిర్మాతనే అవమానించే వారికి ఆ పదవిలో కొనసాగే అర్హతే లేదు'' అన్నారు. ఆయన రాజీనామాకు విపక్షాలన్నీ డిమాండ్ చేస్తున్నాయన్నారు. ''అమిత్ షాపై మోదీ చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆయనకు మద్దతుగా పోస్టులు చేస్తున్నారు. ఆప్తమిత్రులు ఒకరి పాపాలను ఒకరు కప్పిపుచ్చుకుంటున్నారు'' అంటూ ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్‌ది చౌకబారుతనం: బీజేపీ

అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరిస్తోందని బీజేపీ దుయ్యబట్టింది. ఇది ఆ పార్టీ చౌకబారు మనస్తత్వానికి నిదర్శనమని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, కిరెణ్ రిజిజు, అశ్వినీ వైష్ణవ్, రవ్‌నీత్ బిట్టూ తదితరులు మండిపడ్డారు. అంబేడ్కర్‌ను ఆయన జీవితపర్యంతమూ, తదనంతరమూ పథకం ప్రకారం అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. ''దాన్నే అమిత్ షా రాజ్యసభ సాక్షిగా నిరూపించారు. దాన్ని తట్టుకోలేక ఆయనపై తప్పుడు ఆరోపణలకు దిగింది'' అని రాజ్‌నాథ్ ఆరోపించారు. తీవ్ర నిస్పృహలో కూరుకుపోయిన కాంగ్రెస్ చివరికి అబద్ధాలు ప్రచారం చేసే దుస్థితికి దిగజారిందని నడ్డా ఎద్దేవా చేశారు.

బీజేపీ మనస్తత్వం బయటపడింది

పుణే: అమిత్ షా వ్యాఖ్యలను అంబేడ్కర్ మనవడు, వంచిత్ బహుజన అఘాడీ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేడ్కర్ ఖండించారు. బీజేపీ పాత మనస్తత్వం ఆయన మాటలతో బయటపడిందని అన్నారు. అంబేడ్కర్ పట్ల బీజేపీ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆక్షేపించారు. ''బీజేపీ మాతృసంస్థలు ఆర్ఎస్ఎస్, జన సంఘ్ అంబేడ్కర్‌ను వ్యతిరేకించాయి. రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో అంబేడ్కర్‌ను తప్పుబట్టాయి. అంబేడ్కర్ భావజాలం దేశంలో బలంగా ఉండటం వల్లే బీజేపీ తన పాత ప్రణాళికలు అమలు చేయడానికి జంకుతోంది. ఆ ఉక్రోషం కొద్దీ ఆయన పట్ల కోపాన్ని ఇలా వెళ్లగక్కుతోంది'' అని ఆరోపించారు.

అట్టుడికిన రాజ్యసభ

షాపై హక్కుల తీర్మానం
సభలో టీఎంసీ నోటీసు

అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు గాను అమిత్ షాపై చర్యలు తీసుకోవాలంటూ సభా హక్కుల తీర్మానం పెట్టాలని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 187వ నిబంధన మేరకు టీఎంసీ పార్లమెంటరీ పార్టీ నేత డెరెక్ ఓబ్రియాన్ బుధవారం రాజ్యసభలో ఈ మేరకు నోటీసిచ్చినట్టు సమాచారం. అమిత్ షా వ్యాఖ్యలపై విపక్ష సభ్యుల నిరసనలతో సభ అట్టుడికింది. మంత్రి రాజీనామాకు సభ్యులంతా డిమాండ్ చేశారు. షా ప్రసంగంలో కేవలం 12 సెకన్ల భాగాన్నే ప్రచారం చేస్తూ కాంగ్రెస్ వక్రీకరిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఆరోపించారు. 1990 దాకా ఆయనకు భారతరత్న కూడా ఇవ్వని చరిత్ర ఆ పార్టీదని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్‌కు కాంగ్రెస్ చేసిన ద్రోహాన్నే అమిత్ షా నిండు సభలో ఎండగట్టారన్నారు. అయినా విపక్ష సభ్యులు వెనక్కు తగ్గలేదు. 'అంబేడ్కర్‌కు అవమానాన్ని దేశం సహించబోదు'' అంటూ పెద్దపెట్టున నినాదాలకు దిగారు. ఆయన్ను అవమానించింది కాంగ్రెసేనంటూ రిజిజు కౌంటరిచ్చారు. విపక్ష నేత మల్లికార్జున ఖర్గే లేచి అంబేడ్కర్ పోస్టర్‌ను ప్రదర్శించారు. ఆందోళనల నడుమ సభను మధ్యాహ్నం రెండింటి దాకా చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక కూడా అవే దృశ్యాలు కొనసాగడంతో సభను చైర్మన్ గురువారానికి వాయిదా వేశారు. లోక్‌సభలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. విపక్ష సభ్యులు అంబేడ్కర్ పోస్టర్లతో వెల్‌లోకి దూసుకెళ్లి 'జై భీమ్' అంటూ నినాదాలకు దిగారు. దాంతో సభ తొలుత మధ్యాహ్నం దాకా, తర్వాత గురువారానికి వాయిదా పడింది.

ముసుగు తొలగింది

"మొత్తానికి ముసుగు తొలగింది. రాజ్యాంగ వజ్రోత్సవాల వేళ రాజ్యాంగ నిర్మాతనే అమిత్ షా అవమానించారు. ఆయన వ్యాఖ్య లు బీజేపీ కులవాదానికి, దళిత వ్యతిరేక భావజాలానికి నిదర్శనం. 240 లోక్‌సభ సీట్లొస్తేనే ఇలా ప్రవర్తిస్తున్నారు. అదే 400 వస్తే అంబేడ్కర్ స్మృతులనే పూర్తిగా చెరిపేస్తూ చరిత్రను తిరగరాసేవాళ్లేమో!"

- తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

అంబేడ్కర్ పేరే జపిస్తాం

"పాపాలు చేసేవాళ్లే పుణ్యం కోసం ఆలోచిస్తారు. దేశం, ప్రజలు, రాజ్యాంగ పరిరక్షణ గురించి తపించేవాళ్లు అంబేడ్కర్ నామాన్నే జపిస్తారు"

- డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

దొందూ దొందే

"బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే. అంబేడ్కర్ పేరును రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నాయి. దళితులకు, అణగారిన వర్గాలకు అవి చేసిందేమీ లేదు"

- బీఎస్పీ అధినేత్రి మాయావతి

దాచేస్తే నిజాలు దాగవు

అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెసే: మోదీ

- ఆయనను రెండుసార్లు ఓడించింది.. భారతరత్న ఇవ్వలేదు
- నిజాలు బయటపెట్టినందుకే అమిత్ షాపై కాంగ్రెస్ అక్కసు
- అంబేడ్కర్ పట్ల మా భక్తి ప్రపత్తులు, గౌరవం తిరుగులేనివి



న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానించారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తిప్పికొట్టారు. అంబేడ్కర్‌ను పదేపదే దారుణంగా కించపర్చింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ చీకటి చరిత్రను అమిత్ షా బయటపెట్టారని చెప్పారు. అది తట్టుకోలేక ఆయనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిజానిజాలేమిటో దేశ ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. దాచేస్తే నిజాలు దాగవని తేల్చిచెప్పారు. ఈ మేరకు మోదీ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. వాస్తవానికి అంబేడ్కర్‌ను అమితంగా గౌరవిస్తున్నది తామేనని వెల్లడించారు. అంబేడ్కర్ పట్ల తమ ప్రభుత్వానికి ఎనలేని గౌరవాభిమానాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. ''సులువుగా అబద్ధాలు చెప్పేస్తే, చాలా ఏళ్లపాటు చేసిన తప్పిదాలన్నీ మరుగున పడిపోతాయని కాంగ్రెస్ భావిస్తోంది. అంబేడ్కర్‌ను కించపర్చింది ముమ్మాటికీ కాంగ్రెస్సే. అబద్ధాలతో నిజాలను కప్పిపుచ్చాలనుకుంటే అది పొరపాటే అవుతుంది. నెహ్రూ–గాంధీ కుటుంబం నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను పదేపదే అవమానించింది. ఆయన ఘనతను తక్కువ చేసి చూపడానికి చిల్లర ప్రయత్నాలన్నీ చేసింది. ఎస్సీ, ఎస్టీలను సైతం ఘోరంగా అవమానించింది. అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ పాపాలు చెప్పాలంటే ఎన్నో ఉన్నాయి. ఆయనను రెండుసార్లు ఎన్నికల్లో ఓడించింది. అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా జవహర్‌లాల్ నెహ్రూ ప్రచారం చేశారు. ఆయనను ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అంబేడ్కర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వడానికి నిరాకరించారు. ఆ మహోన్నత వ్యక్తి చిత్రపటాన్ని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ఎస్సీ, ఎస్టీలపై లెక్కలేనన్ని మారణహోమాలు జరిగాయి. ఏళ్ల తరబడి అధికారం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీల సాధికారత, అభివృద్ధి కోసం ఏనాడూ కృషిచేయలేదు. అంబేడ్కర్ దయ వల్లే మేము ఈరోజు ఈ స్థానంలో ఉన్నాం. అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన సిద్ధాంతాలు అమలు చేస్తున్నాం. రాజ్యాంగ నిర్మాత గౌరవాన్ని మరింత ఇనుమడింపజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

చైత్యభూమిలో స్వయంగా ప్రార్థనలు చేశా

అంబేడ్కర్ దార్శనికతే మాకు ప్రామాణికం. దేశంలో గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేశాం. సమాజంలో పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పీఎం ఆవాస్ యోజన, జలజీవన్ మిషన్, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ వంటి పథకాలు తీసుకొచ్చాం. మేము ప్రారంభించిన ప్రతి పథకం పేదల జీవితాలను ప్రభావితం చేస్తోంది. అంబేడ్కర్ జీవితానికి సంబంధించిన ఐదు ప్రముఖ క్షేత్రాలను పంచతీర్థాలుగా అభివృద్ధి చేస్తున్నాం. అంబేడ్కర్ స్మృతిస్థలమైన చైత్యభూమికి సంబంధించిన భూమి దశాబ్దాలుగా వివాదంలో ఉండేది. మేము అధికారంలోకి వచ్చాక ఆ వివాదం పరిష్కరించాం. ఆ పవిత్రమైన స్థలంలో నేను స్వయంగా ప్రార్థనలు చేశా. ఢిల్లీలో అంబేడ్కర్ చివరి రోజులు గడిపిన భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. లండన్‌లో ఆయన నివసించిన భవనాన్ని మా ప్రభుత్వం కొనుగోలు చేసింది. అంబేడ్కర్ పట్ల మా భక్తి ప్రపత్తులు, గౌరవం తిరుగులేనివి'' అని ప్రధాని మోదీ స్పష్టంచేశారు.

బదులివ్వలేకే దుష్ప్రచారం

▶ మొదటి పేజీ తరువాయి

నెహ్రూది. ఆ కుటుంబంలో నాలుగు తరాల నేతలూ అంబేడ్కర్‌ను వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. ఆయనకు భారతరత్నను వీలైనంతగా ఆలస్యం చేసింది కాంగ్రెసే. కనీసం ఇప్పుడైనా ఆ పార్టీ అంబేడ్కర్ గురించి మాట్లాడుతుండడం ఆనందం కలిగిస్తోంది. అయితే అంబేడ్కర్‌కు ఇన్నాళ్లూ వాళ్లు ఏమాత్రం గౌరవం ఇవ్వని విషయం కూడా చెబితే బాగుంటుంది'' అన్నారు. బీలిక దిశగా పయనిస్తున్న విపక్ష ఇండియా కూటమికి తిరిగి ఒక్కటయ్యే అవకాశాన్ని మీ వ్యాఖ్యలు కల్పించాయా అని ప్రశ్నించగా తప్పుడు పునాదులపై ఒక్కతాటిపైకి రావడం వారికి అలవాటేనని అమిత్ షా అన్నారు. ''ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. విపక్షాలకు వ్యతిరేకంగా వారు వరుసగా తీర్పులిస్తున్నారు. అందుకే ఓసారి ఈవీఎంలపై, మరోసారి ఇంకో అంశంపై ఆరోపణలు తదితరాలతో ప్రజలను అయోమయపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి'' అని ఆరోపించారు.

ఖర్గేకు ఆనందమంటే తప్పుకుంటా

తాను రాజీనామా చేయాలన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ హాస్యాస్పదమని అమిత్ షా అన్నారు. ''నా రాజీనామా ఖర్గేకు సంతోషం కలిగిస్తుందంటే అలాగే చేస్తా. కానీ నేను పదవి నుంచి తప్పుకున్నా ఖర్గే సమస్యలు తీరవు. ఆయన కనీసం మరో 15 ఏళ్లపాటు అక్కడే (ప్రతిపక్షంలోనే) ఉంటారు'' అంటూ ఎద్దేవా చేశారు. ''అంబేడ్కర్ మాదిరిగానే ఖర్గే కూడా దళిత సామాజిక వర్గం నుంచే వచ్చారు. కనీసం ఆయనైనా ఈ బురదజల్లుడు కార్యక్రమంలో భాగస్వామి కాకుండా ఉంటే బాగుండేది. రాహుల్‌గాంధీ ఒత్తిళ్లకు తలొగ్గి నాపై తప్పుడు ఆరోపణలకు దిగుతున్నారు'' అని అమిత్ షా అన్నారు.

రేప్ చేసి, జననాంగంలో ఇనుప రాడ్ జొప్పించి...

గుజరాత్‌లో 11 ఏళ్ల బాలికపై అత్యాచారం

వడోదర: గుజరాత్‌లో 11 ఏళ్ల బాలికపై ఒక 36 ఏళ్ల వలస కార్మికుడు దారుణ అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేగాక జననాంగంలో ఇనుప కడ్డీ చొప్పించాడు! భరూచ్ జిల్లాలోని ఝగాడియా పారిశ్రామికవాడలో ఆదివారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ఆమె కుటుంబం జార్ఖండ్ నుంచి వలసవచ్చింది. నిందితుడు విజయ్ పాశ్వాన్ బాలిక తండ్రితోపాటు పనిచేస్తున్నాడు. సమీప గుడిసెలో ఉంటూ బాలికను కిడ్నాప్‌చేసి ఘోరానికి పాల్పడ్డాడని పోలీసులు చెప్పారు. పొదల్లోకి తీసుకెళ్లి రేప్‌చేసి పారిపోయాడు. రక్తమోడుతూ బాలిక ఏడుస్తుండటంతో తల్లి చూసి ఆస్పత్రికి తరలించింది. నిందితుడిని సోమవారం అరెస్ట్ చేశారు. పోక్సో సెక్షన్ల కింది కేసు నమోదు చేశారు. బాలికను అతను గత నెలలోనూ రేప్ చేశాడని ప్రాథమిక విచారణలో తేలింది.

జమిలి జేపీసీలో ప్రియాంక

- కాంగ్రెస్ తరఫున నామినీ జాబితాలో ఎంపిక
- తెలుగు వారిలో జీఎం హరీశ్ బాలయోగి, బాలశౌరి వల్లభనేని, సీఎం రమేశ్ పేర్లు ఖరారు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు ఉద్దేశించిన బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటవుతున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)లో కాంగ్రెస్ తరఫున ప్రియాంకా గాంధీ నామినేట్ అయ్యారు. కాంగ్రెస్ తరఫున నామినీల జాబితాలో ప్రియాంక గాంధీ వాద్రా, మనీశ్ తివారీ, సుఖ్‌దేవ్ భగత్ పేర్లను చేర్చారు. అర్హత ఉన్న పార్టీలన్నీ తమ తమ నామినీల పేర్లను లోక్‌సభ స్పీకర్‌కు అందజేశారు. ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి. మొత్తంగా లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ఎంపీలు ఈ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. గురువారం ఈ 21 మంది లోక్‌సభ సభ్యుల పేర్లను స్పీకర్ అధికారికంగా ప్రకటించనున్నారు. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సంబంధిత తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ కమిటీ తమ నివేదికను వచ్చే సెషన్ చివరివారం తొలి రోజున నివేదించాలని మేఘ్వాల్ ప్రతిపాదించనున్నారు. బీజేపీ తరఫున మాజీ కేంద్ర మంత్రి పురుషోత్తం భాయ్ రూపాలా, భర్తృహరి మహతాబ్, అనిల్ బాలుని, సీఎం రమేశ్, బాన్సురీ స్వరాజ్, విష్ణు దయాళ్ రామ్, సంబిత్ పాత్రాల పేర్లు ఖరారైనట్లు సమాచారం. గతంలో న్యాయశాఖ సహాయ మంత్రిగా చేసిన పీపీ చౌదరి జేపీసీకి చైర్మన్‌గా ఉంటారని తెలుస్తోంది. అయితే అనురాగ్ ఠాకూర్ పేరు సైతం పరిశీలనలో ఉందని సమాచారం. శివసేన తరఫున శ్రీకాంత్ షిండే, సమాజ్‌వాదీ పార్టీ తరఫున ధర్మేంద్ర యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ తరఫున కళ్యాణ్ బెనర్జీ, డీఎంకే తరఫున టీఎం సెల్వగణపతి, టీడీపీ తరఫున జీఎం హరీశ్ బాలయోగి, ఎన్సీపీ(ఎస్పీ) తరఫున సుప్రియా సూలే, ఆర్ఎల్‌డీ తరఫున చందన్ చౌహాన్, జనసేన పార్టీ తరఫున బాలశౌరి వల్లభనేని కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి తరఫున కమిటీలో 14 మంది సభ్యులు ఉండనున్నారు. వీరిలో బీజేపీ నుంచి 10 మంది ఉంటారు. రాజ్యసభ నుంచి కాంగ్రెస్ తరఫున రణ్‌దీప్ సూర్జేవాలా, డీఎంకే తరఫున పి.విల్సన్, టీఎంసీ తరఫున సాకేత్ గోఖలే, జేడీ(యూ) తరఫున సంజయ్ ఝా, బీజేడీ తరఫున మానస్ రంజన్ మంగరాజ్‌ల పేర్లు దాదాపు ఖరారయ్యాయి. జమిలీ ఎన్నికల బిల్లులు రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం విదితమే.

హెచ్–1బీ వీసా సులభతరం

వేగంగా ఉద్యోగాలు లభించేలా నిబంధనల్లో మార్పులు ● భారతీయులు భారీగా లబ్ధి పొందే అవకాశం



వాషింగ్టన్: అమెరికాలో హెచ్–1బీ వీసా కార్యక్రమం కింద వేగంగా ఉపాధి పొందాలనుకునే భారతీయులకు అమెరికా శుభవార్త చెప్పింది. వేగంగా ఉపాధి కల్పించేందుకు వీలుగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ హెచ్–1బీ వీసా నిబంధనల్లో కీలకమార్పులు చేసింది. దీంతో హెచ్–1బీ వీసా పొందడం మునపటితో పోలిస్తే అత్యంత సులభంకానుంది. అమెరికా కంపెనీలు తమ ఉద్యోగాల కోసం విదేశీయులను ఎంపికచేసుకునే ప్రక్రియను సులభతరంచేయడం ఇందుకు మరో కారణం. నైపుణ్య ఉద్యోగాలకు సంబంధించిన వీసాల జారీ, అనుమతి ప్రక్రియలను వేగవంతం చేయడం, నిబంధనల సడలింపు ప్రక్రియ వంటి నిర్ణయాలు 2025 జనవరి 17వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఎఫ్–1 విద్యార్థి వీసాలతో అమెరికాలోకి అడుగుపెట్టిన భారతీయులు ఇకపై సులువుగా తమ వీసాను హెచ్–1బీ వీసాగా మార్చుకోవచ్చు. దీంతో వీరికి అక్కడి కంపెనీలు వేగంగా ఉద్యోగాలు కల్పించేందుకు వీలవుతుంది. థిరిటికల్, టెక్నికల్ నిపుణులుగా వీరికి ఉద్యోగాలిచ్చేందుకు అక్కడి సంస్థలకు అవకాశం చిక్కుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లకు తగ్గట్లుగా, ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేందుకు వీలుగా అమెరికన్ సంస్థలను తీర్చిదిద్దే లక్ష్యంతో వీసా నిబంధనలను సడలిస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ మంగళవారం ప్రకటించింది. అమెరికా సంస్థలు కార్మిక కొరత సమస్యను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బైడెన్ ప్రభుత్వం పేర్కొంది. జనవరి 20వ తేదీన నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేయడానికి కొద్దిరోజుల ముందు బైడెన్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. హెచ్–1బీ వీసాల జారీ ప్రక్రియను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) వేగవంతం చేయనుంది. ''హెచ్–1బీ వీసా విధానం ద్వారా అమెరికా సంస్థలు అత్యంత నైపుణ్యమైన ఉద్యోగులకు నియమించుకునే అవకాశాలను విస్తృతంచేశాం. దీంతో అంతర్జాతీయ మేధతో అన్ని రంగాల్లో అమెరికా ఎంతో ప్రయోజనం పొందనుంది''అని హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ మంత్రి అలెజాండ్రో ఎన్.మయోర్కాస్ చెప్పారు. ''1990లో హెచ్–1బీ విధానం మొదలెట్టాక అమెరికా దేశ ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా ఈ పద్ధతిని నవీకరించాల్సిన అవసరం ఇంతవరకు రాలేదు''అని యూఎస్‌సీఐఎస్ డైరెక్టర్ ఎం.జడ్డూ హెచ్–1బీ విధానాన్ని మెచ్చుకున్నారు.

భారతీయులకు ఏ రకంగా ఉపయోగం?

యూఎస్‌సీఐఎస్ ద్వారా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఏటా లాటరీ విధానం ద్వారా కేవలం 65,000 వరకు హెచ్–1బీ వీసాలనే జారీచేసేది. అడ్వాన్స్‌డ్ డిగ్రీ లేదా మాస్టర్ డిగ్రీ ఉన్న సందర్భాల్లో మరో 20వేల హెచ్–1బీ వీసాలనే ఇచ్చేది. ఈ కోటా పరిమితి అనేది ఇన్నాళ్లూ లాభాపేక్షలేని, ప్రభుత్వ సంబంధ పరిశోధనా సంస్థలకు లేదు. దీంతో ఈ నిబంధనలోని లొసుగును దుర్వినియోగం చేస్తూ చాలా మంది 'రీసెర్చ్'మాటున వీసాలు సాధించారని, దీంతో భారత్ నుంచి వచ్చే నైపుణ్య అభ్యర్థులకు లాటరీ ద్వారా వీసా పొందే అవకాశాలు తగ్గిపోయాయని ఆరోపణలు ఉండేవి. దీంతో వీటికి చెక్ పెడుతూ ఇకపై లాభాపేక్షలేని, ప్రభుత్వ సంబంధ పరిశోధనా సంస్థలకు తొలిసారిగా కోటా పరిమితిని విధి స్తూ, కోటాను నిర్వచిస్తూ నిబంధనల్లో మా ర్పులు తెచ్చారు. దీంతో నాన్‌ప్రాఫిట్, గవర్న మెంటల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్స్ నుంచి పోటీ తగ్గి ఆ మేరకు భారతీయులకు లాటరీలో అధిక ప్రా ధాన్యత, లబ్ధిచేకూరుతుందని భావిస్తున్నా రు. ప్రతి ఏటా హెచ్–1బీ వీసా పొందుతున్న వారిలో భారత్, చైనా దేశస్థులే అధికంగా ఉంటున్నారు.


ప్రమాదం అనంతరం కొనసాగుతున్న సహాయక చర్యలు

పర్యాటక పడవను ఢీకొట్టిన నేవీ బోట్

13 మంది జలసమాధి

- ముంబై సమీపంలో దుర్ఘటన
- మృతుల్లో ముగ్గురు నేవీ అధికారులు

ముంబై: ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాన్ని వీక్షించేందుకు బయల్దేరిన ప్రయాణికులు అనూహ్యంగా పడవ ప్రమాదంలో జలసమాధి అయ్యారు. 13 మంది ప్రాణాలను బలితీసుకున్న ఈ ఘోర పడవ ప్రమాదం దేశ ఆర్థిక రాజధాని ముంబై సమీపంలోని అరేబియా సముద్రజలాల్లో బుధవారం మధ్యాహ్నం నాలుగుగంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ముంబై పోలీసులు, భారతీయ నావికాదళం తెలిపిన వివరాల ప్రకారం దాదాపు 100మందికిపైగా పర్యాటకులతో 'నీల్‌కమల్' పర్యాటక పడవ ముంబైలో 'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి బయల్దేరి ఎలఫెంటా ఐలాండ్‌కు వెళ్తోంది. కరంజా ప్రాంతానికి రాగానే శరవేగంగా వచ్చిన భారత నేవీకి చెందిన ఒక బోట్ ఈ పడవను ఢీకొట్టింది. దీంతో పర్యాటకుల పడవ మునిగిపోయింది. తప్పించుకునే వీలులేక 13 మంది ప్రాణాలు కోల్పోయారు. నీటలో పడ్డ ప్రయాణికులను రక్షించేందుకు నావికా, తీర గస్తీ దళాలు రంగంలోకి దిగాయి. 99 మందిని ఈ దళాల సహాయక బృందాలు కాపాడాయి. నాలుగు నేవీ హెలికాప్టర్లు, 11 నావల్ క్రాఫ్ట్‌లు, ఒక తీర గస్తీ బోటు, మూడు మెరైన్ పోలీస్ బోట్‌లు ముమ్మర గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయి. మొత్తంగా 99 మందిని కాపాడినట్లు వార్తలొచ్చాయి. గాయపడిన వారిని వెంటనే దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరణించిన వారిలో ఒక నేవీ అధికారి, ఇద్దరు నేవీక్రాఫ్ట్ కొత్త ఇంజన్ సంబంధిత నిపుణులు ఉన్నట్లు ఇండియన్ నేవీ తెలిపింది. కొత్త ఇంజన్‌ను నేవీక్రాఫ్ట్‌కు బిగించి పరీక్షిస్తున్న సమయంలో బోట్ అదుపుతప్పి మెరుపువేగంతో ప్రయాణించి అటుగా వెళ్తున్న పర్యాటక పడవను ఢీకొట్టిందని నేవీ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. 101 మందిని కాపాడినట్లు మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు.

క్యాన్సర్ టీకా

వచ్చే ఏడాది నుంచే ఉచితంగా అందుబాటులోకి: రష్యా ప్రకటన

ప్రాణాంతక క్యాన్సర్ నివారణకు రష్యా సైంటిస్టులు అత్యుత్తమ వ్యాక్సిన్(టీకా) అభివృద్ధి చేశారు. వచ్చే ఏడాదే ఇది అందుబాటులోకి రానుంది. విశేషం ఏమిటంటే.. ఈ టీకా పూర్తిగా ఉచితం. కొత్త సంవత్సరం ఆరంభంలో క్యాన్సర్ నివారణ టీకాను విడుదల చేయబోతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. తమ సొంత ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌ను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని రష్యా ఆరోగ్యశాఖకు చెందిన రేడియాలజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జనరల్ ఆండ్రీ కాప్రిన్ చెప్పారు. ఈ టీకా మనిషి శరీరంలో క్యాన్సర్ కణాల వ్యాప్తిని సమర్థంగా అడ్డుకుంటుందని సైంటిస్టులు చెబుతున్నారు. క్యాన్సర్ గడ్డ మరింత పెరగకుండా నివారిస్తుందని పేర్కొంటున్నారు. అయితే, ఏ రకం క్యాన్సర్‌ను నివారిస్తుంది? ఎలా పని చేస్తుంది? వ్యాక్సిన్ పేరు ఏమిటన్నది ఇంకా బయటపెట్టలేదు. క్యాన్సర్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసే విషయంలో తమ పరిశోధకులు చాలావరకు విజయం సాధించారని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వయంగా ప్రకటించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా కూడా టీకాను అభివృద్ధి చేసింది. అది గత ఏడాది నుంచే అందుబాటులోకి వచ్చింది.


- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 19 । డిసెంబర్ । 2024



ఆకట్టుకున్న నాటికలు

భవానీపురం: జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 579.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కొనసాగుతున్న జాతరోత్సవాలు

పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారంతో ఐదో రోజుకు చేరాయి. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జనవరి రెండో తేదీ నుంచి జరిగే 35వ విజయవాడ పుస్తక మహోత్సవం నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి టి.మనోహర్ నాయుడు తెలిపారు. పుస్తక మహోత్సవం తొలుత పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తామని ప్రకటించామని, కానీ ప్రభుత్వం నుంచి వచ్చిన సహకారంతో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్సాహంగా ‘ఫిట్ ఇండియా వాక్’



కోనేరుసెంటర్: ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించడం కోసం కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అందులో అందరం భాగస్వామ్యం కావాలని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు పిలుపునిచ్చారు. ఫిట్ ఇండియా వారోత్సవాలలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఫిట్ ఇండియా వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి యువత ఆయువుపట్టు అని, యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం వాక్‌థాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె. శోభన్ బాబు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్. ఉష, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 3.68 కోట్లు




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వారికి భక్తులు హుండీల ద్వారా రూ. 3.68 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. భక్తులు ఆది దంపతులకు సమర్పించిన కానుకలను బుధవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 21 రోజులకు గాను 45 హుండీల ద్వారా రూ. 3,68,90,834 నగదుతో పాటు 560 గ్రాముల బంగారం, 9.030 కిలోల వెండి లభించింది. ఇక యూఎస్ఏకి చెందిన 519 డాలర్లు, ఆస్ట్రేలియా డాలర్లు 80, కత్తార్ రియాల్స్ 204, మలేషియా 516 రింగేట్లు, ఒమాన్ బైంసాలు 1700, సింగపూర్ డాలర్లు 916 లభించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఇక ఆన్‌లైన్ ద్వారా రూ. 1, 16, 429 లభించినట్లు పేర్కొన్నారు. కానుకల లెక్కింపును ఆలయ ఈవో కేఎస్ రామరావు, డీఈవో రత్నరాజులతో పాటు ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

డ్వాక్రా సభ్యులకు ఉచిత బయోగ్యాస్ యూనిట్లు



పెనమలూరు: పొదుపు సంఘాలకు ఉచిత బయోగ్యాస్ యూనిట్లు అందజేస్తామని సొసైటీ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఈఆర్పీ) సీఈవో జి.వీరపాండ్యన్ తెలిపారు. ఆయన బుధవారం పెనమలూరు గ్రామంలో వీసీల పొదుపు సంఘ సభ్యురాలు మొర్ల శివకోటికి ప్రభుత్వం రూ.40 వేలతో ఇచ్చిన బయోగ్యాస్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ యూనిట్‌లో 400 కేజీల పేడను, 400 లీటర్ల నీటిని టబ్బులో కలపాలన్నారు. 20 రోజులకు ఎల్పీజీ గ్యాస్ తయారవుతుందని వివరించారు. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులకు పశుసంపద నుంచి వచ్చే పేడ ద్వారా గ్యాస్ ఉత్పత్తి అవుతుందన్నారు. భవిష్యత్తులో పలు సంఘాలకు ఈ బయోగ్యాస్ యూనిట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.కన్నంనాయుడు, ఎంపీడీవో బి.ప్రణవి, ఏపీఎం జి.కృష్ణంరాజు, సీసీ నాగరత్నం పాల్గొన్నారు.

అధికార పార్టీలో ఆధిపత్య పోరు



ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేలు

- నా మాటే శాసనం అంటున్న ఎంపీ
- ప్రతి పనిలో వాటా ఇవ్వాల్సిందేనని పట్టు
- అంత సీన్ లేదంటున్న ఎమ్మెల్యేలు
- చినబాబు అండతోనే ఎంపీ రెచ్చిపోతున్నారని విమర్శలు
- నాయకుల మధ్య పెరుగుతున్న అంతరం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో అధికార పార్టీలోని ప్రజాప్రతినిధుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ముఖ్యంగా పార్లమెంట్ ప్రజాప్రతినిధికి, అసెంబ్లీ నియోజకవర్గాల ప్రతినిధులకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నట్లు ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు. ఎంపీ ఎన్నికల ముందు అతి వినయం ప్రదర్శించి, నాయకులను, కార్యకర్తలను ఉబ్బితబ్బిబ్బయ్యేలా చేశారని.. ఎన్నికల్లో గెలుపొందాక ఆయన నిజస్వరూపం బయట పడుతోందని.. సొంత పార్టీ నాయకులకే చుక్కలు చూపిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి నియోజకవర్గంలో జరిగే అక్రమ దందాలో తనకు వాటా ఇవ్వాలిందేనని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయనకు, స్థానిక టీడీపీ ఎమ్మెల్యేలకు మధ్య అంతరం పెరుగుతోందని వినికిడి. ఎన్నికల సమయంలో తనతో సన్నిహితంగా మెలిగిన నాయకులను సైతం పార్టీ ఆఫీసుకు వెళ్తే ఎందుకు వస్తున్నారని అక్కడి సిబ్బంది ముఖం మీదే అడుగుతుండటంతో.. ఇంతలోనే ఎంత తేడా అని వారు నిట్టూరుస్తున్నారు.

చినబాబు అండతోనేనా?

ఎన్నికల ముందు వరకు ఎంపీకి వెన్నుదన్నుగా నిలిచిన నేతలందరికీ ఆయన చుక్కలు చూపిస్తుండటంతో లోలోన వారి మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. ప్రతి చిన్న విషయంలో ఎంపీ జోక్యాన్ని వారు సహించలేకపోతున్నారు. కొంత మంది టీడీపీ నేతలైతే చినబాబు అండతోనే ఎంపీ తన ఇష్టానుసారంగా చెలరేగిపోతున్నారనే భావన వ్యక్తం అవుతోంది.

➡ మైలవరం నియోజకవర్గం ప్రస్తుతం టీడీపీ నేతలకు కాసులు కురిపించే కల్ప వృక్షం. ఎన్నికల ముందు వరకు ఎంపీ, ఇక్కడి ప్రస్తుత ఎమ్మెల్యే చాలా సఖ్యతగానే చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. తీరా ఎన్నికలయ్యాక వాటాల విషయంలో తేడా వచ్చినట్లు తెలుస్తోంది. ఎంపీ తనకు అన్నింటిలోనూ వాటా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నట్లు సమాచారం. వీటీపీఎస్‌లో బూడిదపై ఇద్దరి మధ్య షేర్ కుదిరినట్లు టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ‘ఎన్నికల సమయంలో ఖర్చంతా నేనే పెట్టుకున్నానని. నీకేం సంబంధం. మిగతా వాటిలో మీకు వాటా ఇవ్వలేను. నా నియోజకవర్గ సరిహద్దులోకి రావద్దు’ అని ఎమ్మెల్యే కరాఖండిగా చెప్పడంతో వారి మధ్య అంతరం పెరిగినట్లు తెలుస్తోంది.

➡ నందిగామ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ ఇరువురు నేతలు పైకి బాగా ఉన్నట్లు నటిస్తున్నప్పటికీ రోజురోజుకు అంతరం పెరుగుతోందని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. నియోజకవర్గంలోని రెండు ఇసుక రీచ్‌లను ఎంపీ తన కంట్రోల్‌లో ఉంచుకొని, పెద్ద ఎత్తున ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు చివరకు రైతుబజార్లలో కూరగాయల సరఫరా కాంట్రాక్టుకు సంబంధించి వచ్చే మామూళ్లలో సైతం ఇద్దరికీ తేడాలు వచ్చినట్లు ఆ నియోజకవర్గంలో చర్చ సాగుతోంది.

➡ తిరువూరులో నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ ఉప్పు, నిప్పు మాదిరి ఉన్నారు. అక్కడ అక్రమ మట్టి తవ్వకాలు, ఇసుక, మద్యం, పేకాట వంటి మామూళ్లకు సంబంధించిన విషయాల్లో వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఇక్కడి ఎమ్మెల్యే తనను కేర్ చేయకపోవడంతో, ఆ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎంపీనే ఓ వర్గాన్ని రెచ్చగొట్టి, నియోజకవర్గ పెద్దలకు స్థానిక నేతలతో ఫిర్యాదులు చేయిస్తున్నట్లు, అక్కడ పార్టీ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.

➡ జగ్గయ్యపేటలో పాగా వేసేందుకు ఎంపీ ప్రయత్నించారు. అయితే అక్కడ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటాన్ని స్థానిక ఎమ్మెల్యే వ్యతిరేకించారు. అయినప్పటికీ ఇసుక క్వారీల విషయంలో కొన్నింటిని తన వాటాగా తీసుకున్నారు. అక్కడ పరిశ్రమలు ఉండటంతో, ఆ నియోజకవర్గంపై పట్టు పెంచుకొనేందుకు ఎంపీ ప్రయత్నిస్తుండటంతో వారి మధ్య వివాదం చెలరేగుతోంది.

➡ విజయవాడలోని ముగ్గురు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు, ఎంపీకి మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. తాము సీనియర్లం అనే భావనలో ఎమ్మెల్యేలు ఉంటే, తన పెత్తనం సాగాల్సిందేనని రీతిలో ఎంపీ వ్యవహరిస్తున్నారు.



కార్పొరేట్‌కు దీటుగా సివిల్స్ శిక్షణ

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్పొరేట్ స్టడీ సర్కిళ్లకు దీటుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ సివిల్ సర్వీసెస్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ సివిల్ సర్వీసెస్ స్టడీ సర్కిల్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 600 మంది అభ్యర్థులు అర్హత పరీక్ష రాయగా వారిలో 100 మంది ఉచిత సివిల్స్ శిక్షణకు ఎంపికయ్యారని తెలిపారు. శిక్షణలో ఒక్కో అభ్యర్థికి రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఇక్కడ స్టడీ సర్కిల్ కొనసాగుతుందని, త్వరలో అమరావతిలో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సివిల్స్ కష్టమే అయినా అసాధ్యం కాదన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతూ ప్రిలిమ్స్‌కు ప్రాక్టీస్ చేయాలని అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ పోలా భాస్కర్, డైరెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, జిల్లా అధికారి కె. శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, బీసీ కార్పొరేషన్ జేఎండీ తనూజ రాణి, లా ఎక్సలెన్సీ ఐఏఎస్ అకాడమీ ఎండీ డీవీ రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మోడల్స్



అదిరిన హై లైఫ్ ఎగ్జిబిషన్

విజయవాడ నోవోటెల్ హోటల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. మగువల అందాన్ని మరింత పెంచే విధంగా ప్రదర్శన, అమ్మకాలను ఏర్పాటు చేసినట్లు ఎగ్జిబిషన్ సీఈఓ పి. డొమ్నిక్ తెలిపారు. మహిళలు మెచ్చే అధునాతన వస్త్రాభరణాలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. గురువారం కూడా ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ మోడల్స్ చాందినీ భగ్వాని, ఊర్మిళా చౌహాన్ తదితరులు సందడి చేశారు.

– గుణదల(విజయవాడ తూర్పు)

విరమణలకు విస్తృత ఏర్పాట్లు

- 6 లక్షల మంది భవానీలు వస్తారని అంచనా
- పనులు పర్యవేక్షించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీ దీక్షల విరమణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేలా పనులు చేపడుతున్నామన్నారు. భవానీ దీక్షల విరమణ కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, దేవదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 25 వరకు భవానీ భక్తులు అమ్మవారికి ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించనున్నారన్నారు. రోజుకు లక్ష మంది చొప్పున 6 లక్షల మంది భవానీలు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

దసరా ఉత్సవాల తరహాలో..

దసరా ఉత్సవాలు విజయవంతం చేసిన తరహాలో భవానీ దీక్ష విరమణల కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. క్యూ మార్గంలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, క్వాయర్ మ్యాట్లు, తాగునీరు సరఫరా వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా భక్తులకు నిరంతరం సూచనలు, సమాచారం అందిస్తామన్నారు. ఆలయం చుట్టుపక్కల మాత్రమే కాకుండా నగరానికి వచ్చే వివిధ రహదారుల వెంబడి వైద్య శిబిరాలతో పాటు విశ్రాంతి ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించి ఇరుముడులు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులకు అవసరమైన లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచాలని దేవదాయ అధికారులను ఆదేశించారు. ఘాట్ల వద్ద స్నానం ఆచరించి మాల విరమణ అనంతరం ఎర్ర వస్త్రాలు నీటిలో వదిలే ప్రాంతంలో ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం..

నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ భవానీ దీక్ష విరమణ భక్తుల కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్యూ లైన్ల ఏర్పాట్లు వెయింటిగ్ హాళ్లు, పార్కింగ్ స్థలాలు, లడ్డూప్రసాదం, అన్నప్రసాదాల పంపిణీ వంటి వివరాలు యాప్ ద్వారా భక్తులకు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అన్ని ముఖ్య ప్రాంతాల్లో సీసీ టీవీలను అమర్చామన్నారు. విభిన్న ప్రతిభావంతుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన్నట్లు వివరించారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక బృందాలు..

విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్. ఎం. ధ్యాన చంద్ర మట్లాడుతూ పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లను సిద్ధం చేశామన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు, వలంటీర్ల సేవలను వినియోగించుకుని కార్యక్రమ విజయవంతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో కేఎస్ రామరావు మాట్లాడుతూ సీతమ్మవారి పాదాలు, పున్నమీ ఘాట్, భవానీ ఘాట్ వద్ద మొత్తం 800 వరకు షవర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయవాడ ఆర్డీవో చైతన్య, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యం..



యాప్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దీక్ష విరమణలపై బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో మాట్లాడుతూ సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమీకృత కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గిరిప్రదక్షిణ ప్రాంతం, క్యూ లైన్లు, ఇరుముడుల పాయింట్లు, హోమ గుండాలు, ఘాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుపైనా అధికారులకు సూచనలిచ్చారు. రాజీవ్‌గాంధీ పార్కు, పున్నమీ ఘాట్, భవానీ ఘాట్, బబ్బూరి గ్రౌండ్స్, టీటీడీ స్థలం (కుమ్మరిపాలెం), సితార సెంటర్, లోటస్ పక్కన (పున్నమీ ఘాట్), బీఆర్‌టీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన యాప్‌ను ఆవిష్కరించారు. దేవస్థాన ఈవో కేఎస్ రామరావు, డెప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, డీసీపీ గౌతమిశాలి, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ వివాదాలు, సమస్యలను పరిష్కరించడంలో బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది తమ ఆలోచనాధోరణి మార్చుకోవాలన్నారు. జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల ద్వారా చేపట్టిన అర్జీల పరిష్కారంపై బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై తహసీల్దార్లు చేపట్టిన చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల లక్ష్యాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి అర్జీపై శ్రద్ధ పెట్టాలన్నారు. సమస్యల పరిష్కారంలో తప్పించుకొనే ధోరణి ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకూ, కోర్టు కేసులకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్) ఉద్యోగులకు రావాల్సిన వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలు నందు నగర శాఖ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన కరువు భత్యం, పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిటీకి కమిషన్‌ను నియమించి నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరతామన్నారు. నివేదిక సమర్పించేలోపు ఉద్యోగులకు మధ్యంతర భృతిని చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. నగర శాఖ అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌లో విజయవాడ నగర శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ నెలాఖరుకు ఖాళీ కానున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి ఎ. విద్యాసాగర్‌ను ఎన్నుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. సత్యనారాయణ రెడ్డి, పి. రమేష్, బి. సతీష్ కుమార్, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కథా రచయిత త్రివిక్రమ్

కన్నుమూత



కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ (ఫైల్)

విజయవాడ కల్చరల్: విజయవాడ నగరానికి చెందిన విఖ్యాత రచయిత, కాలమిస్ట్ కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ (79) బుధవారం ఉదయం కృష్ణలంకలోని తన స్వగృహంలో అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తెలుగు సాహిత్యంలో ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. నవల, కథ, నాటకం, పద్యం, గద్యం వంటి వాటిల్లో రెండు వేలకు పైగా రచనలు చేశారు. 1974లో ప్రారంభమైన ఆయన రచనా ప్రస్థానం 2024 వరకూ సాగుతూనే ఉంది. ఆయన 16 ఏళ్ల భారత వైమానిక దళంలో పని చేశారు. ఆకాశవాణి కేంద్రంలో ఆయన రచించిన కథలు, నాటికలు ప్రసారం అయ్యాయి. అనేక సాహిత్య పత్రికల్లో కాలమిస్ట్‌గా పని చేశారు. నగరానికి చెందిన సాహితీ సంస్థలు, సాహితీవేత్తలు త్రివిక్రమ్ మృతికి సంతాపం వ్యక్తం చేశాయి.

క్లుప్తంగా

సాగర సంగమాన్ని అభివృద్ధి చేయాలని వినతి



అవనిగడ్డ: కృష్ణానది సంగమ ప్రాంతమైన సాగరసంగమంను ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళగిరి క్యాంపు కార్యాలయంలో డెప్యూటీ సీఎంను కలసి ప్రపంచ తెలుగు మహాసభలకు రావాల్సిందిగా ఆహ్వానం పలికానని పేర్కొన్నారు. పాత ఎడ్లంక బ్రిడ్జిని నిర్మించాలని కోరడంతోపాటు, ఎదురుమొండి – గొల్లమంద రహదారికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

పారదర్శకంగా ఫెన్సింగ్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళలు, పురుషుల ఫెన్సింగ్ పోటీలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.ఎస్.వి.కృష్ణమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఖరీదైన ఎలక్ట్రానిక్ పరికరాలు రాష్ట్రంలో అందుబాటులో లేనందున గతంలో పోటీలను మాన్యువల్‌గా నిర్వహించామని, దీనివల్ల అసోసియేషన్ ఆరోపణలు ఎదుర్కొందని గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను అద్దెకు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో ఫెన్సింగ్ క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడాకారులకు సమాన అవకాశాలు కల్పించేందుకు, కచ్చితమైన ఫలితాలు వెల్లడించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతిభ ఉన్న ఫెన్సింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం



తాడేపల్లి రూరల్: కృష్ణానది పుష్కర ఘాట్ వద్ద మృతదేహం లభ్యంది. మృతుడిని పెనమలూరు మండలం కానూరు గ్రామంగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. బుధవారం రాత్రి కృష్ణా నదిలో మృతదేహం ఉందన్న సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీయించి, తాడేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నది ఒడ్డున నిలిపిన ఆటోను పోలీసులు పరిశీలించగా రామకృష్ణ పేరుతో ఆధార్ కార్డు లభించింది. దాని ఆధారంగా ఆ వ్యక్తిది పెనమలూరు మండలం కానూరు గ్రామంగా గుర్తించారు. ఆటోలో బ్యాంక్ పాసు పుస్తకం, ఫోన్ లభించాయని, ఫోన్‌లో కాంటాక్ట్ నంబర్లను పోలీసులు సంప్రదించగా ఎవరూ సరైన సమాధానం ఇవ్వలేదు. బ్యాంక్ పాసుపుస్తకంలో ఉన్న అడ్రస్, ఆటో సీ బుక్‌లో చిరునామాలు వేరువేరుగా ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేసి రామకృష్ణ మృతికి కారణాలు తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.

వన్‌టౌన్‌కు చెందిన 40 ఏళ్ల వ్యాపారి వెంకటేష్ (పేరు మార్చాం) అర్ధరాత్రి వరకూ బిజినెస్ వ్యవహారాలు చూస్తుంటాడు. అనంతరం తరచూ స్నేహితులతో కలిసి ఎక్కువగా బయటే నాన్‌వెజ్ వంటకాలు తింటుంటాడు. ఇటీవల తరచూ కడుపునొప్పి రావడం, అరుగుదల తగ్గడంతో వైద్యుడిని ఆశ్రయించాడు. వైద్య పరీక్షల అనంతరం జీర్ణాశయ క్యాన్సర్ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు.

పటమటకు చెందిన ఓ ఉద్యోగి వారంలో నాలుగు రోజులు బయట హోటళ్లలో భోజనం చేస్తుంటారు. నాన్‌వేజ్, బిర్యానీలు లాగించేస్తుంటారు. అతనికి తరచూ కడుపునొప్పితో పాటు, విరేచనంలో రక్తం పడటంతో అనుమానం వచ్చి వైద్యుడిని సంప్రదించారు. పెద్ద పేగు క్యాన్సర్‌గా నిర్ధారించారు. ఇలా వీరిద్దరే కాదు.. ఇటీవల తమ వద్దకు వస్తున్న వారిలో పెద్దపేగు, జీర్ణాశయ, లివర్ వ్యాధులు ఎక్కువగా వెలుగు చేస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇందుకు కల్తీ ఆహారమే కారణమని స్పష్టంచేస్తున్నారు.

కల్తీ.. ఆహాకారం

- కల్తీ ఆహారంతో గుండెపోటు, మెదడుపోటు ముప్పు
- జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్‌కు దారితీస్తున్న వైనం
- ఆహార నియమాలు తప్పనిసరి అంటున్న వైద్యులు
- మాంసాహారం మితంగా తీసుకోవాలని సూచనలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కల్తీ ఆహారం, సమపాలన లేని ఆహారపు అలవాట్లు కొంపముంచుతున్నాయి. ఆరోగ్యాన్ని దెబ్బతీసి ఆస్పత్రుల పాలుచేస్తున్నాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల్లో బిర్యానీలు, ఇతర మాంసాహార వంటకాలను లాంగించేస్తుండటంతో తొలుత జీర్ణాశయ వ్యాధులు ఆశించి, ఆ తరువాత ప్రాణాపాయ స్థితికి దారితీస్తున్నాయి. ఇటీవల నగరంలో నమోదవుతున్న లివర్ సిర్రోసిస్, పాంక్రియాటైటీస్, క్యాన్సర్ కేసులను చూస్తుంటే ఆందోళన కలిగిస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. నాలుగు పదుల వయస్సులోనే జీర్ణాశయ, పెద్దపేగు, లివర్ క్యాన్సర్ సోకుతున్నట్లు వెల్లడిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ రకం వ్యాధులే ఎక్కువగా వెలుగుచూస్తున్నాయని, అన్నవాహిక క్యాన్సర్‌లు కూడా నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అప్రమత్తం కాకుంటే రానున్న కాలంలో పెనుముప్పు పొంచి ఉన్నట్లేనని హెచ్చరిస్తున్నారు.

కొంపముంచుతున్న కల్తీ

నాన్‌వెజ్ వంటకాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయనాలు కలిసిన కారంపొడులు ఎక్కువగా వాడుతుంటారు. అంతేకాకుండా మృత జంతువుల కొవ్వు నుంచి తయారు చేసిన కల్తీ నూనెలు వినియోగించి వంటలు చేస్తుండటంతో జీర్ణకోశ వ్యాధులు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అందుకు ఫుడ్ కంట్రోల్ శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో కల్తీ ఆహారాన్ని గుర్తించడమే నిదర్శనంగా పేర్కొంటున్నారు. బయట ఆహారం తినడాన్ని తగ్గించడం ఎంతో ఉత్తమం అని వైద్యులు సూచిస్తున్నారు. కల్తీ ఆహారమే క్యాన్సర్ వంటి వ్యాధులకు దారి తీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జీర్ణకోశ, పెద్దపేగు, అన్నవాహిక క్యాన్సర్‌లకు కల్తీ ఆహారమే ప్రధాన కారణమని స్పష్టంచేస్తున్నారు.

జీవనశైలి వ్యాధులకు దారి తీస్తున్న వైనం

ఆహార నియమాలు పాటించక పోవడంతో ఒబెసిటీకి దారితీసి క్రమేణా జీవనశైలి వ్యాధులకు దారి తీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారికి మధుమేహం, రక్తపోటుతో పాటు, హైపో థైరాయిడ్ వంటి వ్యాధులు సోకుతున్నాయని వివరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించడంతో పాటు, వ్యాయామం చేయడం అవసరమని సూచిస్తున్నారు. అప్రమత్తం కాకుంటే వ్యాధుల ముప్పు పొంచి ఉన్నట్లేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జీర్ణకోశ వ్యాధులు పెరుగుతున్నాయి



మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా జీర్ణకోశవ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గ్యాస్ట్రైటీస్, కొలైటిస్ సమస్యలతో పాటు, లివర్, పాంక్రియాస్ ఇబ్బందులతో చాలా మంది మా వద్దకు వస్తున్నారు. వారికి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాం. కొందరిలో ప్రాణాపాయం కూడా ఏర్పడవచ్చు. ఆహార నియమాలు పాటిస్తూ, కల్తీ ఆహారాన్ని మానుకోవాలి. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.

– డాక్టర్ బి.ఎస్.వి.వి.రత్నగిరి, అసోసియేట్ ప్రొఫెసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ

పౌరుల మిస్సింగ్ డేటా సేకరించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



జూమ్‌కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో చేపట్టిన హౌస్ హోల్డ్ సర్వే ద్వారా పౌరుల మిస్సింగ్ డేటా సేకరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఈ సర్వేను వారం రోజుల్లో పూర్తి చేసి, పౌరుల మిస్సింగ్ డేటా డేటాబేస్‌లో చేర్చాలని సూచించారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది హాజరును తప్పక నమోదుచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ సర్వే ప్రగతిపై కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ప్రతి పౌరుడి సమగ్ర సమాచారం డేటాబేస్‌లో పొందుపరిచేందుకు హౌస్ హోల్డ్ సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారు, సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నవారు డేటాబేస్‌లో నమోదుచేసుకున్నారని, ఉద్యోగులు, వ్యాపార రంగానికి చెంది దారిద్ర్యరేఖకు పైబడినవారు సంక్షేమ పథకాలు అర్హులు కాదనే ఉద్దేశంతో తమ వివరాలను మ్యాపింగ్ చేసుకోలేదని వివరించారు. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబ యజమానితో పాటు సభ్యుల వివరాలను సేకరించి నమోదుకాని వారి డేటాను పొందుపరచాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం జిల్లాలో 7,28,383 గృహాలకు 6,91,627 గృహాల జియో ట్యాగింగ్ చేశారని తెలిపారు. మిగిలిన 36,756 ఇళ్లకు జియో టాగింగ్ చేయాలని సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు సామజిక ప్రయోజనాలను అందేలా వారి ఆధార్‌ను బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామ/వార్డు సచివాలయ అధికారి జి.జ్యోతి, వివిధ మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థను కొనసాగించి ముఖ్యమంత్రి తన మాట నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరుతూ ఏపీ వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో 50 గంటల ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. బుధవారం విజయవాడలోని దీక్ష శిబిరంలో పాల్గొని వలంటీర్లకు రామకృష్ణ మద్దతు తెలిపారు. 50 గంటలు పూర్తికావడంతో నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. ఎన్నికల్లో సాక్షాత్తు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వలంటీర్లకు ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతున్నారని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని, రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. వలంటీర్ల గురించి రాష్ట్రంలో మంత్రులు తెలిసీ తెలియనట్లుగా మాట్లాడటం బాధాకరమన్నారు. వరదల సమయంలో వలంటీర్లను ఏ విధంగా వినియోగించుకున్నారని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు సచివాలయాల్లో వలంటీర్ల అటెండెన్స్ తీసుకున్నారని, నేడు దాన్ని కూడా రద్దు చేయడం బాధాకరమన్నారు. వలంటీర్లను పార్టీలకు ఆపాదించడం సరి కాదన్నారు. కూటమి పెద్దలు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. దీక్షలో పాల్గొన్న వలంటీర్లు మమత, సరోజిని స్వల్ప అస్వస్థకు గురికావడంతో ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ దీక్షలో లంకా గోవిందరాజులు, వలంటీర్లు కుమార్, శిరీష, వెంకటసుబ్బయ్య, రాజేష్, వాసు తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని సందర్శించిన వారిలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, లంకా గోవిందరాజులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఉన్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

21న జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల 21వ తేదీన స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్, దొడ్ల డెయిరీ లిమిటెడ్, కోస్టల్ న్యూమాటిక్ ఏజెన్సీస్, రమా క్లాత్ స్టోర్స్ మొదలైన కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల లోపు అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ ఉదయం తొమ్మిది గంటల విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగే జాబ్ మేళాకు విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93912 54464, 93477 79032 సెల్ నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు పేర్కొన్నారు.


వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



మంత్రి శ్రీనివాస్‌ను కలిసిన వినతిపత్రం ఇచ్చిన వీఓఏల సంఘం ప్రతినిధులు

ఘంటసాల: రాష్ట్రంలోని వీఓఏ (యానిమేటర్స్)లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్‌ఐ సాధికారిత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గన్నవరం ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కూటమి నేతలకు ఏపీ వెలుగు వీఓఏ (యానిమేటర్స్)ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభుదాస్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుదాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 27,837 మంది వీఓఏలు పని చేస్తున్నారని, 28 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని వివరించారు. అయినా తమకు ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేరుగా తమ బ్యాంక్ ఖాతాల్లోనే వేతనాలు జమ చేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, అధికారుల వేధింపులు, బెదిరింపులకు అడ్డుకట్ట వేయాలని, వీఓఏలు చనిపోతే వారి కుటుంబ సభ్యుల్లో వారికి వీఓఏ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మూడేళ్ల కాలపరిమితి పూర్తయిన వీఓఏలను తొలగిస్తామని అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఘంటసాల వీఏఓలు కొల్లూరి నాని, నాగమణి, ఇతర జిల్లాలకు చెందిన ఎ.వనజ, పి.యేసురత్నం, ఎం.గంగాదేవి, బి.రాణి, సి.కిరణ్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



ఉయ్యూరు: ఉరి వేసుకుని పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గండిగుంట శివారు వెంకటాపురంలో బుధవారం జరిగింది. ఉయ్యూరు పట్టణ పోలీసుల కథనం మేరకు.. గండిగుంట శివారు వెంకటాపురంలో నివసించే పోలన శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె పోలన గీతామాధురి (15) ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బుధవారం ఉదయం తండ్రి శ్రీనివాసరావు వ్యవసాయ పనులకు, తల్లి లక్ష్మి విజయవాడలో ఓ వస్త్ర దుకాణంలో పనికి, ఇంటర్ చదువుతున్న అక్క కళాశాలకు వెళ్లారు. గీతామాధురి స్కూలుకు వెళ్లి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనానికి ఇంటికి వచ్చింది. వంట గదిలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన శ్రీనివాసరావుకు వంట గదిలో కుమార్తె ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో షాక్‌కు గురయ్యాడు. స్థానికుల సాయంతో కిందకు దించి చూసేసరికి మృతి చెందింది. బిడ్డ మృతదేహాన్ని చూసి శ్రీనివాసరావు భోరున విలపించాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు గీతామాధురి భౌతిక కాయాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. పట్టణ ఎస్‌ఐ విశ్వనాథ్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పాదచారులు, వాహనదారులపై దాడులు
- పట్టించుకోని అధికారులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక ప్రాంతంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసిన గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనాదారులను వెంబడించి పరుగులు తీయిస్తున్నాయి. రాత్రి వేళలోల్ వాహనదారులు, పాదచారులపై దాడులు చేస్తున్నాయి. వాహనదారులు భయంతో వేగంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజలు ఒంటరిగా రోడ్ల మీదకు వెళ్ళాలంటేనే భయపడుతున్నారు.

కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాల్లోని 20, 21, 22,17, 18 డివిజన్లలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాణిగారితోటలోని రాధాకృష్ణమూర్తి రోడ్డు, సిద్దం కృష్ణారెడ్డి రోడ్డు, వైట్‌హౌస్ సెంటర్, శాంపిల్ బిల్డింగ్ ఏరియా, అంతర్గత వీధుల్లో, కృష్ణాలంక కలోని హైస్కూల్ రోడ్డు, ఫీడర్ రోడ్డు రోడ్డు, నెహ్రూనగర్, గౌతమీ నగర్, ద్వారకానగర్, కాటూరి వారి వీధి, నిర్మల శిశుభవన్ ఏరియా, పాలపర్తి వారి వీధి, శంకరమఠం రోడ్డు, పాతపోలీస్ స్టేషన్ రోడ్డు, పాత పోస్టాఫీస్ రోడ్డు, భ్రమరాంభపురంలోని వీధుల్లో, స్వర్గపూరి వీధుల్లో వీధి కుక్కలు అధికంగా ఉండడంతో ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే ప్రజలు జంకుతున్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా సేదతీరుతూ పనుల నిమిత్తం వెళ్లే వారిపై దాడికి పాల్పడుతుండడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రిళ్లు భయంకరంగా అరుస్తూ స్థానికులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.



కృష్ణలంక, హైస్కూల్ రోడ్డులో సంచరిస్తున్న వీధి కుక్కలు

వ్యాధులతో వీధి కుక్కలు.....

కొన్ని కుక్కలు వింత చర్మ వ్యాధితో బాధపడుతున్నాయి. వాహనాల వెంట పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్కలకు సోకిన వ్యాధితో కుక్కలకు చర్మంపైన ఉన్న వెంట్రుకలు రాలిపోయి పుండ్లు ఏర్పడుతుండడంతో భయంకరంగా కనిపిస్తున్నాయి. ఇళ్ల మధ్యనే సంచరిస్తూ ఒంటరిగా వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. ఈ వ్యాధి తమకు ఎక్కడ సోకుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెత్త కుండీల వద్ద, మాంసం దుకాణాల వద్ద వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు తమ సంతానాన్ని రోజు రోజుకు వృద్ధి చేస్తున్నాయి. సంతానంతో పాటు కుక్కలు రోడ్ల మీద తిరుగుతూ తమ పిల్లలకు ఎక్కడా హానీ కల్పిస్తారోనని అటుగా వెళ్లే వారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. కుక్క కాట్లకు గురై రోజు ఒకరిద్దరు ఆసుపత్రి పాలవుతున్నా అధికారుల్లో కనీసం చలనం లేదని ప్రజలు వాపోతున్నారు. వీధి కుక్కల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



కృష్ణలంకలో ప్రాంతంలో కుక్కల సంచారం అధికంగా ఉంది. ప్రతివీధిలో గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనాల వెంటపడుతున్నాయి. వాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా కుక్కల నియంత్రణ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వెంటనే అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

–మద్దెల సునీల్, స్థానికుడు, కృష్ణలంక

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటు

పటమట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను దేశ హోంమంత్రి అవమానించటం సిగ్గుచేటని, పార్లమెంట్‌లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని అఖిల భారత మాల సంఘం జేఏసీ చైర్మన్ రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి డాక్టర్ ఉప్పులేటి దేవీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన గురునానాక్ కాలనీలోని జేఏసీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీ ప్రసాద్ మాట్లాడుతూ భారత పార్లమెంట్ సాక్షిగా హోంమంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించారని తెలిపారు. ఆయన్ను భారత రాజ్యాంగాన్ని అవమానిస్తే దేశ ప్రజలందరినీ అవమానించినట్లేనని చెప్పారు. అమిత్‌షా వెంటనే హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసే వరకు తాము నిరసన దీక్ష చేపడతామని పేర్కొన్నారు.

పెనుగొండకు అభినందనలు

విజయవాడకల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు అరసం కృష్ణాజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు కొండపల్లి మాధవరావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. అరసం ద్వారా మరుగున పడిన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన ఆయన సాహిత్య కృషికి గుర్తింపు లభించిందన్నారు.

క్లుప్తంగా

సింగల్ యూజ్ ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్



పటమట(విజయవాడతూర్పు): నగరంలో పెరిగిపోతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో ప్రజారోగ్య విభాగం మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న పలు వ్యాపార సంస్థలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేశారు. సూపర్‌మార్కెట్, కూరగాయలు, హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న వారికి జరిమానా విధించారు. నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించవద్దని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పర్యావరణహిత వస్తువులనే వాడాలని సూచించారు. వ్యాపారులు సింగల్ యూస్ ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగించినా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

స్టెల్లాలో హార్టీ ఎక్స్‌పో



పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 23న జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా బుధవారం పటమటలోని స్టెల్లా కళాశాలలో హార్టీ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత మాట్లాడుతూ రైతులు దేశానికి పట్టుకొమ్మలు అని తెలిపారు. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు ఆవిష్కరణలు గురించి అవగాహన పెంచాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఉందని చెప్పారు. కళాశల అగ్రికల్చర్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణ స్వామి మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో పూలు, పండ్లు పెంపకం, దిగుబడి పద్ధతులు, ఆర్గానిక్ ఫార్మింగ్, షిఫ్టింగ్ కల్టివేషన్ పర్యావరణహిత పంటలు, పరికరాలు, వివిధ నమూనాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యవసాయంపై వ్యాస రచన అగ్రికల్చర్ ఫ్యాషన్ షో తో పాటు వివిధ ఫుడ్ స్టాళ్లను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ లీన క్వాడ్రస్, అధ్యాపకులు మనోజ్ , జాస్మిప్రియ, బ్లెస్సి, తేజశ్రీ , మాధురి పాల్గొన్నారు.

పండుగల ఆచారాలు ప్రతి ఒక్కరూ పాటించాలి



విజయవాడస్పోర్ట్స్: సన్మార్గంలో నడిపించే పండుగల ఆచారాలు ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కోరారు. కమిషనరేట్ కార్యాలయంలో కార్యాలయ పరిపాలన విభాగం బుధవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలు పోలీసు అధికారులు, సిబ్బంది మధ్యలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందదాయకంగా ఉందని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. అక్కడున్న వారందరికీ ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, కార్యాలయ ఏవో సునీత, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'మనస్సాక్షి' నాటిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యంగా 'మనస్సాక్షి' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. మనిషికి కావల్సింది అవినీతితో సంపాదించే డబ్బు కాదని, గుప్పెడు మెతుకులు, ఆరు అడుగుల నేల, చారెడు గుడ్డ అన్న కథాంశంతో కళాకారులు రక్తి కట్టించారు. హర్ష క్రియేషన్స్ (విజయవాడ) పక్షాన నటుడు కత్తి శ్యాం ప్రసాద్ నిర్వహణలో దివంగత డాక్టర్ బ్రహ్మానందం రచించిన ఈ నాటికకు రంగస్థల సీనియర్ నటుడు పిళ్లా నటరాజ్ దర్శకత్వం వహించి నటించారు. వేంపాటి రమేష్, ఎస్.అమృతవర్షిణి, సాగర్, మల్లేశ్వర పట్నాయక్ పాత్రోచితంగా నటించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. అనంతరం చింతాడ ప్రసాద్ తన ధ్వన్యనుకరణ (మిమిక్రీ)తో అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీసాయిబాబా నాట్యమండలి (విజయవాడ) ఆధ్వర్యంలో కళాకారిణులు జీఎస్‌డీ కుసుమసాయి, బత్తిన రూపశ్రీ, చిందాన తేజశ్రీ ఆంధ్ర నాట్యం, కూచిపూడి, భరత నాట్యంతో పలు అంశాలకు చక్కని ఆంగికాభినయంతో నర్తించారు. శ్రీదేవి కళా నాట్య మండలి (ఉయ్యూరు) వారు బాలనాగమ్మ నాటకం నుంచి 'మాయలఫకీర్' సీను ప్రదర్శించారు. ఈ సీనులో జెట్టి నరసింహారావు, కణితి ప్రభావతి నటించగా, చింతలపూడి నాగేశ్వరరావు బృందం వాయిద్య సహకారం అందించారు.

గణితంపై పట్టుతో ఉద్యోగావకాశాలు

హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు గణిత శాస్త్రంపై పట్టు సాధించడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించే అవకాశం ఉంటుందని హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆంధ్రలయోల కళాశాలలో గణిత-24 పేరిట గణిత మహోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మిగతా పాఠ్యాంశాల కంటే ఎక్కువగా గణితంలో పట్టు సాధించాలని సూచించారు. ఆధునిక ప్రపంచంలో గణిత శాస్త్రానికి ప్రాముఖ్యత పెరుగుతుందని చెప్పారు. మెరుగైన ఉద్యోగ అవకాశాలకు, పారిశ్రామిక, వ్యాపార రంగంలో గణితానికి అత్యధిక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. గణితం నేర్చుకునే తొలి దశలో కొంత కఠినంగా ఉన్నా సూత్రాల ద్వారా సులువుగా పూర్తి చేయవచ్చని తెలిపారు. గణితం కఠిన తరమనే భావన విద్యార్థులు విడిచిపెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో గణిత శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు గణితంలో క్విజ్, మెమొరీ గ్రిడ్, క్యూబ్ సాల్వింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, గణిత శాస్త్ర విభాగాధిపతి పి.వేణుగోపాల్ అధ్యాపకులు తబిత, నాగకోటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులతో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్రూబిడ్జి సెక్షన్ ఉపకేంద్రం, 11 కేవీ పోలీస్‌కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ పి .రవీంద్రబాబు తెలిపారు. సత్యనారాయణనగర్, పోలీస్‌కాలనీ, హెడ్‌పోస్టు కార్యాలయం, ఎస్‌బీఐ బాలాజీనగర్, ఉదయగిరి గంగయ్యరోడ్డు, కోరావారివీధి, కొత్త ఆంజనేయస్వామిగుడి, జీఎల్‌రావు ప్లాట్స్, మహిత పబ్లిక్ స్కూలు బాలాజీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో కరెంట్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కృష్ణలంక విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ గీతానగర్ ఫీడర్ పరిధిలోని తారకరామానగర్, భూపేష్‌గుప్తా నగర్, రాణిగారితోట, చలసానినగర్, బాలాజీనగర్, గీతానగర్‌కట్టతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైభవంగా పడిపూజ మహోత్సవం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 21వడివిజన్‌లోని శ్రీరాజమాత బండ్లమాంబ గుడి వద్ద ఎస్‌డి సేవా భక్త బృందం, ఎస్ఎస్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి అష్టోత్తర శత కలషాభిషేక పడి పూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. విద్యుత్ కాంతులతో శబరిమలై సన్నిధిని తలపించేలా స్వామి వారి 18 మెట్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అయ్యప్ప, గణపతి, కుమార స్వాముల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్షాదారులు, భవానీలు పాల్గొని భజనలు, కీర్తనలు పాడుతూ పూజలు చేశారు. స్వామియే శరణం అయ్యప్ప... శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామ స్మరణ, భక్తి గీతాలతో ప్రాంతమంతా మార్మోగింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. పూజా కార్యక్రమాలను అయ్యప్పస్వాములు డి.దుర్గాప్రసాద్, పి.సతీష్, ఎస్ఎస్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు యడవల్లి సతీష్, గంట రవికిషోర్, పైడి సతీష్ తదతరులు పర్యవేక్షించారు.



అయ్యప్పస్వామి 18 మెట్లు పూలతో అలంకరణ

రేపు సిద్ధార్థలో విభవా-2కే24

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ నెల 20వ తేదీ సిద్ధార్థ ఆడిటోరియంలో విభవా-2కే24 పేరుతో సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలో విభవా-2కే24 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి కంప్యూటర్ సైన్స్ (పీజీ విద్యార్థులు) చదువుతున్న యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారిలోని ప్రతిభను చూపుతారని చెప్పారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, విభవా-2కే24 కన్వీనర్ డాక్టర్ టీఎస్ రవికిరణ్ మాట్లాడుతూ టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, కోడింగ్ అండ్ డీకోడింగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోతో పాటుగా మిస్టర్ అండ్ మిస్ విభవా-2కే24 పేరుతో ర్యాంప్ వాక్, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్, వీడియోగ్రఫీ, గ్రూప్ డాన్స్ పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ సి. జంపాల తోపాటుగా అధ్యాపకులు, కంప్యూటర్ సైన్స్ పీజీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు

హైలైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్ ప్రారంభం





విజయవాడ నోవాటెల్ హోటల్లో హైలైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. పలువురు మోడల్స్ పాల్గొని షోరూంలోని ఆభరణాలు ప్రదర్శించారు.
సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బాల్యంలోనే లక్ష్య సాధన ఏర్పాటు చేసుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): బాల్యం నుంచి జీవిత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, పిల్లల లక్ష్య సాధన కోసం తల్లిదండ్రులు వారిని ప్రోత్సాహించాలని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. పటమటలోని ఎస్ఎస్ఎం స్కూల్ ప్రైమరీ విద్యార్థుల వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ చిన్నారులకు విద్యతో పాటుగా వారి అభిరుచికి తగిన విధంగా బోధన విధానం ఉండాలని తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రకృతిని రక్షించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. అందుకు బాల్యం నుంచే ప్రకృతిపై ప్రేమ కలిగేలా పెంపకం ఉండాలన్నారు. మరో అతిథిగా పాల్గొన్న ఎయిమ్స్ రీసెర్చ్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ ఆర్తి గుప్త మాట్లాడుతూ చిన్ననాటి నుంచి ప్రతి విద్యార్థికీ ఉన్నత విలువలను అర్జించేలా బోధన ఉండాలని పేర్కొన్నారు. జ్ఞానంతోపాటు నైతిక విలువలు కూడా నేర్పాలన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ఆకర్షించాయి. అంతకు ముందు ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మోంటీ, ప్రిన్సిపాల్ రాయపరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నృతం చేస్తున్న చిన్నారులు

22న సీనియర్ సిటిజన్స్ సంఘం రజతోత్సవ సభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రజతోత్సవ సభను ఈ నెల 22వ తేదీ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వయో వృద్ధులకు సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. సాంఘిక సంక్షేమ, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, స్త్రీ, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభా వంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారితో పాటుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు, అధిక సంఖ్యలో సీనియర్ సిటిజన్లు హాజరవుతారని పేర్కొన్నారు.

42 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ కళాశాలలో బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీకామ్ చివరి సంవత్సరం చదువుతున్న 42 మంది విద్యార్థులు ఎక్సెంచ్యూర్ ఐటీ సంస్థలో సిస్టం అండ్ అప్లికేషన్ సర్వీసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఆవరణలో బుధవారం అభినందించారు. రమేష్ మాట్లాడుతూ గత నెలలో తమ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలను నిర్వహించారని చెప్పారు. వాటి ఫలితాలు ఇటీవల ప్రకటించారని తెలిపారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపికైన వారిలో అత్యధికంగా తమ కళాశాలకు చెందిన 42 మంది ఉద్యోగాలు పొందడం తమకు చాలా సంతోషంగా ఉందని కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఉపాధి విభాగం అధికారి కావూరి శ్రీధర్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, కళాశాల డీన్ రాజేష్ సీ. జంపాలతో పాటుగా అధ్యాపకులు అభినందించారు.

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు





ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో భవానీ దీక్షల విరమణలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక గుడి కెనాల్ రోడ్డు వైపు నుంచి ఘాట్ రోడ్డు వరకు క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ టెంట్లు అమర్చుతున్నారు. పవిత్ర పుణ్యస్నానాల కోసం భవానీ ఘాట్ వద్ద జల్లు స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్లు పంపిణీ

విజయవాడస్పోర్ట్స్: ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, శ్రేయస్సు కాంక్షిస్తూ వారికి అగర్వాల్ కంటి ఆసుపత్రి యాజమాన్యం సన్‌గ్లాసెస్(కళ్లజోళ్లు) పంపిణీ చేయడం పట్ల పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులకు అగర్వాల్ కంటి ఆసుపత్రి సమకూర్చిన కళ్ల జోళ్లను గవర్నర్‌పేటలోని ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.కె.ఎస్.చక్రవర్తి, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



ఈ-కామర్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

ఇటీవలి కాలంలో సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వాడకం పెరిగి ఈ కామర్స్ సంస్థల్లో కొనుగోళ్లు కూడా భారీగా పెరిగాయి. ఇదే సమయంలో వీటికి సంబంధించిన మోసాలు కూడా పెరిగాయి. 2024 జనవరి 1 నుంచి నవంబరు 30 వరకు జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) వద్ద మొత్తం 3,97,333 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ ఫిర్యాదుల్లో 3,67,704 పరిష్కారమయ్యాయి. వీటిలో ఎక్కువ శాతం ఈ కామర్స్ సంస్థల సేవల మీదనే వచ్చాయి. ఒక ఉత్పత్తి ఆర్డర్ చేస్తే మరో ఉత్పత్తి రావడం, పాడైపోయిన వస్తువు రావడం, రిఫండ్ మొత్తం రాకపోవడం వంటి వాటిపై 50వేలకుపైగా ఫిర్యాదులు రావడం గమనార్హం.

ఫిర్యాదు అంశం	మొత్తం ఫిర్యాదులు
సేవల్లో లోపం	59,723
డెలివరీలో జాప్యం	27,394
పాడైపోయిన/లోపం ఉన్న వస్తువు రావడం	53,285
పాలసీ ప్రకారం రీప్లేస్‌మెంట్ లేదా రిఫండ్ చేయకపోవడం	19,020
చెల్లించిన మొత్తం రిఫండ్ రాకపోవడం	50,997
డబ్బులు అకౌంట్లోంచి వెళ్లిపోవడం, సంస్థ/కంపెనీ అకౌంట్లో జమకాకపోవడం	15,315
ఉత్పత్తి డెలివరీ చేయకపోవడం	42,781
ఇతర పరికరాలు రాకపోవడం	5,913
వస్తువు లేదా వస్తువుకు సంబంధించిన ఇతర పరికరాలు రాకపోవడం	15,077
అకౌంట్ బ్లాక్ అవడం / సేవలు ఆపేయడం ఇతరాలు	53,265



ఆధారం: కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ

క్లుప్తంగా...

బియ్యపు మధుసూదన్‌రెడ్డి కేసు వివరాలు సమర్పించండి

శ్రీకాళహస్తి పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై నమోదైన కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు బుధవారం శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి మునిసిపాలిటీ పరిధిలో స్వర్ణముఖి నది ఒడ్డున వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకుడు అన్ని అనుమతులతో 2017లో రివర్ వ్యూ పేరుతో రిసార్ట్ నిర్మించారు. దీన్ని అధికారులు ఏకపక్షంగా కూల్చివేస్తుండటంతో అక్కడికి వచ్చిన మధుసూదన్‌రెడ్డి మునిసిపల్ అధికారులను నిలదీశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారంటూ ప్రశ్నించారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారి శారద తన విధులు నిర్వర్తించకుండా మధుసూదన్‌రెడ్డి తదితరులు అడ్డుకున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులు ఈనెల 14న మధుసూదన్‌రెడ్డి, ఆయన అనుచరులపై కేసు నమోదు చేశారు. దీంతో ఆయన తనపై కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది.

వర్రా రవీంద్రారెడ్డి కస్టడీ పిటిషన్ రద్దు

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల పోలీసులకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వర్రా రవీంద్రారెడ్డి కస్టడీ పిటిషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. కడప కోర్టు గతంలో 19, 20 తేదీల్లో రవీంద్రారెడ్డిని పోలీసు కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలివ్వగా.. హైకోర్టు ఆ ఆదేశాలను రద్దు చేసింది. 'కావాలంటే మళ్లీ కడప కోర్టులో పిటిషన్ వేయండి' అంటూ పోలీసులకు సూచించింది.

తలశిల రఘురాంపై కఠిన చర్యలు వద్దు

సాక్షి, అమరావతి: టీడీపీ నేత కారంపూడి రవీంద్ర ఆత్మహత్య వ్యవహారంలో ఎమ్మెల్సీ తలశిల రఘురాంకు హైకోర్టు రక్షణ కల్పించింది. ఆయనపై రెండు వారాల పాటు కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. రవీంద్ర ఆత్మహత్య వ్యవహారంలో పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ తలశిల రఘురాం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



ఆన్‌లైన్ విద్యలో నాణ్యతకు పట్టం

ప్రపంచంలో తొలిసారిగా ఆన్‌లైన్ అభ్యసనాలకు ర్యాంకులు

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ విద్య విస్తరిస్తోంది. కోవిడ్ మహమ్మారి తర్వాత సంప్రదాయ విశ్వవిద్యాలయాలు డిజిటల్ విద్యపై దృష్టి కేంద్రీకరించాయి. అయితే ఇప్పటి వరకు ఆన్‌లైన్ విద్య నాణ్యతను కొలవడానికి సరైన ప్రమాణాలు లేవు. కానీ, తొలిసారిగా ఇటీవల టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆన్‌లైన్ లెర్నింగ్ ర్యాంకింగ్స్-2024ను ప్రకటించింది. ఇందులో ప్రపంచంలో 11 యూనివర్సిటీలకు గోల్డ్ స్టేటస్ ర్యాంకును ఇచ్చింది. ఇందులో భారతదేశం నుంచి మానవ్ రచన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ స్టడీస్, ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలు 'బంగారు' హోదా పొందాయి.

దేశంలో ఏడు వర్సిటీలకు ర్యాంకులు...

ఆన్‌లైన్ విద్యలో గోల్డ్ కేటగిరీలో 11 యూనివర్సిటీలు ఉన్నాయి. ఇందులో యూఎస్‌ఏ నుంచి మూడు, యూకే, భారత్ నుంచి రెండు చొప్పున, రష్యా, హంగేరీ, న్యూజిలాండ్, ఆ్రస్టేలియా నుంచి ఒక్కొక్క యూనివర్సిటీ ఉన్నాయి. భారత్ నుంచి శూలిని యూనివర్సిటీ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌కు సిల్వర్ స్టేటస్ సాధించగా, అమిటీ యూనివర్సిటీ (నోయిడా), కేఎల్ యూనివర్సిటీ (ఏపీ), లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీ (పంజాబ్), మణిపాల్ వర్సిటీ (జైపూర్) బ్రాంజ్ స్టేటస్ పొందాయి. ఈ ర్యాంకింగ్స్‌తో భారత్ యూనివర్సిటీలు ఆన్‌లైన్ విద్యను అందించడంలో పురోగతిని కనబరుస్తున్నాయని స్పష్టమవుతోంది.

గోల్డ్ స్టేటస్ పొందిన యూనివర్సిటీలు...

- అమెరికన్ యూనివర్సిటీ(యూఎస్)
- అరిజోనా స్టేట్ వర్సిటీ(యూఎస్)
- హెచ్ఎస్ఈ వర్సిటీ (రష్యా)
- మానవ్ వర్సిటీ (భారత్)
- మాస్సే వర్సిటీ (న్యూజిలాండ్)
- ఓపీ జిందాల్ (భారత్)
- సెంట్రల్‌ఫ్లోరిడా వర్సిటీ (యూఎస్)
- వర్సిటీ ఆఫ్ ఎసెక్స్ (యూకే)
- లివర్‌పూల్ వర్సిటీ (యూకే)
- సౌత్ ఆ్రస్టేలియావర్సిటీ (ఆ్రస్టేలియా)
- వర్సిటీ ఆఫ్ స్జెడ్ (హంగేరి)

వీటి ఆధారంగానే ర్యాంకులు

ఆన్‌లైన్ అభ్యాసానికి అంకితమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంతృప్తి, విద్యార్థుల్లో పురోగతి, కోర్సుల సిఫారసు వంటి అంశాలను టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ పరిశీలించి ర్యాంకులు కేటాయించింది. మొత్తం ప్రపంచంలో 14 యూనివర్సిటీలు వెండి, 31 కాంస్య పతకాల కేటగిరీలో నిలిచాయి. మరో 64 సంస్థలు డేటా సమర్పించినప్పటికీ పూర్తి ఎంట్రీ అవసరాలను తీర్చలేదు. కాబట్టి వాటికి రిపోర్టర్ హోదా కల్పించింది. అయితే ఆన్‌లైన్ విద్యను అందిస్తున్న యూనివర్సిటీ అభ్యాసకులు టెక్నాలజీ యాక్సెస్, టైమ్‌జోన్, భాషా ప్రావీణ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వేమిరెడ్డికే క్వార్ట్జ్ గనులు!

▶ మొదటి పేజీ తరువాయి

ఒప్పందం జరిగినట్లు సమాచారం. ఇప్పటికే సైదాపురం పరిసర ప్రాంతాల నుంచి నెల రోజులుగా నిత్యం వందల లారీల్లో ఖనిజాన్ని అనధికారికంగా పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. తమకు ముడిసరుకు మొత్తం అప్పగించాలని లేదంటే కేసులు బనాయించి లీజులు రద్దు చేయిస్తామని అన్ని అనుమతులున్న ఇతర గనుల యజమానులను బెదిరిస్తున్నారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ గత ఆర్నెల్లుగా గనుల యజమానులు తవ్వకాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారు. లీగల్ మైన్లను దుర్మార్గంగా నిలిపివేయడంపై యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమ అనుకూల అధికారులను నియమించుకోవడంతోపాటు సైదాపురంలో పనులను పర్యవేక్షించేందుకు కార్యాలయం ఏర్పాటుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. గనుల తవ్వకాలపై ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా సైదాపురం పరిసరాల్లో క్వార్ట్జ్ శుద్ధి పరిశ్రమ ఏర్పాటు పేరుతో జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. ఉపాధి దొరుకుతుందంటూ కంపెనీ ముసుగులో ప్రజలను మభ్యపుచ్చి కొన్నాళ్ల పాటు హడావుడి చేసి అనంతరం అందరి నుంచి గనులను లాక్కునే ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది.

గనుల యజమానులకు బెదిరింపులు..

జిల్లాలో మైనింగ్ దందాను చేజిక్కించుకున్న వేమిరెడ్డి అనుచరులు అధికారికంగా అన్ని అనుమతులున్న గనులు యజమానులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికారిక గనుల్లో ఉన్న ముడిసరుకును సైతం తమకే ఇవ్వాలని, తాము చెప్పిన ధరకే అప్పగించాలని బెదిరింపులకు దిగారు. ఇప్పటికే తవ్విన ఖనిజంతోపాటు ఇకపై వెలికితీసేది కూడా తాము చెప్పిన నామమాత్రపు ధరకే ఇవ్వాలని ఆదేశించారు. ఈ క్రమంలో గనుల యజమానులను హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి పిలిపించుకుని ఎంపీ తీవ్ర స్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. ముడిసరుకు ఇవ్వకుంటే గనుల నుంచి మీ లారీలు వెళ్లలేవని, పలు రకాల కేసులు నమోదు చేయించి లీజులు రద్దు చేయిస్తామంటూ తమను బెదిరించినట్లు ఓ గని యజమాని వాపోయాడు. తమ మైన్లకు అన్ని అనుమతులు ఉన్నాయని, గత 50 ఏళ్లుగా 'డెడ్ రెంట్' సైతం చెల్లిస్తున్నామని పేర్కొన్నాడు.

రూప్ కుమార్ ద్వారా..

ఎంపీ వేమిరెడ్డి తన అనుచరుడైన రూప్‌కుమార్‌ను ముందుపెట్టి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. సైదాపురం సమీపంలోని శ్రీనివాస పద్మావతి, చాగణం సమీపంలో ఉన్న సిద్ధి వినాయక, తుమ్మల



పనులను పర్యవేక్షించేందుకు సైదాపురంలో ఆఫీస్ నిర్మాణ పనులు

తలుపూరులో ఉన్న జయలక్ష్మి కనకదుర్గా, కలిచేడు సమీపంలో ఉన్న రాఘవేంద్ర గనులు ఆయన ఆధీనంలో ఉన్నాయి. ఆర్నెల్లుగా అందరి మైన్లు నిలిపివేసి కేవలం ఎంపీ అనుచరుడికి చెందిన నాలుగు గనులకే అనుమతులు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటనేది తెలిసిపోతోంది.

అనుకూల అధికారి రాక

నెల్లూరు జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా తిరుపతి జిల్లా డీడీ బాలాజీ నాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించేలా ఎంపీ చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్‌ను కలెక్టర్ ద్వారా 20 రోజుల క్రితం ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అయితే దీన్ని న్యాయస్థానం తప్పుబట్టడంతో మళ్లీ పోస్టింగ్ ఇచ్చినట్లే ఇచ్చి విజయవాడకు బదిలీ చేశారు. అనంతరం ఆ పోస్టులో తమ అనుకూల అధికారిని నియమించేలా బుధవారం ఉత్తర్వులు జారీ చేయించారు.

విదేశాల్లో భారీ గిరాకీ..

కూటమి ప్రభుత్వం రాగానే సైదాపురం గనులపై 'ముఖ్య' నేత కన్ను పడటంతో వెంటనే అనుమతులు నిలిపివేశారు. అన్ని అనుమతులతో వందేళ్ల లీజుపై తీసుకున్న గనులను సైతం మూసి వేయించారు. ఇక్కడ లభ్యమయ్యే మైకా క్వార్ట్జ్, తెల్లరాయి క్వార్ట్జ్‌పై నివేదిక తెప్పించుకున్నారు. వందేళ్లకు సరిపడా గనుల్లో నిల్వలున్నట్లు గుర్తించడంతో వాటిని తవ్వి సొమ్ము చేసుకునేందుకు పథకం వేశారు. సైదాపురం మండలంలో లభించే ఖనిజాన్ని చైనా, జపాన్, రష్యాకు ఎగుమతి చేస్తుంటారు. ఎనిమిది నెలలుగా మైకా, క్వార్ట్జ్‌కి విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నాణ్యతను బట్టి ముడి ఖనిజం టన్ను రూ.25 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు పలుకుతోంది. చైనాలోని సెమీకండక్టర్ పరిశ్రమల్లో మైకా క్వార్ట్జ్‌ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

హోంగార్డులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించండి

పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ ఎంపికలో తమను ప్రత్యేక కేటగిరీగా పరిగణించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ హోంగార్డులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు సానుకూలంగా స్పందించింది. వారిని ప్రత్యేక కేటగిరీగా పరిగణిస్తూ మెరిట్ జాబితా తయారుచేయాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుని ఆదేశించింది. ప్రాథమిక పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ జాబితా తయారు చేయాలని.. ఈ ప్రక్రియను ఆరు వారాల్లో పూర్తి చేయాలని చెప్పింది. సామాజిక, మతపరమైన రిజర్వేషన్లు వర్తింపజేసి ప్రిలిమినరీ పరీక్షలో తమకు క్వాలిఫైయింగ్ మార్కులు రాలేదంటూ తదుపరి ప్రక్రియకు అనర్హులుగా చేయడాన్ని సవాలు చేస్తూ పెద్ద సంఖ్యలో హోంగార్డులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జస్టిస్ సుబ్బారెడ్డి పిటిషనర్లను దేహదారుఢ్య పరీక్షకు, తుది రాత పరీక్షకు అనుమతించాలని పోలీసు నియామక బోర్డును ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే.

ఎన్నో ఏళ్లుగా హోంగార్డులుగా పనిచేస్తున్నారు..

హోంగార్డుల తరపు న్యాయవాదులు శీనాకుమార్, ప్రమోద్, శివరామ్, సాయికుమార్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఎన్నో ఏళ్ల నుంచి హోంగార్డులుగా పనిచేస్తున్నారన్నారు. అందువల్ల వీరిని మిగిలిన అభ్యర్థులతో పోల్చిచూడటానికి వీల్లేదన్నారు. పోలీసు నియామక బోర్డు తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఒకసారి నోటిఫికేషన్ జారీ అయి, ఎంపిక ప్రక్రియ మొదలైన తరువాత మధ్యలో నిబంధనలను మార్చడానికి వీల్లేదని.. వీరిని ప్రత్యేక కేటగిరీగా పరిగణించడం సాధ్యం కాదని తెలిపారు. అందువల్ల ఈ వ్యాజ్యాలను కొట్టేయాలని కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి బుధవారం పైవిధంగా తీర్పు వెలువరించారు.

మేజిస్ట్రేట్ చాలా యాంత్రికంగా వ్యవహరించారు

సోషల్ మీడియా పోస్టుల కేసులో మేజిస్ట్రేట్ కోర్టు తీరును ఆక్షేపించిన హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టులను వ్యవస్థీకృత నేరంగా పరిగణిస్తూ భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 111 కింద పోలీసులు పెడుతున్న కేసుల్లో నిందితులకు మేజిస్ట్రేట్ కోర్టులు యాంత్రికంగా రిమాండ్ విధిస్తుండటాన్ని హైకోర్టు ఆక్షేపించింది. దర్యాప్తు అధికారి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో నిందితుడు బీఎన్ఎస్ సెక్షన్ 111 కింద నేరం చేశారనేందుకు ఎలాంటి ఆధారాలను చూపకపోయినా మేజిస్ట్రేట్ మాత్రం ఆ సెక్షన్ కింద నేరం చేశారనేందుకు ఆధారాలున్నాయని రిమాండ్ ఉత్తర్వుల్లో పేర్కొనడాన్ని న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం తెలిపింది. మేజిస్ట్రేట్ మెదడు ఉపయోగించకుండా, లోపభూయిష్టంగా ఉత్తర్వులిస్తున్నారని తేల్చి చెప్పింది. సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి తన కుమారుడు వెంకటరమణారెడ్డికి వినుకొండ కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేసి అతన్ని విడుదల చేసేలా ఆదేశాలివ్వాలంటూ పప్పుల చెలమారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ రఘునందనరావు ధర్మాసనం



ఇటీవల విచారణ జరిపి, తీర్పు రిజర్వ్ చేసింది. ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ తీర్పులో మేజిస్ట్రేట్ కోర్టు తీరును తప్పుపట్టింది.

ఓ వ్యక్తిపై సెక్షన్ 111 కింద కేసు పెట్టాలంటే, అతనిపై గత పదేళ్లలో ఒకటికంటే ఎక్కువ చార్జిషీట్లు దాఖలై, వాటిలో ఒకదానినైనా కోర్టు విచారణకు స్వీకరించి ఉండాలని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుత కేసులో నిందితుడిపై గత పదేళ్లలో కేసులు నమోదయినట్లు గానీ, చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకున్నట్లు గానీ దర్యాప్తు అధికారి రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించలేదంది. అలాగే బీఎన్ఎస్ సెక్షన్ 47 కింద దర్యాప్తు అధికారి నిందితునికి ఇచ్చిన నోటీసులో అరెస్ట్‌కు కారణాలను పేర్కొన్నట్లు మేజిస్ట్రేట్ తన ఉత్తర్వుల్లో తెలిపారని, వాస్తవానికి అరెస్ట్‌కు కారణాలను దర్యాప్తు అధికారి పేర్కొనలేదని తెలిపింది. అయినప్పటికీ దర్యాప్తు అధికారి సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌పై మేజిస్ట్రేట్ సంతృప్తి వ్యక్తం చేశారంది. మేజిస్ట్రేట్ యాంత్రికంగా వ్యవహరించడమే కాక, కనీసం నోటీసులో పేర్కొన్న అరెస్ట్‌కు కారణాలను నిందితునికి రాతపూర్వకంగా ఇచ్చారా లేదా అన్న విషయాన్ని కూడా పరిశీలించలేదని ఆక్షేపించింది. మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వుల్లో ఈ రెండు లోపాల కారణంగా ఈ హెబియస్ కార్పస్ పిటిషన్‌కు విచారణార్హత ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే దర్యాప్తు అధికారి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో మాత్రం నిందితుని అరెస్ట్‌కు నిర్దిష్ట కారణాలు స్పష్టంగా పేర్కొన్నారని తెలిపింది. అందువల్ల ప్రస్తుత కేసులో నిందితుని అరెస్ట్‌ను అక్రమంగా ప్రకటించలేమంది. అందువల్ల అరెస్ట్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తెలిపింది. పిటిషనర్ లేదా నిందితుడు వారికి చట్ట ప్రకారం ఉన్న ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవాలని తెలిపింది.

వైఎస్ జగన్ పిటిషన్‌పై విచారణ జనవరి 9కి వాయిదా

- మంత్రి నారాయణ న్యాయవాదిపై హైకోర్టు అసహనం
- కౌంటర్ దాఖలుకు మరింత సమయం కోరడంపై అసహనం
- జనవరి 9 లోగా కౌంటర్ దాఖలు చేయాల్సిందేనన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ బడా నేతల భూదాహంపై 'సాక్షి' దినపత్రిక 2016లో ఇచ్చిన వరుస కథనాలపై అప్పటి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అప్పట్లో దాఖలు చేసిన పరువు నష్టం కేసును కొట్టేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి 9కి వాయిదా వేసింది. ఆరోజు ఈ వ్యాజ్యంపై తుది విచారణ జరుపుతామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాక్షిలో వచ్చిన కథనాలకు తనను బాధ్యుడిగా చేస్తూ నారాయణ దాఖలు చేసిన పరువు నష్టం కేసును కొట్టేయాలని కోరుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాఖలు చేసిన ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. అయితే, కౌంటర్ దాఖలుకు మరింత సమయం కావాలని నారాయణ తరపు న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు కోరడంపై న్యాయమూర్తి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కౌంటర్ దాఖలుకు గతంలోనే తగినంత సమయం తీసుకున్నారని, మరింత గడువేమిటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇటీవలే వకాలత్ దాఖలు చేశానని సుబ్బారావు చెప్పగా.. నారాయణకు నోటీసులిచ్చి చాలా రోజులైందని, వకాలత్ దాఖలుకు 3 వారాల సమయం పట్టిందా అని ప్రశ్నించారు. జగన్ న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. తమ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అన్నారు. నారాయణకు గతంలోనే నోటీసులు ఇచ్చామని, ఇప్పటికీ కౌంటర్ దాఖలు చేయలేదని చెప్పారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. ఇదే చివరి అవకాశమని నారాయణకు స్పష్టం చేశారు. జనవరి 9 లోపు కౌంటర్ దాఖలు చేసి కాపీని జగన్ న్యాయవాదికి అందజేయాలని సుబ్బారావును ఆదేశించారు.

తిరుమలలో నిర్మాణాలను నియంత్రించాలి

- ఇష్టమొచ్చినట్టు అనుమతులు ఇవ్వొద్దని హైకోర్టు ఆదేశం
- తిరుపతిలో ఒబెరాయ్ గ్రూప్ హోటళ్ల నిర్మాణంపై నోటీసులు

సాక్షి, అమరావతి: తిరుమలలో విచక్షణారహితంగా చేస్తున్న నిర్మాణాలను నియంత్రించాలని హైకోర్టు అభిప్రాయపడింది. ఇష్టమొచ్చినట్టుగా కాకుండా ఎంత వరకు నిర్మాణాలు అవసరమో అంత వరకే అనుమతించాలని చెప్పింది. తిరుపతిలో ఒబెరాయ్ గ్రూపు హోటల్స్ చేపడుతున్న ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణంపై టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం, తుడాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్ ఒబెరాయ్ గ్రూప్, ట్రైడెంట్ ఫైవ్ స్టార్ హోటల్స్ ఒబెరాయ్ గ్రూప్, ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్ ఎండీలకు సైతం నోటీసులు ఇచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రతివాదుల వాదన వినకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది.



తదుపరి విచారణను జనవరి 8కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి గ్రామీణ మండలం పేరూరు గ్రామం పరిధిలో ఒబెరాయ్ గ్రూపు ఎలాంటి అనుమతుల్లేకుండా ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణం చేపడుతోందంటూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్, ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి, మరొకరు హైకోర్టులో వేర్వేరుగా రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయగా.. సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది.

మా నిర్ణయం మేరకే న్యాయమూర్తుల సంఖ్య పెంపు

సాక్షి, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంచడమన్నది తాము పరిపాలనపరంగా తీసుకోవాల్సిన నిర్ణయమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై పిల్ అవసరం లేదంది. న్యాయమూర్తుల సంఖ్య పెంపుపై 2022లోనే ప్రభుత్వానికి లేఖ రాశామంది. ఆ రోజుకి హైకోర్టులో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అప్పటి ప్రభుత్వం అంత సుముఖత చూపలేదని, మరోసారి ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పింది. ఇందులో ఇతరుల జోక్యం అవసరం లేదంటూ పిల్‌ను పరిష్కరించింది. తగినంత మంది న్యాయమూర్తులు లేకపోవడం వల్ల పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతోందని, జడ్జిల సంఖ్యను పెంచేలా ఆదేశాలివ్వాలని న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై బుధవారం విచారణ జరిపిన సీజే ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

పరిటాల రవి హత్య కేసులో దోషులకు బెయిల్

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర హత్య కేసులో దోషులైన పి.నారాయణరెడ్డి, రేఖమయ్య, బి.రంగనాయకులు, వడ్డే కొండ, ఓబిరెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. వీరంతా 18 ఏళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్నందున, నిబంధనల ప్రకారం బెయిల్‌కు అర్హులంటూ ఓబిరెడ్డి తరపు న్యాయవాది ఎ.స్వరూపారెడ్డి చేసిన వాదనతో హైకోర్టు ఏకీభవించింది. వారికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. క్షమాభిక్ష కోరుతూ అధికారులకు దరఖాస్తు చేసుకునేందుకు పిటిషనర్లకు వెసులుబాటునిచ్చింది. క్షమాభిక్ష దరఖాస్తును 4 వారాల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. ఈ ఐదుగురు ఒక్కొక్కరు రూ.25 వేల మేర రెండు పూచీకత్తులు సమర్పించాలంది. ప్రతి సోమవారం ఉదయం 11 గంటలకు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ ముందు హాజరయ్యేలా చూడాలని మేజిస్ట్రేట్‌కు సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి, జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జునరావు ధర్మాసనం ఈ నెల 13న ఉత్తర్వులు జారీ చేసింది.

హెల్మెట్ తప్పనిసరి

లేకుంటే భారీ మూల్యం తప్పదని గట్టి సందేశం పంపండి

- అక్కడికక్కడే వాహనాలు ఆపి జరిమానాలు విధించండి
- రాష్ట్ర పోలీసుల తీరును తప్పుపడుతూ గట్టిగా ఆదేశించిన హైకోర్టు
- వెనక కూర్చొన్న వారూ హెల్మెట్ ధరించాల్సిందే
- విజయవాడ వాహనదారుల్లో క్రమశిక్షణ లోపించింది
- చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిందే
- ఇందుకు ఏం చేస్తున్నారో అఫిడవిట్ వేయాలని ఆదేశం
- తదుపరి విచారణ జనవరి 8వ తేదీకి వాయిదా



సాక్షి, అమరావతి: మోటారు వాహన చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్న గట్టి సందేశం వాహనదారులందరికీ పంపాలని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. వాహనదారులు చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే వారిని అక్కడికక్కడే ఆపి, వెంటనే జరిమానాలు విధించాలని తేల్చి చెప్పింది. వారిని ఎంతమాత్రం ఉపేక్షించవద్దంది. సీసీ కెమెరాలపై ఆధార పడటం తగ్గించాలంది. ఉల్లంఘనలకు పాల్పడే వారిని అక్కడికక్కడే ఆపితే, రెండు నెలల్లో పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వస్తుందని, ఇందుకు తాము గ్యారంటీ అని చెప్పింది. కేవలం వాహనం నడిపే వారు మాత్రమే కాకుండా వెనుక కూర్చొన్న వారు కూడా హెల్మెట్ ధరించడాన్ని తప్పనిసరి చేయాలని తేల్చి చెప్పింది. జరిమానా మొత్తాన్ని 90 రోజుల్లో చెల్లించకుంటే వాహనాన్ని జప్తు చేయవచ్చన్న నిబంధనను ఎందుకు అమలు చేయడం లేదని పోలీసులను ప్రశ్నించింది. లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే ఆ వాహనాన్ని ఎందుకు జప్తు చేయడం లేదని నిలదీసింది. విజయవాడ వాహనదారుల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ ఎంతమాత్రం లేదని దెప్పి పొడిచింది. ప్రపంచంలో ఇదే చివరి రోజు అన్నంత వేగంగా, విపరీతమైన హారన్ శబ్దాలతో దూసుకెళుతున్నారని, వారిని ఒక్క పోలీసు కూడా ఆపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. 99 శాతం మంది హెల్మెట్ లేకుండానే వాహనాలు నడుపుతున్నారని హైకోర్టు పేర్కొంది.

పట్టించుకోవడం లేదు కాబట్టే ఉల్లంఘనలు

పోలీసులు చేయాల్సిన పని చేయడం లేదు కాబట్టే, వాహనదారులు యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలీసులు హెల్మెట్ ధారణ నిబంధనను కఠినంగా అమలు చేసి ఉంటే, ఈ నాలుగు నెలల్లో మృతి చెందిన 677 మంది వాహనదారుల్లో కొందరైనా బతికి ఉండేవారని పేర్కొంది. రాష్ట్రంలో వాహన ప్రమాదాలు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నాయంది. ఢిల్లీ, ఛండీగఢ్‌లలో ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులను అక్కడికక్కడే పోలీసులు ఆపి చలాన్లు వేస్తున్నారని తెలిపింది. వాహనం నడిపేటప్పుడు హైబీమ్ (ఎక్కువ కాంతినిచ్చే ఎల్ఈడీ లైటింగ్) వాడినా జరిమానా విధిస్తున్నారని, తనకు సైతం అలాగే ఓసారి జరిమానా విధించారని, దీంతో తాను అక్కడికక్కడే జరిమానా చెల్లించి వెళ్లానని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ తెలిపారు. హైబీమ్ వాడటం వల్ల చాలా మంది చనిపోతున్నారని వివరించారు. ఆటోవాలాలు పరిమితికి మించి స్కూలు పిల్లలను ఆటోల్లో ఎక్కించుకుంటున్నారని, ఇలాంటి సందర్భాల్లో కూడా పోలీసులు స్పందించడం లేదని ధర్మాసనం తెలిపింది. మోటారు వాహన చట్ట నిబంధనలను ముఖ్యంగా హెల్మెట్ నిబంధనను అమలు చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని పోలీసులను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లాల వారీగా తమ ముందు ఉంచాలంది. రోడ్లపై వాహనాలను తనిఖీ చేసేందుకు ఎంత మందితో బృందాలను ఏర్పాటు చేస్తున్నారో కూడా చెప్పాలని ఆదేశించింది. పూర్తి వివరాలతో పాటు చట్ట నిబంధనల అమలుకు తగిన ప్రతిపాదనలతో అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారాన్ని ఎంత మాత్రం తేలిగ్గా తీసుకోవద్దని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను జనవరి 8కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదు?

కేంద్ర మోటారు వాహన సవరణ చట్ట నిబంధనలను అమలు చేయడం లేదని, చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన వారికి జరిమానాలు విధించడం లేదని, దీంతో పెద్ద సంఖ్యలో వాహన ప్రమాదాలు, మరణాలు చోటుచేసుకుంటున్నాయంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ట్రాఫిక్ సహా మోటారు వాహన చట్ట నిబంధనల కింద ఇతర విధులు నిర్వర్తించే పోలీసులు, ఇతర అధికారులు బాడీ ఓర్న్ కెమెరాలను ధరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై ఈ ఏడాది జూన్‌లో విచారణ జరిపిన సీజే ధర్మాసనం, ట్రాఫిక్ నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. తమ ఆదేశాల అమలుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ధర్మాసనం, దీనిపై వివరణ ఇచ్చేందుకు ట్రాఫిక్ ఐజీ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా, డీజీపీ కార్యాలయంలో ఐజీ (లీగల్)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆకే రవికృష్ణ ధర్మాసనం ముందు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ధర్మాసనం స్పందిస్తూ, వాహన ప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగించే స్థాయిలో ఉన్నాయంది. ఈ ఏడాది జూన్‌లో ట్రాఫిక్ నిబంధనల విషయంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, హెల్మెట్ నిబంధనను తప్పనిసరి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, వాటిని ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని రవికృష్ణను ప్రశ్నించింది. ఇకపై నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని రవికృష్ణ చెప్పారు. పత్రికలు, టీవీలు, ఎఫ్ఎం రేడియోలు, సైన్ బోర్డులు, సినిమా హాళ్లలో ప్రకటనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను చేపట్టాలని ధర్మాసనం ఆదేశించింది.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 19-12-2024

‘నీపై నీకు నమ్మకం ఉంటే అద్భుతం సాధ్యం అవుతుంది’ అనే మాట మెజిషియన్ లక్ష్మికి తెలియనిదేమీ కాదు. ఆ నమ్మకం వల్లే గానం నుంచి ఇంద్రజాలం వరకు ఎన్నో విద్యల్లో ప్రావీణ్యం సాధించింది ‘ఆహా!’ అనిపిస్తుంది...



లక్ష్మీ ప్రసన్నదేవి

● మహిళేంద్రజాలం

అ బ్ర క ద బ్రలోనూ ఆమె ముద్ర

అయిదు అంగుళాల పదునైన మేకును సుత్తితో ముక్కు లోనికి పంపుతూ లక్ష్మి చేసే సాహసం చూసి ప్రేక్షకుల ఒళ్లు గగుర్పొడుస్తుంది. అటూ ఇటూ కదులుతూ చేతిలోని గొడుగును ఆడిస్తూ ఒకదాని తరువాత ఒకటి చొప్పున అలవోకగా 30 కు పైగా గొడుగులు, స్వింగ్‌ఫ్లవర్స్ తీయడం చూస్తే ఔరా అనిపిస్తుంది. నంబర్స్‌తో మెంటలిజం మ్యాజిక్ చేసి అవాక్కు చేయడమే కాదు, వస్తువుల్ని మాయం చేయడం, పుట్టించడం, మనిషిని రెండు భాగాలు చేసినట్టు భ్రమింప చేయడం... ఇలా ఆమె చేసే ఇంద్రజాలం ప్రేక్షకులని కట్టిపడేస్తుంది.

ఇంద్రజాలంతోనే కాదు తన గానంతో కూడా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది లక్ష్మి.

పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన దండ లక్ష్మీప్రసన్నదేవి భర్త రాము సింగర్, డ్యాన్సర్, మిమిక్రీ ఆర్టిస్టు, మెజీషియన్, ఎంటర్‌టైనర్‌గా సుపరిచితుడు. భర్తతోపాటు ఎన్నో ప్రాంతాలకు వెళుతుండేది లక్ష్మి. అలా వెళ్లడం ద్వారా వివిధ కళా రూపాలకు ప్రేక్షకుల నుంచి వచ్చే అపురూప స్పందనను ప్రత్యక్షంగా చూసే అవకాశం వచ్చింది.

రెండేళ్ల క్రితం భర్తతో కలిసి కేరళలో జరిగిన మ్యాజిక్ పోటీలకు వెళ్లింది లక్ష్మి. ఆ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క మహిళ కూడా లేకపోవడం గమనించింది.

మహిళలు కనిపించని ఆ లోటే తనను మ్యాజిక్‌పై ఆసక్తి పెంచుకునేలా చేసింది.

‘నేను మ్యాజిక్ నేర్చుకోవాలనుకుంటున్నాను’ తన మనసులో మాటను భర్తకు చెప్పింది.

అతడు ఎగతాళిగా నవ్వి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోగానీ ‘భేషుగ్గా నేర్చుకోవచ్చు’ అనడమే కాదు ఇల్లే పాఠశాలగా ఇంద్రజాల విద్య నేర్పడం మొదలుపెట్టాడు.

భర్త నుంచి మ్యాజిక్ ట్రిక్స్ నేర్చుకున్న లక్ష్మి చేసిన మొదటి మ్యాజిక్ షోకు మంచి స్పందన వచ్చింది.

తనమీద తనకు నమ్మకం వచ్చింది.

ఇక అప్పటి నుంచి ‘మ్యాజిక్’ తని ఇంటి పేరుగా మారింది. బర్త్‌డే పార్టీల నుంచి మ్యారేజ్ వరకు రకరకాల ఫంక్షన్‌లలో ఇప్పటివరకు వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చింది. గుంటూరులో జరిగిన ‘అమరావతి మ్యాజిక్ ఫెస్టివల్’ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతిని గెలుచుకుంది. తాజ్ మ్యాజిక్ సొసైటీ ఆగ్రాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకుంది.

దేశవ్యాప్తంగా మేకు మ్యాజిక్ చేస్తున్న ఏడుగురు మెజిషీయన్‌లలో ఏకైక మహిళను తానే అంటుంది లక్ష్మి.

పాటలు పాడటంలో నైపుణ్యాన్ని సాధించిన లక్ష్మి యాంకర్‌గా, సింగర్‌గా వెయ్యికి పైగా షోలు చేసింది.

‘ఇంకా ఎన్నో కళలు నేర్చుకోవాలని ఉంది. దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇవ్వాలని ఉంది’ అంటుంది లక్ష్మీ ప్రసన్నదేవి.

– పెనుపోతుల విజయ్‌కుమార్, సాక్షి, భీమవరం
ఫొటోలు: బడేటి తిరుపతి వెంకటేశ్వరరావు

ఆ చప్పట్లు చాలు...



ప్రేక్షకులలో ఒకరిగా ఎంతోమంది కళాకారుల ప్రదర్శనలను చూసి చప్పట్లు కొట్టాను. ఇప్పుడు నేను ప్రదర్శన చేస్తుంటే అలాంటి చప్పట్లు వినడం అపురూపంగా ఉంది. లక్షలు, కోట్లు అక్కర్లేదు. ఆ చప్పట్లు చాలు కళాకారుడిలో నిత్య ఉత్సాహం నింపడానికి. కళకు ప్రాంతం, జెండర్ అనే తేడా తెలియదు. కళాకారులలో ఏ కొంచెం ప్రతిభ ఉన్నా ప్రపంచం సొంతం చేసుకుంటుంది. గృహిణిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేను ‘ఇప్పుడు ఇవన్నీ ఎందుకు!’ అనుకోలేదు. ‘నేను ఎందుకు నేర్చుకోకూడదు’ అని మాత్రమే అనుకున్నాను. అలా అనుకోవడం వల్లే మెజిషియన్‌గా, సింగర్‌గా, యాంకర్‌గా నాకంటూ ఎంతో కొంత గుర్తింపు వచ్చింది. మరిన్ని కళలు నేర్చుకొని, దేశవ్యాప్తంగా మరిన్ని ప్రదర్శనలు ఇవ్వాలనుకుంటున్నాను.

– దండ లక్ష్మీప్రసన్నదేవి

● న్యూస్ మేకర్

ఆస్కార్ లేడీస్

ఆస్కార్ బరిలో మహిళలే ఆశాదీపాలుగా ఉన్నారు. నామినేషన్ దక్కుతుందనుకున్న ‘లాపతా లేడీస్’ పోటీ నుంచి తప్పుకుంటే యు.కె.ఎంట్రీగా వెళ్లిన ‘సంతోష్’ బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్‌గా షార్ట్‌లిస్ట్ అయ్యింది. సంధ్యా సూరి దీని దర్శకురాలు. గునీత్ మోంగా తీసిన ‘అనూజ’ బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్‌ఫిల్మ్ పట్టికలో నిలిచింది. స్మృతి ముంద్రా తీసిన ‘ఐయామ్ రెడీ, వార్డన్’ బెస్ట్ షార్ట్‌ఫిల్మ్ డాక్యుమెంటరీగా బరిలో మిగిలింది. ఈ మూడింటిలో దేనికి అవార్డు వచ్చినా అది మనకు ఘనతే!

ఆస్కార్ బరిలో భారతీయ స్త్రీ జీవన గాథలు పోటీలో నిలబడ్డాయి. భారతీయ స్త్రీల జీవనం వేయి సముద్రాల విశాలమైనది. వందల హిమాలయాలను తిరగేసి చూసినంత లోతైనది. ఏరుకోవాలేగాని వాటి నుంచి ఎన్నో కథలు. ఆ కథలను ఏరుకున్న దర్శకులు ఈసారి ఆస్కార్ బరిలో షార్ట్ లిస్ట్ అయ్యారు. ఈ షార్ట్‌లిస్ట్‌ల నుంచి నామినేషన్స్ ఖరారు అవుతాయి. వచ్చే సంవత్సరం మార్చి 2న జరిగే ఆస్కార్ వేడుక వేడి మొదలైంది. 97వ అకాడెమీ అవార్డుల్లో భాగంగా సోమవారం పది విభాగాలలో షార్ట్ లిస్ట్ అయిన పోటీదారులను ప్రకటించింది అకాడెమీ. యు.కె. నుంచి నామినేట్ అయిన ‘సంతోష్’ బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్‌లో నిలిస్తే, గునీత్ మోంగా నిర్మించిన ‘అనూజ’ బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్‌ఫిల్మ్‌లో, స్మృతి ముంద్రా తీసిన ‘ఐయామ్ రెడీ, వార్డన్’ బెస్ట్ షార్ట్‌ఫిల్మ్ డాక్యుమెంటరీ విభాగంలో నిలిచింది. ఈ దర్శకులు, నిర్మాతలు గాని లేదా కథాంశాలుగాని భారతీయమైనవి.



● సంధ్యా సూరి

స్త్రీలపై హింస: భారతదేశంలో చోటు చేసుకుంటున్న స్త్రీలపై హింసను ‘సంతోష్’ అనే ఫీచర్ ఫిల్మ్‌గా తీసింది సంధ్యా సూరి. భారతదేశంలోని కులాహంకారం, అవినీతి, సర్వసాధారణ హింస, ఇస్లామోఫోబియా స్త్రీల పాలిట ఎలా ప్రాణాంతకం అవుతున్నదో ‘సంతోష్’లో చూపింది సంధ్యా సూరి. బాల్యంలోనే ఇంగ్లాండ్‌కు వలస వెళ్లి డార్లింగ్‌టన్‌లో స్థిరపడ్డ సంధ్యా సూరి మేథమెటిక్స్‌లో పట్టా పుచ్చుకుని కొన్నాళ్లు జపాన్‌లో లెక్కల టీచర్‌గా పని చేసింది. అయితే సినిమాల మీద ఆసక్తితో వెనక్కు వచ్చి డాక్యుమెంటరీలు తీసింది. ‘ఐ ఫర్ ఇండియా’ (2005) అనే డాక్యుమెంటరీలో ఇంగ్లాండ్ వలస వచ్చిన భారతీయుల ఇక్కట్లను చూపింది. ‘ఫీల్డ్’ (2018) డాక్యుమెంటరీలో హరియాణాలో ఉండే మహిళా రైతుల ఇంటిలోపలి, ఇంటి బయటి సంఘర్షణలను చూపింది. ఇప్పుడు ‘సంతోష్’తో ఆమె అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ‘సంతోష్’లో ఒక మహిళా పోలీసు తన డ్యూటీలో భాగంగా ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొందనేది కథ. ‘ఈ సినిమా పారిస్‌లో మూడు నెలల పాటు ఆడింది. లక్షన్నర మంది చూశారు. పరభాషా చిత్రం ఇంత బాగా ఆడటం అరుదు. యు.కెలో భారత్‌లో ఇలాగే ఈ సినిమా చూడాలని నా కోరిక’ అంది సంధ్యా సూరి.



● గునీత్ మోంగా

అనూజ: అమెరికాలో ఉంటూ ఆస్కార్ స్థాయి సినిమాలు తీస్తున్న నిర్మాత గునీత్ మోంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా అమెరికన్ దర్శకుడు ఆడమ్ జె గ్రేవ్స్ తీసిన ‘అనూజ’ అనే లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ అనూజ అనే తొమ్మిదేళ్ల అమ్మాయి ఆమె చెల్లెలు పాలక్ అనే ఏడేళ్ల అమ్మాయి కలిసి రెడీమేడ్ గార్మెంట్ ఫ్యాక్టరీలలో ఎలా బాల కార్మికులుగా పని చేసి కష్టాలు అనుభవిస్తున్నారో చూపుతుంది. అనూజకు చదువుకునే అవకాశం వచ్చినా ఆ నిర్ణయం తీసుకోవడానికి ఆమె ఎన్నో ఆలోచించాల్సి వస్తుంది. భారతదేశంలోని పేదరికం ఇంకా పిల్లల్ని ఎలా వెట్టి కార్మికులుగా మారుస్తున్నదో ఈ షార్ట్‌ఫిల్మ్ చూపుతుంది.



● స్మృతి ముంద్ర

అయామ్ రెడీ, వార్డన్: అమెరికాలోని టెక్సాస్‌లో జాన్ హెన్రీ అనే దొంగ పదేళ్ల క్రితం ఒక షాపును దొంగిలించే క్రమంలో అడ్డొచ్చిన క్యాషియర్‌ను విచక్షణా రహితంగా పొడిచి చంపాడు. కోర్టు అతనికి మరణశిక్ష విధించింది. అయితే అది ఇంకా అమలు కాలేదు. కాని ఈ పదేళ్లలో అతని మానసిక స్థితి, హత్య చేసేప్పటి స్థితి... ఆ పరిణామ క్రమంలో అతని దృష్టి కోణం, సమాజ దృష్టికోణం వీటన్నింటిని చర్చించింది స్మృతి ముంద్రా తన ‘అయామ్ రెడీ వార్డన్’ షార్ట్ డాక్యుమెంటరీలో. మరణశిక్ష అవసరమా కాదా అనే ప్రశ్నకు జవాబు ప్రేక్షకులకే వదిలిపెడుతుంది. ప్రసిద్ధ ఫిల్మ్ మేకర్ జగ్ ముంద్ర కుమార్తె అయిన స్మృతి ముంద్ర ముంబైలోను, అమెరికాలోను పెరిగింది. నిర్మాతగా, దర్శకురాలిగా అనేక సినిమాలు ప్రేక్షకుల ముందుకు తెచ్చింది. ఈ ముగ్గురు మహిళలు ఆస్కార్ సాధించాలని ఆశిద్దాం.

● మన(సు)లో మాట

మళ్లీ పెళ్లి చేయడం పొరపాటేనా!

డాక్టరుగారూ! మా తమ్ముడు బయట అందరితో చాలా బాగా ఉంటాడు. ఇంట్లో మాత్రం ఎప్పుడూ భార్యతో కొట్లాటలే! భార్యను విపరీతంగా అనుమానిస్తాడు. చాలామందితో సంబంధాలున్నాయని తిట్టడం కొట్టడం కూడా చేశాడు. నిజానికి వాడి భార్య చాలా మంచి అమ్మాయి. ఈ బాధలు భరించలేక మూడేళ్ళ క్రిందట ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. సంవత్సరం కిందట మళ్ళీ మా పెద్దలు రెండో వివాహం చేశారు. మళ్ళీ అదే విధంగా ఈమెను కూడా అనుమానించి వేధిస్తున్నాడు. మావాడు ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడో మాకర్థం కావడం లేదు. ఈమె కూడా వీడు పెట్టే బాధలు తట్టుకోలేక ఏమైనా చేసుకుంటుందేమోనని మాకు భయంగా ఉంది. మా తమ్ముడికి ఇలా మళ్ళీ పెళ్ళి చేయడం మా తప్పేనంటారా! అసలు మావాడెందుకు ఇలా చేస్తున్నాడో దయచేసి చెప్పండి.

– **పద్మావతి**, గిద్దలూరు

మీ తమ్ముడు ‘డెల్యూజనల్ డిసార్డర్’ అనే మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు మీరు రాసిన దాన్ని బట్టి అర్థమవుతుంది. దీనిని ‘ఒథెల్లో సిండ్రోమ్’ అని కూడా అంటారు. షేక్స్పియర్ రాసిన ‘ఒథెల్లో’ నాటకంలోని ఇతివృత్తం కూడా ఇలాగే ఉంటుంది. ఎలాంటి ఆధారాలు లేకున్నా, వాస్తవం కాకపోయినా జీవిత భాగస్వామి శీలాన్ని శంకించి ఇలా వేధించడం ఒక విధమైన మానసిక జబ్బే! మెదడులోని కొన్ని రసాయనిక చర్యలవల్ల, వారసత్వంగా వచ్చే జీన్స్ ప్రభావం వల్లనూ కొందరికి ఈ వ్యాధి వస్తుంది. ఇది కూడా ఒక మానసిక రుగ్మత అని తెలియక మీరు మీ తమ్ముడికి మళ్లీ వివాహం చేసి పెద్ద పొరపాటు చేశారు. మీ మరదలు చాలా మంచిదని మీరే చెబుతున్నారు కదా... మొదట్లోనే మీవాడిని మానసిక వైద్యునికి చూపించి తగిన చికిత్స చేయించి ఉంటే, మీ మరదలు అలా ఆత్మహత్య చేసుకొని ఉండకపోవచ్చు. ఏమైనా, మీ తమ్ముడికి వచ్చే ఈ అనుమానాలను తగ్గించేందుకు, మంచి మందులు, ఇతర చికిత్సా పద్ధతులు ఉన్నాయి. ఇంకో అఘాయిత్యం జరగక ముందే వెంటనే మీ తమ్ముణ్ణి దగ్గర్లోని సైకియాట్రిస్టుకు చూపించి వైద్యం చేయిస్తే మీ వాడు పూర్తిగా ఆ భ్రమలు, భ్రాంతుల నుండి బయటపడి రెండో భార్యతో సంతోషంగా సంసారం చేయగలడు. ఆలస్యం చేయకుండా మానసిక వైద్య చికిత్స చేయించండి.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● ముగ్గు ముచ్చట





వకుళాభరణం స్నేహలత,
రామగుండం,
పెద్దపల్లి జిల్లా

21 చుక్కలు,
5 వరసలు,
5 వచ్చే వరకు,
సరి చుక్క.





సుజాత పి.వి.ఎల్
సైనిక్‌పురి,
సికింద్రాబాద్

20 చుక్కలు,
4 వరసలు,
4 వచ్చే వరకు,
సరి చుక్క.

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

● ట్రాన్స్ జెండర్

జనారణ్యం గెలిచి అరణ్యానికి రక్షణగా...

‘ఆత్మహత్య తప్ప నాకు మరోదారి లేదు’ అనుకున్న అమ్మాయి ఇప్పుడు సాహసాల దారిలో ప్రయాణం చేస్తోంది. ‘ఇతరులతో పోల్చితే నేను జీరో. ఏమీ సాధించలేను’ అనుకున్న అమ్మాయి ఇప్పుడు హీరోగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది. ప్రభుత్వం ద్వారా ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ అందుకున్న తొలి వ్యక్తిగా గుర్తింపు పొందిన విజయ వాసవే ఇప్పుడు మహారాష్ట్ర అటవీశాఖ ఫారెస్ట్ గార్డుగా నియమితురాలైన తొలి ట్రాన్స్‌జెండర్ మహిళగా చరిత్ర సృష్టించింది...



● విజయ వాసవే

గత సంవత్సరం ఉద్యోగాల నోటిఫికేషన్‌ను చూసి దరఖాస్తు చేసింది విజయ. ఇలా దరఖాస్తు చేసిన ఏకైక ట్రాన్స్ ఉమన్ ఆమె. దరఖాస్తు మాట ఎలా ఉన్నా... ఆమె ప్రయాణంలో అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి.

‘ఈ ఉద్యోగం నీలాంటి వాళ్ల కోసం కాదు’ అన్నట్లుగా ఉండేవి కొందరి మాటలు. అలాంటి మాటలు తనని పట్టుదలగా మరింత ముందుకు నడిపించాయి. సాంకేతిక అడ్డంకులను అధిగమించడానికి హైకోర్టు వరకు వెళ్లింది. ఉద్యోగాలు చేయడం విజయకు కొత్తేమీ కాదు... అయితే తాను దరఖాస్తు చేసిన ఉద్యోగానికి రాత, శారీరక పరీక్షలలో విజయం సాధించాలి. ఈ సవాలును అధిగమించడానికి జల్గావ్‌లోని దీప్‌స్తంభ్ ఫౌండేషన్ విజయకు సహాయపడింది. ఇద్దరు సీనియర్ ఫారెస్ట్ అధికారులు ఆమెకు తగిన సూచనలు ఇచ్చారు.

ఎన్నో సవాళ్లను అధిగమించి విజయం సొంతం చేసుకున్న విజయ ఇప్పుడు నందుర్బార్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉద్యోగ విధులు నిర్వహిస్తోంది.

గిరిజన కుటుంబంలో పుట్టిన విజయ ఆశ్రమ పాఠశాలలో చదువుకునే రోజులలో ఎంతోమంది నుంచి తీవ్రమైన వెక్కిరింపులు, వేధింపులు ఎదుర్కొనేది. తోటి విద్యార్థులే కాదు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎగతాళిగా మాట్లాడేవారు. మానసిక, శారీరక వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వస్తుండేవి.

నాసిక్‌లో కాలేజీ స్టూడెంట్‌గా ఉన్నప్పుడు ఒక సభకు హాజరైంది.

ఆ సభలో బిందుమాధవ్ ఖిరే అనే ఉద్యమ కార్యకర్త ఉపన్యాసం తన జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది.

‘ఈ సభకు హాజరు కావడానికి ముందు నాలో ఎంతో ఆత్మన్యూనత ఉండేది. నేను ఏదీ సాధించలేను అనే అకారణ భయం ఉండేది’ అంటుంది విజయ గతాన్ని గుర్తుతెచ్చుకుంటూ. ‘బతుకంటే నిత్య పోరాటం’ అనే సత్యాన్ని తెలుసుకున్న విజయ ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తరువాత పుణెలోని కార్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ‘మాస్టర్స్ ఇన్ సోషల్ వర్క్’లో అడ్మిషన్ పొందింది.

నందుర్బార్ ప్రాంతంలో ‘ఈ అమ్మాయి మొదట అబ్బాయట’ అంటూ ఆశ్చర్యంగా ప్రజలు మాట్లాడుకోవడం మాట ఎలా ఉన్నా... విజయ స్ట్రగుల్ గురించి తెలుసుకున్న తరువాత ‘బేష్’ అంటున్నారు.

తన జీవితంలో ఎక్కువ భాగం పుణెలాంటి కాస్మోపాలిటన్ సిటీలో గడిపిన విజయకు అపరిచిత ప్రాంతంలో ఫారెస్ట్ గార్డ్‌గా విధులు నిర్వహించడం సవాలు కావచ్చు. అయితే ఆమెకు సవాలు కొత్త కాదు. వాటిని అధిగమించడం కూడా కొత్తకాదు. ఒకప్పుడు తనలాగా ఆత్మన్యూనతతో బాధపడుతున్న వారిలో, ఆశ కొడిగడుతున్న వారిలో సోషల్ మీడియా వేదికగా ధైర్యాన్ని ఇస్తోంది, ఉత్సాహాన్ని నింపుతుంది విజయ వాసవే.

బాటిల్ నుంచి బ్యాటిల్ వరకు...

బాల్యం అంటే బంగారు కాలం. అయితే నా బాల్యంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. చీకట్లో ఉంటే చీకటే కనిపిస్తుంది. వెలుగును చూడాలనే పట్టుదల ఉంటే చీకటి దూరం అవుతుంది. నేను సాధించింది చిన్న విజయమా, పెద్ద విజయమా అనేదాని కంటే ప్రతికూల పరిస్థితులను తట్టుకొని కూడా ముందుకువెళ్లవచ్చు అని నిరూపించిన విజయం. ఒకప్పుడు ఫ్లోర్ క్లీనింగ్ బాటిల్ ఎప్పుడూ నాకు అందుబాటులో ఉండేలా చూసుకునేదాన్ని. అవమానాలు తట్టుకోలేనంత బాధ నాలో ఉన్నప్పుడు బాటిల్ మూత తీసి తాగాలని అనుకున్నాను. మూత తీసే సందర్భాలు ఎన్నో వచ్చినా నాకు నేను ధైర్యం చెప్పుకునేదాన్ని. చివరికి నాకు బాటిల్‌తో పనిలేకుండా పోయింది. ఇప్పుడు బ్యాటిల్‌పై మాత్రమే నా దృష్టి.

– విజయ వాసవే

మోడ్రన్ లైఫ్ ఎకో స్టయిల్

ఇది ఈశాన్య రాష్ట్రాల మహిళల విజయం. వారు ప్లాస్టిక్, ఇతర ఫైబర్‌లకు ప్రత్యామ్నాయంగా వెదురును ఉపయోగిస్తున్నారు. సంప్రదాయ లాంగ్‌పై పోటరీని క్యాండిల్ తయారీకి మలుచుకున్నారు. పంటను నిల్వచేయడానికి కరెంటుతో పని లేని ప్రత్యామ్నాయాన్ని కనుక్కున్నారు. తమ దగ్గర దొరికే వస్తువులను అది కూడా పర్యావరణహితమైన వస్తువులు, వాడి పారేసిన తర్వాత త్వరగా మట్టిలో కలిసిపోయే వస్తువులతో మోడరన్ లైఫ్‌స్టయిల్‌ని ఎకో ఫ్రెండ్లీగా మారుస్తున్నారు.

నాటి కుండలో నేటి క్యాండిల్

మణిపూర్ రీజియన్‌లో విస్తరించిన హస్తకళలలో లాంగ్‌పై ఒకటి. నల్లటి మట్టితో కుండల తయారీ అన్నమాట. రిన్‌ఫోన్ అనే మహిళ లాంగ్‌పై కళను మోడరన్ లైఫ్ స్టయిల్‌కి అనుగుణంగా మలుచుకుంది. పరిమళాలను వెదజల్లే సోయా వ్యాక్స్ క్యాండిల్ జార్‌లు తయారు చేసింది. పారాఫిన్ వ్యాక్స్‌కు బదులుగా సోయా వ్యాక్స్‌ను ఉపయోగిస్తోందామె. సువాసన కోసం పర్యావరణానికి ఏ మాత్రం హానికరం కాని వస్తువులనే వాడుతోంది. ఆ ఉత్పత్తులన్నీ పర్యావరణహితమైనవే కావడంతో వీటికి ప్రత్యేకమైన ఆదరణ లభిస్తోంది. ఇలాంటి ప్రయోగాలను చేస్తోన్న రిన్‌ఫోన్ వెంచర్ ‘అక్టోబర్ పంప్‌కిన్’ ను రాజస్థాన్‌లోని బిట్స్ పిలానీ విద్యాసంస్థ ‘ఉమెన్‌ప్రెన్యూర్ ఫర్ భారత్ 2.0 ప్రోగ్రామ్’ కింద 15 లక్షల ప్రోత్సాహకానికి ఎంపిక చేసింది. తాంగ్‌ఖుల్ ఆదివాసీ తెగకు చెందిన రిన్‌ఫోన్ తన కుటుంబంలో మాత్రమే కాదు, ఆ తెగలోని తొలి తరం ఎంటర్‌ప్రెన్యూర్.



● రిన్‌ఫోన్

పంటకు లైఫ్



● బినోలిన్ సైయిమ్‌లే

మేఘాలయకు చెందిన వెస్ట్ ఖాసీ హిల్స్‌లో నివసించే బినోలిన్ సైయిమ్‌లే జీరో ఎనర్జీ స్టోరేజ్ యూనిట్స్ తయారీలో విజయవంతమైంది. కాల్చిన ఇటుకలు, నదిలో దొరికే ఇసుక, వెదురు, సీజీఐ షీట్స్, ఇనుపమేకులు, సిమెంట్, గులకరాళ్లు ఉపయోగించి రైతులకు ఉపయోగపడే స్టోరేజ్ కంటెయినర్స్ తయారు చేసింది. ఇక్కడ రైతుల ప్రధానపంట కూరగాయల సాగు. పంటను కోసి మార్కెట్‌కు తరలించే లోపు పాడయ్యేవి. ఈ స్టోరేజ్ కంటెయినర్‌ల వల్ల రైతులు పండించిన పంట మార్కెట్‌కు చేరేలోపు పాడయ్యే దుస్థితి దూరమైంది.

అర్థవంతమైన వ్యర్థం

మరో మహిళ నాగాలాండ్‌కు చెందిన నెంగ్నైథెమ్ హెంగ్నా. ఆమె అరటి నారతో ఇంట్లో ఉపయోగించే వస్తువులను తయారు చేసి పాలిమర్ ఫైబర్‌కు ప్రత్యామ్నాయాన్ని చూపించింది. టేబుల్ మ్యాట్, కోస్టర్, పండ్లు, కూరగాయలు నిల్వ చేసే బుట్టలు, క్యారీ బ్యాగ్‌ల వరకు పదమూడేళ్లుగా ఆమె తయారు చేస్తున్న అరటినార వస్తువులు దేశమంతటా విస్తరించాయి.



● నెంగ్నైథెమ్



ఇక అస్సామీయులు పడవ తయారీలో ప్రయోగం చేశారు. నాటుపడవలను చెక్కతో తయారు చేస్తారు. మన్నిక దృష్ట్యా వాటికి ప్రత్యామ్నాయంగా ఫైబర్ గ్లాస్ బోట్స్ వాడుకలోకి వచ్చాయి. వీటికి పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాన్ని వెదురుతో కనుక్కున్నారు. ఈ ఇన్నోవేటివ్ బోట్స్ తయారీలో 85 శాతం వెదురు, పది శాతం పాలిమర్, ఐదు శాతం ఫైబర్ గ్లాస్ వాడుతున్నారు. ఈ పడవలు పది హేనేళ్లపాటు మన్నుతాయి. పాడైన తర్వాత ఈ విడి భాగాలు భూమిలో కలిసిపోతాయి.

14 భారత్ తరఫున 100 టెస్టులు ఆడిన 14వ ప్లేయర్‌గా అశ్విన్ గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో సచిన్, ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్, అనిల్ కుంబ్లే, కపిల్ దేవ్, సునీల్ గావస్కర్, విరాట్ కోహ్లి, దిలీప్ వెంగ్‌సర్కార్, సౌరవ్ గంగూలీ, ఇషాంత్ శర్మ, వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్, చతేశ్వర్ పుజారా కూడా ఉన్నారు.

భారత టెస్టు క్రికెట్ ఘనాపాటిల్లో మరో శిఖరం తన ఆటను ముగించింది. తన పదునైన ఆఫ్‌స్పిన్ బంతులతో పాటు తనకే సాధ్యమైన వ్యూహాలు, తెలివితేటలతో ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టించిన ఇంజినీరింగ్ బుర్ర ఇక అంతర్జాతీయ క్రికెట్ చాలంటూ తప్పుకుంది. సుదీర్ఘ కెరీర్ తర్వాత మదరాసీ ముద్దు బిడ్డ రవిచంద్రన్ అశ్విన్ టీమిండియా తరఫున చివరి మ్యాచ్ ఆడేసినట్లు ప్రకటించాడు. ఎన్నో రికార్డులు, మరెన్నో ఘనతల తర్వాత భారత్ తరఫున తన ప్రస్థానాన్ని ముగిస్తున్నట్లు అశ్విన్ వెల్లడించాడు. లెక్కపెట్టలేనన్ని మేటి గణాంకాలకు చిరునామాగా నిలిచిన ఈ దిగ్గజం తుది జట్టులో తన స్థానంపై సందేహం రాగానే ఇక చాలంటూ చివరి నిర్ణయం తీసుకున్నాడు. తన అవసరం లేని జట్టుతో ఇంకా కొనసాగడం అనవసరం అంటూ ఆస్ట్రేలియాతో సిరీస్ మధ్యలోనే గుడ్‌బై చెప్పేసి నిష్క్రమించాడు.

అశ్విన్ అల్విదా



అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత మేటి స్పిన్నర్

- ఆస్ట్రేలియాతో సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ నిర్ణయం
- నేడు స్వదేశానికి పయనం
- ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా గుర్తింపు

బ్రిస్బేన్: భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. టీమిండియా క్రికెటర్‌గా ఇదే తన చివరి రోజు అంటూ వెల్లడించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భాగంగా అడిలైడ్‌లో జరిగిన డే అండ్ నైట్ టెస్టు అశ్విన్ కెరీర్‌లో చివరిదిగా ముగిసింది. తొలి, మూడో టెస్టుల్లో తుది జట్టులో అతనికి స్థానం లభించలేదు. 'గాబా'లో టెస్టు ముగిసిన తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశానికి హాజరైన అశ్విన్... తన నిర్ణయం గురించి స్పష్టంగా వివరించి వెనుదిరిగాడు. సిరీస్‌లో మరో రెండు టెస్టులు మిగిలి ఉన్నా... ముందే రిటైర్మెంట్ ప్రకటించిన అతను నేడు స్వదేశానికి బయలుదేరి వెళుతున్నాడు. 2011లో భారత్ తరఫున తొలి టెస్టు మ్యాచ్ ఆడిన అశ్విన్ 106 టెస్టుల్లో 537 వికెట్లు పడగొట్టాడు. 2010లో వన్డేలు, టి20ల్లో అశ్విన్ అరంగేట్రం జరిగింది. ఈ రెండు ఫార్మాట్‌లలో చాలా కాలం క్రితమే అతను జట్టుకు దూరమైనా... అనూహ్యంగా వచ్చిన అవకాశాలు మళ్లీ వరల్డ్ కప్‌లు ఆడేలా చేశాయి. గత ఏడాది సొంత మైదానంలో చెన్నై వేదికగా ఆస్ట్రేలియాతో ఆడిన వరల్డ్ కప్ మ్యాచ్ అతని ఆఖరి వన్డే కాగా... 2022 టి20 వరల్డ్ కప్‌లో భాగంగా అడిలైడ్‌లో ఇంగ్లండ్‌తో ఆడిన పోరు అతని ఆఖరి అంతర్జాతీయ టి20 మ్యాచ్. 2011 వన్డే వరల్డ్ కప్, 2013 వన్డే చాంపియన్స్ ట్రోఫీల్లో విజేతగా నిలిచిన భారత జట్టులో అశ్విన్ సభ్యుడు. అయితే గత కొన్నేళ్లుగా అతను 'టెస్టు స్పెషలిస్ట్'గానే జట్టుతో కొనసాగుతున్నాడు. ప్రధాన స్పిన్నర్‌గా స్వదేశంలో భారత్ సిరీస్ విజయాల్లో అశ్విన్‌దే కీలక పాత్ర.

జట్టులో అవకాశాలు రాకపోవడంతో...

ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ మధ్యలో తప్పుకోవడం ఆశ్చర్యంగా అనిపించినా అశ్విన్ తీసుకున్న నిర్ణయం మరీ అనూహ్యమేమీ కాదు. ఈ సిరీస్‌కు ముందు న్యూజిలాండ్‌తో 3 టెస్టుల్లో అతను 41.22 సగటుతో కేవలం 9 వికెట్లు తీశాడు. స్వదేశంలో అతని స్థాయి ప్రదర్శనతో పోలిస్తే ఇది చాలా పేలవం. ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో అతడిని కాదని యువ ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కు చోటు కల్పించడం అశ్విన్‌కు తీవ్ర నిరాశ కలిగించింది. సాధారణంగా టీమిండియా విదేశీ గడ్డపై ఒక స్పిన్నర్‌ను ఆడిస్తే అతని బ్యాటింగ్ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటోంది. మూడో టెస్టులో రవీంద్ర జడేజా ఆడాడు. బుధవారం కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే దీనిపై మరింత స్పష్టత వచ్చింది. తొలి టెస్టులో అతడిని తప్పించే నిర్ణయం కోచ్ గంభీర్ తీసుకోగా... రెండో టెస్టు కోసం అశ్విన్‌ను రోహిత్ ఒప్పించాడు. 'పెర్త్ టెస్టు సమయంలోనే అతను రిటైర్మెంట్ గురించి చర్చించాడు. అప్పటికే అతని మనసులో చాలా ఆలోచనలు ఉన్నాయి. అడిలైడ్ తర్వాత బ్రిస్బేన్‌లో కూడా పలు కారణాలతో తుది జట్టులో అతను లేడు. మెల్‌బోర్న్ గురించి ఇప్పుడే చెప్పలేను. అపార అనుభవం ఉండి డ్రెస్సింగ్ రూమ్‌లో పరిణామాల గురించి ఎంతో తెలిసిన అశ్విన్ ఇలాంటి విషయాలు అర్థం చేసుకోగలడు. సిరీస్‌లో తన అవసరం లేకపోతే ఇంకా ఎందుకని అతను భావించాడు. అయితే అతని స్థాయి ప్లేయర్ ఏదైనా నిర్ణయం తీసుకుంటే దానిని మనం గౌరవించాలి' అని రోహిత్ శర్మ అన్నాడు. నిజానికి స్పిన్‌కు అనుకూలించే సిడ్నీలో జరిగే చివరి టెస్టులో ఇద్దరు స్పిన్నర్లతో ఆడితే అశ్విన్ పేరును కూడా పరిశీలించే అవకాశం ఉండేది. అయితే దీనిపై కూడా అతనికి బహుశా నమ్మకం లేకపోవచ్చు. జడేజా, సుందర్‌లనే ఆడిస్తారని అతను అనుకొని ఉంటాడు. అందుకే సిరీస్ ముగిసేవరకు అతను ఆగలేదు. భారత్ తమ తర్వాతి సిరీస్ వచ్చే ఏడాది జూన్‌లో ఇంగ్లండ్ గడ్డపై ఆడుతుంది కాబట్టి అక్కడా అతనికి తుది జట్టులో స్థానంపై సందేహమే. టీమిండియా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌కు అర్హత సాధించినా ఇదే పరిస్థితి ఎదురు కావచ్చు. దాదాపు ఏడాది వరకు స్వదేశంలో టెస్టులు లేవు. ఈ నేపథ్యంలో తప్పుకోవడమే మంచిదని అశ్విన్ భావించాడు.

ఐపీఎల్ బరిలో...

ఐపీఎల్ 2025 సీజన్ కోసం ఇటీవల జరిగిన వేలంలో అశ్విన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు రూ.9 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. కాబట్టి వచ్చే సీజన్‌లో అతను ఐపీఎల్ ఆడటం ఖాయం కాగా, తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో కూడా ప్లేయర్ కమ్ కోచ్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది.



ఈ ఏడాది మార్చిలో ధర్మశాలలో 100వ టెస్టు ఆడిన సందర్భంగా బీసీసీఐ అందించిన ప్రత్యేక టోపీతో అశ్విన్, అతని కుటుంబసభ్యులు

అశ్విన్ కెరీర్ గణాంకాలు

ఆడిన టెస్టులు: 106 తీసిన వికెట్లు: 537
చేసిన పరుగులు: 3503 అత్యధిక స్కోరు: 124
సెంచరీలు: 6 అర్ధ సెంచరీలు: 14
ఇన్నింగ్స్‌లో ఉత్తమ బౌలింగ్: 7/59
ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు: 37 సార్లు
మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు: 8

ఆడిన వన్డేలు: 116	ఆడిన టి20లు: 65
తీసిన వికెట్లు: 156	తీసిన వికెట్లు: 72
చేసిన పరుగులు: 707	చేసిన పరుగులు: 184
అత్యధిక స్కోరు: 65	అత్యధిక స్కోరు: 31
ఉత్తమ బౌలింగ్: 4/25	ఉత్తమ బౌలింగ్: 4/8

అంతర్జాతీయ స్థాయిలో అన్ని ఫార్మాట్‌లలో భారత క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. ఆటగాడిగా నాలో ఇంకా ఎంతో సత్తా మిగిలి ఉంది. అయితే దీనిని క్లబ్ స్థాయి క్రికెట్‌లో ప్రదర్శిస్తాను. కెరీర్ చాలా బాగా సాగింది. రోహిత్‌తోపాటు ఇతర భారత సహచరులతో నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వారిలో కొందరు ఇప్పటికే ఆటకు దూరమయ్యారు. మా డ్రెస్సింగ్ రూమ్‌లో అందరి గౌరవాభిమానాలు అందుకున్న కొద్ది మంది బృందంలో నేనూ కూడా ఒకడిని అని భావిస్తున్నా. బీసీసీఐతో పాటు నాకు అండగా నిలిచిన ఆటగాళ్లు, కోచ్‌లందరికీ కృతజ్ఞతలు. ముఖ్యంగా అద్భుత క్యాచ్‌లతో నా వికెట్ల సంఖ్యను పెంచిన రోహిత్, కోహ్లి, రహానే, పుజారాలకు థ్యాంక్స్. ఆస్ట్రేలియా క్రికెట్ టీమ్‌కు ప్రత్యర్థిగా తలపడటాన్ని నేను ఎప్పుడూ ఆస్వాదించాను. ఇది నాకు చాలా భావోద్వేగ క్షణం. కాబట్టి మీడియా నుంచి ప్రస్తుతం ఎలాంటి ప్రశ్నలు ఎదుర్కొనే స్థితిలో లేను. నన్ను మన్నించండి. నా గురించి ఎంతో గొప్పగా రాయడంతో పాటు కొన్నిసార్లు బాధ పెట్టే వార్తలు కూడా మీరు రాశారు. నేను ఆటకు పూర్తిగా దూరం కాలేదు. నా క్రికెట్ అన్నీ ఇచ్చింది కాబట్టి దానితో కొనసాగడం ఖాయం.

– మీడియా సమావేశంలో రవిచంద్రన్ అశ్విన్

'మిస్టర్ మేధావి'

- క్రికెట్‌లో నిత్య విద్యార్థి అశ్విన్
- ఆటపై అసాధారణ పరిజ్ఞానం
- ప్రతి మ్యాచ్‌కూ పకడ్బందీ సన్నద్ధత
- వ్యూహ రచనల్లో తనకు తానే సాటి
- క్లిష్ట పరిస్థితుల్లో జట్టుకు ఆపన్నహస్తం



2020-2021 సీజన్ బీసీసీఐ బెస్ట్ క్రికెటర్ అవార్డుతో

సాక్షి క్రీడా విభాగం

భారత్, ఆస్ట్రేలియా మధ్య అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టుకు రెండు రోజుల ముందు అశ్విన్ మైదానానికి వెళ్లాడు. తనకు తెలిసిన ఒక మీడియా మిత్రుడిని పిలిచి అంతకుముందు అక్కడ జరిగిన షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్ వీడియోలు ఎక్కడైనా దొరుకుతాయా అని అడిగాడు. స్పిన్నర్ లాయిడ్ పోప్ ఆ మ్యాచ్‌లో చెలరేగడాన్ని గుర్తు చేస్తూ పిచ్ ఎలా స్పందిస్తుందనే విషయాన్ని తెలుసుకునేందుకు అతను ప్రయత్నించాడు. ఒక టెస్టు మ్యాచ్ కోసం అశ్విన్ చేసే సన్నద్ధత ఇది. ఇలా సిద్ధం కావడం అశ్విన్ కెరీర్‌లో ఇది మొదటిసారేమీ కాదు. తాను ఆటలో అడుగు పెట్టిన నాటినుంచి ప్రతీ సిరీస్‌కు, ప్రతీ మ్యాచ్‌కు, ప్రతీ ఓవర్‌కు, ప్రతీ బంతికి కొత్త తరహాలో వ్యూహరచన చేయడం అతనికే చెల్లింది. ఆటపై అసాధారణ పరిజ్ఞానం, చురుకైన బుర్ర, భిన్నంగా ఆలోచించే తత్వం అతడిని అగ్ర స్థానానికి చేర్చాయి. సాంప్రదాయ ఆఫ్‌స్పిన్‌లో అత్యుత్తమ నైపుణ్యం మాత్రమే కాకుండా క్యారమ్ బాల్, ఆర్మ్ బాల్ అతని ఆయుధాలుగా ప్రత్యర్థి బ్యాటర్లను పడగొట్టాయి. స్పిన్ బౌలింగ్‌కు సైన్స్‌ను జోడిస్తే ఎలాంటి ఫలితాలు ఉంటాయనేది ఇంజినీరింగ్ చదివిన అశ్విన్ నిరూపించాడు. అశ్విన్ చేతికి బంతి ఇస్తే చాలు... భారత కెప్టెన్‌కు ఒక ధైర్యం వచ్చేస్తుంది. అతడికి నమ్మి బౌలింగ్ అప్పగిస్తే ఇక గుండెల మీద చేయి వేసుకొని ప్రశాంతంగా ఉండవచ్చనేది వారి భావన. ఆరంభంలోనే బ్యాటర్లను కట్టడి చేయాలన్నా, భారీ భాగస్వామ్యాలను విడదీయాలన్నా, ఓటమి దిశగా వెళుతున్న సమయంలో కూడా రక్షించాలన్నా అశ్విన్ ఆపన్నహస్తం సిద్ధంగా ఉండేది! అశ్విన్ తెలివితేటలు టీమిండియాకు అదనపు బలాన్ని ఇచ్చాయి. తన బౌలింగ్ విషయంలోనే కాదు నాయకుడికి ఒక మంత్రిలా అండగా నిలవడంలో అతనికి అతనే సాటి. ఎన్నో ప్రణాళికల్లో, వ్యూహాల్లో అశ్విన్ భాగస్వామి. ఆటపై అతని సునిశిత పరిశీలన, వైవిధ్యమైన ఆలోచనాశైలితో ఎన్నోసార్లు అతను మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టు పతనానికి కారకుడయ్యాడు. దురదృష్టవశాత్తూ సుదీర్ఘ కెరీర్‌లో ఒక్కసారి కూడా భారత్‌కు సారథిగా వ్యవహరించే అవకాశం రాకపోవడం మాత్రం ఒక లోటుగా ఉండిపోయింది. పైగా ఇంత గొప్ప కెరీర్ తర్వాత ఎలాంటి వీడ్కోలు మ్యాచ్ లేకుండా, ఘనమైన ముగింపు లేకుండా అతను తన ఆఖరి ఆట ఆడేయడం కూడా కాస్త చివుక్కుమనిపించేదే.

దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే రిటైర్ అయిపోగా, కెరీర్ చివర్లో వరుస వైఫల్యాలతో హర్భజన్ సింగ్ ఇబ్బంది పడుతున్న దశలో అశ్విన్ కెరీర్ మొదలైంది. ముందుగా ఐపీఎల్, ఆపై వన్డే, టి20ల్లో ప్రదర్శనతో అందరి దృష్టిలో పడినా... తర్వాతి రోజుల్లో టెస్టు బౌలర్‌గా తన ముద్ర వేయగలిగి అరుదైన ఆటగాళ్లలో ఒకడిగా అతను నిలిచాడు. 2011లో ఆడిన తొలి టెస్టులోనే 9 వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా మొదలైన అతని ఆట అద్భుత కెరీర్‌కు నాంది పలికింది. తొలి 16 టెస్టుల్లోనే 9సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేయడం అశ్విన్ స్థానాన్ని సుస్థిరం చేసింది. 2016–17 సీజన్‌లో నాలుగు సిరీస్‌లలో కలిపి 13 టెస్టుల్లో ఏకంగా 82 వికెట్లు పడగొట్టడం అశ్విన్ కెరీర్‌లో ఉచ్ఛదశ. ఒకటా, రెండా... ఎన్నో గుర్తుంచుకోదగ్గ గొప్ప ప్రదర్శనలు అతని స్థాయిని పెంచాయి. అశ్విన్ బంతులను ఎదుర్కోలేక ఉత్తమ బ్యాటర్లు కూడా పూర్తిగా తడబడి చేతులెత్తేసిన రోజులు ఎన్నో! స్టీవ్ స్మిత్, విలియమ్సన్, రూట్, డివిలియర్స్, అలిస్టర్ కుక్, డీన్ ఎల్గర్, డేవిడ్ వార్నర్, మైకేల్ క్లార్క్, కుమార సంగక్కర, మహేళ జయవర్ధనే, బెన్ స్టోక్స్...అశ్విన్ ముందు తలవంచిన ఇలాంటి బ్యాటర్ల జాబితా చాలా పెద్దది. స్వదేశంలో అసాధారణ ఘనతల మధ్య అతడిని విమర్శించేందుకు కొందరు దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా (SENA) దేశాల్లో అతని ప్రదర్శనను చూపిస్తుంటారు. ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల ప్రదర్శన లేకపోయినా అతని బౌలింగ్ మరీ పేలవంగా ఏమీ లేదు. ఆయా పరిస్థితులను బట్టి తనకు తక్కువ అవకాశాలు వచ్చాయని (26 టెస్టులే ఆడాడు)... తన రికార్డును సవరించే అవకాశం కూడా ఎక్కువగా దక్కలేదని దీనిపై అశ్విన్ చెప్పుకున్నాడు.

బౌలింగ్‌కు తోడు అశ్విన్ బ్యాటింగ్ నైపుణ్యం అతడిని ఆల్‌రౌండర్ స్థాయికి చేర్చింది. 'అండర్–17 స్థాయినుంచి నేను అశ్విన్‌తో కలిసి ఆడాను. అప్పట్లో అతను ఓపెనర్. కొన్నాళ్ల విరామం తర్వాత మేం తమిళనాడు జట్టు నుంచి అశ్విన్ అనే బౌలర్ అద్భుత గణాంకాలు చూసి అతను ఇతను వేరు అనుకున్నాం. ఎందుకంటే మాకు తెలిసిన అశ్విన్ బ్యాటర్ మాత్రమే. టెస్టు ఆటగాడిగా మనం ఎన్నో మంచి బ్యాటింగ్ ప్రదర్శనలు చూశాం. దాని గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు' అని రోహిత్ బుధవారం గుర్తు చేసుకున్నాడు. ఆఫ్‌స్పిన్నర్‌గా ఎదగక ముందు ఉన్న ఆ అనుభవం భారత జట్టుకు కూడా కీలకంగా పనికొచ్చింది. టెస్టుల్లో ఎందరో బౌలర్లకు సాధ్యం కాని రీతిలో నమోదు చేసిన 6 సెంచరీలు అసాధారణ ప్రదర్శన. ఇటీవల బంగ్లాదేశ్‌తో చెన్నైతో జరిగిన టెస్టులో భారత్ 144/6 వద్ద ఉన్నప్పుడు చేసిన శతకం అతని బ్యాటింగ్ విలువను చూపించింది. 2019 సిడ్నీ టెస్టులో తనను కాదని కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వడంతో పాటు విదేశాల్లో ఇతనే మా ప్రధాన స్పిన్నర్ అంటూ కోచ్ రవిశాస్త్రి చెప్పిన మాట అశ్విన్‌ను అప్పట్లో తీవ్రంగా బాధించింది. దానిని అతను ఆ తర్వాత చాలాసార్లు గుర్తు చేసుకున్నాడు. ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత దాదాపు అదే తరహా అనుభవాన్ని ఎదుర్కొంటూ మరొకరికి అవకాశం ఇవ్వకుండా తనంతట తానే రిటైర్మెంట్‌ను ప్రకటించాడు.



అంకెల్లో అశ్విన్ ఘనత

పదమూడేళ్ల ఘనమైన టెస్టు కెరీర్‌లో అశ్విన్ ఎన్నో కొత్త రికార్డులు తన పేరిట నమోదు చేసుకున్నాడు. గతంలో ఎవరికీ సాధ్యం కాని అసాధారణ గణాంకాలకు అతను అడ్రస్‌గా మారాడు. కొన్ని అంకెలు చూస్తే జట్టులో అతని విలువేమిటో, చిరస్మరణీయ విజయాల్లో అశ్విన్ పాత్ర ఏమిటో అర్థమవుతుంది.

537 టెస్టుల్లో అశ్విన్ వికెట్ల సంఖ్య. భారత్ తరఫున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే (619) తర్వాత రెండో స్థానంతో అశ్విన్ ముగించాడు. ఓవరాల్‌గా అతనిది ఏడో స్థానం. మురళీధరన్ (800), వార్న్ (708), అండర్సన్ (704), కుంబ్లే (619), బ్రాడ్ (604), మెక్‌గ్రాత్ (563) అతనికంటే ముందున్నారు.

37 టెస్టుల్లో 37సార్లు అశ్విన్ ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ముత్తయ్య మురళీధరన్ (67) తర్వాత షేన్ వార్న్ (37)తో రెండో స్థానంలో అతను సమంగా నిలిచాడు.

268 అశ్విన్ అవుట్ చేసిన ఎడంచేతి వాటం బ్యాటర్లు. ఈ జాబితాలో అందరికంటే ముందున్న అతను అత్యధికంగా బెన్ స్టోక్స్ (13)ను పెవిలియన్ పంపించాడు.

65 అశ్విన్ అరంగేట్రం చేసిన నాటినుంచి ఇప్పటి వరకు భారత్ సొంతగడ్డపై 65 టెస్టులు ఆడింది. వీటన్నింటిలో అతను బరిలోకి దిగడం విశేషం. ఈ మ్యాచ్‌లలో 383 వికెట్లు పడగొట్టిన అతను జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ మధ్య కాలంలో భారత్ స్వదేశంలో అశ్విన్ విఫలమైన 2 సిరీస్‌లలోనే ఓడి రికార్డు స్థాయిలో 18 సిరీస్‌లు గెలిచింది. 2012లో ఇంగ్లండ్‌పై 4 టెస్టుల్లో 52.64 సగటుతో 14 వికెట్లు... 2024లో న్యూజిలాండ్‌పై 3 టెస్టుల్లో 41.22 సగటుతో 9 వికెట్లతో అతను విఫలమయ్యాడు. ఈ రెండు సిరీస్‌లను ఇండియా చేజార్చుకోవడం అతని పాత్రను చూపిస్తోంది.

11 అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'ల సంఖ్య. ఈ జాబితాలో మురళీధరన్‌తో సమానంగా అగ్రస్థానంలో నిలిచాడు.

4 టెస్టు మ్యాచ్ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీయడంతో పాటు సెంచరీ కూడా చేసిన ఘనతను అశ్విన్ నాలుగు సార్లు నమోదు చేశాడు.



14 ఏళ్లుగా కలిసి ఆడాం. నువ్వు ఈ మాట చెప్పినప్పుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యా. మన జ్ఞాపకాలన్నీ కళ్ల ముందు కదిలాయి. ఈ ప్రయాణంలో ప్రతీ క్షణం ఆస్వాదించాను. నీలా మ్యాచ్‌లు గెలిపించడం ఎవరికీ సాధ్యం కాదు. భారత క్రికెట్‌లో నువ్వు ఒక దిగ్గజానివి. రిటైర్మెంట్ తర్వాతి జీవితం కూడా గొప్పగా సాగాలి. – కోహ్లి

'మనసా... వాచ ఆటపై నీవు కనబరిచే కచ్చితమైన దృక్పథం నన్ను ఎల్లప్పుడు అబ్బురపరుస్తుంది. నువ్వు సంధించే క్యారమ్ బాల్ నుంచి జట్టుకు అవసరమైన పరుగుల్ని రాబట్టే క్రమందాకా జట్టు విజయానికి వేసే బాట అద్భుతం. నువ్వో మ్యాచ్ విన్నర్‌వి. నీ గొప్పతనం ఏంటో నీ ప్రయాణమే చెబుతుంది. నీ పట్టుదల ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తుంది. ఇక నీ రెండో ఇన్నింగ్స్‌కు నా శుభాకాంక్షలు. ఆల్ ద బెస్ట్ అశ్విన్. –సచిన్ టెండూల్కర్

అద్భుత కెరీర్ ముగించిన నీకు నా అభినందనలు. నేను కోచ్‌గా ఉన్న సమయంలో నువ్వొక విలువైన ఆస్తివి. నీ నైపుణ్యంతో ఆటకు వన్నె తెచ్చావు. – రవిశాస్త్రి

ఘనమైన కెరీర్ సాగించిన నీకు శుభాకాంక్షలు. దశాబ్ద కాలం పాటు భారత స్పిన్‌కు పతాకధారిగా నిలబడిన నీ ఘనతల పట్ల గర్వంగా ఉన్నాం. – హర్భజన్ సింగ్

నీ ప్రయాణం అసాధారణం. 700కు పైగా అంతర్జాతీయ వికెట్లతో ఆటను సుసంపన్నం చేశావు. మైదానం బయట కెరీర్ అద్భుతంగా ఉండాలి. – అనిల్ కుంబ్లే

కుర్రాడిగా మొదలు పెట్టి దిగ్గజంగా ఎదిగే వరకు నిన్ను చూశాను. అశ్విన్‌ను చూసి బౌలర్‌గా మారామని ఒక తరం బౌలర్లంతా చెప్పుకుంటారు. ఆటలో నీ లోటు పూడ్చలేనిది. – గౌతమ్ గంభీర్

నీ బౌలింగ్‌లో స్లిప్‌లో ఫీల్డింగ్ చేయడం అంత ఉత్సాహవంతమైన పని మరొకటి లేదు. ప్రతీ బంతికి క్యాచ్ అవకాశం వచ్చినట్లే అనిపించేది. – అజింక్య రహానే

క్రికెట్‌లో నీ రాక మా అదృష్టం. అద్భుత ఆటతో అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ కాలం కొనసాగావు. నువ్వు వినోదం పంచడమే కాదు ఎంతో నేర్పించావు కూడా. – ఇయాన్ బిషప్

వర్షమే గెలిచింది!



భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు 'డ్రా'

- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 89/7 డిక్లేర్డ్
- టీమిండియా ముందు 275 పరుగుల లక్ష్యం
- ఆట ముగిసే సమయానికి 8/0
- 26 నుంచి మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు

వాన, వెలుతురులేమితో వస్తున్న విరామాలతో రోజంతా ఆడినా 'డ్రా' దాదాపు ఖాయమైన టెస్టులో ఆస్ట్రేలియా గెలుపు కోసం ఒక చివరి ప్రయత్నం చేసింది. మిగిలిన సమయంలో ఫలితం తేలడం అసాధ్యంగా కనిపిస్తున్నా సరే... తమ ఇన్నింగ్స్‌కు దూకుడు జోడించి భారత్‌కు సవాల్ విసిరింది. కానీ మరోసారి వాతావరణం దెబ్బ కొట్టడంతో 13 బంతులకే భారత్ ఆట పరిమితమైంది. దాంతో 'షేక్ హ్యాండ్'లు ఇచ్చుకోవడం మినహా మరేమీ మిగల్లేదు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరుతో గెలుపు అవకాశం సృష్టించుకొని చివరకు ఆసీస్ అవకాశం పోగొట్టుకోగా... బ్యాటింగ్ వైఫల్యంతో ఓటమి ప్రమాదంలో నిలిచిన తర్వాత దాని నుంచి తప్పించుకొని భారత్ సంతృప్తిగా మైదానం వీడింది. సిరీస్‌లో 1–1 స్కోరుతో సమాన స్థితిలో ఇరు జట్లు ఈనెల 26 నుంచి మెల్‌బోర్న్‌లో జరిగే 'బాక్సింగ్ డే' టెస్టుకు సిద్ధం కానున్నాయి.

బ్రిస్బేన్: ఎలాంటి అనూహ్య ఫలితం లేకుండా ఊహించినట్లుగానే భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. వర్షం బాగా ప్రభావం చూపిన ఈ పోరులో ఐదు రోజుల్లో కలిపి 216.1 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మ్యాచ్ చివరి రోజు మొత్తం 24.1 ఓవర్ల డ్రామా సాగింది. భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులకు ఆలౌట్ కావడంతో ఆస్ట్రేలియాకు 185 పరుగుల ఆధిక్యం దక్కింది. అనంతరం ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 18 ఓవర్లు మాత్రమే ఆడింది. 7 వికెట్లకు 89 పరుగుల వద్ద డిక్లేర్ చేసి భారత్ ముందు 275 పరుగుల విజయలక్ష్యాన్ని ఉంచింది. ఏమాత్రం అంతరాయం లేకుండా పూర్తిగా సాగినా గరిష్ఠంగా పడే 54 ఓవర్లలో ఇది ఛేదించడం అంత సులువు కాదు కానీ భారత్ ప్రయత్నించేదేమో! కానీ 2.1 ఓవర్లలో భారత జట్టు వికెట్ కోల్పోకుండా 8 పరుగులు చేసిన తర్వాత వెలుతురులేమితో ఆట నిలిచింది. ట్రావిస్ హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కగా... ఈనెల 26 నుంచి మెల్‌బోర్న్‌లో ఇరు జట్ల మధ్య నాలుగో టెస్టు జరుగుతుంది.

టపటపా...

వెలుతురులేమి, వాన కారణంగా ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ ప్రారంభమయ్యేందుకు చాలా సమయం పట్టింది. దాదాపుగా తొలి సెషన్ మొత్తం తుడిచి పెట్టుకుపోయింది. విరామం తర్వాత ఆట మొదలవగా... ఆసీస్ బ్యాటర్లు దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించి వరుసగా పెవిలియన్ చేరారు. వికెట్లు పడుతున్నా జట్టు అదే ఆటను కొనసాగించింది. అయితే భారత్ పదునైన బౌలింగ్‌ను బ్యాటర్లు సమర్థంగా ఎదుర్కోలేకపోయారనేది కూడా వాస్తవం. ఖ్వాజా (7 బంతుల్లో 8; 2 ఫోర్లు), లబుషేన్ (9 బంతుల్లో 1) వికెట్లు బుమ్రా ఖాతాలో చేరగా... ఆకాశ్‌దీప్ తన వరుస ఓవర్లలో మెక్‌స్వీనీ (25 బంతుల్లో 4), మార్ష్ (2) పని పట్టాడు. అనంతరం స్మిత్ (4; 1 ఫోర్), హెడ్ (17; 2 ఫోర్లు)లను పెవిలియన్ పంపించి సిరాజ్ తన వంతు పాత్ర పోషించాడు. క్రీజ్‌లో ఉన్న కొద్ది సేపు దాటిని ప్రదర్శించిన కమిన్స్ (10 బంతుల్లో 22; 2 ఫోర్లు, 2 సిక్స్‌)ను కూడా బుమ్రా అవుట్ చేయగా... మరో ఐదు బంతులకే ఆసీస్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అలెక్స్ కేరీ (20 నాటౌట్; 2 ఫోర్లు), కమిన్స్, హెడ్ కలిసి 49 బంతుల్లో 59 పరుగులు రాబట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 252/9తో బుధవారం ఆట కొనసాగించిన భారత్ మరో 4 ఓవర్లు ఆడి 8 పరుగులు రాబట్టింది. హెడ్ వేసిన బంతిని ఆడే క్రమంలో ఆకాశ్‌దీప్ (44 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) స్టంపౌట్ కావడంతో జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. ఆకాశ్‌దీప్, బుమ్రా (10 నాటౌట్) చివరి వికెట్‌కు 47 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445; భారత్ తొలి ఇన్నింగ్స్: 260; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 4; ఖ్వాజా (బి) బుమ్రా 8; లబుషేన్ (సి) పంత్ (బి) బుమ్రా 1; మార్ష్ (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 2; హెడ్ (సి) పంత్ (బి) సిరాజ్ 17; స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 4; కేరీ (నాటౌట్) 20; కమిన్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 22; స్టార్క్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (18 ఓవర్లలో 7 వికెట్లకు డిక్లేర్డ్) 89. వికెట్ల పతనం:** 1-11, 2-16, 3-16, 4-28, 5-33, 6-60, 7-85. **బౌలింగ్:** బుమ్రా 6-1-18-3, సిరాజ్ 7-0-36-2, ఆకాశ్‌దీప్ 5-1-28-2. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (నాటౌట్) 4; రాహుల్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (2.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 8. బౌలింగ్:** స్టార్క్ 1.1-0-4-0, కమిన్స్ 1-0-4-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

53 విదేశీ గడ్డపై అత్యధిక వికెట్లు (53) సాధించిన భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. కపిల్‌దేవ్ (51; ఆస్ట్రేలియాలో) రికార్డును అతను సవరించాడు.

2 భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య బ్రిస్బేన్ మైదానంలో 'డ్రా'గా ముగిసిన రెండో టెస్టు ఇదే. రెండు జట్ల మధ్య ఈ మైదానంలో 8 టెస్టులు జరిగాయి. ఐదింటిలో ఆస్ట్రేలియా నెగ్గగా... ఒక టెస్టులో భారత్ గెలిచింది. రెండు టెస్టులు 'డ్రా'గా ముగిశాయి. 2003లో చివరిసారి ఈ మైదానంలో భారత్, ఆసీస్ జట్ల మధ్య టెస్టు 'డ్రా'గా ముగిసింది.

సాక్షి బిజినెస్
గురువారం
19-12-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	502	80,182
నిఫ్టీ ▽	137	24,199

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,139	△	29
డోజోన్స్	43,634	△	183
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,199	△	4
డాక్స్	20,243	▽	4
షాంఘై	3,361	▽	25
నికాయ్	39,364	▽	93

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
76,658	△	296
బంగారం (99.5 స్వచ్ఛత)		
76,351	△	295
వెండి (కేజీ)		
89,060	△	535

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.51	85.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.60	109.41
€	యూరో	ఎస్‌బీఐ	87.99	90.60
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.65	56.04
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.99	55.17
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.55	65.23
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.74	23.30
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.22	24.01
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.78	12.60

స్వయం కృషికి నిదర్శనం..


డీమార్ట్, జొమాటో, స్విగ్గీ

- ఈ ఏడాది తొలి స్థానంలో దమానీ
- ఏడాదిలో 44 శాతం పెరిగిన విలువ
- పదో స్థానంలో నైకా ఫాల్గుణి నాయర్
- ఐడీఎఫ్‌సీ ప్రైవేట్, హరూన్ నివేదిక

ముంబై: స్వయం కృషితో అవతరించిన దిగ్గజ పారిశ్రామికవేత్తగా ఈ ఏడాదీ 'డీమార్ట్' రాధాకిషన్ దమానీ అగ్రస్థానం దక్కించుకున్నారు. 'డీమార్ట్' పేరుతో ఆయన ఏర్పాటు చేసిన రిటైల్ చైన్ చక్కని ఆదరణ పొందుతుండడం తెలిసిందే. డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ విలువ రూ.3.4 లక్షల కోట్లుగా ఉంది. ఏడాది కాలంలో 44 శాతం పెరిగింది. జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ రెండో స్థానం దక్కించుకున్నారు. ఆయన ఏర్పాటు చేసిన జొమాటో విలువ ఏడాది కాలంలో 190 శాతం వృద్ధి చెంది రూ.2,51,900 కోట్లకు చేరింది. శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి నెలకొల్పిన స్విగ్గీకి మూడో స్థానం దక్కింది. కంపెనీ విలువ ఏడాది కాలంలో 52 శాతం పెరిగి రూ.1,01,300 కోట్లుగా ఉంది. 2,000 సంవత్సరం తర్వాత స్వయం కృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తలు, వారు ఏర్పాటు చేసిన 200 కంపెనీలతో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్, హరూన్ ఇండియా ఒక నివేదికను విడుదల చేశాయి.

గతేడాది హరూన్ జాబితాలోనూ డీమార్ట్ మొదటి స్థానంలో ఉండగా, ఫ్లిప్‌కార్ట్, జొమాటో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గతేడాది జాబితాలో టాప్–10లో ఉన్న ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, క్రెడ్ ఈ సారి టాప్–10లో చోటు కోల్పోయాయి. ముఖ్యంగా స్వయంకృషితో ఎదిగిన మహిళా అగ్రగామి పారిశ్రామికవేత్తగా ఫాల్గుణి నాయర్‌కు పదో స్థానం దక్కడం గమనార్హం. స్వయం కృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన టాప్–200లో 66 కంపెనీలు బెంగళూరు కేంద్రంగా ఉంటే, 36 కంపెనీలకు ముంబై, 31 కంపెనీలకు గురుగ్రామ్ చిరునామాగా ఉన్నాయి.


గోయల్


దమానీ


శ్రీహర్ష

టాప్–10 జాబితా ఇదీ...

వ్యవస్థాపకులు	కంపెనీ	విలువ (రూ.కోట్లలో)	వృద్ధి (%లో)
రాధాకిషన్ దమానీ	అవెన్యూ సూపర్ మార్ట్స్	3,42,600	44
దీపిందర్ గోయల్	జొమాటో	2,51,900	190
శ్రీహర్ష మాజేటి, నందన్‌రెడ్డి	స్విగ్గీ	1,01,300	52
దీప్ కల్రా, రాజేష్ మాగోవ్	మేక్ మై ట్రిప్	99,300	168
అభయ్ సోయ్	మ్యాక్స్ హెల్త్‌కేర్	96,100	75
యాశిష్ దహియా, అలోక్ భన్సాల్	పాలసీ బజార్	78,600	128
భవిత్ సేత్, హర్ష్ జైన్	డ్రీమ్11	66,500	-
నితిన్ కామత్, నిఖిల్ కామత్	జెరోదా	64,800	28
హర్షిల్ మాథుర్, శశాంక్ కుమార్	రేజర్ పే	62,400	-
ఫాల్గుణి నాయర్	నైకా	56,600	30

ట్రిపుల్ ధమాకా!

మూడు కంపెనీల బంపర్ లిస్టింగ్

గతవారం పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న విశాల్ మెగామార్ట్, సాయి లైఫ్ సైన్సెస్, మొబిక్విక్ కంపెనీల షేర్లు బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. ఈ మూడు కంపెనీల షేర్లు భారీ ప్రీమియం ధరతో లిస్టయ్యాయి. ఈక్విటీ మార్కెట్ నష్టాల్లో ట్రేడవుతున్నా.., వీటికి కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో తొలిరోజే మొబిక్విక్ షేరు అత్యధికంగా 90%, విశాల్ మెగామార్ట్ 44%, సాయి లైఫ్ సైన్సెస్ 42 శాతం లాభాలను ఇన్వెస్టర్లకు పంచాయి.





విశాల్ మెగామార్ట్

దేశవ్యాప్తంగా సూపర్‌మార్ట్‌లను నిర్వహిస్తున్న విశాల్ మెగామార్ట్ షేరు ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర (రూ.78)తో పోలిస్తే 33% ప్రీమియంతో రూ.104 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 46% ఎగసి రూ.114 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 44% లాభంతో రూ.112 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.50,444 కోట్లుగా నమోదైంది.



మొబిక్విక్ సిస్టమ్స్

మొబిక్విక్ పేరుతో ఫిన్‌టెక్ సేవలు అందించే వన్ మొబిక్విక్ సిస్టమ్స్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.279)తో పోలిస్తే 59% ప్రీమియంతో రూ.442 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో ఏకంగా 90.21% ఎగసి రూ.531 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి అదే స్థాయి (రూ.530) వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,120 కోట్లుగా నమోదైంది.



సాయి లైఫ్ సైన్సెస్

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ షేరు ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర (రూ.549)తో పోలిస్తే 18% ప్రీమియంతో రూ.650 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 42% ఎగసి రూ.780 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 40% లాభంతో రూ.768 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15,974 కోట్లుగా నమోదైంది.

యూఎస్ ఫెడ్ వడ్డీ కోత

తాజాగా 0.25 శాతం తగ్గింపు

న్యూయార్క్: అంచనాలకు అనుగుణంగా అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటులో తాజాగా 0.25 శాతం కోత పెట్టింది. దీంతో వడ్డీ రేట్లకు కీలకమైన ఫెడ్ ఫండ్స్ రేట్లు 4.25–4.5 శాతానికి దిగివచ్చాయి. ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన రెండు రోజులపాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌వోఎంసీ) వడ్డీ రేటు తగ్గింపునకే మరోసారి మొగ్గు చూపింది. ఈ క్యాలండర్ ఏడాదిలో ఇది చివరి పాలసీ సమావేశం కాగా.. జో బైడెన్ హయాంలో పావెల్ చేపట్టిన చివరి సమీక్షగా నిపుణులు పేర్కొన్నారు. కాగా.. కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన వెంటనే చేపట్టిన సెప్టెంబర్ సమావేశంలో ఎఫ్‌వోఎంసీ 0.5 శాతం వడ్డీ రేటును తగ్గించిన సంగతి తెలిసిందే. తదుపరి తిరిగి గత(నవంబర్) సమావేశంలో మరో పావు శాతం వడ్డీ రేటును తగ్గించింది.



సూచీలకు మూడోరోజూ నష్టాలే..

- కొనసాగిన ఫెడ్ అప్రమత్తత
- సెన్సెక్స్ నష్టం 502 పాయింట్లు
- 24,200 స్థాయి దిగువకు నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ యుటిలిటీ, క్యాపిటల్ గూడ్స్, మెటల్ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 502 పాయింట్లు నష్టపోయి 80,182 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 137 పాయింట్లు కోల్పోయి 24,199 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా మూడోరోజూ నష్టాల ముగింపు. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగడం కూడా ఒత్తిడి పెంచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 634 పాయింట్లు క్షీణించి 80,050 వద్ద, నిఫ్టీ 187 పాయింట్లు పతనమై 24,149 వద్ద కనిష్టాన్ని తాకాయి. ఐటీ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రైవేటు రంగ హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకుల షేర్లు 1.5% నష్టపోయాయి. వీటితో పాటు పవర్ గ్రిడ్ 2.50%, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు 2% పతనమయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 3 పైసలు బలహీనపడి జీవితకాల కనిష్టం 84.94 వద్ద స్థిరపడింది.



నిస్సాన్, హోండా విలీనం?

న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజాలు హోండా మోటార్, నిస్సాన్ విలీన వార్తలు బుధవారం హడావుడి చేశాయి. చైనా ఎలక్ట్రిక్ వాహన కంపెనీలతో పోటీపడే దిశగా విలీనమయ్యేందుకు ఇరు సంస్థలు చర్చలు ప్రారంభించాయని సమాచారం. నిస్సాన్ తీవ్ర ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, భవిష్యత్‌లో కలిసి పనిచేసేందుకు అవకాశాలను మాత్రమే పరిశీలిస్తున్నట్లు, ఇప్పటివరకూ ఏ నిర్ణయమూ తీసుకోలేదని నిస్సాన్ వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహనాల వ్యాపారానికి సంబంధించి పరస్పరం సహకరించుకోవాలని హోండా, నిస్సాన్ ఈ ఏడాది మార్చిలో ఒక అంగీకారానికి వచ్చాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

షాపర్స్ స్టాప్ నుంచి అమెజాన్ ఔట్	బీ2బీ క్విక్ కామర్స్‌లోకి మైటీవీఎస్

మార్చిలోగా వొడాఫోన్ ఐడియా 5జీ

క్లస్టర్ బిజినెస్ హెడ్ ఆనంద్ దానీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా దేశవ్యాప్తంగా 2025 మార్చిలోగా వాణిజ్యపరంగా 5జీ సేవలను ప్రారంభించనుంది. ప్రస్తుతం కొన్ని నగరాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక క్లస్టర్ బిజినెస్ హెడ్ ఆనంద్ దానీ బుధవారమిక్కడ మీడియాకు వెల్లడించారు. 'తెలుగు రాష్ట్రాల్లో 11,500లకుపైగా 4జీ టవర్స్ ఉన్నాయి. దశలవారీగా వీటిని 5జీకి అప్‌గ్రేడ్ చేస్తాం. స్పామ్ సందేశాలను అడ్డుకునే సాంకేతికతను పరిచయం చేశాం. ఈ సేవలను కాల్స్‌కు కూడా త్వరలో విస్తరిస్తాం. ప్రస్తుతం స్పామ్ కాల్స్ కట్టడికి సంబంధించి టెక్నాలజీని పైలట్ ప్రాజెక్టుగా వినియోగిస్తున్నాం' అని తెలిపారు.



సంస్థకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒక కోటికి పైగా చందాదార్లు ఉన్నారు. ఒక్కో వినియోగదారు నుంచి కంపెనీకి వస్తున్న సగటు ఆదాయం నెలకు రూ. 200 ఉంది. సగటున ఒక్కో కస్టమర్ డేటా వినియోగం ప్రస్తుతం నెలకు 18–20 జీబీ ఉందని ఆనంద్ చెప్పారు. దేశవ్యాప్తంగా కంపెనీ రూ.18,000 కోట్ల తాజా పెట్టుబడులు చేస్తోందని తెలిపారు.

సినిమా

పుకార్లను నమ్మొద్దు

టీజర్ విడుదలపై రాజాసాబ్ యూనిట్


ప్రభాస్

'రాజాసాబ్' సినిమా టీజర్ గురించి వినిపిస్తున్న వదంతులను నమ్మొద్దని, సరైన సమయంలో అధికారిక సమాచారాన్ని వెల్లడిస్తామని చిత్రం యూనిట్ చెబుతోంది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ చిత్రం 'రాజాసాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్లు. బుధవారం ఈ సినిమా అప్‌డేట్‌ను వెల్లడించారు మేకర్స్. ''రాజాసాబ్' చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తయింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. అయితే 'రాజాసాబ్' టీజర్ ఈ క్రిస్మస్ లేదా న్యూ ఇయర్ సందర్భంగా రిలీజ్ కావొచ్చనే పుకార్లు ప్రచారంలోకి వచ్చినట్లుగా మా దృష్టికి వచ్చింది. దయచేసి వీటిని నమ్మొద్దు. 'రాజాసాబ్' అధికారిక అప్‌డేట్స్‌ను సరైన సమయంలో వెల్లడిస్తాం. త్వరలోనే టీజర్‌ను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ 'ఎక్స్' వేదికగా ఓ నోట్‌ను రిలీజ్ చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది.


నాగచైతన్య, సాయిపల్లవి

కాశీలో శివశక్తి

నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా సినిమా 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. కాగా 'తండేల్' లోని శివశక్తి పాటను ఈ నెల 22న కాశీలోని డివైన్ ఘాట్స్‌లో లాంచ్ చేయనున్నారు. ''శ్రీకాకుళం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, పురాతన శ్రీముఖలింగం శివాలయాన్ని ప్రతిబింబించేలా ఈ పాట ఉంటుంది. సంగీతం పరంగా, విజువల్‌గా ఈ సాంగ్ అద్భుతంగా ఉంటుంది. పండగను వైభవంగా జరుపుకుంటున్న అనుభూతిని కలిగించే ఈ జాతర పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

హ్యాపీ హ్యాపీ లైఫ్

రామ్‌చరణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కియారా అద్వానీ, అంజలి హీరోయిన్లుగా నటించారు. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 10న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'దోప్' పాట లిరికల్ వీడియోను ఈ నెల 21న రిలీజ్ చేయనున్నారు. అయితే డిసెంబరు 18న 'దిల్' రాజు బర్త్ డే. ఈ సందర్భంగా 'దోప్' పాట ప్రోమోను రిలీజ్ చేశారు మేకర్స్. 'వక్కా వక్కా వక్కా వక్కా వాట్స్ సే డోప్.. లక లక లక లెట్స్ సే డోప్, హ్యాపీ హ్యాపీ లైఫ్‌కు మైక్రో మంత్ర డోప్..'' వంటి లిరిక్స్‌తో ఈ పాట ప్రోమో వీడియో ఉంది. ఈ పాటకు రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించగా, తెలుగులో తమన్, రోషిణి, పృథ్వీ, శ్రుతిరంజనీ పాడారు.


రామ్‌చరణ్, కియారా అద్వానీ


సిద్ధు జొన్నలగడ్డ

ఏప్రిల్‌లో జాక్

వేసవిలో థియేటర్స్‌కు రానున్నాడు జాక్. 'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ టైటిల్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో 'బేబీ' ఫేమ్ వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ 80శాతంపైనే పూర్తయింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లుగా వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''జాక్' పూర్తి వినోదాత్మక చిత్రం. సిద్ధు పాత్ర అలరించేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అచ్చు రాజమణి.

ఈ క్రిస్మస్ మనదే

- 'అల్లరి' నరేశ్


రాజేష్, సంయుక్త, అమృత, 'అల్లరి' నరేశ్, కిరణ్ అబ్బవరం, సుబ్బు, మారుతి

''బచ్చలమల్లి' సినిమాని యూనిట్ అంతా ఎంతో కష్టపడి, ఇష్టపడి చేశాం. ఈ మూవీని హిట్ చేస్తారా? లేక బ్లాక్‌బస్టర్ చేస్తారా? లేదంటే కల్ట్ చేస్తారా? అనేది ప్రేక్షకుల చేతుల్లో ఉంది. ఈ క్రిస్మస్ మనదే'' అని 'అల్లరి' నరేశ్ అన్నారు. ఆయన టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'బచ్చలమల్లి'. అమృతా అయ్యర్ హీరోయిన్. సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ సంయుక్తా మీనన్, దర్శకులు మారుతి, నక్కిన త్రినాథరావు, విజయ్ కనకమేడల, కార్తీక్ దండు, యదు వంశీ, 'బలగం' వేణు, వశిష్ఠ ముఖ్య అతిథులుగా హాజరై, 'బచ్చలమల్లి' విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుబ్బు మంగాదేవి మాట్లాడుతూ–''బచ్చలమల్లి' పాత్రను నరేశ్‌గారు మాత్రమే చేయగలరు. కావేరి పాత్రకు అమృత మాత్రమే న్యాయం చేయగలరు. రాజేష్‌లాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం'' అన్నారు. ''నేను ఎంతో ప్రేమించి చేసిన కథ ఇది'' అన్నారు రాజేష్ దండా. ''ఈ చిత్రంలో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది'' అని అమృతా అయ్యర్ చెప్పారు.

పదిరెట్లు అద్భుతంగా ఉంటుంది

- చింతపల్లి రామారావు



''విడుదల–1'లో కేవలం పాత్రలు ఎస్టాబ్లిష్ మాత్రమే జరిగింది. అయితే కథ అంతా 'విడుదల–2' లోనే ఉంటుంది. మొదటి భాగానికి మించి పదిరెట్లు అద్భుతంగా రెండో భాగం ఉంటుంది. ఇందులో పెరుమాళ్ పాత్రలో విజయ్ సేతుపతి అద్భుతమైన నటన, భావోద్వేగాలు చూస్తారు'' అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు. విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో, సూరి, మంజు వారియర్, సూరి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'విడుదల–2'. వెట్రిమారన్ దర్శకత్వంలో ఎల్రెడ్ కుమార్ నిర్మించిన ఈ మూవీ తమిళ్, తెలుగులో ఈ నెల 20న విడుదల కానుంది. శ్రీ వేధాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చింతపల్ల రామారావు మాట్లాడుతూ– ''అణగారిన వర్గాల నుంచి ఉద్భవించిన ఓ విప్లవ కెరటం.. పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి ప్రజల్ని ఎలా బయటపడేలా చేశారు? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని సమస్యలు, ఇక్కడ జరిగిన సంఘటనలతో తీసిన చిత్రమిది. ఇళయరాజాగారి నేపథ్య సంగీతం ప్రాణంగా నిలుస్తుంది. నేను నిర్మించిన 'శ్రీ శ్రీ రాజావారు' చిత్రం రిలీజ్ కానుంది. త్వరలోనే 'డ్రీమ్ గర్ల్' అనే మూవీని ప్రారంభించబోతున్నాం. మరో రెండు సినిమాలు సెట్స్ మీదకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాయి'' అని తెలిపారు.



వీజీ ఎంటర్‌టైన్మెంట్స్ పదో వార్షికోత్సవం సందర్భంగా విష్ణు బొప్పన ఆధ్వర్యంలో 2023–2024కు సంబంధించిన బుల్లితెర అవార్డులను హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. నటి శ్రీలక్ష్మి జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. అలాగే టీవీ నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, యూట్యూబర్స్‌కి కూడా అవార్డులను పంపిణీ చేశారు. పది మంది పేద కళాకారులకి ఆర్థిక సాయం చేశారు. ఈ వేడుకలో దర్శకులు ఎస్‌వీ కృష్ణా రెడ్డి, నిర్మాతలు కె. అచ్చిరెడ్డి, అంబికా కృష్ణ, నటీనటులు పూరి ఆకాష్, అర్చన, వర్మ్యసా లైఫ్ స్పేసెస్ వైగండ్ల వెంకటేశ్వర్లు, వీవీకే హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ విజయ్ కుమార్, ఐశ్వర్య సిల్క్స్ లక్ష్మి, అడ్వొకేట్ నాగేశ్వర్ రావు పూజారి తదితరులు పాల్గొన్నారు.

ఈవీవీగారి శైలిలో తీశాను

- రైటర్ మోహన్



''దివంగత దర్శకులు ఈవీవీ సత్యనారాయణగారి వద్ద రచయితగా నా కెరీర్ ఆరంభమైంది. ఆయన ప్రతి సినిమాలోనూ వినోదం, భావోద్వేగాలుండేవి. వాటికి ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యేవారు. తొలిసారి నేను దర్శకత్వం వహించిన 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' సినిమాని వినోదం, భావోద్వేగాలతో ఈవీవీగారి శైలిలో తీశాను'' అని రైటర్ మోహన్ తెలిపారు. 'వెన్నెల' కిషోర్ టైటిల్ రోల్‌లో, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల జంటగా, శియా గౌతమ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. లాస్యారెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న రైటర్ మోహన్ విలేకరులతో మాట్లాడుతూ–''1991లో శ్రీకాకుళం ప్రాంతంలో జరిగే కథే ఈ చిత్రం. ఏడు పాత్రల్లో ప్రతి పాత్ర కథలో చాలా కీలకంగా ఉంటుంది. కథలో క్రైమ్, కామెడీ, ఎమోషన్, థ్రిల్, లవ్.. ఇలా అన్నీ బ్యాలెన్స్‌గా ఉంటాయి. డిటెక్టివ్ పాత్రకి కిషోర్‌గారు కరెక్టుగా సరిపోయారు. తెలుగులో డిటెక్టివ్ సినిమా అనగానే చిరంజీవిగారి 'చంటబ్బాయ్' గుర్తుకు వస్తుంది. షెర్లాక్ హోమ్స్ అనేది హాలీవుడ్ ఫిక్షనల్ క్యారెక్టర్. అది కొందరికి పరిచయం లేకపోవచ్చు. అందుకే అందరికీ కనెక్ట్ అయ్యేవిధంగా వంశీ నందిపాటిగారి సూచన మేరకు 'చంటబ్బాయ్‌గారి తాలూకా' అనే ట్యాగ్‌ని పెట్టాం. మా నిర్మాత రమణారెడ్డిగారికి, వంశీగారికి మంచి సింక్ కుదిరింది. సునీల్ కశ్యప్ సంగీతం, జ్ఞాని నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటాయి. నా తర్వాతి సినిమా ఎమోషనల్ జోనర్‌లో ఉంటుంది. కథ సిద్ధంగా ఉంది'' అని తెలిపారు.


సుదీప్

యాక్షన్ థ్రిల్లర్

కన్నడ హీరో కిచ్చా సుదీప్ నటించిన తాజా చిత్రం 'మ్యాక్స్'. విజయ్ కార్తికేయ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వరలక్ష్మీ శరత్ కుమార్, సునీల్ నటించారు. వి క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్‌పై కలైపులి ఎస్. థాను నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. కాగా తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మ్యాక్స్'. ఇందులో అర్జున్ మహాక్షయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా సుదీప్ నటించారు'' అని మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి కెమెరా: శేఖర్ చంద్ర, సంగీతం: అజనీష్ లోకనాథ్.

ఇవి మొండి వంగడాలు



వ్యవసాయ రంగం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ ఇంకా జనాభాకు సరిపడా పంటలు పండటం లేదు. ఫలితంగా ఆహార కొరత, ఆకలి చావులు. ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోవడం. అందువల్ల ఈ వైపరీత్యాలను తట్టుకునే విత్తనాల తయారీ కోసం మనదేశం ఎన్నో చర్యలు చేపట్టింది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) వాతావరణాన్ని తట్టుకునే వినూత్న వ్యవసాయ పద్ధతులపై దృష్టిపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ప్రాజెక్టును ఏర్పాటుచేసింది. ఇది 2014-24 మధ్యమొత్తం 668 రకాల వరి వంగడాలను తయారుచేసింది. ఇందులో తీవ్ర వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకుని పెరిగేవి 199 ఉన్నాయి. మిగతా 579 తెగుళ్లు, వ్యాధులను తట్టుకునే రకాలు.

	రకాలు
కరువు, నీటి కొరత, నీటి నాణ్యత తగ్గినా తట్టుకునేవి	103
వరదలు, నీట మునిగినా తట్టుకునేవి	50
అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేవి	6
అత్యంత శీతల పరిస్థితులను తట్టుకునేవి	6

ఆధారం : కేంద్ర వ్యవసాయ శాఖ

క్లుప్తంగా...

మతిస్థిమితంలేని మహిళపై అత్యాచారం

ఆస్పరి: మతిస్థిమితం లేని మహిళపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దారుణ సంఘటన కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జొహరాపురం గ్రామానికి చెందిన ఒక మహిళ (35)కు మతిస్థిమితం లేదు. మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన హనుమంతు అనే వ్యక్తి బుధవారం ఉదయం మహిళ తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఆశ్రమంలో విడిచి పెడతానని చెప్పి ఆమెను వెంట తీసుకెళ్లాడు. అయితే, ఆశ్రమానికి తీసుకెళ్లకుండా తన స్వగ్రామమైన ముత్తుకూరుకు తీసుకెళ్లి ఇంట్లో బంధించి ఆమెపై అత్యాచారం చేశాడు. మహిళ కేకలు వేయడంతో ఇంటి పక్కనున్న వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు మహిళను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. మహిళ తండ్రి ఫిర్యాదు మేరకు హనుమంతుపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

'పది' ప్రశ్న పత్రాల లీక్‌పై దర్యాప్తు చేయాలి

వైఎస్సార్‌ఎస్‌యూ డిమాండ్

సాక్షి, అమరావతి: సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పదో తరగతి పరీక్షా ప్రశ్న పత్రాల లీకేజీ కారకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ (వైఎస్సార్ ఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈమేరకు యూనియన్ నాయకులు బుధవారం మంగళగిరి బైపాస్ రోడ్డులోని పాఠశాల విద్యా భవన్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మాట్లాడుతూ.. సమ్మెటివ్ పరీక్షలు జరుగుతున్న తరుణంలో పరీక్ష నిర్వహణ కంటే ముందే ఆన్‌లైన్‌లో పదో తరగతి లెక్కల ప్రశ్నపత్రం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై పాఠశాల విద్యాశాఖ లోతుగా విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి అంబటి, వైఎస్సార్‌సీపీ నేతలపై కేసు నమోదు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 16వ తేదీన మాజీ మంత్రి అంబటి రాంబాబు.. పార్టీ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తూ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దుష్ప్రచారం చేస్తూ పెట్టిన పోస్టులపై కేసు నమోదు చేయాలని కోరుతూ సోమవారం అంబటి.. పార్టీ నేతలు నూరి ఫాతిమా, వనమాబాల వజ్రబాబు, నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సమయంలో విధులకు ఆటంకం కలిగిందని రైటర్ పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వారం దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'అల్ట్రాటెక్' లీజు పొడిగింపు

సాక్షి, అమరావతి: అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ కంపెనీ లైమ్‌స్టోన్ లీజును ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు గనుల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నికోటలో 2004 ఏప్రిల్‌లో 912.797 ఎకరాల్లో లైమ్‌స్టోన్ మైనింగ్ లీజును మంజూరు చేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌తో ఆ గడువు ముగిసింది. దీంతో లీజును 2054 ఏప్రిల్ 26 వరకు గడువును పొడిగించింది.

తీర భద్రతా 'నిర్దేశక్'

80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మాణం

- జీఆర్ఎస్ఈలో సిద్ధమైన సర్వే, హైడ్రోగ్రాఫిక్ వెసల్ నిర్దేశక్
- 110 మీటర్ల పొడవు, 3,800 టన్నుల బరువుతో నిర్మాణం పూర్తి



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సాగర గర్భంలో ఏం జరుగుతోంది? ఉపరితలంపై ముంచుకొస్తున్న ముప్పు ఏంటి? సముద్రంలో శత్రుదేశాల నుంచి తలెత్తే ఆపదలేంటి? ఇలా సుదీర్ఘ భారత సముద్ర తీరంలో అణువణువూ సర్వే చేసి... నావికాదళానికి అందించేందుకు నిర్దేశకుడు వస్తున్నాడు. సంధాయక్ క్లాస్‌లో రెండో అతి పెద్ద సర్వే వెసల్‌గా ఐఎన్ఎస్ నిర్దేశక్ బుధవారం జల ప్రవేశం చేసింది. 2014 వరకూ సేవలందించిన నౌక నిర్దేశక్‌ను గుర్తు చేసుకుంటూ ఈ కొత్త నౌకకూ అదే నామకరణం చేశారు. ఇండియన్ నేవీలో కీలక పాత్ర పోషిస్తున్న తూర్పు నౌకాదళం నుంచి సేవలందించేందుకు ఐఎన్ఎస్ నిర్దేశక్ సిద్ధమవుతోంది. కోల్‌కతాలో రూపుదిద్దుకున్న నిర్దేశక్... విశాఖలో రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ చేతుల మీదుగా జాతికి అంకితమైంది.

80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో...!

దేశంలోనే అతిపెద్ద సర్వేనౌక ఐఎన్ఎస్ సంధాయక్ తర్వాత... రెండో అతి పెద్ద సర్వే వెసల్ ఐఎన్ఎస్ నిర్దేశక్ భారత నౌకాదళంలో ప్రవేశించింది. 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్(జీఆర్ఎస్ఈ) సంస్థ 2020లో దీని తయారీ ప్రారంభించింది. నౌకాదళం కోసం జీఆర్ఎస్ఈ తయారుచేస్తున్న నాలుగు అధునాతన సర్వే నౌకల్లో నిర్దేశక్ రెండోది కావడం విశేషం. ఓడరేవులు, నావిగేషనల్ ఛానెళ్లు, ఎకనమిక్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో కోస్టల్, డీప్ వాటర్ హైడ్రో-గ్రాఫిక్ సర్వే నిర్వహించడం, రక్షణ కోసం ఓషనోగ్రాఫిక్ డేటాను సేకరించడంలో నిర్దేశక్ కీలక పాత్ర పోషించనుంది. దీంతోపాటు శోధన-రెస్క్యూ, సముద్ర పరిశోధనతో పాటు విపత్తు సమయంలో వైద్య సేవలందించే హాస్పిటల్ షిప్‌గానూ నిర్దేశక్‌ను తయారు చేశారు. రక్షణ మంత్రిత్వ శాఖలో బలీయమైన శక్తిగా తూర్పు నౌకాదళం ఎదుగుతున్న నేపథ్యంలో ఈ అత్యాధునిక సర్వే వెసల్‌ని విశాఖపట్నం కేంద్రంగా సేవలందించేందుకు కేటాయించాలని భారత నౌకాదళం నిర్ణయించినట్టు సమాచారం. అయితే.. తొలి షిప్ సంధాయక్ ఇప్పటికే విశాఖ కేంద్రంగా సేవలందిస్తున్న నేపథ్యంలో రెండింటిలో ఒక నౌకని పశ్చిమ నౌకాదళానికి కేటాయించే అవకాశం ఉందని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.

నిర్దేశక్‌కు గుర్తుగా...!

గతంలో నిర్దేశక్ పేరుతో సర్వే నౌక దేశానికి సుదీర్ఘంగా 31 ఏళ్ల సేవలందించింది. అనంతరం దీన్ని 2014 డిసెంబర్ 19న ఉపసంహరించారు. 1983 అక్టోబర్ 4న దీన్ని జాతికి అంకితం చేశారు. కేవలం సర్వే సేవలతో పాటు ఆపద సమయాల్లో ఇది ఆస్పత్రి నౌకగా కూడా మారిపోయింది. ప్రధానంగా కాండ్లాలో వచ్చిన భూకంపం సమయంలో, శ్రీలంకలో సంభవించిన సునామీ సమయంలో ఈ నౌక విశేష సేవలందించింది. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ కేంద్రంగా ఇది పనిచేసింది. 18 మంది అధికారులతో పాటు 160 మంది సిబ్బంది ఇందులో సేవలందించేవారు. 1980 టన్నుల బరువు, 87.8 మీటర్ల పొడవైన ఈ నౌక... గంటకు 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇదే పేరుతో వస్తున్న కొత్త నౌక మాత్రం 3,800 టన్నుల బరువు కలిగి ఉండటంతో పాటు 110 మీటర్ల పొడవు ఉంది. ఇది గంటకు 33 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు.

రూ.2,435 కోట్లతో 4 సర్వే వెసల్స్ నిర్మాణం

1968 నుంచి సంధాయక్ సర్వే వెసల్ భారత నౌకాదళంలో విశిష్ట సేవలందించి 2021లో సేవల నుంచి నిష్క్రమించింది. ఈ తరుణంలో ఇండియన్ నేవీకి సర్వే నౌకలు అవసరమని భావించిన రక్షణ మంత్రిత్వ శాఖ 2017లోనే నాలుగు సంధాయక్ క్లాస్ సర్వే వెసల్స్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. రూ.2,435.15 కోట్లతో బిడ్‌ను జీఆర్ఎస్ఈ దక్కించుకుంది. అత్యాధునిక సాంకేతికతతో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో ఈ షిప్‌లను నిర్మిస్తున్నారు. ఈ క్లాస్ షిప్‌లలో మొదటిది జే18 పేరుతో ఐఎన్ఎస్ సంధాయక్‌ను 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించగా... జే 19 పేరుతో ఐఎన్ఎస్ నిర్దేశక్‌ని 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో పూర్తి చేశారు. తర్వాత ఐఎన్ఎస్ ఇక్షక్, ఐఎన్ఎస్ సంశోధక్ షిప్‌లు 2025 నాటికి భారత నౌకాదళంలోకి చేరనున్నాయని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.



ఐఎన్ఎస్ నిర్దేశక్‌ను జాతికి అంకితం చేస్తున్న కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్

జాతికి అంకితం

విశాఖ సిటీ: హిందూ మహాసముద్రంలో భారత్ తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకునేందుకు ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌక సేవలు దోహదపడతాయని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ పేర్కొన్నారు. భారీ అత్యాధునిక సర్వే నౌక ఐఎన్ఎస్ నిర్దేశక్‌ను ఆయన బుధవారం విశాఖలోని నేవల్ డాక్ యార్డ్‌లో జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్-ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) సంస్థ 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో ఈ నౌకను నిర్మించిందని చెప్పారు. ఈ నౌకలో మల్టీ బీమ్ ఎకో సౌండర్‌లు, సైడ్ స్కాన్ సోనార్లు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్ వంటి అధునాతన హైడ్రోగ్రాఫిక్ సిస్టమ్‌లు పొందుపరిచినట్లు వెల్లడించారు. ఓడరేవులు, నావిగేషనల్ చానల్స్, ఎకనామిక్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో కోస్టల్, డీప్ వాటర్ హైడ్రో-గ్రాఫిక్ సర్వే నిర్వహణ, రక్షణ కోసం ఓషనోగ్రాఫిక్ డేటాను సేకరించడంలో నిర్దేశక్ కీలక పాత్ర పోషించనుందని వివరించారు. శోధన-రెస్క్యూ, సముద్ర పరిశోధనతో పాటు విపత్తుల సమయంలో వైద్య సేవలందించే హాస్పిటల్ షిప్‌గానూ సేవలు అందించనుందని చెప్పారు. ఈ నౌక హిందూ మహాసముద్రంలో భద్రతతోపాటు పర్యావరణ, శాస్త్రీయ అన్వేషణ, శాంతి పరిరక్షక కార్యక్రమాలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందన్నారు.

అత్యాధునిక సర్వే సాంకేతికత

తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ మాట్లాడుతూ.. 110 మీటర్ల పొడవున్న నిర్దేశక్ నౌక అత్యాధునిక సర్వే సాంకేతికతను కలిగి ఉందని తెలిపారు. హిందూ మహాసముద్ర పరిసర ప్రాంతాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు చేస్తూ భారత్ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించేందుకు ఈ నిర్దేశక్ నౌక కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 2025 నాటికి మరో రెండు నౌకలు భారత నౌకాదళంలోకి చేరనున్నాయని వెల్లడించారు.

నిర్దేశక్ సత్తా ఇదీ..



పొడవు: 110 మీటర్లు

బరువు: 3,800 టన్నులు

వేగం: గంటకు 33 కి.మీ. (18 నాటికల్ మైళ్లు)	సామర్థ్యం: 30 కి.మీ. వేగంతో ఏకధాటిగా 12 వేల కి.మీ. దూరం ప్రయణించగలదు	సిబ్బంది: 231 మంది
		ఇంజిన్ సామర్థ్యం: 2 డీజిల్ ఇంజిన్లు
సముద్రంలో: 25 రోజులు తీరానికి రాకుండా పహారా కాయగల సత్తా నిర్దేశక్ సొంతం		ఆయుధ సంపత్తి: సీఆర్ఎన్91 నేవల్ గన్, హాల్ హెలికాప్టర్..

సెన్సార్: అటానమస్ అండర్ వాటర్ వెహికల్ సెన్సార్, హైడ్రోగ్రాఫిక్ సెన్సార్ పరికరాలు, సముద్ర కాలుష్యాన్ని గణించే మార్పుల్ వ్యవస్థ, రిమోట్ ఆపరేటెడ్ వెహికల్స్(ఆర్‌వోవీ), సైడ్ స్కాన్ సోనార్‌లు ఏర్పాటు చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

తిరుపతి రోప్‌వే ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం కాలేదు..

వైఎస్సార్ సీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: రోప్‌వేల విషయంలో ఏపీతో సహా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేంద్రం ఎప్పటికప్పుడు ప్రతిపాదనలను స్వీకరిస్తుందని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. తిరుపతిలో పర్వతమాల పరియోజన పథకం కింద రోప్ వే ప్రతిపాదించబడిందనేది వాస్తవమా? కాదా అంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి రాజ్యసభలో ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్ కోసం వివరణాత్మక సాధ్యసాధ్యాల నివేదిక సిద్ధం కాలేదంటూ రాతపూర్వకంగా కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

స్వాతంత్య్ర సమరయోధులకు అనేక ప్రయోజనాలు




స్వాతంత్య్ర సమరయోధులకు అనేక ప్రయోజనాలను కేంద్రం అందిస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. వారికి అందించే పెన్షన్‌ను 2016, ఆగస్టు 15న సవరించినట్లు చెప్పారు. రాజధాని, శతాబ్ది, దురంతో సహా అన్ని రైళ్లలో సెకెండ్, థర్డ్ ఏసీలో జీవితకాలం ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉందన్నారు. అవే తరగతుల్లో జీవిత భాగస్వాములకు కూడా ఈ సదుపాయం ఉందని తెలిపారు. సీజీహెచ్ఎస్ కింద ఉచిత వైద్య సౌకర్యాలు, పీఎస్‌యూలు నిర్వహించే ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందిస్తున్నట్లు కేంద్రమంత్రి చెప్పారు.

ఏపీలో నైపుణ్యాభివృద్ధికి రూ.72.58కోట్లు కేటాయింపు

నైపుణ్యాభివృద్ధి కింద మూడేళ్లలో ఏపీ ప్రభుత్వం రూ.72.58కోట్లు కేటాయించినట్లు స్కిల్ డెవలప్‌మెంట్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మూడేళ్లలో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎంత కేటాయించాయో చెప్పాలంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

పీఏసీఎస్‌లు పెట్రోల్/డీజిల్ డీలర్‌షిప్ చేయొచ్చు



ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీలు పెట్రోల్, డీజిల్ పంపుల రిటైల్ డీలర్‌షిప్‌లను చేపట్టడానికి ప్రభుత్వం అనుమతిచ్చినట్లు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు పీఏసీఎస్‌లు ఇందుకోసం దరఖాస్తు చేసుకున్నట్లు కేంద్ర మంత్రి అమిత్‌షా వెల్లడించారు.

రోడ్డు భద్రతా ఆడిట్ కోసం మార్గదర్శకాలు



రహదారుల శాఖ జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ఆడిట్ నిర్వహించడానికి 'ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్'(ఐఆర్‌సీ) మార్గదర్శకాలను రూపొందించినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్.నిరంజన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

ఏపీలో ఆరు ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలు


ఏపీలో ఆరు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. దేశంలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌ల వివరాలపై ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్ఎస్ఎల్ ఒకటి, ప్రాంతీయ ఎఫ్ఎస్ఎల్‌లు ఐదు ఉన్నట్లు బండి సంజయ్ వివరించారు.

రెండేళ్ల వ్యవధిలో 8.73 లక్షల ప్రమాదాలు

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2021-22 మధ్య దాదాపు 8లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు సంభవించాయని రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వాల నివేదికల ఆధారంగా అతివేగం, మొబైల్ ఫోన్ వాడకం, డ్రంకెన్ డ్రైవ్, మాదక ద్రవ్యాల వినియోగం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ కారణంగా ఏపీ, తెలంగాణలో రెండేళ్ల వ్యవధిలో 85,739 రోడ్డు ప్రమాదాలు సంభవించాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు ఏజెన్సీల ద్వారా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు ఆయా ఏజెన్సీలకు ఆర్థిక సాయాన్ని సైతం అందిస్తున్నట్లు తెలిపారు.

ఏపీలో 41 రైల్వే ప్రాజెక్టులు..

వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మ తనూజరాణి ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి రూ.73,743 కోట్ల ప్రణాళికా వ్యయంతో 5,329 కి.మీ పొడవుతో 41 రైల్వే ప్రాజెక్టులు ప్రణాళిక/ఆమోదం/ నిర్మాణ దశలో ఉన్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ 41 ప్రాజెక్టుల్లో 17 కొత్త లైన్లు, 24 డబ్లింగ్ లైన్లు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మ తనూజరాణి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. కాగా ఈ ఏడాది మార్చి నాటికి రూ.24,150 కోట్లతో 1,006 కి.మీ పొడవు రైల్వే లైన్లు ప్రారంభించామన్నారు. 2009-2014 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేలైన్లకు ఏడాదికి రూ.886 కోట్లు కేటాయించారని... 2024-25 సంవత్సరానికి రూ.9,151 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు.

కడప-రేణిగుంట 4లైన్ల పనుల్లో జాప్యాన్ని నివారించండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వైఎస్సార్‌సీపీ ఎంపీల బృందం వినతి

సాక్షి, న్యూఢిల్లీ: 21 నెలల క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తయిన కడప-రేణిగుంట (4లైన్లు) ఎన్‌హెచ్-716 పనుల్లో చోటు చేసుకున్న తీవ్ర జాప్యాన్ని తక్షణమే నివారించాలని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని వైఎస్సార్‌సీపీ ఎంపీల బృందం కోరింది. ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మద్దిల గురుమూర్తి, వైఎస్ అవినాష్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. దాదాపు 120. 489కి.మీ పొడవు గల ఈ రోడ్డు రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గం మీదుగా వెళుతుందన్నారు. తక్షణం స్పందించి ఈ ప్రాజెక్టు పరుగులు పెట్టేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.

మరో ఘటన జరగకూడదనే బన్నీ రాలేదు

శ్రీతేజను పరామర్శించిన అల్లు అరవింద్



రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన బాలుడు శ్రీతేజను పరామర్శించేందుకు వస్తే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయోనన్న ఉద్దేశంతోనే బన్నీ రాలేదని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ స్పష్టం చేశారు. ఈ ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను ఆయన బుధవారం పరామర్శించి.. బాలుని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అరవింద్ మాట్లాడుతూ సంఘటన జరిగిన మర్నాడే.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను పరామర్శించేందుకు బన్నీ రావాలనుకున్నాడని తెలిపారు. కానీ మరో ఘటన జరగకుండా చూసుకోవాలని ఆస్పత్రి వర్గాలు చెప్పడంతో రాలేదని వివరించారు. పోలీసులు కేసు నమోదు చేయడంతో.. లీగల్ టీమ్ సలహాతో విరమించుకున్నాడని చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

క్లుప్తంగా...

కోన శశిధర్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శిగా పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు చూస్తున్న జేఏడీ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్‌ను ఆ విధులను నుంచి రిలీవ్ చేస్తున్నట్లు సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి'

సాక్షి, న్యూఢిల్లీ: కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని 'కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఢిల్లీలో బుధవారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని రూపొందించిన వ్యక్తి ఫొటో కరెన్సీ నోట్లపై లేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పలనాయుడు, మల్లు రవి, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశంపై తమ అభిప్రాయం వ్యక్తం చేస్తామని చెప్పారు. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించే వరకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచండి

అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై సీడీఎంఏతో సమావేశం

సాక్షి, అమరావతి: మున్సిపల్ శాఖలో ఇంజనీరింగ్ ఆఫీస్ సిబ్బంది, మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు జీవో నం.36 ప్రకారం వేతనాలు పెంచలేదని, ఫుల్ టైమ్ పనిచేయించుకుంటూ పార్ట్‌టైమ్ వేతనాలు ఇస్తోందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు పేర్కొన్నారు. ఈఏడాది జనవరిలో జరిగిన మున్సిపల్ వర్కర్ల సమ్మెలో భాగంగా వీరికి న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారంపై ఏఐటీయూసీ, టీఎన్టీయూసీ, ఇతర కార్మిక సంఘాల నేతలతో బుధవారం వడ్డేశ్వరంలోని సీడీఎంఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. సీడీఎంఏ హరినారాయణన్, కార్మిక సంఘాల జాయింట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం కమిటీని నియమించిందనీ, ఎన్నికల కోడ్ కారణంగా నివేదికను అమలు చేయలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ డైరెక్టర్ హరినారాయణన్ కార్మికుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంత్రితో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సుబ్బారాయుడు తెలిపారు.

గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను కొనసాగించి ముఖ్యమంత్రి తన మాట నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరుతూ ఏపీ వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో 50 గంటల ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. బుధవారం విజయవాడలోని దీక్ష శిబిరంలో పాల్గొని వలంటీర్లకు రామకృష్ణ మద్దతు తెలిపారు. నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. ఎన్నికల్లో సాక్షాత్తు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వలంటీర్లకు ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతున్నారని, వలంటీర్ వ్యవస్థను కొనసాగించి రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పంది దాడిలో వ్యక్తి మృతి

ఉదయగిరి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పంది దాడిచేసి గాయపరచడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లి గ్రామంలో వరి పొలం వద్ద కుమ్మిత బాలవెంగయ్య (53) కాపలాదారుడిగా ఉన్నాడు. మంగళవారం రాత్రి అతనిపై పంది దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

ఉదయగిరి అడవుల్లో మూగజీవాల వధ

ఉదయగిరి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో హనుమాన్ నాలా వద్ద నల్లబండ సమీపంలో రెండు మూగజీవాల కళేబరాల అవశేషాలను బుధవారం స్థానికులు గుర్తించారు. ఈ సమాచారం ఆనోటా ఈనోటా వ్యాప్తిచెంది దుప్పులను వధించినట్లుగా ప్రచారం జరిగింది. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు స్థలానికి వెళ్లి మూగజీవాల శరీర భాగాలను సేకరించారు. ఇవి వన్యప్రాణులవా లేక పశువుల కళేబరాలా అనే విషయాన్ని రెండ్రోజుల్లో తెలియజేస్తామని తెలిపారు. ఆవులను వధించి మాంసం తీసుకెళ్లి కళేబరాలను అక్కడ వేసినట్లుగా ఉందని స్థానికులు అనుమానిస్తున్నారు.

తీరంలో ఘోరం

సముద్రపు ఇసుకను కొల్లగొట్టేస్తున్నారు

విశాఖ భీమిలీ తీరంలో టీడీపీ కూటమి తిమింగలాల బరితెగింపు

నదులు, వాగుల్లోని ఇసుకనే కాదు.. అధికార టీడీపీ కూటమి 'తిమింగలాలు' ఇప్పుడు సముద్ర తీరంలోని ఇసుకనూ కొల్లగొట్టేస్తున్నారు. ఖనిజాన్వేషణ కోసం ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారు. రాత్రికి రాత్రి రాష్ట్ర సరిహద్దులు దాటించేస్తున్నారు. ఫలితంగా సముద్ర తీరంలో కందకాలు ఏర్పడుతున్నాయి. ఇలా సాగరతీరాన్ని చెరువులుగా మార్చేస్తూ.. మత్స్యసంపదకు, ప్రకృతికి విఘాతం కలిగిస్తున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. విశాఖలోని భీమిలి తీరం ఈ అరాచకానికి కేంద్రంగా మారింది.



మంగమారిపేట బీచ్‌లో ఏర్పడిన గోతులు

- ఖనిజాల కోసం రాత్రిపూట అక్రమంగా రాష్ట్రం దాటిపోతున్న ఇసుక
- కందకాలుగా మారిపోతున్న సాగర తీరం
- సీ బెడ్‌కు మీటరు లోతులోనే ఖనిజ నిక్షేపాలు
- రెండు మీటర్లకు పైగా తవ్వకాలు చేస్తున్న ఇసుక దొంగలు
- గార్నెట్, జిర్కోనియం, సిలిమినైట్ వంటి ఖనిజాల కోసమే దోపిడీ
- ఫిర్యాదులొస్తున్నా చోద్యం చూస్తున్న అధికారులు

సాక్షి, విశాఖపట్నం: భీమిలి తీరంలో అరుదైన ఖనిజ నిక్షేపాలుండటంతో అక్రమ తవ్వకాలు పెచ్చరిల్లుతున్నాయి. ఇక్కడ బీచ్ రోడ్డు వెంబడి తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతంలో రాత్రి సమయాల్లో కొందరు లారీలు, మినీ వ్యాన్‌ల ద్వారా ఇసుకను తవ్వి అక్రమంగా తరలించేస్తున్నారు. ఫలితంగా పెద్దపెద్ద గోతులు ఏర్పడుతూ తీరప్రాంత భద్రతని కలవరపెడుతోంది. ఇప్పటికే తుపాను సమయాల్లో రుషికొండ, ఐటీ జంక్షన్, సాగర్‌నగర్, తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో సముద్రం పెద్దఎత్తున కోతకు గురవుతోంది. ఇప్పుడు కూటమి నేతల ఇసుక దందాతో 2–3 మీటర్ల మేర భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. ఈ తరహా గోతులతో ఆటుపోట్ల సమయంలో తీరం కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

మాకేం తెలీదు.. మేమేం చూడలేదు?

ఇక కూటమి నేతలు సముద్ర తీరాన్ని విధ్వంసం చేస్తూ.. భారీ గుంతలు తవ్వుతూ ఇసుకను దోచేస్తున్నా అధికారులు మాత్రం అలాంటివేమీ జరగడం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అక్రమ రవాణా కోసం ప్రత్యేకంగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటుచేసుకున్నా పట్టించుకోవడంలేదు. సీఆర్‌జెడ్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకపోయినా.. టన్నుల కొద్దీ ఇసుక తరలిపోతుండటంతో మత్స్య సంపదకు విఘాతం కలుగుతోందని స్థానికులు భీమిలి డివిజన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అవన్నీ తీరంలోనే కప్పేస్తున్నారు తప్ప.. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు మాత్రం అడుగు ముందుకెయ్యడంలేదు. పైగా.. కూటమి నేతల ఇసుక దాహాన్ని కప్పిపుచ్చే విషయంలో మాత్రం జిల్లా రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు ఎంతో సమన్వయం పాటిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి.

అపారమైన ఖనిజ నిక్షేపాలే కారణం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్మాణ రంగాన్ని ఇసుక కొరత వేధిస్తోంది. దీంతో.. సముద్రంలో దొరుకుతున్న ఇసుకని ఇంటి నిర్మాణ పనులకు వాడుతున్నామంటూ తప్పుదోవ పట్టించి విచ్చలవిడిగా తోడేస్తూ రాత్రికి రాత్రి రాష్ట్రాలు దాటించేస్తున్నారు. నిజానికి.. సముద్రపు ఇసుక ఇంటి నిర్మాణానికి వినియోగించేది చాలా అరుదు. కానీ.. ఇందులో అపారమైన ఖనిజ నిక్షేపాలు దాగి ఉండడంతో వీటి కోసమే ఈ తవ్వకాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమిలి తీర ప్రాంతంలో 24 రకాల ఖనిజ నిక్షేపాలతో కూడిన బ్లాకులున్నాయని గతంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఇటీవల తీరంలో ఇసుక నల్లగా కనిపించడం కూడా దీనిని బలపరుస్తోంది. ఇదే ఇప్పుడు కూటమి నేతల పాలిట వరంగా మారింది. ఇక్కడి ఇసుకలో గార్నెట్, జిర్కోనియం, ఇలిమినైట్, సిలిమినైట్, రూటిల్, లికాక్సిన్, మోనోజైట్ వంటి మినరల్స్ ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భీమిలిలోని 24 బ్లాకుల్లో సుమారు 4.302 మిలియన్ టన్నుల భారలోహాలున్నాయి. సీ బెడ్‌కు కేవలం ఒక మీటరు లోతు నుంచే ఈ ఖనిజ నిక్షేపాలున్నాయని తెలుస్తోంది. అందుకే.. ఖనిజ నిక్షేపాల కోసం ఇసుక తవ్వకాలు జరుపుతూ రూ.కోట్ల లావాదేవీలు చేతులు మారుతున్నట్లు సమాచారం.

అత్యంత అరుదైన ఖనిజ నిక్షేపాలివి..

భీమునిపట్నం తీరంలో లభ్యమయ్యే ఖనిజాలు అత్యంత అరుదైనవని జీఎస్‌ఐ భావిస్తోంది. ఇక్కడ లభ్యమయ్యే గార్నెట్ నిక్షేపాలను శాండ్ బ్లాస్టింగ్, వాటర్ జెట్ కటింగ్, వాటర్ ట్రీట్‌మెంట్ కోసం వినియోగిస్తారు. ఇలిమినేట్, రూటిల్, లికాక్సిన్ వంటి మినరల్స్‌ను సింథటిక్ రూటిల్స్, టైటానియం డైయాక్సిడ్ పిగ్మెంట్, టైటానియం స్పాంజ్, టైటానియం టెట్రాక్లోరైడ్, టైటానియం మెటల్ తయారీకి వినియోగిస్తారు. అత్యంత అరుదుగా లభించే టైటానియం మెటల్స్‌ను ఎయిర్‌క్రాఫ్ట్స్, స్పేస్ షెటిల్స్, వైద్య పరికరాల తయారీలో వినియోగిస్తుంటారు. ఇందుకోసమే ఎక్కువ లోతులో ఇసుకని తవ్వి చెన్నై, కేరళకు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది.



ఉప్పాడ తీరంలో విధ్వంసం

పెద్దపెద్ద లారీల ద్వారా తరలిస్తున్నారు..



తీర ప్రాంతాల్లో సముద్రపు ఇసుకను అడ్డగోలుగా తవ్వేస్తూ తరలించేస్తున్నారు. ఫలితంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఇది తీరప్రాంత భద్రతకు ముప్పు కలిగించడమే. ఈ గోతులు చూస్తుంటే సముద్రం ఎప్పుడు ముందుకొచ్చేస్తుందోనని మా ప్రాంత ప్రజలంతా భయపడుతున్నాం. పెద్ద పెద్ద లారీల ద్వారా ప్రతిరోజూ ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

– వేముల ఈశ్వర్‌రెడ్డి, కాపులుప్పాడ

చేపలు దొరకడంలేదు..



ఇప్పటికే గంగమ్మ తల్లి ముందుకొచ్చేస్తూ భయపెడుతోంది. ఇలాంటి ప్రాంతంలో ఇసుక దోచేస్తుండటం మాకు భయం కలిగిస్తోంది. ఇసుక లేకపోతే అలల రాకపోకల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. దీనివల్ల.. ఇటువైపు చేపల రాక ఆగిపోతుంది. ఈ అక్రమ తవ్వకాలు జరిగినప్పటి నుంచి ఈ ప్రాంతాల్లో వేటకు వెళ్తుంటే చేపలు సరిగా దొరకడంలేదు. ఇదే రీతిలో అక్రమ రవాణా కొనసాగితే చిన్న చేప కూడా పట్టుకోలేం.

– మేరుగు చిన్నారావు, మత్స్యకారుడు, మంగమారిపేట

భవిష్యత్తులో తీర భద్రతకు పెనుముప్పు..



సముద్రపు ఇసుకను అక్రమంగా తరలించడం తీర ప్రాంత ప్రజలకు భవిష్యత్తులో ప్రమాదకరం. బీచ్ రోడ్డు ప్రధాన రహదారి వెంబడి యథేచ్ఛగా ఇసుకను రవాణా చేస్తున్నా అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ అనేక సీసీ కెమెరాలున్నాయి. ఇసుక తరలింపుపై దృష్టిపెట్టి అధికారులు చర్యలు తీసుకుంటే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వెయ్యొచ్చు.

– దౌలపల్లి కొండబాబు, 4వ వార్డు కార్పొరేటర్

పందెం పుంజా... మజాకా!

రాజభోగాలతో పెంపకం

- జాతిని బట్టి పలుకుతున్న రేటు
- రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధర
- సంక్రాంతి బరిలో దింపేందుకు తర్ఫీదు

నిడదవోలు: సంక్రాంతి సందర్భంగా గోదావరి జిల్లాల్లో నిర్వహించే కోడి పందేలను తిలకించడానికి పలువురు ఆసక్తి చూపుతారు. రాజకీయ నేతలు, సినీ ప్రముఖులు సైతం పందేలకు సై అంటారు. పండగ సమీపిస్తుండడంతో కోడి పుంజుల వేటలో పందెం రాయుళ్లు ఉంటే మరోపక్క నిర్వాహకులు మూడు నెలల నుంచి పుంజుల పెంపకంలో నిమగ్నమయ్యారు. కోళ్ల పెంపకం దార్లు, పందెంరాయుళ్లు మాత్రం పుంజులకు రాజభోగాలతో మేత పెట్టి మరీ పందేలకు సిద్ధం చేస్తున్నారు. పోలీసులు హెచ్చరిస్తున్నా ఏటా పందెంరాయుళ్లు బరితెగించి కోళ్లకు కత్తులు కట్టి బరుల్లో రక్తపుటేరులు పారిస్తున్నారు.

డిమాండ్‌ను బట్టి..

కత్తులు కట్టి బరిలో దింపే పుంజుల ధరలు వింటే ఆశ్చర్యం కలుగుతుంది. కోడిపుంజుల జాతులను పందెం రాయుళ్లు పలు రకాలుగా పిలుస్తారు. రకాన్ని బట్టి ఒక్కో పుంజు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతోంది. ప్రధానంగా సేతువు జాతి కోడి మీద పందేలు జోరుగా కాస్తారు. దీని ధర రూ.70 వేల వరకు పలుకుతోంది. వర్ల రకం కోడి ధర రూ. 50 వేలు ఉంది. నెమలి రకం కోడి పుంజు ప్రస్తుతం రూ.50 వేల నుంచి రూ.60 వేలు పలుకుతోంది. కాకి డేగ, పర్ల రూ.25 వేల నుంచి రూ.30 వేలు, ఎర్ర కెక్కిరాయి రూ.40 వేల ధర పలుకుతోంది. పచ్చకాకి డేగ రూ.30 వేల నుంచి రూ.40 వేలుకు అమ్ముతున్నారు. డిమాండ్‌ను బట్టి పుంజుల పెంపకందారులు రేటును అమాంతం పెంచుకుంటూ పోతున్నారు. రసంగి, సేతువా, కెక్కరి, పూల, అబ్రస్, రసంగి, పండుడేగ, మైయిలా, సింగాలి, పెట్టమారు, అబ్రాసు, పింగళ వంటి రకాల కోడి పుంజులు రూ.25 వేల నుంచి రూ.30 వేల ధరకు పందెం రాయుళ్లు కొనుక్కుని పోతున్నారు.



పౌష్టికాహారంతోపాటు వ్యాయామం

ప్రతీరోజు వీటిని ఈత కొట్టించడంతో పాటు వేడి నీళ్లతో స్నానం చేయించి శక్తివంతమైన పుంజులుగా తీర్చిదిద్దుతారు. నవంబర్ మాసం నుంచి వీటికి గంట్లు, చోళ్లు, గుడ్లు, పిస్తాలు, బాదం, జీడిపప్పు, ఎండు ద్రాక్ష, కిస్మిస్, నల్ల నువ్వులు, తాటిబెల్లం, మటన్ కైమా, నాస్తా వంటివి ఆహారంగా ఇస్తారు. పౌష్టికాహారం తీసుకున్న పుంజులకు అరుగుదలకు, బద్ధకం, నీరసం రాకుండా ప్రతీ రోజూ వ్యాయామాలు కూడా చేయిస్తున్నారు.



ఇలా ఈత కొట్టిస్తారు



పందెంకు సిద్ధం



బరిలో దింపేందుకు బాదం మేత

జనవరిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలు పరిష్కారం

కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి హామీ



కేంద్రమంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: జనవరిలోగా స్టీల్‌ప్లాంట్ సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందని కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చినట్లు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. సీపీఎం రాజ్యసభ సభ్యుడు డాక్టర్ వి.శివదాసన్ నేతృత్వంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసి స్టీల్‌ప్లాంట్ సమస్యలపై వినతిపత్రం అందించారు. స్టీల్‌ప్లాంట్‌లో తమ పర్యటన అనంతరం ఇచ్చిన హామీల మేరకు పరిస్థితులు చక్కబడతాయని ఆశించగా, మరింతగా క్షీణించాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తీవ్ర ఆర్థిక సంక్షోభం సిబ్బందిని మానసికంగా కుంగదీస్తున్నట్లు తెలిపారు. కొన్ని నెలలుగా ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించక పోగా ఉన్న హెచ్‌ఆర్‌ఏ, తదితర అలవెన్సులను తొలగించారని పేర్కొన్నారు. స్థానిక యాజమాన్యం ఉక్కు మంత్రిత్వశాఖ పేరిట చెల్లింపులు నిలిపి వేసిందన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ సందర్భంగా చెల్లించే లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం ఉన్న ఫండ్ నుంచి రూ.390 కోట్లు యాజమాన్యం ఉపసంహరించిందన్నారు. అదే విధంగా ఉద్యోగులకు చెందిన పీఎఫ్, ఎస్ఏబీఎఫ్ ట్రస్టులకు రూ.900 కోట్ల చెల్లింపులు నిలిపి వేసిందన్నారు. త్రిఫ్ట్ సొసైటీతో పాటు ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ సభ్యులకు కూడా చెల్లింపులు ఆపేసిన విషయాన్ని మంత్రికి నివేదించారు. స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు కోసం క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ చేయడంతో పాటు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ అందజేయాలని అభ్యర్థించారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ఇస్తుందని, తద్వారా ఉద్యోగుల పెండింగ్ జీతాలు క్లియర్ చేస్తామని హామీ ఇచ్చినట్లు పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

వేద విద్య వ్యాప్తికి టీటీడీ విశేష కృషి

తిరుపతి సిటీ: వేద విద్య వ్యాప్తికి, వేద పరిరక్షణకు టీటీడీ విశేష కృషి చేస్తోందని టీటీడీ ఈవో జే శ్యామలరావు పేర్కొన్నారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి వర్సిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వీ వేద వర్సిటీ టీటీడీ 2006లో ప్రారంభించడం జరిగిందని, అప్పటి నుంచి వేద విద్యలో ఉన్నతస్థాయి పరిశోధనలు జరిగాయన్నారు. వేద పరిశోధనలో భాగంగా వేదాల్లో ఉన్న విజ్ఞానాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. త్రికోణమితి, వేదిక్ మ్యాథ్స్, ఖగోళశాస్త్రం వంటి అంశాలు వేదాల్లో ఉన్నవేనని తెలిపారు. ఐఐటీ సహకారంతో ప్రాచీన భారతీయ శాస్త్రాల్లో ఉన్న విజ్ఞానాన్ని నేటి యువతకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వేద విద్య వ్యాప్తికి ఆరు వేద పాఠశాలు ప్రారంభించడం జరిగిందని, వర్సిటీ ఆధ్వర్యంలో వేద పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాచీన తాళ పత్ర గ్రంథాలను సేకరించి, పరిష్కరించి, డిజిటలైజేషన్ చేసేందుకు తగిన చర్యలు తీసుకుని భద్రపరచాలని సూచించారు. భవిష్యత్తులో వేదాల్లోని సైన్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి హిందూ ధర్మ పరిరక్షణకు కృషి జరుగుతుందని తెలియజేశారు. అనంతరం వేద వాంగ్మయమునకు చెందిన శుక్ల యజుర్వేద వాజసనీయ ప్రాది సాఖ్యము 'సేవది' అనే పుస్తకాలను ఆవిష్కరించారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,598 మంది స్వామి వారిని దర్శించుకోగా 20,102 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

సిరులతల్లికి ప్రత్యేక పూజలు



విశాఖ విద్య: మార్గశిర మాసోత్సవాల 17వ రోజు బుధవారం అధిక సంఖ్యలో భక్తులు విశాఖలోని సిరులతల్లి శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి.

నామ సంకీర్తనం మోక్షదాయకం

జంగారెడ్డిగూడెం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తిరుప్పావై మూడవ పాశురం అర్థాన్ని ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమారాచార్యులు తెలియజేశారు. భగవంతుని నామ సంకీర్తన చేయటం ద్వారానే పరమాత్ముని అనుగ్రహం పొందేందుకు సులభమైన మార్గమని వివరించారు. ప్రవచనం అనంతరం తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు.



విద్యా సమాచారం

21 నుంచి లా కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ లా విభాగం నిర్వహించే కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 21 నుంచి 27 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు విభాగాధిపతి మాధురి పరదేశి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ లాసెట్-2024, ఏపీ పీజీఎల్‌సెట్-2024 ఉత్తీర్ణులైన విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. లా విభాగంలో మూడేళ్ల, ఐదేళ్ల డిగ్రీ, రెండేళ్ల పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టనున్నామని తెలిపారు.

శాస్త్రీయ విధానాలతో అధిక లాభాలు

తిరుపతి సిటీ: శాస్త్రీయ పరిజ్ఞానంతో నిర్ణీత పద్ధతుల ఆధారంగా సీమ పందుల పెంపకం చేపట్టిన ఔత్సాహికులకు అధిక లాభార్జన పొందే అవకాశం ఉంటుందని వెటర్నరీ వర్సిటీ పరిశోధక సంచాలకులు డాక్టర్ శోభామణి పేర్కొన్నారు. వెటర్నరీ వర్సిటీ నిరంతర విద్యా సమాచార కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులుగా శాస్త్రీయ పద్ధతులలో సీమ పందుల పెంపకంపై ఔత్సాహిక యువత, రైతులకు జరిగిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రీయ పద్ధతులలో పందుల పెంపకం తదితర విషయాలపై అవగాహన కల్పించారు.



జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ×గ్రామీణ స్థానిక ప్రభుత్వ సంస్థల్లో సమాంతర వ్యవస్థల పాత్ర, ప్రాముఖ్యత్వఅనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించి మాట్లాడారు. అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. సదస్సు సంచాలకులు ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

గురుకులాలు చక్కదిద్దుతాం

- వెనుకబడిన వర్గాల విద్యార్థులకు గురుకులాలే కీలకం
- అందుకే వసతులు మెరుగు పరుస్తున్నాం.. డైట్ చార్జీలు పెంచాం
- అసెంబ్లీలో లఘుచర్చకు మంత్రి సీతక్క సమాధానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకులాలను బాగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పంచాయతీరాజ్, మహిళా శిశు శాఖ మంత్రి సీతక్క తెలిపారు. 'వెనుకబడిన వర్గాల విద్యార్థులకు గురుకులాలే కీలకం. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచారు. ఆహార భద్రత కమిటీలు ఏర్పాటు చేశారు. గురుకులాల్లో కొత్త డైట్‌తో మొన్న సీఎం, మంత్రులు మధ్యాహ్న భోజనం చేశారు. ఇదే అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చాం. లేకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటాం..' అని మంత్రి చెప్పారు. బుధవారం అసెంబ్లీలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై లఘు చర్చ ముగింపు సందర్భంగా సీతక్క మాట్లాడారు.

గతంలో చేసిన ఖర్చులపై ఆడిటింగ్ చేయిస్తాం

'రాష్ట్రంలో 3,751 గురుకులాలు, 25,941 సాధారణ పాఠశాలలు నడుపుతున్నాం. వీటిలో చదివే పిల్లలందరికీ దాదాపు 40 శాతం మేర డైట్, మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచాం. కొత్తగా అన్ని గురుకులాలు ఒకేచోట ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది రూ.2,500 కోట్ల ఖర్చుతో 54 గురుకులాలు మంజూరు చేశాం. ప్రస్తుతమున్న గురుకులాల్లో మౌలిక వసతులు మెరుగు పరుస్తున్నాం. దేశంలోనే మొదటిసారిగా కిచన్ ఫ్లోర్ నిర్వహణ, నాణ్యతతో కూడిన సరుకులు సరఫరా సహా అన్ని చర్యలు చేపడుతున్నాం. సాధారణ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 21,19,349 మంది విద్యార్థులకు, గురుకులాల్లోని 9 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రెండు జతల చొప్పున యూనిఫామ్‌లు అందిస్తున్నాం. యూనిఫామ్‌లు కుట్టే పని స్వయం సహాయక బృందాలకు అప్పగించాం. ఇందుకోసం ఒక జతకు రూ.75 చొప్పున ఇవ్వాలని నిర్ణయించాం. దీనివల్ల మొత్తం 30 వేల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది. 2014 నుంచి గురుకులాల్లో చేసిన ఖర్చులపై అధికారులతో ఆడిటింగ్ చేయించి, అవకతవకలకు పాల్పడ్డారని తేలినచోట్ల రికవరీ చేయడంతో పాటు చర్యలు తీసుకుంటాం..' అని మంత్రి చెప్పారు.

ఆ కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి

లఘు చర్చలో పాల్గొన్న మాజీ మంత్రి టి.హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'పాము, కుక్క, ఎలుక కాటు, ఫుడ్ పాయిజన్, కరెంట్ షాకులు, ఇతర కారణాలతో ఏడాదిలో 54 మంది విద్యార్థుల చనిపోయారు. ఈ వివరాలు ప్రభుత్వానికి పంపిస్తాం. ఆయా కుటుంబాలకు మానవతా దృక్పథంతో రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలి..' అని కోరారు. బడిలోనో, అమ్మ ఒడిలోనో ఉండాల్సిన పిల్లలు వెంటిలేటర్లపై ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో రూ.9 వేల కోట్లతో 'మన ఊరు మన బడి' ప్రారంభించి, వెయ్యి పాఠశాలలు అభివృద్ధి చేసే ప్రణాళిక రూపొందించామని తెలిపారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యేలు రామచంద్రనాయక్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ భూపతిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిల చెల్లింపుల ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

సాక్షి, హైదరాబాద్: స్కాలర్‌షిప్ బకాయిల చెల్లింపుల ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పారదర్శకంగా ప్రతి కళాశాలకు బకాయిలను చెల్లిస్తామని, పైరవీలకు ఎలాంటి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో ప్రైవేట్ మెడికల్, నర్సింగ్ కళాశాలల యజమాన్యాల యూనియన్ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్ స్కాలర్‌షిప్, బకాయిల గురించి డిప్యూటీ సీఎంతో చర్చించారు. గత రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా చేసిన నిర్లక్ష్యం వల్ల ప్రజా ప్రభుత్వంపై భారం పడుతోందని వ్యాఖ్యానించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం ముందుకు పోతోందని తెలిపారు.

సీఎం ధర్నా చేయడమేంటి?

- బీజేపీ నేత 'పొంగులేటి'

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్ ఎదుట ధర్నా చేయడం ఏమిటని, ఇది కాంగ్రెస్ మార్క్ రాజకీయమా? అని బీజేపీ నేత, ఆ పార్టీ తమిళనాడు, కర్ణాటక సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి ప్రశ్నించారు. నియమాలను సాక్షాత్తు సీఎం ఉల్లంఘిస్తే.. శాంతి భద్రతలను ఎవరు కాపాడాలి? రాజ్యాంగ ప్రతినిధిగా ఉన్నవారే రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తారా? అని ఒక ప్రకటనలో నిలదీశారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో సీఎంకో చట్టం.. సామాన్యులకో చట్టమా? అని ప్రశ్నించారు. నియమ నిబంధనలకు లోబడి ఎవరైనా నిరసనలు చేపట్టవచ్చునని, అయితే చట్టాన్ని కాపాడాల్సిన వారే ఉల్లంఘిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాల ఆందోళనలు అంటే చాలు.. విపక్ష నేతలను ముందస్తు అరెస్టు చేసే పోలీసులు దీనికేం సమాధానం చెబుతారని పొంగులేటి నిలదీశారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- కౌన్సిల్ చైర్మన్‌కు సర్పంచుల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం విజ్ఞప్తి చేసింది. బుధవారం కౌన్సిల్‌లో చైర్మన్‌కు ఎమ్మెల్సీ కవిత, నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సంఘం అధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, సముద్రాల రమేశ్ వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 2019 - 2024 మధ్య కాలంలో సర్పంచులుగా అప్పటి ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జీపీకి కనీసం రూ.5 లక్షల నుంచి 50 లక్షల వరకు బిల్లులు బకాయిలో ఉన్నట్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. తమ విజ్ఞప్తిపై కౌన్సిల్ చైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు. కౌన్సిల్‌లో సర్పంచుల బిల్లుల చెల్లింపు అంశంపై మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత, నవీన్‌రెడ్డిలకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్ఆర్ జెడ్పీ కార్యాలయ ఆవరణలోకి పీఆర్ఆర్డీ కమిషనరేట్ ఆఫీస్

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ కార్యాలయంలోని పలు ప్రధాన విభాగాలను ఖైరతాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా జెడ్పీ కార్యాలయ భవనంలోకి మార్చనున్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలోని మూడో అంతస్తులో ఏర్పాటు చేసిన కమిషనరేట్ ఆఫీస్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. నగరంలోని మూడు వివిధ ప్రదేశాల్లో కమిషనరేట్ పరిధిలోని కార్యాలయాలు ఉండటంతో పరిపాలనాపరంగా ఇబ్బందులు తలెత్తడంతో ఖైరతాబాద్‌లోని ఆర్ఆర్ జెడ్పీ ఆఫీస్‌లో అందుబాటులో ఉన్న చోటును ఉపయోగించుకోవాలని పీఆర్‌శాఖ నిర్ణయించింది. నూతన కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు పీఆర్ఆర్డీ డైరెక్టర్ సృజన, కమిషనరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ, అదానీ ఒక్కటే

- డ్రంకెన్ డ్రైవ్ పెడితే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారో రారో..
- కవితకు కొంత విశ్రాంతి అవసరం: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: మోదీ, అదానీలు వేర్వేరు కాదని, ఇద్దరూ ఒక్కటేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు డబ్బులు వెళితే, మోదీ ప్రభుత్వంలో అదానీ కంపెనీలకు పేదల డబ్బులు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విజన్ ఉన్న నాయకుడు కనుకనే దేశ ప్రజల మేలు కోసం అదానీ, మోదీ హటావో, దేశ్‌కో బచావో నినాదం ఇచ్చారని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీది త్యాగం చేసే గుణం అయితే, మోదీది స్వార్థమని అన్నారు. అదానీ అవినీతిపై ఆధారాలు ఇవ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని, అయితే అమెరికా ప్రభుత్వమే అదానీని అరెస్టు చేయాలని చెపితే ఇంకేం ఆధారాలు కావాలని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉన్న కారణంగా మానసికంగా కొంత గందరగోళానికి గురయ్యారని, ఆమెకు కొంత విశ్రాంతి అవసరమని, ఆ తర్వాత ప్రెస్‌మీట్లు పెట్టి ప్రెస్‌నోట్‌లు ఇస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో డ్రంకెన్ డ్రైవ్ మిషన్లు పెట్టాలని హరీశ్‌రావు అడుగుతున్నారని, ఎన్ని మిషన్లు పెట్టేందుకయినా సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమేనని, అయితే ఆ మిషన్లు పెట్టాక కేసీఆర్ అసెంబ్లీకి వస్తారో రారోనని వ్యాఖ్యానించారు.

ఆర్వోఆర్ రెవెన్యూ చట్టాన్ని ఆహ్వానిస్తున్నాం

- డీసీఏ, టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ, ట్రెసా నేతల హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఆర్వోఆర్ రెవెన్యూ చట్టాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నట్టు డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ పేర్కొన్నారు. భూభారతి పేరుతో వచ్చిన చట్టంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, ట్రెసా నేతలు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. చట్ట రూపకల్పనకు విశేష కృషి చేసిన సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పిల్లల భోజనానికి పిసరంతే నిధులు

- ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఏమూలకు?
- పాఠశాలల్లో కనీస వసతులు లేకుంటే చదువు ఎలా?
- సర్కారు స్కూళ్లలో చదవాలంటే అవమానంగా భావిస్తున్నారు
- అసెంబ్లీలో ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ
- గురుకులాలు ఉంటాయా? ఉండవా?: గంగుల

గురుకులాలు ఉంటాయా?: గంగుల కమలాకర్



యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూళ్లు తెస్తామని చెబుతున్న ప్రభుత్వం.. ఇప్పుడున్న గురుకులాలు ఉంటాయా? ఉండవా? స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 261 గురుకులాలుంటే, బీఆర్ఎస్ హయాంలో 1,029కి పెరిగాయని తెలిపారు. బీబీనగర్‌లో డిఫెన్స్ అకాడమీని ప్రారంభించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్‌కు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం పేదల పక్షం: యెన్నం శ్రీనివాసరెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షానే ఉంటుందని, అందుకే సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు బాధ్యులైనవారిపై కేసులు నమోదు చేసినట్టు కాంగ్రెస్ సభ్యుడు యెన్నం శ్రీనివాసరెడ్డి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు, సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఇస్తూ, మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు.

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థుల ఆహారం కోసం ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఏమూలకూ సరిపోవటం లేదని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుంటే విద్యార్థులు ఎలా చదువుకొంటారని ప్రశ్నించారు. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై బుధవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. 'మార్కెట్లో కోడిగుడ్డు ధర రూ.5 నుంచి రూ.7కు పెరిగింది. కానీ కేంద్రం పెంచింది రూ.1.12 మాత్రమే. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెంచింది 74 పైసలు మాత్రమే. పాఠశాలల్లో భోజనం నాణ్యత తగ్గడానికి ఇదే కారణం'అని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని అక్బరుద్దీన్ ఆరోపించారు. అమెరికా, బ్రిటన్‌లో ప్రభుత్వ స్కూళ్లలో చదవడాన్ని గర్వంగా భావిస్తారని.. మన దగ్గర మాత్రం సిగ్గుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో విద్యకు ప్రాధాన్యతనిచ్చారని కొనియాడారు. కేసీఆర్ ప్రారంభించిన అనీస్ ఉల్ గుర్బాలో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.

టీచర్లను నియమిస్తే విద్యార్థులెందుకు తగ్గారు?: పైడి రాకేశ్‌రెడ్డి

ప్రభుత్వ స్కూళ్లలో టీచర్లను నియమిస్తే విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందని బీజేపీ సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. లోపాలు ఎక్కడో కనిపెట్టి సరిచేయాలని సూచించారు. హాస్టళ్ల పక్కనే పందులు తిరుగుతున్నాయని, ఈ పరిస్థితే విద్యార్థుల అనారోగ్యానికి కారణమవుతోందని తెలిపారు. మధ్యాహ్న భోజనం నిధులు రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ సర్కారు సున్నపు గనులు కోరింది

1,433 హెక్టార్ల కోసం రెండు ప్రతిపాదనలు వచ్చాయి | **లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని 1,433 హెక్టార్లలో సున్నపు బ్లాకులు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరిందని కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. వికారాబాద్ జిల్లాలో 680 హెక్టార్లు, 753 హెక్టార్ల విస్తీర్ణంలో సున్నపురాయి బ్లాకులను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ ఎండీసీఎల్)కు అనుకూలంగా తెలంగాణ ప్రభుత్వం 11.03.2024న రెండు ప్రతిపాదనలు పంపిందని వివరించారు.

మూడేళ్లలో 30,706 సైబర్ నేరాలు

తెలంగాణలో గత మూడేళ్లలో 30,706 సైబర్ నేరాలు నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్బీ) ప్రచురించే 'క్రైమ్ ఇండియా' నివేదిక- 2022 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 2020లో 5,024, 2021లో 10,303, 2022లో 15,297 సైబర్ నేరాలు నమోదైనట్లు బుధవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

సీఎస్ఎస్ కోసం రూ.16,672 కోట్లు విడుదల

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కోసం తెలంగాణ రాష్ట్రానికి రూ.16,672 కోట్లు విడుదల చేసినట్లు కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఇందర్‌జిత్ సింగ్ సమాధానమిచ్చారు. 2023-24లో 50 సీఎస్‌ఎస్‌లకు 12,977.75 కోట్లు, 2022-23లో 61 పథకాలకు 12,977.28 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు.

యూపీఎస్సీని సందర్శించిన టీజీపీఎస్సీ బృందం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బృందం బుధవారం ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని సందర్శించింది. పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, నియామకాల ప్రక్రియ, కోర్టు కేసులు తదితర అంశాలపై యూపీఎస్సీ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, సభ్యులు అనితా రాజేంద్ర, అమిరుల్లా ఖాన్, నర్రి యాదయ్య, రామ్మోహన్‌రావు, రజని కుమారి తదితరుల బృందం ఢిల్లీ చేరుకుంది. ఇందులో భాగంగా బుధవారం యూపీఎస్సీ చైర్‌పర్సన్ ప్రీతిసూదన్‌తో బృందం సభ్యులు సమావేశమయ్యారు. నియామక పరీక్షలను సజావుగా నిర్వహించడంలో యూపీఎస్సీ అనుసరిస్తున్న విధానాలు, నియామక ప్రక్రియలు, కేసుల నిర్వహణలో పాటించాల్సిన విధానాలు, కమిషన్‌కు ఇచ్చిన ఆర్థిక స్వయంప్రతిపత్తి తదితర అంశాలను తెలుసుకున్నారు. యూపీఎస్సీ, టీజీపీఎస్సీ అనుసరిస్తున్న విధానాలపైనా చర్చించారు. నియామకాల ప్రక్రియను విజయవంతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. టీజీపీఎస్సీ ఈ ఏడాది 13 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసిందని ఈ సందర్భంగా చైర్మన్ బుర్రా వెంకటేశం వివరించారు.

తిరుపతన్న బెయిల్ పిటిషన్ మరోసారి వాయిదా

జనవరి 2న విచారించనున్న సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా అభియోగాలు ఉన్న మేకల తిరుపతన్న (అప్పటి అడిషనల్ ఎస్పీ) బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని తిరుపతన్న హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. హైకోర్టులో బెయిల్ నిరాకరించడంతో, ఆ తీర్పును ఆయన అక్టోబర్ 20న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుదీర్ఘకాలంగా జైలులో ఉంటున్నానని, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఆ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. పిటిషన్‌పై బుధవారం జస్టిస్ బీవీ నాగరత్నం, జస్టిస్ ఎస్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, మోహిత్‌రావు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసినందున గురువారం వాదనలు వినిపిస్తామని దవే తెలిపారు. గురు, శుక్రవారాల్లో తమకు కుదరదని, క్రిస్మస్ సెలవుల తర్వాత వాదనలు వినిపించేందుకు అవకాశం కల్పించాలని సిద్ధార్థ లూథ్రా కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం జనవరి 2కు కేసు విచారణను వాయిదా వేసింది.

ఎమ్మెల్యే లేకుండా చెక్కుల పంపిణీ వద్దు

మాధవరం పిటిషన్‌లో అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లేకుండా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయరాదని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఆయన ఆధ్వర్యంలోనే చెక్కులు పంపిణీ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన బండి రమేశ్ ఆధ్వర్యంలో అధికారులు చెక్కులను పంపిణీ చేస్తున్నారంటూ కృష్ణారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాది, మాజీ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదన వినిపిస్తూ.. పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసేందుకు ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేను కాకుండా, ఆయన చేతిలో ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడిని అధికారులు పిలుస్తున్నారని చెప్పారు. జీవోలు 18, 25 మేరకు సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యేను భాగస్వామ్యం చేయాలన్నారు. అయితే, దీనిపై వివరాలు తెలుసుకుని చెప్పేందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేసే చెక్కుల పంపిణీకార్యక్రమాల్లో ఎమ్మెల్యేను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వం కౌంటర్‌దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 23కి వాయిదా వేశారు.

విదేశీ విద్య ఉపకార వేతనాలు అందటం లేదు : బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తదుపరి విడత ఉపకార వేతనాలు మొత్తం విడుదల కాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీకి చెందిన కేపీ వివేకానంద, మర్రి రాజశేఖరరెడ్డి, అనిల్ జాదవ్‌లు ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని నిలదీశారు. విదేశీ విద్య ఉపకార వేతనాలతో విదేశాలకు వెళ్లి చదువుకుంటున్న విద్యార్థులకు రెండు, మూడు విడతల ఉపకార వేతనం మొత్తం విడుదల కాలేదన్నారు. పరిస్థితి చూస్తుంటే ఈ పథకాన్ని ఉంచుతారా ఎత్తేస్తారా అన్న అనుమానం కలుగుతోందని చెప్పారు. అన్ని ప్రభుత్వ బిల్లుల్లో 10 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నట్టుగానే ఉపకార వేతనాల్లో కూడా వసూలు చేస్తున్నారని వివేకానంద ఆరోపించారు. ఈ ఆరోపణ నిరాధారమని, ఆ కామెంట్లను వెనక్కి తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. వివేకానంద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. ఈ సమయంలో ప్రతిపక్ష-అధికారపార్టీ సభ్యుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగాయి. ఓ దశలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీరు మార్చుకోకుంటే సభ నుంచి సస్పెండ్ చేస్తానని స్పీకర్ హెచ్చరించారు.

పథకాన్ని మరింత పకడ్బందీగా నడుపుతాం: మంత్రి సీతక్క



విదేశీ విద్య ఉపకార వేతనాలకు సంబంధించి ఈ సంవత్సరం 1,098 మంది విద్యార్థులకు రూ.140.74 కోట్లు చెల్లించినట్టు మంత్రి సీతక్క చెప్పారు. ఈ పథకంలో మొత్తం విద్యార్థులు 8,723 మందికిగాను రూ.1,396 కోట్లు ఇప్పటివరకు చెల్లించగా, రూ.104.42 కోట్లు బకాయిలున్నాయన్నారు. గత ప్రభుత్వం రూ.244 కోట్లు బకాయి పడితే తాము క్రమంగా చెల్లిస్తున్నామని, ఇప్పటికే రూ.144 కోట్లు చెల్లించామని చెప్పారు. మార్చి వరకు సమయం ఉందని, ఈలోపు నిధులు విడుదల చేస్తామన్నారు. 2024-25 సంవత్సరానికి 3,488 దరఖాస్తులు వచ్చాయని, 1,310 మందిని ఎంపిక చేయాల్సి ఉందన్నారు.

అసెంబ్లీ వార్తలు

రాష్ట్ర పరిపాలకులు రాజ్‌భవన్ ముట్టడా

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పరిపాలన చేసేవారే రాజ్‌భవన్ ముట్టడికి వెళ్తారా! అని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సాక్షాత్తు సీఎం.. రాజ్‌భవన్ ముట్టడికి వెళితే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఇలాంటి చర్యలేమిటని ప్రశ్నించారు. సమావేశాల్లో చర్చల నుంచి తప్పించుకోవడం కోసమే రాజ్‌భవన్ ముట్టడి చేపట్టారని విమర్శించారు. ప్రభుత్వ వ్యవహారంపై ఆశ్చర్యం వేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధ పడుతున్నారని అన్నారు.

పదేళ్లు ఆటో కార్మికులు గుర్తుకు రాలేదా?

- కాంగ్రెస్ ఎమ్మెల్యే మట్టా రాగమయి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు అధికారంలో ఉన్న పదేళ్లు ఆటో కార్మికుల సమస్యలు గుర్తుకురాలేదా? అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఆటో కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని, ఇప్పుడు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆమె మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీ సజావుగా సాగకుండా ప్రతి రోజూ డ్రామాలు చేస్తున్నారని, వారి తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి పనులు చేస్తున్నారని, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను త్వరలోనే అమలు చేయడం ఖాయమని పేర్కొన్నారు.

సభను పక్కదారి పట్టిస్తున్నారు

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ సభ్యులు శాసనసభ, మండలిలో ప్రజల సమస్యలపై చర్చ జరగకుండా పక్కదారి పట్టించాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎందుకు శాసనసభకు రావడంలేదని, కేసీఆర్ చదివిన 80 వేల పుస్తకాల అనుభవం ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. కేసీఆర్‌ను ముందుగా చట్ట సభలకు తీసుకురావాలని ఆయన బీఆర్ఎస్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ పదే పదే తనను అరెస్ట్ చేస్తారు.. అంటున్నారని, ఎలాంటి తప్పు చేయకపోతే భయమెందుకని అన్నారు. అసెంబ్లీలో ప్రతీ విషయాన్ని చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం వల్లే ర్యాలీ: ఏలేటి



సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం వల్లే ఆయన అదానీకి వ్యతిరేకంగా ర్యాలీ చేశారని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి రాజ్యాంగాన్ని ఖూనీ చేశారని, ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని అన్నారు. అదానీతో చేతులు కలిపి రూ.100 కోట్ల విరాళం తీసుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. అదానీ దోస్తానాతో రాహుల్, రేవంత్‌ల మధ్య దూరం పెరిగిందని, కేవలం పదవి కాపాడుకోవడం కోసమే రేవంత్ ధర్నాలో పాల్గొన్నారని అన్నారు.

బీఆర్ఎస్‌కు నొప్పేంటో : ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



బీజేపీపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంటే బీఆర్ఎస్‌కు నొప్పేంటని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఏఐసీసీ అదానీ అవకతవకలపై చలో రాజ్‌భవన్‌కు పిలుపునిచ్చిందని, అందులో భాగంగా పార్టీ సభ్యుడిగా సీఎం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలతో మరొకసారి బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీ బయట పడిందని, బీజేపీకి బీటీమ్ బీఆర్ఎస్ అని స్పష్టమైందని పేర్కొన్నారు. ప్రజలు కూడా దీనిని గుర్తించి బీఆర్ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. అదానీతో తాము చట్టబద్ధమైన ఒప్పందాలు మాత్రమే చేసుకున్నామన్నారు.

ఓడిన 'అధికార' అభ్యర్థులకు ప్రాధాన్యం సరికాదు

- బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు గెలిచిన చోట ఓడిన అధికార పార్టీ అభ్యర్థులకు మంత్రులు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల తాను గెలిచిన ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, అక్కడ ఓడిన అభ్యర్థిని ఎమ్మెల్యే మాదిరిగా పరిచయం చేయడం సరికాదన్నారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. ఉత్తర-దక్షిణ తెలంగాణ జిల్లాల మధ్య తేడాలు సృష్టించేలా కొందరు మంత్రులు వ్యవహరించడం మంచిదికాదని అభిప్రాయపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవిని తాను కోరుకోవడం లేదని తెలిపారు. అయితే వచ్చే ఎన్నికలకు ముందు తనకు నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తే కనీసం 15 సీట్లు గెలిచి చూపిస్తానని రాకేశ్‌రెడ్డి చెప్పారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని టీ-కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గడ్డం వంశీలు బుధవారం ఢిల్లీలో వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. రాజ్యాంగం మార్చాలని, చెత్తబుట్టలో వేయాలని గతంలో బీజేపీ నేతలు మాట్లాడారని గుర్తు చేశారు. ప్రచారం, మైలేజీ కోసమే మాజీ మంత్రి కేటీఆర్ అరెస్టు కావాలనుకుంటున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అల్లు అర్జున్ అరెస్టు తర్వాత పుష్ప-2 సినిమా వసూళ్లు రూ.100-150 కోట్లు పెరిగాయని తెలిపారు. కేటీఆర్ కూడా అరెస్టు అయితే.. పుష్ప-3 లెవెల్‌లో మైలేజీ వస్తుందని భావిస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ కుటుంబంలో మైలేజీ విషయంలో పోటీ నెలకొందన్నారు. ఎమ్మెల్సీ కవిత ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చారని 'చామల' గుర్తు చేశారు.

తెలంగాణలో ఐదు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు

- ఒకటి రాష్ట్ర ఎఫ్ఎస్ఎల్, నాలుగు ప్రాంతీయ ఎఫ్ఎస్ఎల్‌లు
- ఒక సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఐదు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు ఉన్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. దేశంలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ల వివరాలపై ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు.. బండి సంజయ్ రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. డైరెక్టర్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ సర్వీసెస్ కింద దేశంలో ఏడు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్)లు ఉన్నాయని తెలిపారు. వీటిలో ఒకటి హైదరాబాద్‌లో ఉండగా.. భోపాల్, చండీగఢ్, పుణే, ఢిల్లీ, కోల్‌కతాలో మిగతా ల్యాబ్‌లు ఉన్నట్లు తెలిపారు. ఇక తెలంగాణలో రాష్ట్ర ఎఫ్ఎస్ఎల్ ఒకటి, నాలుగు ప్రాంతీయ ఎఫ్ఎస్ఎల్‌లు ఉన్నట్లు బండి సంజయ్ వెల్లడించారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

జాతీయ సదస్సుకు హాజరైన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని 'కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురాం డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని గురజాడ హాలులో బుధవారం జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు లోక్‌సభ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పలనాయుడు, మల్లు రవి, రాజ్యసభ ఎంపీలు బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్యలు హాజరై మద్దతు ప్రకటించారు. రాజ్యాంగాన్ని రూపొందించిన వ్యక్తి ఫొటో కరెన్సీ నోట్లపై లేకపోవడం సిగ్గుచేటని పరశురాం మండిపడ్డారు. తాము వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశంపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తామని, కరెన్సీ నోటుపై అంబేడ్కర్ ఫొటో ముద్రించేవరకు అండగా నిలుస్తామని ఎంపీలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సన్నిధి

సాక్షి ప్లస్

గురువారం ॥ 19-12-2024

'పల్లాణ్డు పల్లాణ్డు పల్లా యిరత్తాణ్డుపలకోడి నూఱాయిరమ్ మల్లాణ్డు తిణ్ణోళ్ మణివణ్ణా! ఉన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు' అంటూ భగవంతుడికే మంగళాశాసనం చేసిన మహాభక్తుడు విష్ణుచిత్తుడు. అతని గారాలపట్టి మన గోదాదేవి ఆచరించిన ముప్పై రోజుల వ్రతమే ధనుర్మాస వ్రతం.

పరిహారం

ప్రత్యర్థుల వల్ల సమస్యలు ఎదురవుతున్నాయా? వృత్తి ఉద్యోగాల్లో శ్రమదమాదులకోర్చి పురోగతి సాధించినంత మాత్రాన జీవితం ప్రశాంతంగా గడిచిపోతుందని అనుకోలేం. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకున్న వారి పురోగతికి ఓర్వలేని జనం ఉండనే ఉంటారు. ఈర్ష్యాపరులైన ప్రత్యర్థుల వల్ల అనుకోని అవరోధాలు తలెత్తడమే కాదు, మనశ్శాంతి కూడా లోపిస్తుంది. ప్రత్యర్థుల వల్ల తలెత్తే సమస్యలను కట్టడి చేయాలంటే...


- తెల్లకాగితాల పుస్తకాన్ని, ఎర్రసిరా కలాన్ని తెచ్చుకోండి. ఎర్రసిరా కలంతో పుస్తకంలో శ్రీరాముని కీర్తిస్తూ 'శ్రీరామ



జయం' అనే మాటను 12,500 సార్లు రాయండి. ఇలా రాయడం పూర్తయిన తర్వాత ఏదైనా ఒక మంగళవారం హనుమాన్ ఆలయానికి వెళ్లి, ఆ పుస్తకాన్ని, శనగపిండితో తయారు చేసిన లడ్డూలను సమర్పించండి.
- అమ్మవారి ఆలయంలో ఏదైనా శుక్రవారం రోజున పదకొండు నేతి దీపాలను వెలిగించండి. ప్రతిరోజూ ఉదయం నిత్యపూజలో భాగంగా దేవీ ఖడ్గమాల స్తోత్రాన్ని పారాయణం చేయండి.
- ప్రతి మంగళవారం ఉదయం నిత్యపూజ చేసే సమయంలో హనుమాన్ చాలీసాను పదకొండుసార్లు పఠించండి. ఆంజనేయ ఆలయాన్ని దర్శించుకుని నేతి దీపాన్ని వెలిగించి, బెల్లం నైవేద్యంగా సమర్పించండి.
- ఏదైనా శనివారం గోధుమ రొట్టెలను తయారు చేసి, వాటిపై ఒక పుల్లతో మీ ప్రత్యర్థుల పేరు లేదా పేర్లు రాయండి. ఆ రొట్టెను పెనం మీద కాల్చి, చల్లార్చిన తర్వాత వీధికుక్కకు తినిపించండి.

– సాంఖ్యాయన

మానవ కళ్యాణార్థం మార్గళీ వ్రతం!



హేమంత ఋతువులో వాతావరణ ప్రభావం చేత మనుష్యులు సుషుప్తి అవస్థలో వుంటారు. అటువంటి మాయావస్థ నుండి బయటపడవైచే ఒకానొక ఉద్దేశంతో ఈ వ్రతం స్వయంగా ఆమె ఆచరించీ, సామాన్యుల చేత ఆచరింపజేసిన మహా తల్లి గోదాదేవి. యితర గోపికలని కూడా కలుపుకుని వారిని వేకువజామునే మేలుకొలుపుతూ అందరిని ఆ భగవత్సన్నిధికి చేరవేసిన నిస్వార్థపరురాలు. పరమాత్మునికి సామూహిక పూజే చాలా ప్రీతి అన్న విషయం ఎరిగినందుకే గోదాదేవి తన బృందంతో సహా శ్రీ కృష్ణుని వద్దకు వెళ్ళింది. లోకమంతా పచ్చగా, భోగభాగ్యాలతో కళకళలాడాలనే ఉద్దేశంతో పరమాత్మని ప్రార్థిస్తూ తెల్లవారుఝామున స్నానం చేసి సౌందర్యవంతులైన గోపికలతో కలిసి చేసిన వ్రతమే ఈ ధనుర్మాస వ్రతం. ఇక్కడ సౌందర్యమంటే ఆత్మసౌందర్యం, స్నానమనగా భక్తితత్వంలో మునిగితేలడం. రోజుకొక పాశురం పాడుతూ ఒక్కొక్క గోపికను మేలుకొలిపే ముప్పై పాశురాల రాగమాలికే తిరుప్పావై! రమారమి క్రీ.శ.750 ప్రాంతంలో శ్రీరంగనాథస్వామి వెలసిన శ్రీరంగానికి దగ్గరలో శ్రీవిల్లిపుత్తూరు అనే గ్రామంలో పెరియాళ్వార్ (విష్ణుచిత్తుని మరో పేరు) అనే భక్తశిఖామణి ఒకనాడు తన తులసివనంలో మొక్కలకు పాదులు తవ్వుతుండగా భూమిలో లభించిన ఈ బాలిక కర్కాటక మాసం, పుబ్బానక్షత్రంలో దొరికింది. ఈమెని పెరియాళ్వార్ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకున్నారు.

విష్ణుచిత్తుని ఇంట అన్నసంతర్పణలూ, శ్రీరంగనాథుని భజనలే నిత్యకృత్యాలు. అందుకే గోదాదేవి చిన్నతనం నుంచి ఆ రంగనాథుడ్ని మనసారా సేవించింది. ఆమె భక్తితో కట్టే పూలదండలని వాసన చూసి ముందుగా తాను ధరించిన తరువాత వాటిని తండ్రిద్వారా ఆ రంగనాథునికి సమర్పించేది. పూలమాలలని ముందుగా తాను ధరించడంతో ఆమెకు శూడికొడుత్త అనే పేరువచ్చింది. గోదాదేవి ముందుగా ధరించి ఇచ్చిన పూలమాలలు తప్ప వేరే మాలలని తాను ధరించనని రంగనాథుడు స్వయంగా విష్ణుచిత్తునితో చెప్పడంతో తన బిడ్డ కారణ జన్మురాలని తనని తరింపజేయడానికే తన ఇంట వెలసిందని గ్రహించాడు.

ద్వాపరయుగంలో గోపికలు శ్రీ కృష్ణుణ్ణి భర్తగా పొందదలచి కాత్యాయనీ వ్రతాన్ని చేశారని తండ్రి ద్వారా తెలుసుకుంది గోదాదేవి. శ్రీకృష్ణుని లీలలు కథలు కథలుగా అక్కడి అందరూ చెప్పుకోవడంతో తాను ఆ కృష్ణావతార సమయంలో ఉంటే బాగుండునని తలచింది. అయితే కృష్ణావతారంలో సత్యభామ తానేనని జ్ఞానసంపద కలిగిన ఓ గోపిక ద్వారా తెలుసుకుని ఆశ్చర్యపోయింది. తాను కూడా ధనుర్మాస వ్రతమాచరించి ఆ శ్రీరంగనాథుని సన్నిధి చేరుకోవాలని కోరుకుంది.

'శూడిక్కొడుత్త శుడర్ క్కొడియే..తోల్ పావై పాడి యరుళవల్ల పల్ వళైయామ్,వేంగడ వఱ్కెన్నైవిది యెన్ద విమ్మాత్తమ్, నాంగడవా వణ్ణమే నల్గు' దీని అర్థం–'సువాసనతో కూడిన బంగారుజిలుగులు (జ్ఞాన కాంతులు) వెదజల్లే పుష్పదండలను దాల్చి, వాటినే శ్రీరంగనాథునికి సమర్పించిన ఓ మెరుపుతీగా, ఆ వేంకటేశ్వరునికి నీవు ఎట్లైతే ప్రియము కల్గించుమని వేడుకొన్నావో అలాగే, నీ భక్తులమైన మాకు కూడా ఆ వ్రతఫలం కల్గించు తల్లీ!' అంటూ పరాశరభట్టర్ గోదాదేవిని స్తుతించడం ఇక్కడ గమనించాలి. సుగంధమైన పుష్పమాలలని స్వామికి సమర్పించినందున ఆముక్తమాల్యద అనే పేరు గోదాదేవికి వచ్చింది. కోదై, నాచియార్, ఆండాళ్...ఇలా వివిధ నామధేయాలు ఆమెకున్నాయి.



గోదాదేవి మెడలో ధరించే పూమాల భక్తిగీతమాలగా, చేతిలోని చిలుక గురువుకు చిహ్నంగా చెప్పుకోవచ్చు. గోదాదేవి ధనుర్మాస వ్రతమాచరించడానికి తన గోపికలతో కలిసి ఆ పరమాత్మని కోరినదేమిటంటే, భూమండలాన్ని దద్దరిల్లచేసే తెల్లనైన పాంచజన్యమనబడే శంఖాన్నీ, విశాలమైన పర అనే వాద్యాన్ని, మంగళగానం చేయడానికి భాగవతులు, మంగళ దీపాలు, ధ్వజములు కావాలని కోరింది.

వీటిని ఆ భగవత్సేవ వినియోగం కొరకు కోరుకున్నారు. అంతేకాదు, పాంచజన్యం, పర అనే భౌతిక వస్తువులని ఎందుకు కోరారంటే ఈ పరికరాలు ఎల్లప్పుడూ ఆ భగవంతుని అంటిపెట్టుకుని ఉంటాయి. అటువంటివి తమ వద్ద వుంటే ఆ భగవంతుడు తమతో ఉన్నట్టేనని భావించి కోరుకున్నారు. వ్రతమాచరించే ముప్పై రోజులూ ఆహారనిష్ఠలతోపాటూ ఇతర కఠినమైన నియమాలు పాటిస్తూ సదా భగవన్నామ స్మరణలో గడిపారు గోదాదేవి బృందం. ఎదుటి వారిని నొప్పించే మాటలు ఆడకుండా, వారికి సహాయపడుతూ కలసి మెలసి మెలుగుతూ లోకకళ్యాణం కొరకు వ్రతమాచరించడమే గోదాదేవి ముఖ్యోద్దేశం.

విష్ణుచిత్తుడు ఆ రంగనాథుని ఆజ్ఞతో ముప్పై రోజుల వ్రతానంతరం గోదాదేవిని శ్రీరంగానికి తోడుకొనిపోయి ఆ శ్రీరంగనాథునితో కళ్యాణం జరిపించాడు. గోదాదేవి భక్తి ప్రవత్తుల కారణంగా, జనులందరూ చూస్తుండగా ఆ రంగనాథునిలో లీనమైపోయింది. పన్నిద్దరు ఆళ్వార్లలో ఏకైక స్త్రీమూర్తి మన ఆండాళ్ తల్లి!



– కారంపూడి వెంకట రామదాస్


'తిరు' అంటే శ్రీ, లక్ష్మీ, అమృతం మొదలగు అర్థాలున్నాయి. 'పావై' అంటే పాటల సమాహారం, వ్రతం అనే అర్థాలున్నాయి. 'శ్రీకృష్ణుని(రంగనాథుడు) పొందకోరి ఆచరించిన గానామృత వ్రతమే ఈ మార్గశీర్ష వ్రతం లేదా ధనుర్మాస వ్రతం! మార్గమంటే బుద్ధి, శీర్షమంటే ఉత్తమమైనది. 'మాసాలలో మార్గశీర్ష మాసాన్ని నేనే!' అని స్వయంగా శ్రీ కృష్ణుడే భగవద్గీతలో చెప్పాడు. అటువంటి కృష్ణుణ్ణి పొందడానికి మార్గశిరమే ఉత్తమమైన కాలమని భావించి ఈ వ్రతమాచరించింది గోదాదేవి.

ప్రేమ పరిమళించిన చోట తర్కం అంతరిస్తుంది

ఈ భూమి మీద నడిచిన కారుణ్య మూర్తులైన బుద్ధుడు, మహావీరుడు జీసస్ వంటి వారు మానవీయతను ప్రబోధించి శాంతిస్థాపనకు, సమానత్వానికై అజరామరమైన ప్రేమ తత్వాన్ని ఈ లోకానికి బోధించారు. ప్రాక్ పశ్చిమ ప్రపంచంలో నుండి జీసస్ ఒక విభిన్నమైన నైసర్గిక భౌగోళిక పరిస్థితులు ఉన్న ఇశ్రాయేలులోని బెత్లెహేం నందు జన్మించాడు. అది తన చుట్టూ ఉన్న బాబిలోనియా, ఈజిప్ట్ గ్రీక్ దేశాల ఆధునిక, తాత్విక, వైజ్ఞానిక నాగరికతలు, సంస్కృతుల ప్రభావితం కలిగినది.

మానవ జీవితంలో 14 సంవత్సరాల ప్రౌఢదశ ఒక ప్రత్యేకమైన శారీరక మానసిక పరిపక్వత గలిగే దశ ప్రారంభం అవుతుంది. సరిగ్గా ఈ దశ మానవుడిని ప్రపంచానికి పరిచయం చేస్తుంది. అందుకే జోసెఫ్‌కు క్రీస్తు మానవునిగా 14వ తరంగా కన్య మరియకు జన్మించిన రోజే క్రిస్మస్.

క్రీస్తు అత్యంత బాహ్యాంతర సౌందర్యమూర్తి, పరిపూర్ణుడు. నీసాటి వాడు నిన్ను కోపగించుకుంటే నువ్వు ప్రతిగా వారిని కోపగించుకోకు. మళ్ళీ వారిపై క్రోధం పెంచుకుంటే వారికి నువ్వు సహాయపడ్డవాడివి అవుతావు. నీ క్రోధం వాళ్లకు బలం, నీకు బలహీనత. అదే నువ్వు వారిని సహృదయంతో మందహాసంతో స్వీకరిస్తే వారు నిశ్చేష్టులవుతారు, అందుకే జీసస్ నువ్వు నీ శత్రువుని ప్రేమించు అని చెబుతాడు. అయితే ఇక్కడ శత్రువు కన్నా పొరుగువారిని ప్రేమించటమే కొంచెం కష్టం అయినా వారితో ప్రేమపూర్వకంగా మెలగాలి. నీలో ఉన్న అంతర్గత ప్రేమను ఒక ఆలింగనం ద్వారా బహిర్గతం చేయి. వారు ఈ పరిణామానికి తమ తార్కిక జ్ఞానాన్ని కోల్పోవాలి. అటువంటి ప్రేమలో తార్కిక విచక్షణ ఉండదు. కాబట్టి ప్రేమ పరిమళించిన చోట తర్కం అంతరిస్తుంది. ఇలాంటి ప్రేమ మార్గానికి పరాకాష్ఠ జీసస్ స్వరూపం.



సరిగ్గా ఈ భావన కొనసాగింపే జీసస్‌లో మరో ఉదాత్త అంశం నిదర్శనమైనది. అదే ఒక చెంపపై కొడితే మరో చెంపను చూపించు అనటం. అప్పుడు మరో చెంపని చూపించటం వల్ల అవతలివాడిని ఆలోచనలో పడేస్తుంది కానీ మొదట్లో ఈ విభిన్న ప్రతిస్పందన యూదు వంశస్థులకు అర్థం అవడానికి చాలా కాలం పట్టింది. అది వారి తర్కానికి అందని దృగ్విషయం, అదొక సందిగ్ధావస్థ. ఈ దశ ప్రేమకు ముందూ, ద్వేషభావానికి తర్వాత ఉంటుంది. ఇది సంఘంలో కొంత పరివర్తనకు నాంది పలికింది. వ్యవస్థలో నెలకొన్న అమానవీయ చేష్టలకు అమూల్యమైన మానవ ప్రాణం బలి కాకూడదని సంకల్పించాడు. అందుకే జీసస్ అత్యంత దయార్ద్ర మానవతామూర్తి గా వెలుగొందాడు. క్రీస్తుకు పూర్వం ప్రజలంతా మోసెస్ న్యాయమార్గాన్ని అనుసరిస్తే ఆ తదుపరి జీసస్ సర్వత్రా తన ప్రేమ మార్గాన్ని చూపాడు.

జీసస్ ప్రేమస్వరూపుడు అనటం కాదు, జీసస్ స్వయంగా ఒక ప్రేమ స్వరూపుడు. ఇక్కడ జీసస్ వేరూ ప్రేమ వేరూ కాదు. అది అత్యంత అనిర్వచనీయం. ప్రేమ ఎప్పుడూ సత్యంలాగా భాషలో పలికేది కాదు అది కేవలం వ్యక్తీకరించేది. అందుకే యేసును శిలువ వేసే సమయంలో రోమ్ సైనికాధికారి పిలాట్ ఇదంతా నువ్వు ఎందుకు చేస్తున్నావు అని అడిగితే సత్యం కోసం చేస్తున్నానని సమాధానం ఇస్తాడు, అప్పుడు పిలాతు యేసును మళ్ళీ ప్రశ్నిస్తాడు సత్యం అంటే ఏంటి? అని– ఆ ప్రశ్నకు యేసు మౌనం వహిస్తాడు. ప్రేమ మౌనంగా వ్యక్తపరిచే భాష, ఈ అవ్యాజమైన ప్రేమతో సమస్త జనులారా మీరు నా వద్దకు రండి మిమ్ములను క్షమిస్తాను, ప్రేమిస్తాను అని ప్రేమతో సందేశాన్ని ఇచ్చాడు యేసు. అయితే యూదులు ఆ సత్యసాక్షిని సహృదయంతో అర్థం చేసుకోలేదు. కనుకనే శిలువపై ఏసుగా మరణించి క్రీస్తుగా పునర్జన్మ పొందిన మానవరూప దివ్య దైవత్వంగా పరిణామం చెందాడు. అందుకే సంఘం యథార్థవాదులందరినీ లోకవిరోధులుగానే చిత్రీకరిస్తుంది. అందుకు తార్కాణంగా ప్రముఖ గ్రీకు దార్శనికుడు సోక్రటీస్‌కు రాజ్యం విషం ఇచ్చి మరణశిక్షను విధించింది. అలాగే భారతీయ దార్శనికుల్లో విప్లవాత్మకమైన శాంతి, సత్య తత్వాన్ని అందించిన బుద్ధుని బోధలూ, బౌద్ధం భారతదేశం నుంచి తరిమి వేయబడ్డాయి. అదేవిధంగా యూదుల ఆలోచనలను సరిదిద్దే ప్రయత్నంలో జీసస్ కృషి నిరర్థకమే అయింది. వారికి సత్యం, ప్రేమల తత్వం అర్థం కాలేదు. వారు జీసస్ సత్యమార్గాన్ని చేరుకోలేక అపవాదిగా మార్చి సిలువ వేశారు.

ఈ దార్శనికులంతా వారి తాత్విక సందేశాలతో సమస్త జీవకారుణ్యతతో ఎటువంటి మారణాయుధాలు లేకుండా ఒక మనిషి మరో మనిషిపై గాని, ఒక జాతి మరో జాతిపైగానీ, ఒకరి భావజాలం మరొకరి భావజాలంపై గాని, సాంస్కృతిక దురాక్రమణలు కానీ, ధర్మం పేరిట యుద్ధాలు, రక్తపాతాలు గానీ సృష్టించలేదు. కేవలం ప్రకృతి ధర్మాలను వివరిస్తూ మనుషుల మధ్య సమతను, సమానత్వాన్ని, ప్రేమపూర్వక ప్రవచనాలతో, వాత్సల్యపు వాక్యాలతో శాంతి సామ్రాజ్యాల స్థాపనకు ప్రాణత్యాగాలు చేశారు. అందుకు కావలసింది ద్వేషాన్ని, అహంకారాన్ని విడనాడటమే. ఇవి మనలో నుండి మనపైకి అధిరోహించి మనల్ని అథఃపాతాళానికి తొక్కేస్తాయి, కానీ మనమే అహంకారాన్ని అధోపాతాళానికి తొక్కిపెడితే మనం ఆకాశానికి ఎదుగుతాం.

– ప్రొఫెసర్ చెరుకుపల్లి వంశీధర్

ప్రేమ మౌనంగా వ్యక్తపరిచే భాష, ఈ అవ్యాజమైన ప్రేమతో సమస్త జనులారా మీరు నా వద్దకు రండి మిమ్ములను క్షమిస్తాను, ప్రేమిస్తాను అని ప్రేమతో సందేశాన్ని ఇచ్చాడు యేసు. అయితే యూదులు ఆ సత్యసాక్షిని సహృదయంతో అర్థం చేసుకోలేదు. కనుకనే శిలువపై ఏసుగా మరణించి క్రీస్తుగా పునర్జన్మ పొందిన మానవరూప దివ్య దైవత్వంగా పరిణామం చెందాడు.

● హదీసు ప్రబోధిని

ఆ న్యాయస్థానంలో అందరూ జవాబుదారులే!



దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అంటుండేవారు: మీలో ప్రతి ఒక్కడూ సంరక్షకుడే, జవాబుదారుడే. సావధానంగా వినండి: మీలో ప్రతి ఒక్కడూ (తమ తమ పరిధుల్లో) యజమానినే, సంరక్షకుడే. మీలో ప్రతి ఒక్కరిని, వారి సంరక్షణలో ఉన్న వారి బాపతు అడగడం జరుగుతుంది.

వివరణ: ముస్లిం సమాజంలోని ప్రతి వ్యక్తి అనేక బాధ్యతలకు కట్టుబడి ఉన్నాడు. తనకు అందుబాటులో ఉన్నది, తాను ఖర్చు చేసే ప్రతి విషయం అల్లాహ్ అతనికి ప్రసాదించిన ఓ అమానతు. దైవానికి దాసునిగా ఉంటానని ప్రతిజ్ఞ చేసినందువల్ల అల్లాహ్ తనకు అందించిన ఆ అమానుతును కొల్లగొట్టకుండా దాన్ని ఎంతో మేళకువగా పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నాడు. ఎందుకంటే మరణానంతరం ఈ భూమిలో తనకు లభించిన ప్రతి వరాన్ని, ప్రతి శక్తిని, సామర్థ్యాన్ని గురించి ఎలాంటి మొహమాటం లేకుండా అక్కడ అడగడం జరుగుతుంది. ఒక ముస్లింగా మనిషి తాను పని చేసే పరిధిలో, శక్తి సామర్థ్యాల్లో స్వతంత్రుడు ఎంత మాత్రం కాడు, సరి కదా ఆ వరాలన్నింటికీ అతను సంరక్షకుడు. దైవ న్యాయస్థానం లో బాధ్యతలు, సంరక్షణకులకు సంబంధించిన పూర్తి రికార్డు ప్రశ్నల రూపంలో ఎదురవుతుంది.

ఇస్లామీయ దేశాధ్యక్షుణ్ణి నేరుగాను, ఇస్లామీయ పాలనా వ్యవస్థలో, న్యాయవ్యవస్థలో పని చేసే ప్రతి చిన్నా, పెద్దా అధికారుల్నీ, ఉద్యోగుల్ని పరోక్షంగానూ హెచ్చరించడం జరిగింది. ఈ హెచ్చరిక ఏమిటంటే మీరు ఏ హోదాల్లోనైతే పని చేస్తున్నారో లేక ఏ ఏ ప్రభుత్వ శాఖలకు ఇన్చార్జీలుగా ఉన్నారో ఎంతో న్యాయంగా దైవభీతి కలిగి మీ బాధ్యతలను నెరవేర్చే ప్రయత్నం చేయండి.

పరలోకంలో అల్లాహ్ ఏర్పరిచిన న్యాయస్థానంలో మిమ్మల్ని నిలబెట్టి మీరు భూలోకంలో ఏ బాధ్యతలను నిర్వహించారో మీకు ఏ అమానతు అయితే అప్పగించడం జరిగిందో దాన్ని పూర్తిగా నిర్వర్తించారా లేదా అని అడగడం జరుగుతుంది జాగ్రత్త.

ప్రతివాడు తన భార్య పిల్లల నైతికతలకు, విద్యాబుద్ధులకు కాపలాదారుడు. భార్య తన శీల సంపదకు, తన పిల్లల శిక్షణకు, భర్త ఆస్తికి, ఇంటిని నడిపేందుకు బాధ్యురాలు. భార్యాభర్తలను ఒకరి విషయాల్లో మరొకరిని బాధ్యులుగా, కాపరదారులుగా చేయడం జరిగింది.

మొత్తానికి ప్రళయ దినం నాడు ప్రతివ్యక్తి తన జీవిత కర్మల చిట్టా చేతబట్టి అల్లాహ్ న్యాయస్థానంలో నిలబడవలసి ఉంది.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

- ఇస్లామీయ రాజ్య పాలకుడు ఓ సంరక్షకుడు. అతనితో అతని రాజ్యంలోని ప్రజానీకం గురించి అడగడం జరుగుతుంది.
- ప్రతివాడు తన భార్య, పిల్లలకు యజమాని. అతడు తన బాధ్యతలను గురించి దేవునికి జవాబు చెప్పుకోవాల్సి ఉంది.
- స్త్రీ (భార్య), తన భర్త ఇంటికి (అతని సంతానానికి) బాధ్యురాలు. గృహ సంబంధమైన బాధ్యతల గురించి ఆమెను ప్రశ్నించడం జరుగుతుంది.
- నౌకరు తన యజమానికి; కుమారుడు తన తండ్రి ఆస్తికి సంరక్షకుడు. దేవుడు వారి బాధ్యతలను గురించి అడుగుతాడు.


అమృత బిందువులు

- కోపంలో సమాధానం చెప్పకు సంతోషంలో వాగ్దానం చేయకు ఒత్తిడిలో నిర్ణయం తీసుకోకు అయినవారి ఎదుట అబద్ధం చెప్పకు.
- 'అనుభవం ఎదిగిన ప్రాయాన్ని బట్టి రాదు. తగిలిన గాయాన్ని బట్టి వస్తుంది.'
- తప్పు చేయడానికి ఎవరూ భయపడరు. కానీ చేసిన తప్పు బయట పడకుండా ఉండడం కోసం భయపడతారు.
- 'జీవితంలో వయసు ఉన్నప్పుడే చదవండి. ఎందుకంటే జీవితం చివరి దశలో చదివి తెలుసుకున్నా ఆచరించేందుకు జీవితం ఉండదు.'
- ఈ లోకంలో ప్రతి ఒక్కరికి వారి తెలివితేటల మీద గర్వం ఉంటుంది. కానీ ఏ ఒక్కరికి తమలో ఉండే గర్వం గురించి తెలుసుకునే తెలివి ఉండదు.
- వేదం చదివితే ధర్మం తెలుస్తుంది. వైద్యం చదివితే రోగం ఏమిటో తెలుస్తుంది. గణితం చదివితే లెక్క తెలుస్తుంది. లోకం చదివితే ఎలా బతకాలో తెలుస్తుంది.
- కాలికున్న చెప్పులైనా మనతో ఉన్న మనుషులైనా నొప్పిని, బాధను కలిగిస్తున్నారంటే, సరిపోయేవి కావని అర్థం.

ధర్మ సందేహాలు

ధనుర్మాసం అంటే ఏమిటి?

డిసెంబర్ 15వ తేదీ ఆదివారం సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశిస్తాడు కాబట్టి డిసెంబర్ 16వ తేదీ నుంచి ధనుర్మాసం మొదలవుతుంది. ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం ఇల్లు శుభ్రం చేసి, దీపారాధన చేయడం వల్ల మహాలక్ష్మి కరుణా, కటాక్షాలు సిద్ధిస్తాయని శాస్త్రవచనం. తెలుగు రాష్ట్రాలలో ఈ మాసాన్ని పండుగ నెల అని అంటారు. సంక్రాంతికి ఒక నెల ముందు నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. సూర్యుడు ధను రాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలవుతుంది. తిరిగి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సంక్రాంతి రోజుతో ధనుర్మాసం ముగుస్తుంది. ధనుర్మాసం ప్రారంభాన్నే పల్లెటూర్లలో సంక్రాంతి నెల పట్టడం అంటారు.



ధనుర్మాసంలో శుభకార్యాలు ఎందుకు చేయరు?

ఏడాది పొడవునా నిత్య దైనందిన కార్యక్రమాలతో ఉంటూ భగవంతుని కోసం సమయం కేటాయించలేని వారి కోసమే ఈ ధనుర్మాసం. అందుకే ఈ నెలలో ఎలాంటి శుభకార్యాలు చేయరు. శుభకార్యాలు ఉండవు కాబట్టి ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. ఎందుకంటే రవి ధనస్సు రాశిలోకి ప్రవేశించి మకరంలోకి వెళ్ళే సమయమే ధనుర్మాసం. ధనుస్సు, మీనంలో రవి ఉన్నప్పుడు, సూర్యుని రాశి అయిన బృహస్పతిలో ఉన్నప్పుడు ఏ శుభకార్యాన్ని నిర్వహించకూడదు. కేవలం పండుగ వాతావరణంతో అంతా సంతోషంగా, ప్రశాంతంగా ఉండగలుగుతారు. ఈ మాసంలో ఎక్కువగా సూర్య నమస్కారాలు చేస్తారు. ఇంకా విష్ణుమూర్తిని నిత్యం వేకువనే పూజించడం శుభం.

బిజినెస్ రీల్

పీసీ జ్యువెలర్ షేర్ల విభజన

1 షేరు 10 షేర్లుగా మార్పిడి



హైదరాబాద్: బంగారు ఆభరణ రిటైల్ కంపెనీ పీసీ జ్యువెలర్ 1:10 నిష్పత్తిలో షేర్ల విభజనను చేపట్టింది. ఇందుకు ఈ నెల 16 రికార్డు తేదీకాగా.. రూ. 10 ముఖ విలువగల ఒక్కో షేరు రూ. 1 ముఖ విలువగల 10 షేర్లుగా మార్పు చెందాయి. విభజన తదుపరి కంపెనీ ఈక్విటీ షేర్ల సంఖ్య 46.54 కోట్ల నుంచి 465.4 కోట్లకు ఎగసింది. కాగా.. షేర్ల విభజనకు ముందు రుణ చెల్లింపులకుగాను సెప్టెంబర్‌లో బ్యాంకుల కన్సార్షియంతో పీసీ జ్యువెలర్‌కు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో రూ. 10 ముఖ విలువగల 5.18 కోట్ల షేర్లను రుణదాతలకు జారీ చేసింది. ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా షేరుకి రూ. 292 ధరలో నాన్‌ప్రమోటర్ కేటగిరీలో ప్రిఫరెన్షియల్ కేటాయింపులు చేపట్టింది. ఇందుకు కంపెనీ బోర్డు ఇప్పటికే ఆమోదముద్ర వేసింది.

షాపర్స్ స్టాప్ నుంచి అమెజాన్ ఔట్

4 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: గ్లోబల్ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా షాపర్స్ స్టాప్‌లోగల 4 శాతం వాటాను విక్రయించింది. ఒక్కో షేరుకి రూ. 627.6 సగటు ధరలో 44 లక్షల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ దాదాపు రూ. 276 కోట్లుకాగా.. తద్వారా కంపెనీ నుంచి వైదొలగింది. ఎన్‌ఎస్ఈ గణాంకాల ప్రకారం అసెట్, వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ 360 వన్, అనుబంధ నాలుగు సంస్థలతో కలిసి వాటాను సొంతం చేసుకుంది. వీటితోపాటు కొటక్ మహీంద్రా ఎంఎఫ్, టాటా ఎంఎఫ్, మోర్గాన్ స్టాన్లీ సైతం వాటాలు కొనుగోలు చేశాయి. 2018 జనవరిలో అమెజాన్ రూ. 179.3 కోట్లు వెచ్చించి షాపర్స్ స్టాప్‌లో వాటాను సొంతం చేసుకుంది.

ఎన్‌ఎస్ఈలో షాపర్స్ స్టాప్ షేరు 1.2 శాతం బలపడి రూ. 635 వద్ద ముగిసింది.

సెంబ్‌కార్ప్‌కు భారీ సోలార్ ప్రాజెక్టు



న్యూఢిల్లీ: సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్‌లో భాగమైన సెంబ్‌కార్ప్ గ్రీన్ ఇన్‌ఫ్రాకు 150 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు, అలాగే 300 ఎండబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బీఈఎస్ఎస్) ప్రాజెక్టు దక్కింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి ఈ కాంట్రాక్టులను పొందింది. 2 గిగావాట్ల ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం (ఐఎస్‌టీఎస్) ప్రాజెక్టులో ఇవి భాగంగా ఉన్నాయి. ఇది భారత్‌లో సెంబ్‌కార్ప్‌కి సంబంధించి తొలి సోలార్, బీఈఎస్ఎస్ హైబ్రిడ్ ప్రాజెక్టు.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	7,113.65	2.48
DRREDDY	1,276.90	2.34
CIPLA	1,471.00	1.39
WIPRO	311.95	1
ADANIPORTS	1,210.90	1

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	757	-2.92
POWERGRID	321.7	-2.46
BEL	304.55	-1.95
NTPC	342.65	-1.83
JSWSTEEL	949.75	-1.77

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-12-2024

విశాఖ	600-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	610-00
విజయవాడ	610-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	580-00
వరంగల్	582-00
రిటైల్ ధర	6.40

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,507
ఎన్ఎస్ఈ	1,04,386
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,90,664
ఎఫ్ఐఐ	- 1,317
డీఐఐ	+ 4,084

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.49	$ 70.08
బ్రెంట్	73.90	$ 73.19

బీ2బీ క్విక్ కామర్స్‌లోకి మైటీవీఎస్

- 2 గంటల్లో వాహన విడిభాగాల డెలివరీ
- సంస్థ ఎండీ జి.శ్రీనివాస రాఘవన్ వెల్లడి



చెన్నై: టీవీఎస్ మొబిలిటీ గ్రూప్‌లో భాగమైన మైటీవీఎస్ తాజాగా భారత్‌లో తొలిసారిగా బిజినెస్ టు బిజినెస్ క్విక్ కామర్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మైటీవీఎస్ యాప్‌లో ఆర్డర్ ఇచ్చిన రెండు గంటల్లో వాహన విడిభాగాలు, లూబ్రికెంట్స్‌ను రిటైలర్లు, వ్యాపార భాగస్వాములకు చేరుస్తారు. మూడేళ్లలో దేశవ్యాప్తంగా 250 డార్క్ స్టోర్లను మైటీవీఎస్ హైపర్‌మార్ట్ పేరుతో ఏర్పాటు చేస్తామని సంస్థ ఎండీ జి.శ్రీనివాస రాఘవన్ బుధవారం తెలిపారు. 2025 మార్చి నాటికి 50 డార్క్ స్టోర్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. 'ఈ దుకాణాలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సరఫరా వ్యవస్థ సాంకేతికతను ఉపయోగించుకుంటాయి. సరైన ఉత్పత్తిని సరైన స్థలం, సమయానికి అందజేస్తాం. కన్‌సైన్‌మెంట్ ఇన్వెంటరీ విధానాన్ని అమలు చేస్తాం. రిటైలర్లు భారీగా స్టాక్ పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. వర్కింగ్ క్యాపిటల్ భారం తగ్గుతుంది' అని అన్నారు.

అతిపెద్ద డిజిటల్ కేటలాగ్..

కంపెనీ తమిళనాడు, కర్నాటకలో 14 డార్క్ స్టోర్లను నిర్వహిస్తోంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతం అయిందని రాఘవన్ చెప్పారు. ఇది ప్రతి స్టోర్‌కు లాభదాయకతను పెంచుతుందని, మూడు నెలల్లో భాగస్వామి రిటైలర్‌లకు అత్యుత్తమ రాబడిని అందిస్తుందన్నారు. వాణిజ్య, ప్యాసింజర్ వాహనాల కోసం విడిభాగాలు, లూబ్రికెంట్స్ విభాగంలో 1.2 కోట్లకుపైగా స్టాక్-కీపింగ్ యూనిట్లతో దేశంలో అతిపెద్ద డిజిటల్ కేటలాగ్ నిర్మించామని తెలిపారు. 2025 నాటికి భారత్‌లో 50,000 గరాజ్‌లు, రిటైలర్లను కనెక్ట్ చేయాలన్నది లక్ష్యమని వివరించారు. ప్రస్తుతం మైటీవీఎస్ 1,000కు పైగా సర్వీసింగ్ కేంద్రాలను నిర్వహిస్తోంది. 10 లక్షలకుపైగా కస్టమర్లు ఉన్నారు.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు @ రూ.15.82 లక్షల కోట్లు

డిసెంబర్ 17 నాటికి 16.45 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు డిసెంబర్ 17వ తేదీ నాటికి వార్షికంగా 16.45 శాతం పెరిగి రూ.15.82 లక్షల కోట్లకు చేరాయి. స్థూలంగా చూస్తే వసూళ్లు 20.32 శాతం పెరిగి రూ.19.21 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో రిఫండ్స్ రూ.3.39 లక్షల కోట్లు. వెరసి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.15.82 లక్షల కోట్లుగా నమోదయ్యింది.



కంపెనీ బోర్డుల్లో మహిళలకు ప్రాధాన్యం

- నాలుగేళ్లలో కాస్తంత మెరుగుదల
- టాప్-100లో 95 కంపెనీల్లో చోటు



న్యూఢిల్లీ: దేశంలోని 100 అగ్రగామి కంపెనీల డైరెక్టర్ల బోర్డుల్లో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ముఖ్యంగా గడిచిన నాలుగేళ్లలో ఇది గణనీయంగా మెరుగుపడినట్టు 'ఎక్సలెన్స్ ఎనేబులర్స్' 5వ కార్పొరేట్ గవర్నెన్స్ సర్వే వెల్లడించింది. 2024 మార్చి నాటికి కేవలం ఐదు కంపెనీల్లోనే మహిళా స్వతంత్ర డైరెక్టర్ ఒక్కరూ లేని పరిస్థితి నెలకొన్నట్టు తెలిపింది. ఇవన్నీ ప్రభుత్వరంగ సంస్థలే (పీఎస్‌యూ) కావడం గమనార్హం. నాలుగు పీఎస్‌యూలతోపాటు, ఒక ప్రభుత్వరంగ బ్యాంక్‌లో మహిళా డైరెక్టర్ ఒక్కరూ లేరు. 2021 మార్చి నాటికి అగ్రగామి 100 కంపెనీల్లో మహిళా ఇండిపెండెంట్ డైరెక్టర్ లేని కంపెనీలు 21 ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. కంపెనీల బోర్డుల్లో కనీసం ఒక్క మహిళా ఇండిపెండెంట్ డైరెక్టర్ అయినా ఉండాలని కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 149 నిర్దేశిస్తోంది. సమర్థత కలిగిన మహిళలను గుర్తించి, కెరీర్ పురోగతి దిశగా అవకాశాలు కల్పించడం ద్వారా బోర్డుల్లో ప్రాతినిధ్యాన్ని పెంచగలమని ఈ సర్వే అభిప్రాయపడింది.

నిదానంగా పురోగతి..

కంపెనీ బోర్డుల్లో కీలక పదవులకు మహిళలకు అవకాశాలు పెరుగుతున్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. 2021 మార్చి నాటికి మహిళా మేనేజింగ్ డైరెక్టర్లు కలిగిన కంపెనీలు రెండు ఉంటే, 2024-25 మార్చి నాటికి ఐదుకు పెరిగినట్టు తెలిపింది. అలాగే, 2021 మార్చి నాటికి రెండు కంపెనీలకు మహిళా చైర్‌పర్సన్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఐదుగురు ఈ స్థానానికి చేరుకున్నట్టు వెల్లడించింది. నాయకత్వ బాధ్యతల్లో మహిళల ప్రాత్ర గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో పెరుగుతూ వచ్చినట్టు తెలిపింది. లింగ సమానత్వం మెరుగ్గా లేకపోయినప్పటికీ.. కీలకమైన పాలన బాధ్యతల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్నట్టు పేర్కొంది.

రెట్టింపైన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం

- ఏప్రిల్-నవంబర్ మధ్య 15 గిగావాట్లు
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన విద్యుత్ సామర్థ్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-నవంబర్ కాలంలో 15 మెగావాట్ల మేర అదనంగా సమకూరినట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. క్రితం ఏడాది ఇదే కాలంలో కొత్త ఏర్పాటు చేసిన 7.54 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ సామర్థ్యం కంటే రెట్టింపుగా పేర్కొన్నారు. గత నెలలోనే 2.3 గిగావాట్ల మేర సామర్థ్యం సమకూరినట్టు తెలిపారు. సీఐఐ నిర్వహించిన ఇంధన సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో పదేళ్లలో పునరుత్పాదక ఇంధన రంగంలో అసాధారణమైన బాటలు వేసినట్టు చెప్పారు. నేడు శుద్ధ ఇంధన విభాగంలో భారత్ ప్రపంచంలోనే ప్రముఖ దేశంగా అవతరించినట్టు ప్రకటించారు. శిలాజేతర ఇంధన వనరుల ద్వారా 2030 నాటికి 500 గిగావాట్ల విద్యుత్ తయారీ సాధించాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ 6.1 బిలియన్ డాలర్ల మేర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించినట్టు మంత్రి వెల్లడించారు. స్థానికంగానే సోలార్ ప్యానెళ్లు, మాడ్యూళ్ల తయారీని ప్రోత్సహించేందుకు పీఎల్ఐ పథకం కింద రూ.24,000 కోట్లతో పథకాన్ని తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు. 2025-26 నాటికి 38 గిగావాట్ల సామర్థ్యంతో 50 సోలార్ పార్క్‌లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద ఎలక్ట్రోలైజర్ల తయారీకి రూ.4,400 కోట్లు, ఇతర ప్రధాన విడిభాగాలకు రూ.13,050 కోట్ల ప్రోత్సాహకాలు ప్రకటించినట్టు చెప్పారు.

వివాద్ సే విశ్వాస్ పై సందేహాల నివృత్తి

వివరణలు జారీ చేసిన ఐటీ శాఖ



న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ 'వివాద్ సే విశ్వాస్' పథకానికి సంబంధించి సందేహాలను తొలగించే ప్రయత్నం చేసింది. తరచూ అడిగే ప్రశ్నలకు (ఎఫ్ఏక్యూలు), వాటికి సమాధానాలు విడుదల చేసింది. 2024 జూలై 22 నాటికి అపరిష్కృతంగా ఉన్న అన్ని రకాల అప్పీళ్లకు వివాద్ సే విశ్వాసం పథకం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ పథకం కింద పన్ను వివాదాలను పరిష్కరించుకోవాలని భావించే వారు ఈ నెల 31లోపు ప్రత్యక్ష పన్నుల వివాద్ సే విశ్వాస్ కింద డిక్లరేషన్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. వివాదంలో ఉన్న పన్ను మొత్తాన్ని చెల్లించాలి. తాజా స్పష్టతతో పన్ను చెల్లింపుదారులు అందరికీ కేసుల పరిష్కారంలో సమాన అవకాశాలు లభిస్తాయని నాంజియా అండ్ కో ఎల్ఎల్‌పీ పార్ట్‌నర్ సచిన్ గార్గ్ తెలిపారు. జూలై 22 నాటికి పెండింగ్‌లో ఉన్నవి, కొట్టేసిన వాటికి సైతం ఈ పథకం కింద పరిష్కారానికి అర్హత ఉంటుంది. వివాద్ సే విశ్వాస్ పథకాన్ని 2024-25 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. అక్టోబర్ 1న దీన్ని నోటిఫై చేశారు. డిసెంబర్ 31లోపు డిక్లరేషన్ దాఖలు చేసిన వారు పరిష్కారానికి వీలుగా వివాదంలో ఉన్న పన్ను మొత్తాన్ని చెల్లించాలి. 2025 జనవరి 1, ఆ తర్వాత డిక్లరేషన్ దాఖలు చేస్తే వివాదంలోని పన్ను మొత్తంలో 110 శాతాన్ని చెల్లించాలని ఆదాయపన్ను శాఖ తెలిపింది.

విమాన చార్జీలను నియంత్రించం


సహాయ మంత్రి మురళీధర్ మోహోల్



న్యూఢిల్లీ: విమానయాన రంగంలో పోటీతత్వాన్ని కొనసాగించడానికి వీలుగా చార్జీల నియంత్రణ విషయంలో ప్రభుత్వం దూరంగా ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ స్పష్టం చేశారు. అయితే విమానయాన సంస్థలు వసూలు చేసే చార్జీలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం సమీక్షిస్తుందని అవసరమైతే అసాధారణ పెంపుదలను నిరోధించడానికి జోక్యం చేసుకుంటుందని రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కొన్ని సందర్భాల్లో, సీజన్లలో విమానయాన చార్జీలు పెరుగుతుండడం తెలిసిందే. దీంతో వీటిని అందుబాటు ధరలకు తీసుకురావాలన్న డిమాండ్లు నెలకొన్నాయి. 2023తో పోల్చితే 2024లో చార్జీలు మోస్తరు స్థాయికి దిగొచ్చినట్టు మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. భారత ఏవియేషన్ పరిశ్రమలోని సంక్లిష్టతల దృష్ట్యా ఈ రంగం వృద్ధికి అవసరమైన సహాయకారి పాత్రను ప్రభుత్వం పోషిస్తున్నట్టు వివరించారు. ''ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చార్జీలను సహేతుక స్థాయిలో నిర్ణయించే విషయమై ఎయిర్‌లైన్స్ సంస్థలు అవగాహన కలిగి ఉన్నాయి. పండుగల సీజన్లలో కొన్ని విభాగాల్లో చార్జీలు తగ్గడాన్ని కూడా గమనించొచ్చు''అని మంత్రి పేర్కొన్నారు.

ఏఐ వినియోగానికి సవాలుగా హ్యాకింగ్ రిస్కులు

డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ) గణనీయంగా ప్రాచుర్యంలోకి వస్తున్నప్పటికీ దీన్ని వినియోగించుకోవడంలో కంపెనీలు కాస్త ఆచి తూచి వ్యవహరిస్తున్నాయి. హ్యాకింగ్, సైబర్ దాడులు వంటి రిస్కులే ఏఐ వినియోగానికి అతి పెద్ద సవాళ్లుగా ఉంటున్నాయని ఒక సర్వేలో 92% మంది భారతీయ ఎగ్జిక్యూటివ్‌లు అభిప్రాయపడ్డారు. ఇందుకు ప్రైవసీ రిస్కులు కారణమని 91% మంది, నియంత్రణపరమైన అనిశ్చితి కారణమని 89% మంది తెలిపారు. డెలాయిట్ ఏషియా పసిఫిక్ రూపొందించిన 'ఏఐ ఎట్ క్రాస్‌రోడ్స్' నివేదికలో ఈ అంశాలు వెల్లడి అయ్యాయి. ఏఐ సంబంధ రిస్కులను ఎదుర్కొనడంలో తమ సంస్థలకు తగినంత స్థాయిలో వనరులు లేవని 50 శాతం మంది పైగా టెక్ వర్కర్లు తెలిపారు. గవర్నెన్స్‌పరంగా పటిష్టమైన విధానాలను పాటించడం, నిరంతరం కొత్త సాంకేతికతల్లో శిక్షణ పొందాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోందని డెలాయిట్ వివరించింది. అయితే, ఏఐ వినియోగంపై ఆశావహ భావం కూడా ఉన్నట్లు పేర్కొంది. నైతిక విలువలతో వినియోగించేందుకు 60% మంది ఉద్యోగులకు నైపుణ్యాలు ఉన్నాయని, ఉద్యోగాల్లో నైపుణ్యాలపరంగా ఉన్న అంతరాలను తొలగించేందుకు 72% సంస్థలు క్రియాశీలకంగా పని చేస్తున్నాయని నివేదిక వివరించింది. 13 మార్కెట్లవ్యాప్తంగా 900 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ సర్వేలో పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎండీగా రామ మోహన్ రావు

సంస్థ బోర్డులో మరో తెలుగు వ్యక్తి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్యాంకింగ్ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎండీగా తెలుగువారైన రామ మోహన్ రావు అమరను నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. మూడేళ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్‌బీఐ బోర్డులో ఒక చైర్మన్, నలుగురు ఎండీలు ఉంటారు. రామ మోహన్ రావు బాధ్యతలు స్వీకరిస్తే ఎండీల సంఖ్య నాలుగుకు చేరుకుంటుంది. సంస్థ చైర్మన్ సి.ఎస్. శెట్టి కూడా తెలుగు వారు కావడం విశేషం. ఎస్‌బీఐ చరిత్రలో ఒకేసారి రెండు కీలక పదవులను తెలుగు వారు దక్కించుకోవడం ఇదే తొలిసారి. కాగా, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు డైరెక్టర్ల పేర్లను సిఫార్సు చేసే ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) ఈ ఏడాది సెప్టెంబర్‌లో రామ మోహన్ రావును ఎస్‌బీఐ ఎండీగా ప్రతిపాదించింది. ఎస్‌బీఐ ఎండీ పోస్టుకు ఎఫ్ఎస్ఐబీ తొమ్మిది మందిని ఇంటర్వ్యూ చేసింది. ఎఫ్ఎస్ఐబీ ప్రతిపాదనలపై ప్రధాన మంత్రి నేతృత్వంలోని కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుంది. ఎస్‌బీఐ కార్డ్ ఎండీ, సీఈవోగా కూడా రామ మోహన్ రావు పనిచేశారు. బ్యాంకింగ్ రంగంలో మూడు దశాబ్దాల అనుభవం ఆయన సొంతం.

గార్మెంట్స్ ఎగుమతులు జూమ్

- ఏప్రిల్-నవంబర్‌లో 11.4% వృద్ధి
- 9.85 బిలియన్ డాలర్లు నమోదు
- అపారెల్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచ అనిశ్చితి ఉన్నప్పటికీ 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ కాలంలో భారత్ నుంచి రెడీమేడ్ గార్మెంట్స్ ఎగుమతులు 11.4 శాతం పెరిగి 9.85 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు ప్రపంచ డిమాండ్‌ను ఈ వృద్ధి తెలియజేస్తోందని అపారెల్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) తెలిపింది. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణలతో సమీప భవిష్యత్తులో అధిక వ్యాపార అవకాశాలు భారత్ వైపునకు మళ్లనున్నాయని కౌన్సిల్ వివరించింది. దేశ స్వాభావిక బలాలు, కేంద్ర, రాష్ట్రాల పటిష్ట సహాయక విధానాలతో ప్రయోజనాలను పొందేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఏఈపీసీ చైర్మన్ సుధీర్ సెఖ్రి అన్నారు. ఎండ్-టు-ఎండ్ వాల్యూ చైన్ సామర్థ్యం, బలమైన ముడిసరుకు, స్థిర, బాధ్యతాయుత వ్యాపార పద్ధతులపై దృష్టి సారించే కర్మాగారాలతో భారత్ ఖచ్చితంగా రాబోయే కాలంలో గణనీయ వృద్ధిని సాధిస్తుందని అన్నారు.

నమ్మకం పెరుగుతోంది..

మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులపై గ్లోబల్ బ్రాండ్‌ల పెరుగుతున్న నమ్మకాన్ని కూడా ఈ వృద్ధి ప్రతిబింబిస్తోందని సుధీర్ తెలిపారు. ప్రత్యేకించి పండుగ సీజన్‌లో డిమాండ్ దూసుకెళ్లడం ఇందుకు ఉదాహరణ అని వివరించారు. అంతర్జాతీయ కొనుగోలుదారులు భారత్ టెక్స్ ఎక్స్‌పో-2025లో పాల్గొనాల్సిందిగా చైర్మన్ విజ్ఞప్తి చేశారు. భారత మొత్తం వస్త్ర వ్యవస్థను ఒకే గొడుకు కింద చూపే పెద్ద వేదిక అని వ్యాఖ్యానించారు. 'భారత్ టెక్స్ రోడ్‌షో సందర్భంగా వివిధ దేశాలకు వెళ్లాం. అంతర్జాతీయ కొనుగోలుదారులు, రిటైల్ చైన్‌ల నుండి అద్భుత ప్రతిస్పందనలను అందుకున్నాం. భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ప్రోత్సహిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ ప్లాట్‌ఫామ్ గొప్ప సహకారాన్ని, సోర్సింగ్ నెట్‌వర్క్‌లను విస్తరిస్తుందని ఖచ్చితంగా అనుకుంటున్నాం' అని వివరించారు.

ఇప్కా ల్యాబ్స్ వాటా విక్రయం

డీల్ విలువ రూ. 600 కోట్లు




న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ కంపెనీ ఇప్కా ల్యాబొరేటరీస్‌లో ప్రమోటర్లలో ఒకరైన ఉషా మధుకర్ చందూర్కర్ తాజాగా 1.6 శాతం వాటాను విక్రయించారు. వీటి విలువ రూ. 600 కోట్లుకాగా.. ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా బీఎస్ఈలో 40 లక్షల షేర్లను అమ్మివేశారు. షేరుకి రూ. 1,501.52 ధరలో రూ. 600.6 కోట్లకు విక్రయించారు. ఈ లావాదేవీ తదుపరి ఇప్కా ల్యాబ్స్‌లో ప్రమోటర్లు, గ్రూప్ సంస్థల వాటా 46.3 శాతం నుంచి 44.7 శాతానికి తగ్గింది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు.

ఈ నేపథ్యంలో ఇప్కా ల్యాబ్స్ షేరు బీఎస్ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 1,516 వద్ద ముగిసింది.

ఐటీసీ హోటళ్ల కన్సాలిడేషన్ బాట

ఒబెరాయ్, లీలా హోటళ్లలో వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ ఆతిథ్య రంగ ప్రత్యర్థి సంస్థలు ఒబెరాయ్, హోటల్ లీలాలో వాటాలు పెంచుకుంది. సొంత అనుబంధ సంస్థ రస్సెల్ క్రెడిట్ ద్వారా తాజాగా ఒబెరాయ్ హోటళ్ల మాతృ సంస్థ ఈఐహెచ్‌లో 1.52 కోట్ల షేర్లను కొనుగోలు చేసింది. ఇది ఈఐహెచ్ ఈక్విటీలో 2.44 శాతానికి సమానంకాగా.. హోటల్ లీలా వెంచర్‌లో 34.6 లక్షల షేర్లను సొంతం చేసుకుంది. తద్వారా 0.53 శాతం వాటాను చేజిక్కించుకుంది. ఫలితంగా ఈఐహెచ్‌లో ఐటీసీ వాటా 16.13 శాతానికి బలపడగా.. హోటల్ లీలాలో వాటా 8.11 శాతాన్ని తాకింది. ఇక మరోపక్కవాటాదారులకు జనవరి నుంచి విడదీయనున్న ఐటీసీ హోటళ్ల షేర్ల జారీకి 2025 జనవరి 6 రికార్డ్ డేట్‌గా నిర్ణయించినట్లు ఐటీసీ వెల్లడించింది.

ఐటీసీ షేరు బీఎస్ఈలో 0.2 శాతం పుంజుకుని రూ. 471 వద్ద ముగిసింది.

బంగారు ఆభరణాల ఆకర్షణ..

2024-25లో వినియోగం 18% వరకూ పెరిగే చాన్స్

- ఇక్రా నివేదిక



ముంబై: విలువ పరంగా దేశీయ బంగారు ఆభరణాల వినియోగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) కూడా పటిష్టంగా ఉంటుందని రేటింగ్ ఏజెన్సీ- ఇక్రా పేర్కొంది. విలువ రూపంలో వినియోగం 14 నుంచి 18% వృద్ధి చెందుతుందని ఇక్రా నివేదిక తెలిపింది. 2023-24లో ఈ వృద్ధి రేటు 18 శాతంగా నివేదిక తెలిపింది. నివేదిక ప్రకారం, బంగారం ధరలు అస్థిరంగా ఉన్నప్పటికీ వినియోగదారుల డిమాండ్ మందగించలేదని, పండుగ నేపథ్యంలో డిమాండ్ ఇటీవలి నెలల్లో మరింత పెరిగిందని నివేదిక వివరించింది. 2024 జూలైలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో 9% మేర (15 నుంచి 6 శాతానికి) దిగుమతుల సుంకం తగ్గడం- బంగా రం ధరల్లో తాత్కాలిక ధరల కట్టడికి దారి తీసిందని ఇది రెండవ త్రైమాసికంలో భారీ కొనుగోళ్లకు దారితీసిందని నివేదిక వివరించింది ప్రత్యేకించి ఆ భర ణాలతో పాటు, నాణేలు, కడ్డీల కొనుగోళ్లూ పెరిగా యని వివరించింది. పండుగల సీజన్ కూడా పసిడి డిమాండ్‌కు కలిసి వచ్చిన అంశంగా పేర్కొంది.

పెరుగుతున్న దిగుమతులు..

భారత్ బంగారం దిగుమతులు సైతం భారీగా పెరుగుతుండడం గమనార్హం. భారత్ బంగారం దిగుమతులలో 40 శాతంతో స్విట్జర్లాండ్ అతిపెద్ద వాటా కలిగిఉంది. యూఏఈ వాటా 16% కాగా, దక్షిణాఫ్రికా వాటా 10%గా ఉంది. దేశంలోకి వచ్చీ-పోయే విదేశీ నిధులకు సంబంధించిన కరెంట్ అకౌంట్‌పై పసిడి కొనుగోళ్ల (దిగుమతుల) ప్రభావం కనబడుతోంది. 2023-24లో భారత్ పసిడి దిగుమతుల విలువ 30% పెరిగి 45.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. యునైటెడ్ అర బ్ ఎమిరైట్స్ (యూఏఈ) నుంచి ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ తయారీదారులు, వ్యాపారులు రాయితీ రేటుతో 160 టన్నుల బంగారాన్ని దిగు మతి చేసుకోవడనికి ప్రభుత్వం నోటిఫై చేసింది. భారతదేశం-యూఏ ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)లో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది 140 టన్నులు ఈ తరహాలో నోటిఫై అయ్యింది.

ఎకానమీకి సవాలు: జీటీఆర్ఐ

దేశంలోకి భారీగా పసిడి దిగుమతులు వాణిజ్య సమతౌల్యతకు, కరెంట్ అకౌంట్‌లోటు కట్టు తప్పడానికి తద్వారా ఎకానమీ పురోగతిని దెబ్బతీయడానికి దారితీసే అంశమని ఆర్థిక విశ్లేషణా సంస్థ-జీటీఆర్ఐ ఒక నివేదికలో పేర్కొంది. పసిడి ది గుమతుల విలువ పెరగడం ఆందోళనకరమైన విషయమని జీటీఆర్ఐ ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవ పే ర్కొన్నారు. తాజాగా వెలువడిన గణాంకాల ప్రకా రం నవంబర్‌లో పసిడి దిగుమతుల విలువ ఆల్‌టై మ్ హై 14.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2023 నవంబర్‌లో ఈ విలువ 3.5 బిలియన్ డాలర్లు.



సిరీస్ సొంతం చేసుకోవాలని...

- నేడు భారత్, వెస్టిండీస్ మూడో టి20
- రాత్రి 7 గంటల నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: భారత్, వెస్టిండీస్ మహిళల జట్ల మధ్య గురువారం నిర్ణయాత్మక మూడో టి20 మ్యాచ్ జరగనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టి20లో భారత్ విజయం సాధించగా... రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ గెలిచి 1–1తో లెక్క సరిచేసింది. తొలి టి20లో బ్యాటర్లు దంచికొట్టడంతో భారీ స్కోరు చేసిన టీమిండియా... రెండో మ్యాచ్‌లో అదే జోరు కొనసాగించలేకపోయింది. గత మ్యాచ్‌కు అందుబాటులో లేకపోయిన భారత రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం కూడా సందేహమే. ఈ నేపథ్యంలో మరోసారి స్మృతి మంధాన జట్టును నడిపించనుంది. బ్యాటింగ్‌లో స్మృతి రాణిస్తున్నా... ఆమెతో పాటు ఇతర ప్లేయర్లు కూడా సత్తా చాటాల్సిన అవసరముంది. ఈ సిరీస్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ అర్ధశతకాలు సాధించిన స్మృతి అదే ఫామ్ కొనసాగించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తుండగా... జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, ఉమా ఛెత్రి, దీప్తి శర్మ నిలకడ ప్రదర్శించాల్సిన అవసరముంది. బౌలింగ్‌లో అనుభవలేమి స్పష్టంగా కనిపిస్తోంది. గత మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాటర్లు విజృంభిస్తుంటే... మన బౌలర్లు వారిని అడ్డుకోవడంలో విఫలమయ్యారు. సీనియర్లు దీప్తి శర్మ, రాధ యాదవ్, రేణుక సింగ్‌తో పాటు యంగ్‌ప్లేయర్లు సైమా ఠాకూర్, సజీవన్ సజన, టిటాస్ సాధు సమష్టిగా సత్తా చాటాల్సిన అవసరముంది. మరోవైపు రెండో టి20లో విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న వెస్టిండీస్ అదే ఊపు కొనసాగించాలని భావిస్తోంది. ఈ ఫార్మాట్‌లో భారత్ చేతిలో వరుసగా తొమ్మిది పరాజయాల తర్వాత గత మ్యాచ్‌లో విజయం సాధించిన కరీబియన్ జట్టు సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. ముఖ్యంగా కెప్టెన్ హేలీ మాథ్యూస్, క్యాంప్‌బెల్, డాటిన్ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. గత మ్యాచ్‌లో కరీబియన్ ప్లేయర్లు భారత బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్నారు. 150 పరుగుల లక్ష్యాన్ని కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 26 బంతులు మిగిలుండగానే పూర్తి చేశారు. సిరీస్ సొంతం చేసుకోవాలంటే కరీబియన్ హిట్టర్ల దూకుడును భారత్ అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

భారత్ 'ఖో ఖో' కూత పాక్‌తో షురూ

వచ్చేనెల 13 నుంచి ఖోఖో ప్రపంచకప్ ● బరిలో 24 దేశాలు



న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే ప్రప్రథమ ఖోఖో ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. భారత్ ఆతిథ్యమిచ్చే ఈ గ్రామీణ క్రీడ మెగా ఈవెంట్‌లో పురుషుల విభాగంలో చిరకాల ప్రత్యర్థుల మధ్య జనవరి 13న జరిగే తొలి మ్యాచ్‌తో ప్రపంచకప్‌కు తెరలేవనుంది. 13 నుంచి 19 వరకు జరిగే ఈ ఈవెంట్లో 24 దేశాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో 21 పురుషుల జట్లు, 20 మహిళా జట్లు బరిలోకి దిగుతాయి. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే పోటీకి ముందుగా అట్టహాసంగా ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రపంచకప్ సీఈఓ విక్రమ్ దేవ్ డోగ్రా తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ '13 నుంచి 16వ తేదీ వరకు లీగ్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. 17న నాలుగు క్వార్టర్ ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తాం. మరుసటి రోజే (18) సెమీఫైనల్స్, ఇరు విభాగాల్లో 19న జరిగే ఫైనల్స్‌తో టోర్నీ ముగుస్తుంది' అని అన్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంతో పాటు గ్రేటర్ నోయిడాలోని ఇండోర్ స్టేడియంలో మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ టోర్నీ కోసం జవహర్‌లాల్ స్టేడియంలో ప్రస్తుతం భారత పురుషులు, మహిళా జట్ల ప్రాబబుల్స్‌కు శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో నుంచి తుది జట్లను త్వరలోనే ప్రకటిస్తామని భారత ఖోఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ చెప్పారు. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ ఈ మెగా ఈవెంట్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. 615 మంది ప్లేయర్లు, 125 మంది సహాయ సిబ్బందికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.



సయీమ్ అయూబ్, సల్మాన్ ఆఘా

సల్మాన్ ఆల్‌రౌండ్ షో

- సయీమ్ అయూబ్ సెంచరీ
- తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై పాకిస్తాన్ విజయం

పార్ల్ (దక్షిణాఫ్రికా): దక్షిణాఫ్రికా పర్యటనలో టి20 సిరీస్‌ను కోల్పోయిన పాకిస్తాన్ జట్టు... వన్డే సిరీస్‌లో మాత్రం శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ 3 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ (97 బంతుల్లో 86; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడగా... కెప్టెన్ మార్క్‌రమ్ (35; 1 ఫోర్), టోనీ జోర్జీ (33; 6 ఫోర్లు), రికెల్టన్ (36; 7 ఫోర్లు) రాణించారు. పాకిస్తాన్ బౌలర్లలో సల్మాన్ ఆఘా 4 వికెట్లు పడగొట్టగా... అబ్రార్ అహ్మద్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 49.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ సయూమ్ అయూబ్ (119 బంతుల్లో 109; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... ఆల్‌రౌండర్ సల్మాన్ ఆఘా (90 బంతుల్లో 82 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) చివరి వరకు అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. కెప్టెన్ రిజ్వాన్ (1), అబ్దుల్లా షఫీక్ (0), కమ్రాన్ గులామ్ (4), ఇర్ఫాన్ ఖాన్ (1) విఫలమయ్యారు. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (23) మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మలచడంలో విఫలమయ్యాడు. 60 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన జట్టును అయూబ్, సల్మాన్ ఆదుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 141 పరుగులు జోడించడంతో ఛేదన సులువైంది. చివర్లో కొంత ఉత్కంఠ నెలకొన్నా... సల్మాన్ జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన సల్మాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య గురువారం కేప్‌టౌన్ వేదికగా రెండో వన్డే జరగనుంది.

క్వార్టర్స్‌లో సహజ



నవీ ముంబై: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ 6–2, 6–2తో ఇవా గర్కుషా (రష్యా)పై విజయం సాధించింది. 72 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్లు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, స్మృతి భాసిన్, చిలకలపూడి శ్రావ్య శివాని జోడీలు క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాయి. తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)–కులంబయేవా (కజకిస్తాన్) జోడీ 6–2, 6–2తో స్నేహల్ మానె–సోనల్ పాటిల్ (భారత్) జంటపై, స్మృతి–శ్రావ్య శివాని ద్వయం 6–4, 6–7 (5/7), 10–6తో ఆకాంక్ష–సోహా సాదిక్ (భారత్) జోడీపై గెలిచాయి.

బంగ్లాదేశ్‌దే సిరీస్

రెండో టి20లోనూ వెస్టిండీస్‌పై ఘనవిజయం




కింగ్స్‌టౌన్: వెస్టిండీస్ పర్యటనలో వన్డే సిరీస్ కోల్పోయిన బంగ్లాదేశ్ జట్టు టి20 సిరీస్ కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన రెండో టి20లో బంగ్లాదేశ్ 27 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను మట్టికరిపించింది. తద్వారా మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో సిరీస్ పట్టేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 129 పరుగులు చేసింది. షమీమ్ హుసేన్ (17 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మెహదీ హసన్ మిరాజ్ (26), జాకీర్ అలీ (21) ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ లిటన్ దాస్ (3), తన్జిద్ హసన్ (2), సౌమ్య సర్కార్ (11) విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో గుడకేశ్ మోతీ 2 వికెట్లు పడగొట్టగా... అకీల్ హుసేన్, రోస్టన్ చేజ్, అల్జారీ జోసెఫ్, మెకాయ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో విండీస్ తడబడింది. బంగ్లాదేశ్ బౌలర్లు విజృంభించడంతో వెస్టిండీస్ 18.3 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది. చేజ్ (32; 1 ఫోర్, 2 సిక్స్‌లు), అకీల్ హుసేన్ (31; 2 ఫోర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (6), నికోలస్ పూరన్ (5), బ్రాండన్ కింగ్ (8), ఫ్లెచర్ (0), షెఫర్డ్ (0) విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తస్కిన్ అహ్మద్ 3 వికెట్లు తీయగా... మెహదీ హసన్, తన్జీమ్ హసన్, రిషాద్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షమీమ్ హుసేన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన ఆఖరి టి20 గురువారం జరగనుంది.

'బెస్ట్ ప్లేయర్లు'గా వినిసియస్, బొన్మాతి



దోహా: రియల్ మాడ్రిడ్ స్టార్ వినిసియస్ జూనియర్ ఎట్టకేలకు అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా) అవార్డును చేజిక్కించుకున్నాడు. పురుషుల విభాగంలో అతను 'ఫిఫా బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు అందుకున్నాడు. ఈ అక్టోబర్‌లో ప్రతిష్టాత్మక బాలన్‌డోర్ అవార్డు రేసులో తుదిదాకా నిలిచినా... అనూహ్యంగా మాంచెస్టర్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి అందుకోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యాడు. ఇప్పుడు 'ఫిఫా' ప్రతిష్టాత్మక అవార్డుతో ఆ అవమానాన్ని, నిరాశను ఒక్కసారిగా అధిగమించినట్లయ్యింది. 2023 ఆగస్టు నుంచి 2024 ఆగస్టు వరకు జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా 'ఫిఫా' 11 మంది ప్లేయర్లను తుది అవార్డుల జాబితాకు ఎంపిక చేసింది. వీరిలో నుంచి వినిసియస్ విజేతగా నిలిచాడు. బ్రెజిల్‌కు చెందిన ఈ 24 ఏళ్ల స్టార్ స్ట్రయికర్ గత సీజన్‌లో విశేషంగా రాణించాడు. 39 మ్యాచ్‌ల్లో 24 గోల్స్ సాధించాడు. స్పానిష్ టీమ్ రియల్ మాడ్రిడ్ 15వసారి యూరోపియన్ కప్ గెలుపొందడంలో కీలకపాత్ర పోషించాడు. మహిళల విభాగంలో 'ఫిఫా బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ ఐతనా బొన్మాతి కైవసం చేసుకుంది. 26 ఏళ్ల స్పానిష్ స్టార్ ఇదివరకే వరుస సీజన్లలో బాలన్‌డోర్ అవార్డును ముద్దాడింది. అభిమానులు, ప్రస్తుత కెప్టెన్లు, కోచ్‌లు, ప్రపంచ వ్యాప్త జాతీయ ఫుట్‌బాల్ జట్లు, మీడియా ప్రతినిధులు వేసిన ఓట్లకు సమాన వెయిటేజీ ఇచ్చినట్లు 'ఫిఫా' వెల్లడించింది.

ప్లే ఆఫ్స్‌కు పట్నా పైరేట్స్, యూపీ యోధాస్



తెలుగు టైటాన్స్ రెయిడర్‌ను పట్టేసిన పట్నా పైరేట్స్ ఆటగాళ్లు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో పట్నా పైరేట్స్, యూపీ యోధాస్ జట్లు ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లాయి. లీగ్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 41–37 పాయింట్ల తేడాతో తెలుగు టైటాన్స్‌పై విజయం సాధించింది. తద్వారా 20 మ్యాచ్‌ల్లో 13 విజయాలు, 6 పరాజయాలు, ఒక 'టై'తో 73 పాయింట్లు ఖాతాలో వేసుకున్న పైరేట్స్... పట్టికలో రెండో స్థానానికి చేరింది. మరోవైపు 21 మ్యాచ్‌ల్లో 11 విజయాలు, 10 పరాజయాలతో 61 పాయింట్లతో ఉన్న తెలుగు టైటాన్స్ పట్టికలో ఏడో స్థానంలో కొనసాగుతోంది. కీలక పోరులో పట్నా పైరేట్స్ తరఫున దేవాంక్ 14 పాయింట్లతో విజృంభించగా... దీపక్, అంకిత్ చెరో ఆరు పాయింట్లతో అతడికి అండగా నిలిచారు. టైటాన్స్ తరఫున పవన్ సెహ్రావత్, విజయ్ మలిక్ చెరో 9 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఇతర జట్ల ఫలితాల ఆధారంగా యూపీ యోధాస్ కూడా ప్లేఆఫ్స్‌లో అడుగు పెట్టింది. యోధాస్ బుధవారం బరిలోకి దిగకపోయినా... లీగ్‌లో 20 మ్యాచ్‌లాడి 11 విజయాలు, 6 పరాజయాలు, 3 'టై'లతో 69 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో నాలుగో స్థానానికి చేరి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బుధవారమే జరిగిన మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ జట్టు 31 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తలైవాస్ 60–29 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌ను మట్టికరిపించింది. తలైవాస్ తరఫున మోయిన్, హిమాన్షు చెరో 13 పాయింట్లతో చెలరేగారు. ఈ ఇద్దరూ సూపర్ రెయిడ్‌లతో విజృంభించడంతో తలైవాస్ ఏకపక్ష విజయం సాధించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో యూపీ యోధాస్; యు ముంబాతో పట్నా పైరేట్స్ తలపడతాయి.

సాంట్నర్‌కు వన్డే, టి20 పగ్గాలు

న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటన




ఆక్లాండ్: సీనియర్ లెఫ్టార్మ్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ న్యూజిలాండ్ జట్టు కెప్టెన్‌గా నియమితులయ్యాడు. వన్డే, టి20 జట్లకు ఇకపై పూర్తి స్థాయి కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ అనుభవజ్ఞుడైన స్పిన్నర్‌కు సారథ్యం కొత్తేం కాదు. నాలుగేళ్ల క్రితమే రెగ్యులర్ కెప్టెన్ గైర్హాజరైతే 2020లో తొలిసారి వెస్టిండీస్‌తో జరిగిన టి20 మ్యాచ్‌కు పగ్గాలు చేపట్టాడు. అనంతరం అడపాదడపా ఇటు టి20లతో పాటు అటు వన్డేల్లో జట్టును నడిపించిన అనుభవం అతనికి వుంది. ఈ క్రమంలో అతను 24 టి20ల్లో, నాలుగు వన్డేల్లో జట్టుకు సారథిగా సేవలందించాడు. ఈ జూన్‌లో దక్షిణాఫ్రికాలో జరిగిన టి20 ప్రపంచకప్ అనంతరం కేన్ విలియమ్సన్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పడంతో 32 ఏళ్ల సాంట్నర్ ఇన్నాళ్లు తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే ఇప్పుడు పూర్తిస్థాయి సారథిగా... విలియమ్సన్ వారసుడిగా జట్టును నడిపిస్తాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు (ఎన్‌జడ్‌సీ) వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కొత్త ఏడాది నుంచి సాంట్నర్‌కు కొత్త సవాళ్లు ఎదురవనున్నాయి. త్వరలోనే శ్రీలంకతో టి20, వన్డేలలో ద్వైపాక్షిక సిరీస్‌లతో పాటు, ఫిబ్రవరిలో పాకిస్తాన్ గడ్డపై ముక్కోణపు వన్డే సిరీస్, తదనంతరం అక్కడే జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలు జరుగనున్నాయి. ఈ మెగా టోర్నీ ముగియగానే స్వదేశంలో కివీస్... పాక్‌తో టి20, వన్డే ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడుతుంది. ఈ సందర్భంగా సాంట్నర్ మాట్లాడుతూ పూర్తిస్థాయి సారథి పాత్ర పోషించేందుకు, సరికొత్త సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధమని చెప్పాడు. కివీస్ టెస్టు జట్టుకు మాత్రం టామ్ లాథమ్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఇటీవల భారత్‌ను సొంతగడ్డపై లాథమ్ బృందమే ఓడించింది.

తెలంగాణ జట్టుకు రెండో ఓటమి

సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టుకు రెండో పరాజయం ఎదురైంది. డిఫెండింగ్ చాంపియన్ సర్వీసెస్‌తో బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 1–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఆట 15వ నిమిషంలో శ్రేయస్ గోల్‌తో తెలంగాణ జట్టు 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత సర్వీసెస్ జట్టు విజృంభించింది. అవకాశం దొరికినపుడల్లా తెలంగాణ జట్టు గోల్‌పోస్ట్‌పై దాడులు నిర్వహించింది. 31వ నిమిషంలో యుమ్నామ్ అర్నాల్డ్ సింగ్ గోల్‌తో సర్వీసెస్ 1–1తో సమం చేసింది. ఆ తర్వాత సర్వీసెస్ పది నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి ఆధిక్యంలోకి వెళ్లింది. 65వ నిమిషంలో క్రిస్టోఫర్ కామె, 75వ నిమిషంలో అలన్ థాపా ఒక్కో గోల్ చేసి సర్వీసెస్‌కు 3–1తో విజయాన్ని ఖరారు చేశారు. బుధవారమే జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో 32 సార్లు చాంపియన్ పశ్చిమ బెంగాల్ 2–0తో రాజస్తాన్ జట్టును ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించగా... జమ్మూ అండ్ కశ్మీర్, మణిపూర్ జట్ల మధ్య మ్యాచ్ 1–1తో 'డ్రా' అయింది.





గుయాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో 700 మీటర్ల లోతున ఏర్పాటు చేసిన జియాంగ్‌మెన్ భూగర్భ అబ్జర్వేటరీలోని భారీ కాస్మిక్ డిటెక్టర్. దీని తయారీకి చైనా ఏకంగా 30 కోట్ల డాలర్లు వెచ్చించింది.



ఇది అమెరికాలోని న్యూ ఆర్లీన్స్‌లో లేక్ పంచార్ట్రైన్‌పై ఏకంగా 24 మైళ్ల పొడవున విస్తరించిన కాజ్‌వే. పొగమంచు కారణంగా వాహనాలు ప్రమాదానికి గురవడంతో దాన్ని 8 గంటలపాటు మూసేయాల్సి వచ్చింది.

ఎటు చూసినా మృతదేహాలే

సిరియా తిరుగుబాటుదారులపై చిత్రహింసలు
- దమాస్కస్, కుతైఫాల్లో సామూహిక ఖననాలు
- వెలుగులోకి బషర్ అసద్ సర్కారు అకృత్యాలు

దమాస్కస్: ఎక్కడ చూసినా శవాల కుప్పలు. రాజధాని డమాస్కస్‌తోపాటు కుతైఫా, అద్రా, హుస్సేనియాల తదితర ప్రాంతాల్లో సామూహిక సమాధులు! సిరియాలో ఇటీవల కుప్పకూలిన అసద్ ప్రభుత్వం అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తిరుగుబాటుదారులను బంధించి జైళ్లలో చిత్రహింసలు పెట్టడమే గాక దారుణంగా హతమార్చినట్టు తేలింది. అలా అదృశ్యమైనవారి మృతదేహాలు ఎక్కడపడితే అక్కడ బయటపడుతున్నాయి. సిరియా అంతటా సామూహిక సమాధులేనన్న వార్తల నేపథ్యంలో సిరియన్ ఎమర్జెన్సీ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) అనే అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ ఇటీవల దేశంలో పర్యటించింది. దాని పరిశీలనలో దిగ్భ్రాంతి కలిగించే విషయాలు బయటికొచ్చాయి...

లక్షల మంది గల్లంతు

సిరియాలో తిరుగువాబాటు చేసిన వారందరినీ బషర్ అల్ అసద్ ప్రభుత్వం నిర్బంధించింది. జైళ్లలో పెట్టి చిత్ర హింసలకు గురి చేసింది. ఆ క్రమంలో వేలాది మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ ఎవరికీ తెలియలేదు. అలా 2011 నుంచి ఇప్పటివరకు ఏకంగా లక్ష మందికి పైగా అదృశ్యమయ్యారు. 2014లో కనపించకుండా పోయిన సోదరుడి కోసం ఓ మహిళ, 2013లో అరెస్టయిన కుమారుడి కోసం ఓ తండ్రి ఇప్పటికీ వెదుకుతూనే ఉన్నారు. హయత్ తహ్రీర్ అల్‌షామ్ (హెచ్‌టీఎస్) తిరుగుబాటు సంస్థ దేశాన్ని హస్తగతం చేసుకోవడం, అసద్ రష్యాకు పారిపోవడం తెలిసిందే. అనంతరం సిరియా రక్షణ దళం వైట్‌హెల్మెట్స్‌తో కలిసి హెచ్‌టీఎస్ సిరియా అంతటా జైళ్లు, నిర్బంధ కేంద్రాలను తెరిచింది. అసద్ హయాంలో నిర్బంధించిన వేలాది మందిని విడుదల చేసింది. ఆ తర్వాత ఆచూకీ లేకుండాపోయిన తమ ఆత్మీయులకోసం అనేకమంది జైళ్ల చుట్టూ తిరుగుతున్నారు.

వారేమైనట్టు?

తిరుగుబాటుదారులను చిత్రహింసలు పెట్టి చంపాక అసద్ సర్కారు సామూహికంగా ఖననం చేసింది. అవన్నీ ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అలా ఇప్పటికే ఏకంగా లక్షకు పైగా మృతదేహాలను కనుగొన్నారు! సామూహిక సమాధులున్న మరో 66 ప్రాంతాలనూ గుర్తించారు. డమాస్కస్ వాయవ్యంగా ఉన్న కుతైఫా పట్టణంలో వేలాది మృతదేహాలను వేర్వేరు చోట్ల సామూహికంగా ఖననం చేసినట్లు ఈటీఎఫ్ తెలిపింది. డమాస్కస్ విమానాశ్రయ మార్గంలో హుస్సేనియేయాలోనూ సామూహిక సమాధులు బయటపడ్డాయి. దక్షిణ సిరియాలో పన్నెండు సామూహిక సమాధులు కనుగొన్నారు. సిరియాలో గల్లంతైన వారిలో 80,000 మందికి పైగా చనిపోయినట్టు హక్కుల సంఘం ఇప్పటికే తేల్చింది. 60,000 మందిని చిత్రహింసలకు గురిచేసి చంపినట్లు బ్రిటన్‌కు చెందిన వార్ మానిటర్ సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎస్‌ఓహెచ్‌ఆర్) తెలిపింది.

గుర్తించలేని స్థితిలో శవాలు

ఖననం చేసి చాలాకాలం కావడంతో చాలావరకు శవాల అవశేషాలే మిగిలాయి. దాంతో మృతులను గుర్తించడం కష్టంగా మారింది. చేసేది లేక పుర్రెలు, ఎముకలనే భద్రపరుస్తున్నారు. డీఎన్‌ఏ నమూనాల డాక్యుమెంటేషన్, తదుపరి విశ్లేషణ కోసం బ్లాక్ బాడీ బ్యాగుల్లో విడిగా ఉంచుతున్నారు. హత్యకు గురైన వారిని మున్ముందైనా గుర్తించగలమని ఈటీఎఫ్ ఆశాభావం వెలిబుచ్చింది.

సిగరెట్ కాల్చిన మలేసియా మంత్రికి
రూ.95 వేల జరిమానా



కౌలాలంపూర్: కేంద్ర మంత్రి. అందులోనూ కీలకమైన విదేశాంగ శాఖ మంత్రి. బహిరంగంగా సిగరెట్ తాగి ప్రజలకు ఏం సందేశం ఇద్దామనుకుంటున్నారని నెటిజన్లు మంత్రి మొహమ్మద్ హసన్‌పై ఆన్‌లైన్‌లో విమర్శల వరద పారించారు. ఇంతకీ ఆ మంత్రి చేసిన ఘోర నేరం ఏంటంటే బహిరంగంగా సిగరెట్ కాల్చడం. భారత్‌లోలాగే మలేసియాలోనూ బహిరంగంగా ధూమపానంపై నిషేధం అమల్లో ఉంది. బహిరంగంగా సిగరెట్ కాల్చే పొగరాయుళ్లపై జరిమానాల విధించడం, శిక్షించడం భారత్‌లో ఏ స్థాయిలో అమలవుతోందో భారతీయ పౌరులందరికీ బాగా తెలుసు. ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంట్ ప్రాంగణంలో గతంలో పార్లమెంట్ సభ్యులు ఒకరిద్దరు బహిరంగంగా సిగరెట్ గుప్పుగుప్పుమని కాల్చినా జరిమానా వేసిన పాపానపోలేదు. కానీ మలేసియా ప్రభుత్వం మాత్రం సదరు మంత్రికి జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అక్కడి చట్టాల ప్రకారం బహిరంగ ధూమపాన నేరానికి కనీసం 5,000 రింగెట్లు అంటే భారతీయ కరెన్సీలో రూ.95,000 జరిమానా విధిస్తారు. తప్పుకు శిక్షగా జరిమానా కట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి హసన్ చెప్పారు. హోటల్ వంటి జనసమ్మర్ద ప్రాంతాల్లో సిగరెట్ కాల్చడం నేరం. అందుకు బేషరతు క్షమాపణ చెబుతున్నట్లు ఆయన చెప్పారు. నెగేరీ సెంబిలాన్ రాష్ట్రంలోని ఒక హోటల్‌లో ఆరుబయట కూర్చొని స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ సిగరెట్ కాల్చుతున్న ఫొటో ఒకటి వైరల్‌గా మారడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే తప్పును తెల్సుకున్న మంత్రి స్వయంగా ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సంప్రతించి తనకు జరిమానా విధించాలని కోరినట్లు తెలుస్తోంది. తానేం చట్టానికి అతీతుడిని కాదని, మంత్రి స్వయంగా జరిమానా విధించాలని వేడుకున్నారని ఆరోగ్య మంత్రి జుల్కెఫ్లీ అహ్మద్ వెల్లడించారు. వంటశాలలు, రెస్టారెంట్‌లలో ధూమపానంపై నిషేధం 2019 ఏడాది నుంచి అమల్లో ఉంది. 2024 అక్టోబర్ నుంచి మరింత కఠినమైన నియమ నిబంధనలను అమలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వయంగా మంత్రిపైనే విమర్శలు రావడం గమనార్హం. సెరెంబన్ జిల్లా ఆరోగ్య కార్యాలయం నుంచి సదరు నోటీస్‌ను బుధవారం అందుకున్నానని మంత్రి అహ్మద్ వెల్లడించారు. ''ఈ అంశం నిజంగా చర్చనీయాంశమై ఆందోళన కల్గించి ఉంటే సారీ చెప్పేందుకు నేను సిద్ధం. ఆరోగ్య శాఖ ఎంత జరిమానా విధించినా నేను కట్టేస్తా. నాపై మరీ పెద్దమొత్తాలను జరిమానాగా మోపబోరని భావిస్తున్నా''అని బుధవారం ఒక పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

200 మందికి పైగా ఉత్తరకొరియా సైనికుల మృతి

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులను ముమ్మరం చేసింది. తూర్పు డోనెట్స్క్ ప్రాంతంలో దాడులు పెరిగినట్టు ఉక్రెయిన్ ఉన్నత ఆర్మీ కమాండర్ మంగళవారం తెలిపారు. మూడు రోజులుగా శత్రువులు ముమ్మర దాడులు చేస్తున్నారని ఒలెక్సాండర్ సిర్‌స్కీ ఆన్‌లైన్ ప్రసంగంలో ప్రభుత్వానికి, ప్రాంతీయ అధికారులకు తెలిపారు. రష్యా భారీగా ఉత్తర కొరియా దళాలను రంగంలో దించుతోందన్నారు. కుర్స్క్ ప్రాంతంలో వందల మంది ఉత్తర కొరియా సైనికులు ప్రాణాలు కోల్పోయినట్టు యూఎస్ సైనికాధికారి ఒకరు చెప్పా రు. అక్కడ రష్యా జరిపిన 42 దాడులను తిప్పికొట్టినట్టు ఉక్రెయిన్ తెలిపింది. ''గత వారమంతా రష్యా రోజుకు 40 దాడులు చేసింది. గత 24 గంటల్లో ఏకంగా 68 దాడులకు పాల్పడింది'' అని పేర్కొంది. ఉక్రెయిన్ ఏకైక బొగ్గు గనుల ప్రాంతం పోక్రోవ్స్క్ ఉత్తరాన ఓ గ్రామాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రష్యా రక్షణ శాఖ తెలిపింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ జనవరిలో బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో పోరు తీవ్రత పెరిగింది. దాదాపు మూడేళ్ల యుద్ధానికి ముగింపు పలికేందుకు రష్యాతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉండాలని ట్రంప్ సోమవారం అన్నారు.

కోడిగుడ్డు @రూ.21 వేలు!



మీరు చదివింది నిజమే! బ్రిటన్‌లో ఇటీవల జరిగిన చారిటీ వేలంలో ఓ కోడిగుడ్డు ఏకంగా 200 పౌండ్లకు అమ్ముడుపోయింది! అంటే సుమారు రూ.21 వేలు! అంత పెట్టి కొనడానికి ఆ గుడ్డులో ప్రత్యేకతలు ఏమిటంటారా? కోడిగుడ్లు ఓవెల్ షేప్‌లో ఉంటాయి. కానీ ఇది మాత్రం గోళాకారంలో ఉంది. విలక్షణ ఆకారమున్న ఈ గుడ్డును 'వన్ ఇన్ ఎ బిలియన్'గా పిలుస్తున్నారు. యువత మానసిక ఆరోగ్యం కోసం పనిచేసే ఐయువెంటాస్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ వేలాన్ని నిర్వహించింది. వచ్చిన మొత్తాన్ని యువత మానసిక ఆరోగ్యంపై వెచ్చించనుంది. ఈ అసాధారణ గుడ్డును బర్క్‌షైర్‌కు చెందిన ఓ వ్యక్తి కొనుక్కున్నాడు. బాగానే ఉంది గానీ ఈ అతి ఖరీదైన గుడ్డును ఏం చేస్తాడు? ఆమ్లెట్ వేసుకు తినేస్తాడా? లేదట. ''దానిలోని యోక్, ఎల్లో తీసేసి అరుదైన ఆకృతిలోని దాని పెంకును మాత్రం సంరక్షిస్తా''అని చెప్పాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సునీతా మార్చిలోగా రావడం కష్టమే

కేప్ కనావెరెల్: కేవలం ఎనిమిది రోజుల పని కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు వెళ్లి ఏకంగా ఆరు నెలలకుపైగా అక్కడే చిక్కుకుపోయిన భారతీయ మూలాలున్న అమెరికా నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ మరో మూడు నెలలపాటు అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. సునీత, బుచ్ విల్మోర్‌లను త్వరగా తీసుకొచ్చి వాళ్ల బదులు వేరే వ్యోమగాములను పంపేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ఆలస్యం కావడమే ఇందుకు ప్రధానకారణం. దీంతో బోయింగ్ వారి ప్రతిష్టాత్మక స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో ఐఎస్ఎస్‌కు చేరుకున్న సునీతా దాదాపు 10 నెలలపాటు అక్కడే గడపడం ఖాయంగా కనిపిస్తోంది. 2025 మార్చి నెలలోపు సునీత, విల్మోర్ భారత్‌కు తిరుగుపయనం కావడం సాధ్యంకాదని మంగళవారం నాసా అధికారికంగా ప్రకటించడంతో ఈ విషయం వెల్లడైంది. జూన్ ఐదో తేదీన సునీత, విల్మోర్ ద్వయం ఐఎస్ఎస్‌కు పయనమయ్యారు. వీళ్లు ప్రయాణించిన వ్యోమనౌకలో హీలియం లీకేజీ సమస్య ఉత్పన్నంకావడంతో ఆనాడు వారి తిరుగుప్రయాణం అర్ధంతరంగా వాయిదాపడింది. సమస్య ఉన్న క్యాప్స్యూల్‌లోనే ప్రయాణిస్తే వీళ్ల ప్రాణాలకు ముప్పు ఉండొచ్చన్న అంచనాలు, భయాలు, విశ్లేషణల నడుమ వీళ్లు లేకుండానే ఖాళీ సీట్లతో స్టార్‌లైనర్ క్యాప్సూల్ సెప్టెంబర్‌లో భూమి మీదకు తిరిగొచ్చింది. సునీత, విల్మోర్‌ల బదులు అక్కడ పనిచేయాల్సిన మరో ఇద్దరు వ్యోమగాములను పంపేందుకు ఉద్దేశించిన కార్యక్రమం కూడా షెడ్యూల్‌కంటే ముందుగా నిర్వహించే పరిస్థితి లేదు.

ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్

పొగుడుతూ, విమర్శిస్తూ మాధ్యమాల్లో పోటెత్తిన పోస్టులు



ఫ్లోరిడా: డొనాల్డ్ ట్రంప్ పేరు చెప్పగానే శ్వేత వర్ణంలో ఎడమవైపు పాపిటతో చక్కగా దువ్విన తలకట్టు మదిలో మెదులుతుంది. 'ట్రంప్ హెయిర్‌స్టైల్'అంటూ ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఆ తలకట్టు ఇప్పుడు ట్రంప్ తలమీదనే అదృశ్యమైంది. తాజాగా ఫ్లోరిడాలోని పామ్ బీచ్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ క్లబ్‌లో రిపబ్లికన్ నేతలతో మాట్లాడేందుకు వచ్చిన సందర్భంగా ట్రంప్‌ను చూసి అందరూ అవాక్కయ్యారు. నలుపు ప్యాంట్, తెలుపు టీ-షర్ట్, ఎరుపు టోపీతో నడిచి వస్తున్న ట్రంప్‌ను చూసినవాళ్లంతా ఆయన తలకట్టు మీదనే ధ్యాసపెట్టారు. ఎప్పుడూ ఉత్సాహంగా ఉండే ట్రంప్ హావభావాలకు తగ్గట్లు గాల్లోకి అలా లేచిపడుతూ ఉండే జుట్టు ఆయనకు ఎంతో కళగా కనిపించేది. అలాంటి హెయిర్‌స్టైల్ అదృశ్యమై జుట్టునంతా వెనక్కి దువ్వేసి ఉన్న ట్రంప్‌ను చూసి అక్కడివారంతా గుసగుసలాడుకున్నారు. ఎప్పుడూలేనిది ఈయనకేమైంది?. హెయిర్‌స్టైల్ ఎందుకు మార్చారు?. రెండోసారి అధ్యక్ష హోదాలో ప్రపంచానికి విభిన్నంగా కన్పించాలనుకుంటున్నారా? లేదంటే పాత తలకట్టు బోర్ కొట్టిందా? అంటూ పలు ప్రశ్నలు తమలో తామే సంధించుకున్నారు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు తలో అభిప్రాయం ఆన్‌లైన్‌లో పెట్టేశారు. ''ట్రంప్ ముఖవర్చస్సులో హెయిర్‌స్టైల్ కీలకం. అలాంటి తలకట్టులేనిట్రంప్ ఇప్పుడు ఇంకెలాగో కనిపిస్తున్నారు. నాటి కళ నేడు లేదు''అని ఒకరు పోస్ట్‌చేశారు. ''కళావిహీనంగా ఉన్నారు''అని ఇంకొకరు పోస్ట్‌చేశారు. ''అలాంటిదేమీ లేదు. అంతసేపు టోపీ పెట్టుకోవడంతో తలకట్టు చెదిరి సాదాసీదాగా కనిపిస్తోంది''అని ఇంకో నెటిజన్ విశ్లేషించారు.

భారత్‌పై సుంకాలు: ట్రంప్

కెనడా, మెక్సికో, చైనాలకూ హెచ్చరికలు

పామ్‌బీచ్ (ఫ్లోరిడా): అమెరికా వస్తువులపై భారత్ హెచ్చు సుంకాలు విధిస్తోందని డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. ''కొన్నింటిపై ఏకంగా 100 శాతం సుంకాలున్నాయి. బదులుగా భారత్‌పై భారీ సుంకాల విధింపు తప్పదు. వాళ్లు మాపై ఎంత పన్ను వేస్తే మేమూ వాళ్లకు అదే పన్ను విధిస్తాం''అని సోమవారం స్పష్టం చేశారు. చైనా, మెక్సికో, కెనడా సహా ప్రధాన అమెరికా భాగస్వాములతో వాణిజ్య సంబంధాల గురించి మీడియాతో విస్తృత సంభాషణలో భాగంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''భారత్ చాలా పన్నులు వేస్తోంది. బ్రెజిల్ కూడా అంతే. వారు మమ్మల్ని తప్పుబట్టినా సరే, మేం కూడా వారిపై అదే విధంగా పన్నులు వేయబోతున్నాం''అని స్పష్టం చేశారు. చైనా, మెక్సికో, కెనడాలతో వాణిజ్య వివాదాలను కూడా ట్రంప్ ప్రస్తావించారు. పరస్పర సుంకాలు తన ఆర్థిక విధానాలకు మూలస్తంభమని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైనాతో సంభావ్య వాణిజ్య ఒప్పందాల గురించి అడిగిన ప్రశ్నకు సూటిగా బదులిచ్చారు. సరిహద్దు భద్రత, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి మెక్సికో, కెనడాలతో అమెరికా వాణిజ్య పరిస్థితి వివాదాస్పదంగా ఉంది. ఫెంటానిల్ సహా అక్రమ మాదకద్రవ్యాల ప్రవాహం, అమెరికా సరిహద్దుల వెంబడి వలసదారుల కదలికలను పరిష్కరించడానికి ఇరు దేశాలు చర్యలు తీసుకోకపోతే కెనడా, మెక్సికో దిగుమతులపై 25% సుంకం విధించే ప్రణాళికను ట్రంప్ పునరుద్ఘాటించారు. ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో వలసదారులు, మాదకద్రవ్యాల ప్రవాహం తగ్గింపుపై కెనడా ఇప్పటికే దృష్టి సారించింది.

శనివారం నుంచి మోదీ కువైట్ పర్యటన

న్యూఢిల్లీ: శనివారం నుంచి ప్రధాని మోదీ కువైట్‌లో రెండ్రోజులపాటు పర్యటించనున్నారు. గత 43 ఏళ్లలో భారత ప్రధాని ఒకరు ఈ గల్ఫ్ దేశంలో పర్యటనకు వెళ్తుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. కువైట్ అమీర్ షేక్ మెషాల్ అల్ అహ్మద్ అల్ జబీర్ అల్ సబాహ్ ఆహ్వానం మేరకు ఇండియా, కువైట్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా ప్రధాని పర్యటిస్తున్నారని భారత విదేశాంగ శాఖ బుధవారం పేర్కొంది. పర్యటనలో భాగంగా మోదీ కువైట్ పాలకులతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అక్కడ భారతీయ సంతతి వ్యక్తులతో భేటీ కానున్నారు. చివరిసారిగా 1981లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ కువైట్‌లో పర్యటించారు. కువైట్, భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2023–24లో ఏకంగా 10.47 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

కేరళలో రెండు ఎంపాక్స్ కేసులు

తిరువనంతపురం: కేరళలో ప్రాణాంతక మంకీపాక్స్ కేసులు వెలుగుచూసి కలకలం సృష్టించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి తిరిగొచ్చిన ఇద్దరిలో ఎంపాక్స్ లక్షణాలు బయటపడ్డాయని కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ బుధవారం ప్రకటించారు. వీరిలో ఒకరు వయనాడ్ జిల్లావాసికాగా ఇంకొకరు కన్నూర్ జిల్లాకు చెందిన వ్యక్తి అని తెలిపారు. కన్నూర్‌లోని పెరియారం వైద్యకళాశాలలో వీళ్లిద్దరికీ చికిత్స అందిస్తున్నారు. వీళ్లతో సన్నిహితంగా మెలిగిన వాళ్ల వివరాలు సేకరిస్తున్నామని, పాజిటివ్ లక్షణాలుంటే చికిత్స అందిస్తామని మంత్రి తెలిపారు.

హిజాబ్ చట్టానికి బ్రేక్

నిరసనల నేపథ్యంలో ఇరాన్ నిర్ణయం

ఇరాన్‌లో అత్యంత వివాదాస్పదమైన 'హిజాబ్–పవిత్రత చట్టం'అమలుకు దేశ జాతీయ భద్రతా మండలి బ్రేకులు వేసింది. ఇరాన్ తీరు పట్ల ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఆ చట్టం అస్పష్టంగా ఉందని, దాన్ని సంస్కరించాల్సిన అవసరముందని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. హిజాబ్ ధరించని మహిళలకు జరిమానాలతో పాటు 15 ఏళ్ల దాకా జైలు శిక్షకు చట్టం ప్రతిపాదించింది. పలు కఠినమైన శిక్షలు సూచించింది. హిజాబ్ విషయమై ఇరాన్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై పెజెష్కియాన్ గతంలోనూ అసహనం వ్యక్తం చేశారు. ''హిజాబ్‌ను బలవంతంగా తొలగించలేకపోయాం. దాన్ని ధరించాల్సిందేనంటూ మహిళల హక్కులను కాలరాసే అధికారం మాకు లేదు''అని ఇటీవలి అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన పదేపదే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎన్నికల హామీని అమలు చేశారని భావిస్తున్నారు. మహిళా, కుటుంబ వ్యవహారాల మాజీ ఉపాధ్యక్షుడు మసౌమే ఎబ్టెకర్ కూడా ఈ చట్టాన్ని విమర్శించారు. ఈ చట్టాన్ని అమలు చేయడమంటే ఇరాన్‌లో సగం మందిపై అభియోగం మోపడమేనన్నారు.

నిత్య వివాదం: హిజాబ్ వివాదం ఈనాటిది కాదు. మహిళలపై అణచివేతకు చిహ్నంగా ఉన్న హిజాబ్‌ను కొత్త తరం ధిక్కరిస్తూనే ఉంది. హిజాబ్ ధరించలేదని, వస్త్రధారణ అనుచితంగా ఉందని 2022లో మహసా అమీనీ అనే 22 ఏళ్ల కుర్దిష్ మహిళను ఇరాన్ నైతిక పోలీసులు అరెస్ట్ చేశారు. కస్టడీలో కోమాలోకి వెళ్లిన ఆమె తర్వాత ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు. ఆమె డాక్టర్ కావాలని కలలు కన్నారు. యూనివర్సిటీకి వెళ్లే ముందు వారం పాటు తల్లిదండ్రులతో ఉందామని వచ్చి ప్రాణాలొదిలారు. అమీనీ మరణంపై ఇరాన్‌వ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. మహిళలే గాక పురుషులు కూడా వాటిలో పాల్గొన్నారు. పోలీసుల చిత్రహింసలే ఆమెను పొట్టన పెట్టుకున్నాయంటూ దుయ్యబట్టారు. బలూచ్, అజెరిస్, అరబ్బులు కూడా కుర్దులతో కలిసి రోడ్డెక్కారు. సున్నీలు, షియాలని తేడా లేకుండా నిరసనల్లో పాల్గొన్నారు. వేలాది నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వాన్ని ధిక్కరించిన, నిరసనల్లో పాల్గొన్న వారిలో 500 మంది మరణించారు. 120 మంది కంటి చూపు కోల్పోయారు. ఏడాదికి అలజడి తగ్గుముఖం పట్టాక దుస్తుల కోడ్ ఉల్లంఘించిన వారికి ప్రభుత్వం కఠిన శిక్షలు ప్రకటించింది.

గాయని అరెస్టుతో: హిజాబ్ ధరించకుండా పాట పాడి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ఇరాన్ గాయని పరస్తూ అహ్మదీ (27)ని అధికారులు తాజాగా అరెస్ట్ చేశారు. భుజాలు కనిపించేలా స్లీవ్‌లెస్ డ్రెస్‌లో నలుగురు పురుష కళాకారుల మధ్య పాడిన ఆ వీడియో అందరినీ ఆకర్షించింది. ఆమెతో పాటు అందులో ఉన్నవారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాంతో మళ్లీ నిరసనలు మొదలయ్యాయి. 300 మందికి పైగా ఇరాన్ హక్కుల కార్యకర్తలు, రచయితలు, జర్నలిస్టులు కొత్త హిజాబ్ చట్టాన్ని బహిరంగంగా ఖండించారు. సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో అహ్మదీని మర్నాడే విడుదల చేశారు. నిరసనలు పెరిగి రెండేళ్ల నాటి పరిస్థితి పునరావృతమయ్యేలా ఉండటంతో హిజాబ్ చట్టం అమలును తాత్కాలికంగా నిలిపేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

మరణశిక్ష నుంచి ఎట్టకేలకు విముక్తి

- ఇండోనేసియా నుంచి ఫిలిప్పీన్స్‌కు తిరిగొచ్చిన మహిళ
- క్షమాభిక్ష కోసం ఎదురుచూస్తున్న అమాయకురాలు

మనీలా: డ్రగ్స్ తరలించారన్న ఆరోపణలపై అరెస్టయి గత 15 సంవత్సరాలుగా జైల్లో మగ్గిపోతున్న అమాయక ఫిలిప్పీన్స్ మహిళకు ఎట్టకేలకు ఇండోనేసియా జైలు నుంచి తాత్కాలిక విముక్తి లభించింది. ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ దేశాలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇకపై ఆమె జీవితకాల జైలు శిక్షను ఇండోనేసియాకు బదులు సొంతదేశం ఫిలిప్పీన్స్‌లోని మహిళల కారాగారంలో అనుభవించనుంది. ఇండోనేసియా విధించిన శిక్ష ప్రకారం 2015 ఏడాదిలోనే ఫిలిప్పీన్స్ పోలీసుల తుపాకీ గుళ్లకు బలికావాల్సిన మేరీ జేన్ వెలోసో అనూహ్యంగా ఆ దారుణ శిక్ష అమలు నుంచి తప్పించుకున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో తనకు క్షమాభిక్ష పెట్టాలని త్వరలో దేశాధ్యక్షుడిని వేడుకుంటానని 39 ఏళ్ల మేరీ చెప్పారు. బుధవారం ఉదయం ఆమె ఇండోనేసియా నుంచి బయల్దేరి స్వదేశం ఫిలిప్పీన్స్‌లోని మనీలా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. తమ తల్లి రాకతో ఇద్దరు కుమారులు, మేరీ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

ఎనిమిది మందిపై బుల్లెట్ల వర్షం

2010లో బతుకుదెరువు కోసం పనిమనిషిగా ఇండోనేసియాలో అడుగుపెట్టిన ఆమెను ఎయిర్‌పోర్ట్‌లోనే పోలీసులు అరెస్ట్‌చేశారు. వెంట తెచ్చిన సూట్‌కేసులో 2.6 కేజీల నిషేధిత హెరాయిన్ మాదకద్రవ్యం ఉండటంతో ఆమెపై కఠిన డ్రగ్స్ ట్రాఫికింగ్ చట్టాలు మోపి మరణశిక్ష విధించారు. ఆ సూట్‌కేసుతో తనకేం సంబంధం లేదని, ఇండోనేసియాలో ఇంటి పనిమనిషిగా పని కుదిర్చిన ఏజెంట్ మారియా క్రిస్టినా సెర్గీ ఆ సూట్‌కేసు ఇచ్చాడని, అందులో ఏముందో తనకు నిజంగా తెలీదని ఆమె ఎంత మొత్తుకున్నా పోలీసులు వినలేదు. ఐదేళ్ల తర్వాత షూట్ చేసి చంపేయాలని తీర్పు వెలువడింది. అక్రమంగా డ్రగ్స్ తెచ్చారంటూ మేరీసహా ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఫ్రాన్స్, ఘనా, నైజీరియాలకు చెందిన మొత్తం తొమ్మిది మందిని 2015 ఏడాదిలో ఒక ద్వీపకారాగారానికి తీసుకెళ్లారు. మేరీ తప్ప మిగతా ఎనిమిది మందిపై ఫైరింగ్ స్క్వాడ్ పోలీసులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించి చంపేశారు. ఈమెను కూడా చంపేసేవారే. కానీ ఈమెను ఇండోనేసియాకు పంపిన ఏజెంట్ సెర్గీ కేవలం రెండ్రోజుల ముందు ఫిలిప్పీన్స్‌లో అరెస్టవడం, తానే ఆమెకు ఆ సూట్‌కేసు ఇచ్చి పంపానని ఒప్పుకోవడంతో ఈమె శిక్ష అమలు ఆఖరి నిమిషంలో ఆగిపోయింది. అయితే ఎవరు తెచ్చినా డ్రగ్స్ తమ భూభాగానికి తేవడం మాత్రం నేరమే కాబట్టి ఈమెను నిర్దోషిగా వదిలేది లేదని ఇండోనేసియా కరాఖండీగా చెప్పింది. దీంతో మేరీ విడుదలకు ఫిలిప్పీన్స్‌లో పెద్ద ఉద్యమమే మొదలైంది. చివరకు ఫిలిప్పీన్స్ ప్రభుత్వం చొరవ తీసుకుని ఖైదీల బదిలీ ఒప్పందం చేసుకుంది. మేరీ మిగతా శిక్షాకాలం సొంత దేశంలో అనుభవించేలా డీల్ కుదిరింది. ఈ ఒప్పందం మేరకు ఆమెను ఇండోనేసియా బుధవారం వదిలేసింది.



పంజాబ్‌లో రైతుల రైల్‌రోకో

పలు రైళ్ల సేవలకు అంతరాయం

చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతోపాటు తమ పలు డిమాండ్లను నెరవేర్చాలంటూ పంజాబ్‌లో రైతులు రైలుపట్టాల మీదకెక్కారు. బుధవారం చేపట్టిన రైతుల రైల్‌రోకో ఆందోళన కార్యక్రమం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల పిలుపు మేరకు వేలాది మంది రైతులు రైలుపట్టాలపై తమ ఆందోళన కొనసాగించారు. కిసాన్ మజ్దూర్ మోర్చా రైతు నేత సర్వాన్ సింగ్ పంధేర్ సైతం రైల్‌రోకోలో పాల్గొన్నారు. మోగా, ఫరీద్‌కోట్, గుర్దాస్‌పూర్, జలంధర్, హోషియార్‌పూర్, లూథియానా, పటియాలా, మొహాలీ, సంగ్రూర్, బఠిండా, దేవీదాస్‌పూర్, అమృత్‌సర్‌సహా పలు పట్టణాల మీదుగా వెళ్లే పలు రైల్వే రూట్‌లలో ధర్నా చేశారు. దీంతో జమ్మూ–సెల్దార్, అమృత్‌సర్–ముంబై, ఢిల్లీ–అమృత్‌సర్ మధ్య తిరిగే పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

గెలిస్తే వృద్ధులకు ఉచిత వైద్యం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: రాబోయే ఢిల్లీ శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వృద్ధులకు మరో వరమిచ్చారు. అనారోగ్య పరిస్థితుల్లో 60 ఏళ్లు దాటిన అర్హులైన వృద్ధులకు ఉచితంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బుధవారం ఢిల్లీలోని ఆప్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ''60 దాటిన అర్హులైన వృద్ధులకు వైద్యానికి అయ్యే ఖర్చుకు ఎలాంటి గరిష్ట పరిమితి పెట్టబోము. సంజీవని యోజన ఉచిత వైద్యానికి సంబంధించిన నమోదు ప్రక్రియ రెండు రోజుల్లో మొదలవుతుంది. ఆప్ కార్యకర్తలు స్వయంగా మీ ఇంటికొచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. వాళ్లు ఇచ్చే కార్డ్‌ను భద్రంగా దాచుకోండి. మేం ఈసారి మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులకు ఉచిత వైద్యం పథకం అమల్లోకి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వైద్య పథకంలో ఎన్నో లోపాలున్నాయి. దానిని మించిన పథకాన్ని మేం ఎలాంటి తప్పులకు తావివ్వకుండా అమలుచేస్తాం'' అని అన్నారు. జరిగే అవకాశం ఉంది.

డిగ్రీతోనే డిఫెన్స్ ఆఫీసర్

బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్‌తోనే త్రివిధ దళాల్లో ఉన్నత అవకాశాలు అందుకునేందుకు చక్కటి మార్గం.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ)! త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష ఇది. తాజాగా యూపీఎస్సీ.. సీడీఎస్ఈ(1)-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సీడీఎస్ఈ(1)-2025 ద్వారా ఆయా అకాడమీల్లో భర్తీ చేయనున్న పోస్టులు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» సీడీఎస్ఈ(1)-2025 నోటిఫికేషన్ విడుదల
» త్రివిధ దళాలకు చెందిన అయిదు అకాడమీల్లో 457 పోస్టులు
» డిగ్రీ, బీటెక్ అర్హతలతో పోటీ పడే అవకాశం
» రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
» శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్



అయిదు విభాగాలు..457 పోస్టులు

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(1)-2025 ద్వారా త్రివిధ దళాలకు చెందిన అయిదు విభాగాల్లో 457 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్)-100 పోస్టులు, ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా)-32పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్)-32 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(పురుషులు)-275 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(మహిళలు)-17పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **ఇండియన్ మిలటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఇండియన్ నేవల్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** జనవరి 2, 2002-జనవరి 1, 2007 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **నేవల్ అకాడమీ:** జనవరి 2, 2002-జనవరి 1, 2007 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** జనవరి 2, 2002-జనవరి 1, 2006 మధ్యలో జన్మించి ఉండాలి(డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్న వారికి రెండేళ్ల సడలింపు ఇస్తారు).
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** జనవరి 2, 2001-జనవరి 1, 2007 మధ్యలో జన్మించి ఉండాలి.

రెండంచెల ఎంపిక

త్రివిధ దళాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. మొదటి దశలో యూపీఎస్సీ సీడీఎస్ రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి మెరిట్ జాబితాలో నిలిస్తే..మలిదశలో ఆయా దళాలకు చెందిన సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌లు నిర్వహించే ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియలోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో కెరీర్ ఖరారవుతుంది.

సీడీఎస్ఈ రెండు రకాలుగా

తొలిదశలో నిర్వహించే సీడీఎస్ఈ రాత పరీక్ష రెండు విధాలుగా ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్ ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు(ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ వంద మార్కుల చొప్పున); ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు(ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు చొప్పున) పరీక్ష జరుగుతుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కు తగ్గిస్తారు. రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో అయిదు రోజుల పాటు ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. ఎయిర్ ఫోర్స్ అకాడమీకి 6 రోజులపాటు టెస్టులు ఉంటాయి.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

రాత పరీక్షలో ప్రతిభ చూపి అర్హత సాధించిన అభ్యర్థులకు మలి దశలో ఆయా సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో 300 మార్కులకు ప్రత్యేక ఎంపిక ప్రక్రియ ఉంటుంది. పలు రకాల పరీక్షలు, చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా.. ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూ బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలోనే ఒక ప్రక్రియగా కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సంపాదించిన అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి తుది జాబితా విడుదల చేస్తారు.

శిక్షణ, స్టయిఫండ్

ఎంపికైన అభ్యర్థులకు ఆయా అకాడమీల్లో శిక్షణ ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్)లో 18 నెలలు, నేవల్ అకాడమీలో 17 నెలలు, ఎయిర్ ఫోర్స్ అకాడమీలో 18 నెలలు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 11 నెలలు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత లెఫ్టినెంట్ హోదాలో పర్మనెంట్ కొలువు సొంతమవుతుంది. నేవీలో మాత్రం ప్రారంభంలో సబ్-లెఫ్టినెంట్ హోదా లభిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షణ పొందిన వారు ప్రారంభంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా విధులు చేపడతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, డిసెంబర్ 31
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2025 జనవరి 1 నుంచి 7 వరకు;
- **సీడీఎస్ఈ పరీక్ష తేదీ:** 2025, ఏప్రిల్ 13
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://upsconline.gov.in, www.upsc.gov.in

రాత పరీక్షలో రాణించే మార్గం

ఇంగ్లిష్

వంద మార్కులకు నిర్వహించే ఇంగ్లిష్ పరీక్ష విభాగంలో ఇంగ్లిష్ భాషపై పట్టుతోపాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, సెంటెన్సెస్‌లో పదాల ఆర్డరింగ్, ప్యాసేజ్‌లు,సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, క్లోజ్ టెస్టు, ఫిల్‌అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ద ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి.

జనరల్ నాలెడ్జ్

అభ్యర్థుల్లో సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహనను పరీక్షించే విభాగమిది. ఇందులో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు, ప్రాముఖ్యం ఉన్న అంశాలు,అవార్డులు, జాయింట్ మిలిటరీ ఎక్సర్‌సైజ్‌స్-అందులో పాల్గొన్న దేశాలు, ఆయా ఉమ్మడి సైనిక విన్యాసాల పేర్లు మొదలైన వాటిని తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ, వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రటిక్ ఈక్వేషన్స్, ట్రిగనామెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 13,735 జూనియర్ అసోసియేట్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. జూనియర్ అసోసియేట్(క్లర్క్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్/తత్సమాన ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ ఫైనల్/చివరి సెమిస్టర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.04.2024 నాటికి 20 ఏళ్ల నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్(ప్రిలిమినరీ, మెయిన్ పరీక్ష), స్థానిక భాష పరీక్ష ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభతేది:** 17.12.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.01.2025
» **వెబ్‌సైట్:** https://bank.sbi/web/careers/current-openings

ఖమ్మం మెడికల్ కాలేజ్‌లో 55 ఫ్యాకల్టీ పోస్టులు

ఖమ్మం జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 55.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-02,అసోసియేట్ ప్రొఫెసర్-07, అసిస్టెంట్ ప్రొఫెసర్-01, సీపీఎస్ స్పెషలిస్ట్-02, సీనియర్ రెసిడెంట్-43.
» **విభాగాలు:** జనరల్ మెడిసిన్, అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫార్మకాలజీ, సైకియాట్రీ, రేడియోడయాగ్నోసిస్, రెస్పిరేటరీ మెడిసిన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం/ఎంసీహెచ్, పీజీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 31.03.2024 నాటికి 69 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, టీచింగ్ అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.12.2024
» **ఇంటర్వ్యూ తేది:** 20.12.2024.
» **వెబ్‌సైట్:** http://gmckhammam.org

ఇండియన్ నేవీలో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌లో ప్రవేశాలు

ఇండియన్ నేవీ ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచ్‌లలో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ నాలుగేళ్ల బీటెక్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎజిమల (కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 36 (మహిళలకు 07).
» **వయసు:** 02.01.2006 నుంచి 01.07.2008 మధ్య జన్మించిన వారై ఉండాలి.
» **అర్హత:** కనీసం 70 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ పరీక్ష(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ(మెయిన్) 2024 పరీక్షలో ర్యాంకు సాధించి ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(మెయిన్)2024 ర్యాంక్, పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.12.2024
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ క్రీడా కోటా కింద డైరెక్ట్ ఎంట్రీ (ఇంటేక్ 03/2024) ద్వారా హవల్దార్, నాయబ్ సుబేదార్(స్పోర్ట్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **క్రీడలు:** అథ్లెటిక్స్(పురుషులు), ఆర్చరీ(పురుషులు), బాస్కెట్‌బాల్(పురుషులు), బాక్సింగ్(పురుషులు), డైవింగ్(పురుషులు), ఫుట్‌బాల్(పురుషులు), ఫెన్సింగ్ (పురుషులు), జిమ్నాస్టిక్స్(పురుషులు), హాకీ(పురుషులు), హ్యాండ్‌బాల్(పురుషులు), జూడో(పురుషులు), కయాకింగ్-కెనోయింగ్(పురుషులు), కబడ్డీ(పురుషులు), స్విమ్మింగ్(పురుషులు), సెయిలింగ్(పురుషులు), షూటింగ్(పురుషులు), ట్రయాథ్లాన్(పురుషులు), వాలీబాల్(పురుషులు), వుషు(పురుషులు), వెయిట్ లిఫ్టింగ్(పురుషులు), రెజ్లింగ్(పురుషులు), వింటర్ గేమ్స్(పురుషులు), రోయింగ్(పురుషులు).
» **అర్హత:** పదో తరగతి/ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్/ఖేలో ఇండియా గేమ్స్/యూత్ గేమ్స్/ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో పాల్గొన్న అత్యుత్తమ క్రీడాకారులై ఉండాలి.
» **వయసు:** 17.5 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్ ఆఫ్ పీటీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్‌క్యూ(ఆర్మీ),రూమ్ నెం.747, 'ఎ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.02.2024.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

పోలో ఆడుతూ మరణించిన సుల్తాన్ ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



రాజపుత్ర వంశాలు (క్రీ.శ. 760 - 1142)

రాజపుత్ర వంశానికి చెందిన రాజులు బెంగాల్,బిహార్ ప్రాంతాలను పాలించారు. వాస్తవానికి వీరు రాజపుత్రులు కారు. 'పాల' వంశస్థులు. ఈ వంశ స్థాపకుడు గోపాలుడు. వీరిలో 'దేవపాలుడు' గొప్పవాడు. ఇతడు తూర్పు ఈశాన్య దేశాలైన జావా, సుమత్రాతో సత్సంబంధాలు కొనసాగించాడు. ఈ వంశీయులు సుమారు 400 ఏళ్లు పాలించారు. వీరిలో చాలా మంది బౌద్ధమతాన్ని అనుసరించారు. ధర్మపాలుడు విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఉద్దంతపురం, జగద్దల విశ్వ విద్యాలయాలను పాలరాజుల కాలంలోనే ఏర్పాటు చేశారు. వీరు అనేక విహారాలను పునర్నిర్మించారు.

గూర్జార ప్రతీహారులు - 'కనౌజ్' (క్రీ.శ. 800 -1036)

ఈ వంశస్థాపకుడు నాగభట్టు. మహేంద్రపాలుడు గొప్పవాడు. ఇతడి ఆస్థానంలో రాజశేఖరుడు అనే ప్రముఖ కవి ఉండేవాడు. మహేంద్రపాలుడు అరబ్ సైన్యాలపై విజయం సాధించాడు. అరబ్ బాటసారి సులేమాన్ మిహిరభోజుడి సామ్రాజ్యం గురించి వర్ణించాడు. మిహిరభోజుడి కుమారుడు మహేంద్రపాలుడు. ఇతడి తర్వాత ప్రతీహారుల సామ్రాజ్యం క్షీణించింది.

గహడ్వాల్ వంశం - కనౌజ్ (క్రీ.శ. 1080-1194)

ఈ వంశ స్థాపకుడు చంద్రదేవుడు (1085-1100). ఈ పాలకుల్లో గొప్పవాడు జయచంద్రుడు. మహమ్మద్ ఘోరీ 1193లో జయచంద్రుడిని ఓడించడంతో అవమానం భరించలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. గహడ్వాలులు శతాబ్ద కాలం పాటు తురుష్క దండయాత్రల నుంచి మధ్యదేశాన్ని రక్షించారు.

చందేలులు - బుందేల్ ఖండ్ క్రీ.శ. 916-1203

చందేలుల రాజధాని ఖజురహో. ఈ వంశ మూలపురుషుడు జయశక్తి. క్రీ.శ. 950 ప్రాంతంలో యశోవర్మ స్వతంత్రంగా చందేల రాజ్యాన్ని స్థాపించాడు. చందేల రాజుల్లో విద్యాధరుడు ప్రసిద్ధుడు. మధ్యప్రదేశ్‌లోని 'ఖజురహో' దేవాలయాలను నిర్మించింది వీరే. అల్లావుద్దీన్ ఖిల్జీ 1309లో చందేలులను తుదముట్టించి బుందేల్‌ఖండ్‌ను ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపాడు.

కాలచూరులు (క్రీ.శ. 950 - 1195)

కాలచూరి వంశస్థుల రాజధాని త్రిపుర (మధ్యప్రదేశ్). ఈ వంశ స్థాపకుడు కోకల్లుడు (845 - 880). కాలచూరుల్లో గంగయదేవుడు ప్రసిద్ధుడు. ఇతడికి 'విక్రమాదిత్య', 'త్రికళింగాధిపతి' అనే బిరుదులు ఉన్నాయి. క్రీ.శ. 1212లో చందేల త్రైలోక్యమల్లుడు కాలచూరి చివరి పాలకుడైన విజయ సింహుడిని ఓడించాడు.

చౌహానులు క్రీ.శ. 973-1192

వీరినే చహమాణులు అని కూడా అంటారు. ఈ వంశానికి మూలకర్త సింహరాజు. వీరి రాజధాని 'శాకంబరి'. అజయరాజు అజ్మీర్‌ను నిర్మించాడు. సోమదేవ మహాకవి విశాలదేవుడి ఆస్థానంలో ఉండేవాడు. ఇతడు 'లలిత విగ్రహరాజ' నాటకాన్ని రచించాడు. ఈ వంశస్థుల్లో మూడో పాలకుడైన పృథ్వీరాజు చాలా గొప్పవాడు. పృథ్వీరాజ్ చౌహాన్ 1191లో మహమ్మద్ ఘోరీని మొదటి 'తరైన్' యుద్ధంలో ఓడించి క్షమించి వదిలేశాడు. కానీ మహమ్మద్ ఘోరీ మళ్లీ దండెత్తి వచ్చి పృథ్వీరాజ్‌ను 1192లో రెండో తరైన్ యుద్ధంలో ఓడించాడు.

గుజరాత్ చాళుక్యులు (క్రీ.శ. 974-1238)

గుజరాత్ చాళుక్య వంశస్థుల రాజధాని 'అన్హిల్ వాడ్' (గుజరాత్). వీరినే సోలంకీలు అంటారు. ఈ వంశస్థాపకుడు మూలరాజు. మొదటి భీమరాజు కాలంలో (1022-64) ఘజనీ మహమ్మద్ 1024లో సోమనాథ ఆలయాన్ని ధ్వంసం చేశాడు. భీమరాజు మనవడైన జయసింహుడి కాలంలో సోలంకీ రాజ్యం ఉచ్ఛస్థితిలో ఉంది. జైనకవి హేమచంద్రుడు ఇతడి మంత్రి. జయసింహుడి తర్వాత సామంతులైన వాఘేల వంశస్థులు సోలంకీలను జయించి రాజ్యాన్ని ఆక్రమించారు.

పరమారులు - మాల్వా, మధ్యప్రదేశ్ (క్రీ.శ. 974 - 1233)

పరమార వంశ స్థాపకుడు 'సియక'. వీరిలో ముంజరాజు గొప్పవాడు. ఇతడినే 'వాక్పతిరాజు'గా వ్యవహరిస్తారు. ఇతడి ఆస్థానంలో ధనంజయ, హలాయుధ, ధనిక, పద్మ గుప్త తదితర మహాకవులు ఉండేవారు. వాక్పతిరాజు 'ముంజేశ్వరం' తటాకాన్ని నిర్మించాడు. ఇతడి కుమారుడైన భోజరాజుకు ఈ వంశంలో మంచి పేరు ఉంది. భారతదేశ చరిత్రలో ఇతడికి ప్రత్యేక స్థానం ఉంది. భోజరాజుకు 'కవిరాజ మాళ్వా చక్రవర్తి' అనే బిరుదు ఉంది. ఇతడు థాన్ నగరాన్ని నిర్మించాడు.

సేన వంశస్థులు (క్రీ.శ. 1119 -1190)

వీరు బెంగాల్‌ను పాలించారు. సేన వంశీయుల్లో లక్ష్మణసేనుడు ప్రసిద్ధుడు. ఇతడు విజయయాత్రలు చేసి పూరీ,కాశీ, ప్రయాగలో విజయస్తంభాలు స్థాపించాడు. ఇతడు స్వయంగా కవి. ఇతడి ఆస్థానంలో పంచరత్నాలు అనే ప్రసిద్ధ కవులు ఉండేవారు. వీరిలో ధోయి, జయదేవుడు ముఖ్యమైనవారు. జయదేవుడి 'గీత గోవిందం' ప్రసిద్ధి చెందిన రచన.

కర్కోటక వంశం (క్రీ.శ. 630-955)

ఈ వంశం కశ్మీర్ ప్రాంతాన్ని పాలించింది. 'కర్కోటక వంశ' స్థాపకుడు దుర్లభవర్ధనుడు. కల్హణుడి 'రాజ తరంగిణి' వీరి చరిత్రకు ప్రధాన ఆధారం. ఈ వంశంలో ముక్తాపీడ లలితాధిత్య గొప్పరాజు. ఇతడు కశ్మీర్ రాజ్యాన్ని ఆసియాలోని పెద్ద రాజ్యాల్లో ఒకటిగా రూపొందించాడు. 'మార్తాండ', 'సూర్య' దేవాలయాలను నిర్మించాడు.

లోహారులు (క్రీ.శ. 939 -1339)

ఈ రాజ్యస్థాపకుడు పర్వగుప్తుడు. కశ్మీర్‌ను పరిపాలించిన లోహారులందరిలో 'రాణి దిద్దా'కు ప్రత్యేక స్థానం ఉంది. 1139లో షామీర్ (షామ్సుద్దీన్) అనే ముస్లిం వీరుడు 'శ్రీ సంస్థినా' బిరుదుతో కశ్మీర్‌ను ఆక్రమించాడు. లోహారుల కాలంలో సంస్కృతం రాజభాషగా ఉండేది. బ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాబల్యం ఉండేది.

షాహీలు (క్రీ.శ. 883-1026)

షాహీలు కాబూల్, పంజాబ్ ప్రాంతాలను పాలించారు. వీరినే హిందూషాహీలుగా వ్యవహరిస్తారు. రాజ తరంగిణి, అల్‌బెరూనీ గ్రంథం వీరి చరిత్రకు ముఖ్యమైన ఆధారాలు. వీరి రాజధాని కాబూల్. అల్‌బెరూనీ ఈ వంశంలో మొదటివారిని హిందూ తురుష్కులుగా పేర్కొన్నాడు. కుషాన్ వంశంలో చివరి రాజు 'లగితూర్మానే'ను అతడి మంత్రి కల్లర్ తొలగించి, హిందూషా వంశాన్ని స్థాపించాడు. షాహీ రాజ్యాన్ని ముస్లింలు ఆక్రమించారు. అరబ్బు యాత్రికుడైన అల్‌బెరూనీ భారతదేశంలో 'కితాబ్-ఉల్-హింద్' గ్రంథం రాశాడు.

అరబ్బుల దండయాత్రలు (క్రీ.శ. 712)

అరబ్బులు సింధూ ప్రాంతంపై దండయాత్ర చేశారు. భారతదేశంపై దండయాత్రల వల్ల అరబ్బులకు పరిమిత ఫలితాలు లభించాయి. ఎడారి వల్ల సింధూ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలపైకి దాడి చేయడానికి వీలు కలుగలేదు. అరబ్బుల పాలనలో సింధ్, గుజరాత్ రాష్ట్రాలు విదేశీ వాణిజ్యాన్ని విస్తృతంగా సాగించి ఐశ్వర్యవంతమయ్యాయి. అరబ్బుల ద్వారా ఐరోపా దేశాలకు భారతీయ సంస్కృతి వ్యాపించింది.

మహమ్మద్ ఘజనీ దండయాత్రలు (క్రీ.శ. 1000-27): ఇతడు భారతదేశంపై 17సార్లు దండెత్తాడు. ఘజనీ 1026లో సోమ్‌నాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. ఇది గుజరాత్‌లోని కథియవార్‌లో ఉంది. ఇతడు రాజపుత్ర రాజ్యాల సిరిసంపదలను కొల్లగొట్టాడు. వారి సైన్యాలు చాలా వరకు క్షీణించాయి. ఘజనీ మహమ్మద్ భారతదేశంలో ముస్లిం రాజ్య స్థాపనకు అనుకూల పరిస్థితులను కల్పించాడు.

మహమ్మద్ ఘోరీ దండయాత్రలు (క్రీ.శ. 1175-1206): ఇతడిని భారతదేశంలో తురుష్క అఫ్గాన్ సామ్రాజ్య స్థాపకుడిగా పేర్కొంటారు. ఘోరీ మరణానంతరం అతడు జయించిన భూభాగాలన్నింటితో అతడి బానిస అయిన కుతుబుద్దీన్ ఐబక్ ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు. మహమ్మద్ ఘోరీ.. పృథ్వీరాజ్ చౌహాన్‌తో 1191లో మొదటి, 1192లో రెండో తరైన్ యుద్ధాలు చేశాడు. బిహార్, బెంగాల్‌ను జయించడంలో భక్తియార్ ఖిల్జీ (1197) అనే అఫ్గాన్ సాహసయోధుడు ఘోరీకి సహాయపడ్డాడు. ఘోరీని 1206లో పంజాబ్‌లోని భోఖర్లు అనే తెగకు చెందినవారు హత్య చేశారు.

ఢిల్లీ సుల్తాన్‌లు (క్రీ.శ. 1206-1210)

కుతుబుద్దీన్ ఐబక్: ఇతడు భారతదేశంలో తురుష్క-అఫ్గాన్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు ఇల్బారీ వంశానికి చెందిన తురుష్కుడు. ఇతడు 1206లో ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఢిల్లీకి మొదటి ముస్లిమ్ సుల్తాన్ ఇతడే. ఇతడిని బానిస వంశ స్థాపకుడిగా పేర్కొంటారు. 1210లో ఇతడు 'పోలో' ఆడుతూ గుర్రంపై నుంచి పడి మరణించాడు. ఐబక్ 'కుతుబ్ మినార్' నిర్మాణాన్ని ప్రారంభించగా, ఇల్‌టుట్ మిష్ పూర్తి చేశాడు. కుతుబుద్దీన్ ఐబక్‌కు 'లక్‌బక్ష్' అనే బిరుదు ఉంది.

ఇల్‌టుట్ మిష్ (క్రీ.శ. 1211-1236): ఇల్‌టుట్‌మిష్ తురుష్కుల్లో ఇల్బారీ తెగకు చెందినవాడు. రాజ్య రక్షణ కోసం ఇతడు 40 మందితో బానిసల దళం (చిహాల్‌గనీ) ఏర్పాటు చేశాడు. ఇల్‌టుట్‌మిష్ మంగోలుల దాడుల నుంచి భారతదేశాన్ని కాపాడాడు. స్వతంత్రంగా అరబ్బీ నాణేలను ముద్రించడం ప్రారంభించాడు. వెండి టంకా, రాగి జిటాల్ ఇతడి కాలం నుంచే వాడుకలోకి వచ్చాయి. తురుష్క సామ్రాజ్యాన్ని స్థిరపరిచాడు. కుతుబ్‌మినార్ నిర్మాణాన్ని పూర్తి చేయించాడు.

సుల్తాన్ రజియా (క్రీ.శ. 1236-1240): ఈమె ఇల్‌టుట్ మిష్ కుమార్తె. యాకుబ్‌ఖాన్ అనే అబిసీనియన్‌ను వివాహం చేసుకున్నారు. ఈమె మధ్యయుగానికి చెందిన మొదటి, చివరి సుల్తానా (రాణి). ఇల్‌టుట్ మిష్ తన కుమారులు అసమర్థులవ్వడం వల్ల కూతురైన రజియాను వారసురాలిగా ప్రకటించాడు. ఈమె మంచి పాలనాదక్షురాలు. ఈమె కాలంలో చిహాల్‌గనీలు బలవంతులై ఆమెను ఎదిరించారు. వీరిని అడ్డుకునే ప్రయత్నంలో రజియా ప్రాణాలను కోల్పోయారు.

సుల్తాన్ నసీరుద్దీన్ మహమ్మద్ (క్రీ.శ. 1246 - 1265): ఇతడు ఇల్‌టుట్ మిష్ కుమారుడు. అసమర్థుడు. భోగలాలసుడు. అమీర్‌ల చేతిలో కీలుబొమ్మగా మారాడు.

సుల్తాన్ ఘియాసుద్దీన్ బాల్బన్ (క్రీ.శ. 1265 - 1285): ఇతడు సుల్తాన్ నసీరుద్దీన్‌కు 1246-65 మధ్య ప్రధానమంత్రిగా సర్వాధికారాలు చెలాయించాడు. ఇతడి మరణానంతరం సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. 40 మంది బానిసల దళాన్ని రద్దు చేశాడు. శత్రువుల రహస్యాలు తెలుసుకునేందుకు గూఢచార దళాన్ని ఏర్పాటు చేశాడు. సాష్టాంగపడి సుల్తాన్ పాదాలను లేదా సింహాసనాన్ని ముద్దు పెట్టుకోవడం లాంటి పారశీక రాచ మర్యాదలను బాల్బన్ ప్రవేశపెట్టాడు. సర్దార్లను అణచివేయడానికి మద్యపానం, జూదం, అతిగా మాట్లాడటం లాంటివాటిని నిషేధించాడు.

- వెనిస్ యాత్రికుడైన 'మార్కోపోలో' భారతదేశాన్ని సందర్శించాడు. రాణి రుద్రమదేవి ఆస్థానానికి వచ్చాడు.

ఖిల్జీ వంశం (క్రీ.శ. 1290-1320)

ఇది ఢిల్లీని పాలించిన రెండో తురుష్క వంశం. వీరి పాలనా కాలం క్రీ.శ. 1290-1320.

జలాలుద్దీన్ (క్రీ.శ. 1290-1296): ఇతడు బాల్బన్ కొలువులో చేరిన ఖిల్జీ వంశానికి చెందిన తురుష్క తెగకు చెందిన వ్యక్తి. 1290లో బానిస వంశ చివరి పాలకుడైన కైకోబాద్‌ను వధించి ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఇతడి అన్న కొడుకు అల్లాఉద్దీన్ ఖిల్జీ. జలాలుద్దీన్ తన కూతురిని అల్లాఉద్దీన్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఇతడి కాలంలో ఇస్లామ్ మతాన్ని స్వీకరించిన మంగోలులు నయా ముస్లింలుగా చెలామణి అయ్యారు. వీరు ప్రభుత్వానికి బెడదగా తయారయ్యారు.

అల్లాఉద్దీన్ ఖిల్జీ (క్రీ.శ. 1296-1316): ఇతడు 1299లో గుజరాత్‌ను జయించాడు. కాకతీయ, యాదవ, హోయసాల, పాండ్య రాజ్యాలపై అల్లాఉద్దీన్ సేనాని మాలిక్‌కపూర్ దండెత్తి జయించాడు. 1312లో మాలిక్‌కపూర్ దేవగిరి రాజైన శకదేవుడిని వధించి ఆ రాజ్యాన్ని ఢిల్లీ రాజ్యంలో కలిపాడు. 1303లో మంగోలుల దాడుల నుంచి రక్షించుకోవడానికి దుర్గాలను నిర్మించాడు.

అల్లాఉద్దీన్ ఖిల్జీకి 'సికిందర్' అనే బిరుదు ఉంది. ఇతడు జాగీర్లను రద్దు చేశాడు. ఇతడి కాలంలో సైన్యం పోషణ బాధ్యత ప్రభుత్వ పరిధిలోనే ఉండేది. గుర్రాలపై ముద్రలు వేసే పద్ధతి ప్రవేశపెట్టాడు. జీతాలను నగదు రూపంలో చెల్లించేవాడు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వ్యాపారులు సరకులు అమ్మాలని శాసించాడు. ఇతడు 'సిరి', 'అలైదర్వాజా' కట్టడాలను నిర్మించాడు. అమీర్‌ఖుస్రూ అనే పర్షియన్ కవిని పోషించాడు. అల్లాఉద్దీన్ 'నయాముస్లిం'లను అణచివేశాడు. అలైదర్వాజా తురుష్క వాస్తు రీతికి ప్రతీక.

అల్లాఉద్దీన్ షియాబుద్దీన్ ఉమర్, కుతుబుద్దీన్ ముబారక్ ఖిల్జీ వంశం చివరి పాలకులు. నసీరుద్దీన్ ఖుస్రూతో ఖిల్జీ వంశ పాలన పూర్తిగా అంతమైంది.

భిన్న ధ్రువాలను ఏకం చేసే విశ్వజనీన విధానం



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

వివాహం

వివాహం అన్ని సమాజాల్లోనూ ఉంది. కానీ, దీని నియమాలు వివిధ సమాజాల్లో విభిన్న రీతుల్లో ఉన్నాయి. అందువల్ల సమాజ శాస్త్రవేత్తలు దీనికి విశ్వజనీన నిర్వచనాన్ని ఇవ్వలేకపోతున్నారు.

వివాహం - నిర్వచనాలు

- ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది పురుషులు, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది స్త్రీలతో ఆచారంతో లేదా చట్టంతో గుర్తింపు పొందిన, కొంత లాంఛనప్రాయంతో కూడి ఉన్న విధానంతో కొంతకాలం పాటు నిలకడగా ఉండే కలయిక లేదా సంబంధమే వివాహం.

  - ఎడ్వర్డ్ వెస్టర్ మార్క్

  వెస్టర్ మార్క్ ఇచ్చిన నిర్వచనం అన్ని సమాజాల్లోని వివాహ వ్యవస్థకు సరిపోయే విధంగా లేదు. ఉదాహరణకు కింద పేర్కొన్న సమాజాలకు ఈ నిర్వచనం సరిపోదు.

  ఎ) ఒనోటోవా, టుక్ సమాజాల్లో వయసుకు రాగానే న్యాయబద్ధమైన సంతానాన్ని పొందుతారు.

  బి) 'కిబ్బుజ్ సమాజం'లో అసలు వివాహ వ్యవస్థే లేదు.

- సంతానోత్పత్తి, పిల్లల నిర్వహణ కోసం స్త్రీ, పురుషుల మధ్య జరిగే ఒప్పందమే వివాహం.

  - మలినో విస్కీ

  ఈ నిర్వచనం కూడా కొన్ని సమాజాలకు మినహాయింపుగా ఉంది.

- భార్యాభర్తల పరస్పర హక్కులు, విధులు, సదుపాయాలకు సంబంధించిన నియమాలు, నిబంధనలు ఉన్నదే వివాహం.

  - ల్యూండ్ బర్గ్

  ల్యూండ్ బర్గ్ నిర్వచనం కూడా అన్ని సమాజాలకు వర్తించదు. ఉదాహరణకు..

  ఎ) ఇజ్రాయెల్‌లోని 'కిబ్బుజ్' తెగలో స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధం ఉంది కానీ, ఆర్థిక సహకారం లేదు.

  బి) కేరళలోని ఒక తెగలో స్త్రీ, పురుషులకు సహ నివాసం లేదు, ఆర్థిక సహకారం లేదు.

వివాహానికి విశ్వజనీన నిర్వచనం లేనప్పటికీ దీనికి ప్రపంచవ్యాప్తంగా సామాజిక సమ్మతి ఉంది.

వివాహ విధులు

జైవిక విధులు: మానవుడిలో లైంగిక వాంఛలను వివాహం ద్వారా నెరవేర్చుకుంటారు. దీని ద్వారా స్త్రీ, పురుషులు జంటగా ఏర్పడి సంతానోత్పత్తితో తమ వంశాన్ని అభివృద్ధి చేసుకుంటారు. ఇది కేవలం ఆ దంపతులనే కాకుండా వారి భావి సంతానాన్ని కూడా సూచిస్తూ సన్నిహిత సంబంధాలతో, పరస్పర అనురాగబద్ధమై ఉంటుంది. మరణం వల్ల ఏర్పడే లోటు సంతానం ద్వారా భర్తీ అవుతుంది.


సామాజిక విధులు: వివాహం దంపతుల మధ్య కొన్ని బాధ్యతలను సంస్థాగతం చేస్తుంది. దంపతులిద్దరూ వారి సంతానాన్ని ఒకరు తండ్రిగా, మరొకరు తల్లిగా సంరక్షిస్తారు. వివాహం భార్యభర్తల్లో ఒకరికి మరొకరిపై లైంగిక గుత్తాధిపత్యాన్ని కల్పిస్తుంది. స్త్రీ, పురుషుల మధ్య ఏర్పడే శ్రమ విభజనకు కూడా వివాహమే బీజం వేస్తుంది. వివాహం తర్వాత స్త్రీ.. పిల్లల రక్షణ చూస్తూ, పురుషుడికి సహాయకారిగా ఉంటూ సామాజిక మనుగడకు దోహదం చేస్తుంది. పురుషుడు ప్రధానంగా కుటుంబ బాధ్యతలను చూస్తాడు.

సంబంధ బాంధవ్యాలు కల్పించడం: వివాహం వల్ల నూతన బంధుత్వాలు ఏర్పడతాయి. ఇది రెండు కుటుంబాలను కలపడం ద్వారా పెద్ద సంఖ్యలో బంధుత్వ వర్గాలను ఏర్పాటు చేస్తుంది. ఇరుపక్షాల వాళ్లు ఒకరికొకరు జీవనోపాధి పరంగా, రాజకీయంగా, చట్టపరంగా, మతపరంగా ఆదుకుంటారు. బంధువర్గంలో భావితరాలకు మార్గదర్శకంగా ఉంటారు. ఇతరులతో కలహం ఏర్పడినప్పుడు రక్షణగా నిలుస్తారు. వ్యవహారాల్లో అండగా ఉంటారు. ఈ సంబంధ బాంధవ్యాలు తరతరాలకు సాగిపోతూ ఉంటాయి.

విద్యా విధులు: వివాహం ద్వారా ఏర్పడిన నూతన కుటుంబం ఆ సమాజం సంస్కృతిని, అందులోని నియమ నిబంధనలు, ప్రవర్తనా రీతులను తమ సంతానానికి అందజేస్తూ వారికి విద్యాబుద్ధులు అందిస్తారు. సమాజ అభ్యున్నతికి అవసరమైన కొత్త తరాలను తయారు చేస్తారు. వివాహం ద్వారా ఏర్పడ్డ కుటుంబం పాత తరాల సంస్కృతిని కొత్త తరాలకు అందిస్తుంది.

వివాహం రకాలు

సమాజంలో వివాహానికి సంబంధించి వివిధ రకాల విధానాలున్నాయి.



అంతర్వివాహం

ఒక వ్యక్తి తమ ప్రాంతం లేదా తన సమూహానికే చెందిన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎన్నుకుంటే దాన్ని 'అంతర్వివాహం'గా పేర్కొంటారు. తన సమూహం అంటే ఆ వ్యక్తి మతం, వర్ణం, కులం, తెగ ఏదైనా కావొచ్చు.

ఈ పద్ధతి హిందూ సమాజంలోని కుల వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాచీన హిందూ సమాజంలో నాలుగు రకాల వర్ణాలు ఉన్నాయి.

అవి: 1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు 3) వైశ్యులు 4) శూద్రులు

వీరు కొన్ని నియమాల ప్రకారం వర్ణాంతర వివాహాలను అనుమతించారు.

ఎ) **అనులోమ వివాహ పద్ధతి:** హిందూ వర్ణ వ్యవస్థలో ఒక పురుషుడు తన కింది వర్ణానికి చెందిన యువతిని వివాహం చేసుకుంటే దాన్ని 'అనులోమ వివాహం' అంటారు. దీని ప్రకారం.. ఒక బ్రాహ్మణ యువకుడు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణానికి చెందిన స్త్రీని; క్షత్రియుడు - క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీని; వైశ్యుడు - వైశ్య, శూద్ర స్త్రీని; శూద్రుడు - శూద్ర స్త్రీని వివాహం చేసుకునే విధానం.

బి) **ప్రతిలోమ వివాహం:** హిందూ వర్ణ వ్యవస్థలో ఒక యువతి తన కంటే పై వర్ణానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవడాన్ని 'ప్రతిలోమ వివాహం' అంటారు. దీని ప్రకారం.. బ్రాహ్మణ యువతి - బ్రాహ్మణ; క్షత్రియ స్త్రీ - క్షత్రియ, బ్రాహ్మణ; వైశ్య యువతి - వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ; శూద్ర స్త్రీ - శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ యువకులను వివాహం చేసుకునే విధానం.

అంతర్వివాహానికి కారణాలు:

- తమ సమాజం విచ్ఛిన్నం కాకుండా ఉండటానికి అంతర్వివాహాలు చేసుకునేవారు.
- తమ సమాజ ఉనికి కాపాడటానికి ఈ రకమైన వివాహం చేసుకునేవారు.
- తమ సంస్కృతిని కొనసాగించడానికి ఈ పద్ధతికి ప్రాధాన్యం ఇచ్చేవారు.
- తమ ప్రాంతం అలవాటైనందువల్ల అందులోనే జీవించడానికి ఇష్టం చూపి ఈ రకమైన వివాహం చేసుకునేవారు.
- తమ జైవిక లక్షణాలు చెడిపోకుండా ఉండటానికి దీనికి ప్రాధాన్యం ఇచ్చేవారు.

బహిర్వివాహం

ఒక సమూహానికి చెందిన వ్యక్తి మరో సమూహానికి చెందిన మహిళను జీవిత భాగస్వామిగా చేసుకునే పద్ధతిని 'బహిర్వివాహం' అంటారు. దీనికి సంబంధించి కొన్ని నిషేధాలు, ఎవరిని చేసుకోవాలనే విషయంలో విధి విధానాలు ఉన్నాయి.

ఉదా: హిందూ సమాజంలో స్వ గోత్రికుల మధ్య వివాహం నిషేధం. దీన్ని 'సంపద పద్ధతి వివాహం' అంటారు. దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి.

బహిర్వివాహానికి కారణాలు:

- ప్రాచీన యుగంలో పెద్ద పెద్ద మృగాలను వేటాడటానికి సహాయం కోసం ఒక సమాజంలోని వ్యక్తులు మరో సమాజంలోని వ్యక్తులపై ఆధారపడేవారు. దీని కోసం ఒకరిపై మరొకరు నమ్మకం పెంచుకునేందుకు స్త్రీలను ఇచ్చి పుచ్చుకోవడం మొదలు పెట్టారు.
- ఒకే సమాజంలోని స్త్రీ, పురుషుల మధ్య లైంగిక ఆకర్షణ తగ్గినందువల్ల బహిర్వివాహానికి మొగ్గు చూపారు.
- ఒక సమాజంలో స్త్రీల కొరత ఎక్కువగా ఉండటంతో మరో సమాజానికి చెందిన యువతులను వివాహం చేసుకున్నారు.
- ఒక సమాజంలో ఆహార కొరత తీవ్రంగా ఉండటంతో మరో ఉన్నత సమాజానికి చెందిన యువకులకు స్త్రీలను ఇచ్చేవారు.

  ఉదా: గంగానది పరీవాహక ప్రాంతంలో వ్యవసాయం అభివృద్ధి చెందడం వల్ల ఆహారం సమృద్ధిగా లభించేది. కానీ రాజస్థాన్‌లోని థార్ ఎడారి పరిసర ప్రాంతాల్లో అల్ప వర్షపాతం కారణంగా ఆహార కొరత ఉండేది.
- ఒక సమాజంలోని వ్యక్తుల మధ్య గౌరవం తగ్గడం కూడా బహిర్వివాహానికి కారణం.

ఏక వివాహం

ఒక పురుషుడు, ఒక స్త్రీని ఒకేసారి వివాహమాడటాన్ని 'ఏక వివాహం' అంటారు. భారతీయ సమాజంతోపాటు ప్రపంచవ్యాప్తంగా బాగా ప్రాచుర్యం పొందిన, మంచి ఆదరణ ఉన్న పద్ధతి ఇది. ఏక వివాహంలో ఆప్యాయత, నిజాయితీతో కూడిన ప్రేమ, అనురాగం ఉంటాయి. పిల్లల సంరక్షణ బాగుంటుంది. ఇది రెండు రకాలుగా ఉంటుంది.

ఎ) **ఏక కాలిక ఏక వివాహం:** స్త్రీ సంతానవతి కానప్పుడు, భర్తకు, భార్యకు సరిపడక విడాకులు ఇచ్చుకున్నప్పుడు 'పునర్వివాహం' చేసుకుంటారు. దీన్నే 'ఏక కాలిక ఏక వివాహం' అంటారు. ఇది కొన్ని భారతీయ ఆదిమవాసి తెగల్లో కనిపిస్తుంది. ఇది నిలకడలేని వైవాహిక జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. కేరళలోని ఇరుళ, యూరాళి మొదలైన ఆహార సంగ్రాహక ఆదిమ తెగల్లో ఈ రకమైన వివాహం కనిపిస్తుంది.

బి) **జీవితాంతపు ఏక వివాహం:** జీవితాంతం ఒకే భాగస్వామితో జీవిస్తే దాన్ని 'జీవితాంతపు ఏక వివాహం' అంటారు. ఇది చాలా స్థిరమైన వివాహ రూపం. భార్య, భర్త మధ్య ఉండే అన్యోన్యత, నిలకడైన దాంపత్య జీవనానికి ఇది ప్రతీకగా ఉంటుంది. జీవితాంతపు ఏక వివాహం అనేక ఆదిమ వాసి తెగల్లో ఉంది.

ఉదా:
1) గోండులు 2) భిల్లులు
3) సంతాల్‌లు 4) నాగాలు

మాదిరి ప్రశ్నలు

1. మానవ వివాహ చరిత్రను రచించిన ప్రఖ్యాత సమాజ శాస్త్రవేత్త?
   ఎ) ఎడ్వర్డ్ వెస్టర్ మార్క్ బి) మోర్గాన్
   సి) మర్డాక్ డి) టైలర్
2. హిందూ వివాహ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
   ఎ) 1955 బి) 1956
   సి) 1957 డి) 1958
3. 'మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ ఇన్ ఇండియా' గ్రంథ రచయిత?
   ఎ) కార్వే బి) కె.ఎం. కపాడియా
   సి) ఎం.ఎన్. శ్రీనివాసన్
   డి) టి.ఎన్. మదాన్
4. మేనరిక వివాహాలు భారతదేశంలో ఎక్కువగా ఏ ప్రాంతంలో ఉన్నాయి?
   ఎ) పశ్చిమ భారతదేశం
   బి) ఉత్తర భారతదేశం
   సి) దక్షిణ భారతదేశం
   డి) ఈశాన్య భారతదేశం

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) బి; 4) సి.

HTML was introduced by

MODEL QUESTIONS

BANK EXAMS

Computer Awareness

1. If you want to connect to your own computer through the Internet from a different location, you can use ______.
   1) E-mail 2) FTP
   3) Instant message
   4) Telnet 5) None of these
2. The sharing of a medium and its path by two or more devices is called ______.
   1) Modulation 2) Encoding
   3) Line discipline
   4) Multiplexing
   5) None of these
3. The server on the internet is also identified as ______.
   1) Repeater 2) Host
   3) Gateway 4) AND Gate
   5) None of these
4. Personal computers can be connected together to form a______.
   1) Server 2) Super computer
   3) Network 4) Enterprise
   5) None of these
5. DSL is an example of a (n) ______connection.
   1) Network 2) Wireless
   3) Slow 4) Broadband
   5) None of these
6. What's considered the 'backbone' of the World Wide Web?
   1) URL 2) HTML 3) HTTP
   4) FTP 5) None of these
7. SMTP stands for ______.
   1) Simple Mail Transfer Protocol
   2) Serve Message Text Process
   3) Short Messaging Text Process
   4) Short Messaging Transfer Protocol
   5) None of these
8. A Proxy server is used for which of the following?
   1) To provide security against unauthorized users
   2) To process client requests for web pages
   3) To provide TCP/IP
   4) To process client requests for database access
   5) None of these
9. Which term identifies main page of the entire site?
   1) URL 2) Web site address
   3) Hyperlink 4) Domain name
   5) None of these
10. Which of the following is not a network topology?
    1) Star 2) Bus 3) Linear
    4) Ring 5) None of these
11. A central computer that holds collections of data and programs for many PCs, work stations, and other computers is a(n)_______.
    1) Supercomputer
    2) Minicomputer 3) Laptop
    4) Server 5) None of these
12. When the pointer is positioned on a ______ is shaped like a hand.
    1) Grammar error
    2) Formatting error
    3) Screen Tip
    4) Spelling error
    5) Hyperlink
13. TCP stands for _______.
    1) Transfer control protocol
    2) Transfer control process
    3) Transmission control protocol
    4) Transmission control process 5) None of these
14. Peer-to-peer is a description-
    1) Of communications between two dissimilar devices
    2) Of communications between two equal devices
    3) Of communications between two different devices
    4) All of the above
    5) None of these
15. The technique where digital signals are converted to its analog form for transmission over an analog facility is called_______.
    1) Modulation 2) Digitization
    3) Multiprocessing
    4) All of the above
    5) None of these
16. Narrowband channel is a communication channels _______.
    1) That handles low volumes of data
    2) Used mainly for telegraph lines and low speed terminals
    3) Both a and b
    4) All of the above
    5) None of these
17. MIME is an acronym for______.
    1) Multiprogramming Internet Mail Extension
    2) Multicasting Internet Mail Extension
    3) Multiple Internet Mail Extension
    4) Multipurpose Internet Mail Extension
    5) None of these
18. Which of the following is a network in which computers are located physically close together, often in the same building?
    1) WAN 2) PAN 3) MAN
    4) LAN 5) None of these
19. What is a modulator/demodulator that is connected to a circuit board or motherboard?
    1) Fax modem
    2) Network Interface Card (NIC)
    3) Internal modem
    4) External modem
    5) None of these
20. What kind of server converts IP addresses to domain names?
    1) File 2) DNS 3) E-mail
    4) P2P 5) None of these
21. In the OSI model, the actual transmission of data is handled in the ______ layer.
    1) Data link 2) Physical
    3) Network 4) Transport
    5) None of these
22. Which device cannot be shared in network?
    1) Floppy 2) Keyword
    3) Computer 4) Printer
    5) None of these
23. A network of geographically distant computers and terminals is called a-______.
    1) Integrated Services Digital Network (ISDN)
    2) Metropolitan Area Network (MAN)
    3) Wide Area Network (WAN)
    4) Local Area Network (LAN)
    5) None of these
24. An example of a wireless medium that sends data through the air or space is:
    1) Fiber-optic cable
    2) Coaxial cable
    3) Twisted pair
    4) Microwaves
    5) None of these
25. A ____ shares hardware, software, and data among authorized users.
    1) Network 2) Protocol
    3) Hyperlink 4) Transmitter
    5) None of these
26. Granting an outside organization access to internet web pages is often implemented using a(n)?
    1) Extranet 2) Intranet
    3) Internet 4) Hacker
    5) None of these
27. ______ is a process that permits multiple computers to use the same IP address and hide their actual IP addresses from the Internet.
    1) Routing
    2) Network Address Translation (NAT)
    3) Signature referencing
    4) Packet filtering
    5) None of these
28. The topology where all the nodes are attached in a circular wiring arrangement is called a ______.
    1) Star topology
    2) Bus topology
    3) Network topology
    4) Ring topology
    5) None of these
29. Difference engine is the machine introduced by______.
    I) Blaze Pascal 2) Napier
    3) Charles Babbage 4) Newman
    5) None of these
30. Valves are invented in______ generation.
    I) I generation
    2) II generation
    3) III generation
    4) IV generation
    5) None of these
31. Micro-programming introduced by_______.
    1) John Mauchley
    2) Maurice Wilkies
    3) William Shockley
    4) Blaise pascal
    5) None of these
32. (1024)3 is equivalent to______.
    1) Approx I million
    2) Approx 1 billion
    3) Approx 10 thousand
    4) 3096 5) None of these
33. Convert the (347)8 into binary number
    1) 111000101 2) 011100111
    3) 101110101 4) 100000111
    5) None of these
34. Time required by a sector to reach below the head is known as ______.
    1) Seek time 2) Latency time
    3) Access time 4) Disk time
    5) None of these
35. Function keys, control keys, arrow keys, modifier keys, toggle keys are known as ______.
    1) Special keys 2) Alpha keys
    3) Esc keys
    4) Multimedia key
    5) None of these
36. ______can be used with any CRT monitor but not with the LCD monitor.
    1) Joystick 2) Light Pen
    3) Trackball 4) Mouse
    5) None of these
37. ______ Technologies is used by banks for faster processing of large volumes of cheques.
    1) OCR 2) OMR
    3) MICR 4) Bar code
    5) None of these
38. The shortcut key for undo is ___.
    1) Win button + E
    2) Ctrl + X
    3) Win button+ R
    4) Ctrl +Z 5) None of these
39. Which of the following is not hardware of a computer?
    1) Monitor 2) Windows
    3) Processor 4) Printer 5) None of these
40. What is the main folder on a storage device called?
    I) Platform 2) Interface
    3) Root-Directory
    4) Home-Page 5) None of these
41. Ctrl, Shift and Delete are known as______.
    1) Modifier Keys
    2) Control Keys 3) Toggle keys
    4) Function keys
    5) None of these
42. When you start your computer from the off position then it is known as ______.
    1) Hard booting 2) Processing
    3) Storage 4) Soft-booting
    5) None of these
43. A repair for a known software bug, usually available at no change on the internet is called ______.
    1) Version 2) Patch
    3) Tutorial 4) FAQ
    5) None of these
44. Small application programs that run on a web page and may ensure a form is completed properly or provide animation are known as ______.
    1) Flash 2) Spiders
    3) Cookies 4) Applets
    5) Sparks
45. Which is the slowest internet connection?
    1) Digital subscriber line
    2) TI
    3) Cable modem
    4) Leased line
    5) Dial-up service
46. The transmission mode which allow both communicating devices to transmit and receive data simultaneously is______.
    1) Simplex 2) Full-duplex
    3) Half-duplex 4) Duplex
    5) None of these
47. In IP addressing scheme, which class is used for multicasting?
    1) Class A 2) Class B
    3) Class C 4) Class D
    5) None of these

KEY

1) 4	2) 4	3) 2	4) 3
5) 4	6) 3	7) 1	8) 2
9) 1	10) 3	11) 4	12) 5
13) 3	14) 4	15) 1	16) 1
17) 4	18) 4	19) 3	20) 2
21) 2	22) 2	23) 3	24) 4
25) 1	26) 1	27) 2	28) 4
29) 3	30) 1	31) 2	32) 2
33) 2	34) 2	35) 1	36) 2
37) 3	38) 4	39) 2	40) 3
41) 1	42) 1	43) 2	44) 1
45) 5	46) 2	47) 4	